

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16+8 వెల: ₹ 5.50
సంపుటి: 17
సంచిక: 48
శుక్రవారం 10-5-2024
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




'ప్రజల జీవన ప్రమాణాలు ఇంకా మెరుగు పడాలి. అందుకు అధికారులు నిబద్ధత, పారదర్శకత, కార్యదీక్షతో పనిచేయాలి.'






ప్రెస్టీజ్
ఏదైనా ఏమైనా
ఎక్స్ఛేంజ్ ఆఫర్*
ప్రెస్టీజ్‌తో మీ కిచెన్‌ని అప్‌గ్రేడ్ చెయ్యండి.
ప్రెస్టీజ్ మరియు జడ్జ్ వారి విన్నూత్న ఆవిష్కరణలతో మీ పాత కిచెన్‌వేర్ మరియు కిచెన్ ఉపకరణాలు, ఏ బ్రాండ్ అయినా ఎక్స్ఛేంజ్ చేసి మీ కిచెన్‌ని అప్‌గ్రేడ్ చెయ్యండి.
మే 1 నుండి జూన్ 30, 2024 వరకు
75 Years of Prestige
చిందటం నియంత్రించే స్వచ్ఛ్ వెరైటీ ప్రెషర్ కుక్కర్
స్వచ్ఛ్ ప్రెషర్ కుక్కర్స్
24% - 42% తగ్గింపు*
హానికారక కెమికల్స్ లేని ఆరోగ్యాన్ని ఇచ్చే ప్రెస్టీజ్ నాన్‌స్టిక్ కుక్‌వేర్‌ని అలవర్చుకోండి
PFOA-free
నాన్‌స్టిక్ కుక్‌వేర్ రేంజ్
33% - 55% తగ్గింపు*
సులభంగా శుభ్రం చేయబడే విప్లవాత్మకమైన డిజైన్
స్వచ్ఛ్ గ్లాస్‌టాప్ గ్యాస్ స్టవ్
లిఫ్ట్ & లాక్
క్లీన్
29% - 41% తగ్గింపు*
ప్రెషర్ కుక్కర్ విజిల్ ని లెక్కించే సౌకర్యవంతమైన ఇండక్షన్ కుక్‌టాప్
AUTOMATIC WHISTLE COUNTER
Prestige
ఇండక్షన్ కుక్‌టాప్ 2000W
37% - 51% తగ్గింపు*
14 రకాల పనులు చేసే మల్టీపర్పస్ గ్రైండర్
14 రకాల పనులు
ఎండ్యూర ప్రో మిక్సర్ గ్రైండర్ 1000W
37% - 46% తగ్గింపు*
మీ సౌకర్యం కోసం చిన్న ఉపకరణాలు
జ్యూసర్
ఓటీజీ
శాండ్విచ్ మేకర్
కెటిల్
ఎయిర్ ఫ్రైయర్
32% - 65% తగ్గింపు*
గ్యాస్ లీకేజ్ మరియు స్మోక్ డిటెక్షన్ టెక్నాలజీ కలిగిన భారతదేశపు మొట్టమొదటి చిమ్నీ
SafeSense
ఆస్కార్ సేఫ్ సెన్స్ చిమ్నీ
52% - 62% తగ్గింపు*
JUDGE By Prestige
సూపర్ ప్రోడక్ట్స్ అంతకంటే సూపర్ ధరలు
ప్రెషర్ కుక్కర్ 37%-53% తగ్గింపు*
కుక్‌వేర్ 38%-71% తగ్గింపు*
గ్యాస్ స్టవ్ 41%-47% తగ్గింపు*
మిక్సర్ గ్రైండర్ 41%-52% తగ్గింపు*
ఇండక్షన్ 45%-52% తగ్గింపు*
చిన్న ఉపకరణాలు 39%-68% తగ్గింపు*
సర్వ్ వేర్ 36%-74% తగ్గింపు*
*నిబంధనలు వర్తించును. ఆఫర్లు కేవలం ఎక్స్ఛేంజ్ పై మాత్రమే వర్తిస్తాయి. అన్ని డిస్కౌంట్స్ ఎంఆర్‌పి పైన మాత్రమే. అన్ని తగ్గింపులు సంబంధిత ఉత్పత్తివర్గానికి వర్తిస్తాయి పేర్కొన్న ఉత్పత్తి పై కాదు. ఎంపిక చేసిన డీలర్ ఔట్‌లెట్లలో స్టాక్ ఉన్నంత వరకు మాత్రమే. మార్పిడి ధర, కొనుగోలు చేసిన వస్తువులు మరియు వాపసు ఇచ్చే పాత వస్తువులపై ఆధారపడి ఉండును. పాత ఉత్పత్తులు ఏ బ్రాండ్ అయినా తీసుకుంటాము. నిజమైన మార్పిడి ధర కోసం దయచేసి ఎంపిక చేసిన డీలర్ ఔట్‌లెట్స్‌లో లభ్యమయ్యే, ఏదైనా ఏమైనా ఎక్స్ఛేంజ్ ఆఫర్ ధరల పట్టీ చూడండి. వాపసు ఇచ్చే పాత వస్తువులు అల్యూమినియం/స్టెయిన్‌లెస్ స్టీల్ ప్రెషర్ కుక్కర్స్, అల్యూమినియం/స్టెయిన్‌లెస్ స్టీల్ కుక్‌వేర్ (కనిష్ట పాత్ర బరువు 400 గ్రాములు), గ్యాస్ స్టవ్స్ (కనిష్ట 2 బర్నర్స్), మిక్సర్ గ్రైండర్ (మోటర్ కలిగిన బాడీ మరియు రెండు స్టెయిన్‌లెస్ స్టీల్ జార్లు కలిగి ఉండాలి), ఇండక్షన్ కుక్‌టాప్స్, రైస్ కుక్కర్స్, చిమ్నీస్, హాట్ టాప్స్, వెట్ గ్రైండర్, ఓటీజీలు, కెటిల్, టోస్టర్స్, ఐరన్, మైక్రోవేవ్ ఓవెన్, జ్యూసర్స్, బ్లెండర్స్, వాటర్ ప్యూరిఫైయర్స్ మరియు వాక్యూమ్ క్లీనర్స్ అయి ఉండాలి. ప్రెస్టీజ్® లోగో ఇది ఇండియాలో టిటికె ప్రెస్టీజ్ లిమిటెడ్ వారి ట్రేడ్ మార్క్. జడ్జ్® లోగో అనేది ఇండియాలో హారివుడ్ హోమ్‌వేర్స్ లిమిటెడ్ వారి రిజిస్టర్డ్ ట్రేడ్‌మార్క్. నిబంధనలు మరియు షరతులకు సంబంధించిన మరిన్ని వివరాలు కోసం మీ సమీపంలోని ప్రెస్టీజ్ ఎక్స్‌క్లూజివ్/డీలర్ అవుట్లెట్ కి విచ్చేయండి లేదా మా వెబ్ సైట్ https://shop.ttkprestige.com/anything-for-anything-offer ను సందర్శించండి.
Prestige®
తనవాళ్ళ మీద ప్రేమ ఉన్నవారు ప్రెస్టీజ్‌ని ఎలా కాదనగలరు.
CUSTOMER CARE NO 080-6000 4411
Store Locator
For any institution or bulk enquiries, contact: 7908 710841 biz.enquiry@ttkprestige.com
Scan to Connect
Shop Online on shop.ttkprestige.com
ttk
Prestige Xclusive
Alwal, Ph: 9849776540; Attapur, Ph: 9246118777; Alkapuri X Road, Ph: 9100014635; Balanagar, Ph: 9866993073; Balapur, Ph: 8008857035; Beeramguda, Ph: 900300266; Begumpet, Ph: 7702864300; Bandlaguda(Nagole), Ph: 7330648666; Bowenpally: Ph: 9866025388; B N Reddy Nagar, Ph: 7207001355; Bachupally: Ph: 9848288300; Champapet, Ph: 9703075111; Dammaiguda: Ph: 9052490634; Dilsukhnagar, Ph: 9246114922; Dr. A. S. Rao Nagar, Ph: 9291333300/03; Dr .A. S. Rao Nagar, Ph: 8125065333; Esi, Erragadda, Ph: 040-23702269, 9441252567; Habsiguda, Ph: 9502250985; Hydernagar, Ph: 9381095556; Narayanaguda, Ph: 7799343774; Khairatabad, Ph: 9502652070; Khajaguda, Ph: 9390527577; Kondapur, Ph: 8885552184; Kompally: Ph: 9697433444; Kphb Colony, Ph: 040-48523222; Kukatpally Near Ushamullapudi Kaman, Ph: 040-23162169, 9441252567; Kushaiguda, Ph: 9440579551; Lingampally, Ph: 8688542107; Madinaguda Near Bata, Ph: 040-48513308; Madinaguda Opp To Madinaguda Church, Ph: 9989233466; Malkajgiri R K Nagar, Ph: 040-42100136; Malakpet, Ph: 9100014638; Maredpally Picket, Ph: 9849499537; Manikonda, Ph: 9849028192; Narsingi, Ph: 9849112557; Nallagandla, Ph: 7382191923; Neredmet 'X' Road, Ph: 6301594751; Nizampet, Ph: 7416059699; Paradise Circle, Ph: 9542970857; Pragathinagar: Ph: 9177345689; Ramanthapur, Ph: 9014373123; Rampally 'X' Road, Ph: 8328311762; Sri Krishnanagar, Ph: 040-40062169, 9441252567; Santoshnagar, Ph: 9100442430; Suncity: Ph: 7416642333; Suchitra, Ph: 8790590846; Shamshabad, Ph: 9676899277; Tirumalgiri, Ph: 040-274806; Tolichowki, Ph: 8885552183; Uppal, Ph: 7330993030; Boduppal, Ph: 9849776541; Vanastalipuram, Ph: 9030870622, 9052757075; Quthbullapur, Ph: 7997635855.
Also Available at: Amberpet: Vardhaman Kitchen World, Ph: 9912142260; Ameerpet: New Nakoda Steel Palace, Ph: 66770555; Sri Vinayaka Steel Palace, Ph: 9390233998; chintalbasti: Sri Laxmivenkateswarasteel, Ph: 23393720; Sri Lazmi Narasimha Swamy, Ph: 9949912904; Chilakalguda: Vasavi Steel Palace, Ph: 9849640935; Chinatal: Sri Sai Steel Palace, Ph: 9290448599; Dilsuknagar: Metro Home Needs, Ph: 9395393970; Sanjay Steel Bazar, Ph: 9885591931; Gachibowli: Sharth City Mall- Kitchen Hub, Ph: 7331199941; Himayath Nagar: Kundan Stores, Ph: 9848496067; Jntu: Home Store, Ph: 8106827623; Kphb: Shiv Home World, Ph: 91336 04440; Sree Pegal Electronics, Ph: 9703388988; Sri Krishna Enterprises, Ph: 9246363704; Krishnanagar: Srisaraswathi Homeappliances, Ph: 9290127400; Chandraprabhuhomeappliances, Ph: 9032309832; Nallkunta: Vishal Shopping Centre, Ph: 9949003162; Sanathnagar: Agromechindustries, Ph: 92462 22812; Zaheerabad: Dhanalaxmi Electronics, Ph: 7286884432.

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16+8 వెల: ₹ 5.50
సంపుటి: 17 సంచిక: 48
శుక్రవారం 10-5-2024
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ప్రజల జీవన ప్రమాణాలు ఇంకా మెరుగు పడాలి. అందుకు అధికారులు నిబద్ధత, పారదర్శకత, కార్యదీక్షతో పనిచేయాలి.'



బెంగళూరు జోరు...

వరుసగా నాలుగో విజయం. మెరిసిన కోహ్లి. పంజాబ్ కింగ్స్ అవుట్. - 13లో



మార్కెట్‌కు ఎన్నికల కలవరం

సెన్సెక్స్ 1,062 పాయింట్లు క్రాష్ 22,000 స్థాయి దిగువకు నిఫ్టీ - 13లో



ఎన్నికల ప్రచారం ప్రాథమిక హక్కు కాదు

ఎన్నికల్లో ప్రచారం చేయాలన్న కారణంతో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ ఇవ్వొద్దని సుప్రీంకోర్టుకు ఈడీవిజ్ఞప్తి చేసింది.

- వివరాలు 6లో



భారత అంతర్గత అంశాల్లో అమెరికా జోక్యం

భారత అంతర్గత విషయాలు, సార్వత్రిక ఎన్నికల్లో అమెరికా దురుద్దేశంతో కలగజేసుకుంటోందని రష్యా సంచలన ఆరోపణలు చేసింది.

- వివరాలు 6లో



కోడి రెక్కల కింద పిల్లల్ని దాచుకున్నట్టు ఇన్నాళ్లూ తెలంగాణ ప్రజలను కాపాడుకున్నాం..

మాది పేగు బంధం

'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూలో మాజీ సీఎం కేసీఆర్



- కాళేశ్వరంపై బద్నాం చేసే కుట్ర..
- ఫోన్ ట్యాపింగ్‌పై గోబెల్స్ ప్రచారం
- బీజేపీకి వ్యతిరేకంగా నిలబడినందుకే కవిత అరెస్టు
- కష్టాలకోర్చి తెలంగాణ సాధించా..
- నా గుండెధైర్యం చెక్కుచెదరదు
- బీఆర్ఎస్ జాతీయ రాజకీయాలకు బ్రేక్ తాత్కాలికమే..
- కేంద్రంలో ప్రాంతీయ పార్టీల కూటమిదే అధికారం
- 'ఓటుకు కోట్లు' కేసు నుంచి సీఎం రేవంత్ తప్పించుకోలేరు
- ధరణి, ల్యాండ్ టైట్లింగ్ చట్టాలు ప్రపంచంలోనే ఉత్తమం
- రాష్ట్రంలో బీఆర్ఎస్‌కు 12కుపైగా ఎంపీ సీట్లు వస్తాయని ధీమా

"కేసీఆర్ రాష్ట్ర సాధకుడు, ఒక చరిత్ర. తెలంగాణతో నాది పేగు బంధం. నాడు ఆశలు అడుగంటిన సమయంలో పట్టుమని పది మంది కూడా లేకున్నా తెలంగాణ పోరాటం మొదలుపెట్టా. అనేక కష్టనష్టాలకోర్చి రాష్ట్రాన్ని సాధించా. నా గుండె ధైర్యం ఎన్నడూ చెక్కు చెదరదు. కోడి రెక్కల కింద పిల్లలను దాచుకున్నట్లు తెలంగాణ ప్రజలను కాపాడుకున్నాం. గత ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ అభూత కల్పనలు సృష్టిస్తే.. మేం చేసింది కూడా చెప్పుకోలేక పోయాం. పదేళ్లు సీఎంగా నేను ఏం మాట్లాడానో, వాళ్లేం మాట్లాడుతున్నారో ప్రజలు చూస్తున్నారు. బీఆర్ఎస్ జాతీయ కార్యకలాపాలకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. తెలంగాణలో ఓడిపోకపోతే మహారాష్ట్రలో 20, 30 ఎంపీ సీట్లు వచ్చేవి. ఏడాదిలోగా గ్రామస్థాయి మొదలుకుని మొత్తం బీఆర్ఎస్ కార్యవర్గాలను పునర్వ్యవస్థీకరిస్తాం."

(కల్వల మల్లికార్జున్‌రెడ్డి)

కాంగ్రెస్‌ను నమ్మి మోసపోయామని తెలంగాణ ప్రజలు గుర్తించారని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. తెలంగాణ ఆత్మగౌరవం గురించి సీఎం రేవంత్ మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్టే ఉందన్నారు. 'ఓటుకు కోట్లు' కేసు నుంచి రేవంత్ తప్పించుకోలేరని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్‌కు 12కుపైగా లోక్‌సభ సీట్లు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. కేంద్రంలో ప్రాంతీయ పార్టీల కూటమే అధికారంలోకి వస్తుందని, అందులో బీఆర్ఎస్ కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా బస్సుయాత్ర చేస్తున్న కేసీఆర్ 'సాక్షి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. - వివరాలు 2లో

భారత్ ఆత్మపై బీజేపీ దాడి

నర్సాపూర్, సరూర్‌నగర్ సభల్లో రాహుల్‌గాంధీ ఫైర్

- రాజ్యాంగాన్ని మారుస్తామని బీజేపీ, ఆర్ఎస్ఎస్ స్పష్టం చేశాక జరుగుతున్న తొలి ఎన్నికలు ఇవి
- భారత రాజ్యాంగం మామూలు పుస్తకం కాదు.. దేశ పేదల గొంతుక, వారి గుండె చప్పుడు
- అలాంటి రాజ్యాంగాన్ని రద్దు చేస్తామని బీజేపీ నేతలు అంటున్నారు
- గత పదేళ్లలో మోదీ ఓ 22 మంది కోసమే ప్రభుత్వాన్ని నడిపారు..
- మేం అధికారంలోకి రాగానే పేదల బ్యాంకు ఖాతాల్లో రూ.కోట్లు వేస్తాం.. పేదరికాన్ని రూపుమాపుతాం

సాక్షి, హైదరాబాద్/ సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: 'తాము గెలిస్తే భారతదేశ రాజ్యాంగాన్ని మారుస్తామని, రద్దు చేస్తామని, ఖతం చేస్తామని బీజేపీ, ఆర్ఎస్ఎస్ స్పష్టంగా చెప్పాక జరుగుతున్న తొలి ఎన్నికలివి. భారత రాజ్యాంగం మామూలు పుస్తకం కాదు. దేశ పేదల గొంతుక, వారి గుండె చప్పుడు. ప్రజలకు రిజర్వేషన్లు, హక్కులు రాజ్యాంగంతోనే లభించాయి. అలాంటి రాజ్యాంగాన్ని రద్దు చేస్తామని, మారుస్తామని అనడం ద్వారా బీజేపీ నేతలు పేద ప్రజలపైనే కాకుండా భారతదేశ ఆత్మపై దాడి చేస్తున్నారు..' అని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'అంబేడ్కర్, మహాత్మాగాంధీ, నెహ్రూ లాంటి వారు పోరాడి, ఏళ్ల తరబడి జైళ్లలో మగ్గి, తమ రక్తం, చెమటను ధారపోశారు. ఆ మహనీయుల కర్మ ఫలాలకు నష్టం కలిగించాలని ఇప్పుడు బీజేపీ వాళ్లు అనుకుంటున్నారు. రాజ్యాంగాన్ని రద్దు చేయడం మిగతా 4వ పేజీలో ▶

విశ్వ నగరంలో విషం చిమ్ముతున్నారు

15 సెకన్ల సమయమిస్తే మైనార్టీలను తుద ముట్టిస్తామని బీజేపీ మహిళా నేత అన్నారు: సీఎం రేవంత్‌రెడ్డి - 4లో



సరూర్‌నగర్ సభలో అభివాదం చేస్తున్న రాహుల్. చిత్రంలో సీఎం రేవంత్

డబుల్ డిజిట్ పక్కా

- రేవంత్‌రెడ్డీ చూస్కో.. బీజేపీ అగ్రనేత అమిత్ షా వ్యాఖ్య..
- దేశంలో కుటుంబ పాలనకు, భారతీయ కుటుంబానికి మధ్య పోటీ జరుగుతోంది
- రాహుల్ పిల్ల చేష్టల గ్యారంటీ వర్సెస్ మోదీ గ్యారంటీ మధ్య ఎన్నికలు
- నర్సయ్యగౌడ్‌కు ఓటేస్తే అభివృద్ధికి వేసినట్లే.. భువనగిరి జిల్లా రాయగిరిలో ప్రచారం

సాక్షి, యాదాద్రి: 'దేశంలో కుటుంబ పాలనకు, భారతీయ కుటుంబానికి మధ్య పోటీ జరుగుతోంది. ఈ ఎన్నికలు మోదీ, రాహుల్‌కు మధ్య జరుగుతున్నాయి. మోదీ దేశం కోసం.. వారు కుటుంబాల సంక్షేమం కోసం పని చేస్తారు. 'ఓట్ ఫర్ జిహాద్ వర్సెస్ ఓట్ ఫర్ డెవలప్మెంట్.. రాహుల్ పిల్ల చేష్టల గ్యారంటీ వర్సెస్ మోదీ అభివృద్ధి గ్యారంటీ' మధ్య ఎన్నికలు జరుగుతున్నాయి..'అని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అన్నారు. 2019లో తెలంగాణలో బీజేపీ 4 స్థానాల్లో గెలిచిందని, రేవంత్‌రెడ్డీ చూస్కో.. ఈసారి 10 కంటే ఎక్కువ సీట్లలో బీజేపీ గెలవబోతోంది అని వ్యాఖ్యానించారు. తెలంగాణలో డబుల్ డిజిట్ స్కోర్ బీజేపీని 400 స్థానాల్లో గెలిపించేందుకు మార్గం సుగమం చేస్తుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పరిస్థితి దయనీయంగా మారిందని, రాహుల్ గ్యారంటీలు చెల్లే పరిస్థితి లేదని చెప్పారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, రైతులకు ఏటా రూ.15 వేలు, రైతు కూలీలకు రూ.12 వేల ఆర్థిక సాయం అమలు కాలేదన్నారు. గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా రాయగిరిలో భువనగిరి లోక్‌సభ బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్‌కు మద్దతుగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీలకు న్యాయం

'నీళ్లు, నిధులు, నియామకాలు అనే నినాదంతో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ పదేళ్లు తమ కుటుంబం బాగు కోసమే పని చేసింది. ఇప్పుడు కాంగ్రెస్‌కు ఐదేళ్లు అవకాశం ఇచ్చారు. కానీ ఆ పార్టీ తెలంగాణను ఏటీఎంలా మార్చుకుంటోంది. అబద్ధాలతో ఈ ఎన్నికలు గెలవాలని మిగతా 4వ పేజీలో ▶



రాయగిరి సభలో అభివాదం చేస్తున్న అమిత్‌షా

NECC NATIONAL EGG CO-ORDINATION COMMITTEE | Vencobb CHICKEN
Suggested Today's Eggs & Broiler Chicken Hyderabad Zone Rates
12 Eggs Retail Rate ₹ 68 | Ex Farm Live Bird 140 kg | Dressed with Skin 235 kg | Retail Live Bird 162 kg | Skin Less 257 kg
Conditions Apply
Issued in the interest of consumers

ఇదండీ సంగతి



15 సెకన్లు కాదు..
15 గంటలు ఇవ్వండి..

- మోదీజీ మీ చేతిలో అధికారం ఉంది
- ముస్లింలను ఏం చేస్తారో చేయండి
- భయపడేది లేదు.. ఎక్కడికి రావాలో చెప్పండి
- నవనీత్ కౌర్ వ్యాఖ్యలకు అసదుద్దీన్ కౌంటర్



సాక్షి, హైదరాబాద్: బీజేపీ అమరావతి అభ్యర్థి (సిట్టింగ్ ఎంపీ) నవనీత్ కౌర్.. గతంలో ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ మాట్లాడిన మాటలు ప్రస్తావిస్తూ చేసిన వ్యాఖ్యలకు, ఎంఐఎం అధినేత, హైదరాబాద్ లోక్‌సభ మజ్లిస్ అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీ గట్టిగా కౌంటర్ ఇచ్చారు. పాతబస్తీలో బీజేపీ అభ్యర్థి మాధవీలతకు మద్దతుగా ప్రచారం నిర్వహించిన నవనీత్ కౌర్.. దాదాపు పన్నెండేళ్ల కిందట అక్బరుద్దీన్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించారు. 'పోలీసులు 15 నిమిషాలు పక్కకు తప్పుకుంటే లెక్కలు సరిచేస్తామని చిన్నోడు అన్నాడని, కానీ వాళ్లకు 15 నిమిషాలేమో..మాకు 15 సెకన్లు చాలు..'అంటూ వ్యాఖ్యానించారు. కాగా గురువారం పాతబస్తీలో ఎన్నికల ప్రచారం చేస్తున్న మిగతా 8వ పేజీలో ▶

అది పెత్తందార్ల కూటమి

- దుష్ట చతుష్టయానికి ఏం కావాలో మోదీ, అమిత్‌షా అదే మాట్లాడుతున్నారు
- పదేళ్ల క్రితం హామీ ఇచ్చిన హోదాపై ప్రకటన చేస్తారని అందరూ ఆశించారు

కర్నూలు, కళ్యాణదుర్గం, రాజంపేట ఎన్నికల సభల్లో ఏపీ సీఎం జగన్ ధ్వజం

- ప్రజలకు తీవ్ర నిరాశ మిగిల్చి.. మనపై నాలుగు రాళ్లేసి వెళ్లారు
- చంద్రబాబు అంత అవినీతిపరుడు దేశ చరిత్రలోనే లేదన్న నోటితోనే పొగడ్తలా?
- మీ రాకతో రైతులు, అక్కచెల్లెమ్మలు, అవ్వాతాతలకు, పిల్లలు, సామాజిక వర్గాలకు ఏమైనా ఒరిగిందా?
- పెత్తందారీ భావజాలంతో ఓట్లు అడుగుతున్నారు..
- మీరు ఇక్కడ నొక్కే బటన్ సౌండ్ ఢిల్లీ దాకా వినిపించాలి
- ఆరునూరైనా ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు కొనసాగి తీరాల్సిందే

11లో





నేటి మోదీ సభ తెలంగాణకు కీలకం

- ఈ సభలో ఎన్నికల సందేశం ఇస్తారు..
- రిజర్వేషన్లపై రాహుల్ డైరెక్ట్ చేసిన సినిమా ఫ్లాప్
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి - 9లో

నేడు, రేపు తేలికపాటి వానలు

- ఉపరితల ద్రోణి, ఆవర్తనం ప్రభావం..
- రెండ్రోజులు సాధారణం కంటే తక్కువగా నమోదవనున్నఉష్ణోగ్రతలు
- వాతావరణ శాఖ వెల్లడి

- వివరాలు 3లో

కాపులు, ముస్లింలకు రిజర్వేషన్లు అక్కర్లేదు

- ఓ ఇంగ్లిష్ టీవీ చానల్ ఇంటర్వ్యూలో పవన్ సంచలన వ్యాఖ్యలు
- ఆ రిజర్వేషన్లు ఇవ్వడం సాధ్యమే కాదంటూ వ్యాఖ్య.. ముస్లిం రిజర్వేషన్లపై బీజేపీ పెద్దల ప్రకటనకు జనసేన అధినేత మద్దతు



10లో

ప్రజలకు రాహుల్‌గాంధీ క్షమాపణ చెప్పాలి

- ఆరు గ్యారంటీలను మరిచిన కాంగ్రెస్
- జహీరాబాద్ రోడ్‌షోలో మాజీ మంత్రి హరీశ్‌రావు



జహీరాబాద్‌లో నిర్వహించిన రోడ్‌షోలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

జహీరాబాద్ (సంగారెడ్డి)/సిద్దిపేటజోన్: కాంగ్రెస్ పార్టీ జాతీయ నేత రాహుల్‌గాంధీ ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చి మరిచిపోయారని మాజీమంత్రి హరీశ్‌రావు విమర్శించారు. హామీల అమలులో విఫలమైనందుకు రాష్ట్ర ప్రజలకు రాహుల్ గాంధీ బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారానికి ఏం ముఖం పెట్టుకుని రాష్ట్రానికి వచ్చారని హరీశ్‌రావు ప్రశ్నించారు. అక్కా చెల్లెళ్లకు రాహుల్‌గాంధీ రూ.8,500 ఇస్తానంటున్నారని, మళ్లీ ఎవరి చెవులో పువ్వు పెడతారని నిలదీశారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో గురువారం బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌కు మద్దతుగా రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ..కరెంటు కోతలు పెడుతున్న కాంగ్రెస్‌కు పార్లమెంట్ ఎన్నికల్లో వాతలు పెట్టాలన్నారు. ఆరు గ్యారంటీ పథకాలు వచ్చిన వారు కాంగ్రెస్‌కు ఓటు వేయాలని, రాని వారంతా బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో పార్లమెంట్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్, ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు, డీసీఎంఎస్ చైర్మన్ ఎం.శివకుమార్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వై.నరోత్తం, బేవరేజస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవిప్రసాద్, బీఆర్ఎస్ నాయకులు కిజర్‌యాఫై పాల్గొన్నారు.

బీజేపీతో కొట్లాడినందుకే కవితకు జైలు

బీజేపీతో కొట్లాడేది ఒక్క కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీయేనని ఆ పోరాటం ఫలితంగానే ఎమ్మెల్సీ కవిత జైలుకు వెళ్లాల్సి వచ్చిందని హరీశ్‌రావు తెలిపారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో జరిగిన ముస్లిం, మైనార్టీ ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీజేపీ, బీఆర్ఎస్‌లు ఒక్కటేనని కాంగ్రెస్ పార్టీ నాయకులు చేస్తున్న ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. బీజేపీతో బీఆర్ఎస్ కలిసి ఉంటే కవిత అరెస్ట్ అయ్యేవారా..? అని ప్రశ్నించారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ప్రధాని మోదీతో జత కట్టారని, చాలాసార్లు బహిరంగంగానే ప్రధానిని పొగిడిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. రేవంత్‌రెడ్డి, బీజేపీ మిలాఖత్ అయి రాష్ట్రంలో బీఆర్ఎస్‌ను లేకుండా చేయాలని కుట్ర చేస్తున్నారని ఆరోపించారు.

ఢిల్లీ హైకోర్టులో కవిత బెయిల్ పిటిషన్

- నేడు విచారణ



సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత బెయిల్ కోసం ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో కవితను ఈడీ అరెస్టు చేయడాన్ని సవాలు చేస్తూ ఆమె తరఫు న్యాయవాది మోహిత్‌రావు గురువారం 1,149 పేజీలతో బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన న్యాయమూర్తి జస్టిస్ స్వర్ణకాంత శర్మ శుక్రవారం విచారణ చేపట్టనున్నారు. లిక్కర్ కేసులో కవితను మార్చి 15న ఈడీ, ఏప్రిల్ 11న సీబీఐ అరెస్టు చేసిన విషయం విదితమే. గతంలో ఈ కేసును విచారించిన ట్రయల్ కోర్టు (రౌజ్ అవెన్యూ కోర్టు) కవిత బెయిల్ పిటిషన్‌ను నిరాకరిస్తూ జ్యుడీషియల్ కస్టడీని పొడిగించింది. ఈ నేపథ్యంలోనే ఆమె ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు.

మాది పేగు బంధం

తెలంగాణతో తమది పేగు బంధమని, రాష్ట్ర ప్రయోజనాలను కాపాడేది బీఆర్ఎస్ ఒక్కటేనని ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఆయన 'సాక్షి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. వివరాలు ఆయన మాటల్లోనే..



బస్సులో నుంచి ప్రజలకు అభివాదం చేస్తున్న కేసీఆర్

ప్రజలు కాంగ్రెస్‌ను నమ్మి మోసపోయారు

కాంగ్రెస్ ఇచ్చిన అడ్డగోలు హామీలతో ప్రజలు ఆశకు పోయి మోసపోయారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాతి పరిణామాలతో.. కాంగ్రెస్‌ను నమ్మి తినే అన్నంలో మన్ను పోసుకున్నామనే భావన జనంలో మొదలైంది. అసెంబ్లీ ఎన్నికల్లో మేం పూర్తిగా తుడిచిపెట్టుకుపోలేదు. కేవలం 1.8శాతం ఓట్ల స్వల్ప తేడాతో అధికారం కోల్పోయాం. మాకు కొన్ని వర్గాలు దూరం అయ్యాయనేది ఈనాడు జర్నలిజం స్కూల్ నుంచి పుట్టిన విచిత్రమైన కథ. మాకు ఏ ఒక్క వర్గం కూడా దూరం కాలేదు.

కేంద్రంలో ప్రాంతీయ పార్టీల కూటమిదే అధికారం


మోదీ ఏమైనా మొనగాడా? రాహుల్ సిపాయా? ఎన్డీయే, ఇండియా కూటమి ఏదీ అధికారంలోకి వచ్చే పరిస్థితి లేదు. ఎన్నికల తర్వాత మోదీ, ఎన్డీయే దుర్మార్గ పాలన అంతమవుతుంది. దక్షిణాదిలోని 139 సీట్లలో బీజేపీకి 9 కూడా రావు. అధికారం వచ్చే పరిస్థితి కాంగ్రెస్‌కు లేదు. బలంగాఉన్న ప్రాంతీయ పార్టీలతో ఏర్పడే కూటమికే వాళ్లు మద్దతు ఇవ్వాల్సి వస్తుంది. అలాంటి పరిస్థితుల్లో ఎవరి మద్దతు తీసుకోవాలో అందరం కలసి నిర్ణయం తీసుకుంటాం. ప్రాంతీయ పార్టీల కూటమి వస్తే బీఆర్ఎస్‌కు ఒకట్రెండు కేంద్ర మంత్రి పదవులు కూడా వస్తాయి.

మోదీ మేనియా అంతా గ్యాస్

ఎన్డీయే ట్రాష్.. మోదీ మేనియా గ్యాస్ అని తేలిపోయింది. ఆయన నినాదాలన్నీ డొల్ల, మోదీ పాలనలో ఒక్క రంగం కూడా బాగుపడలేదు. కార్పొరేట్లకు రుణమాఫీ చేశారు. ఎగవేతదారులను లండన్‌లో పెట్టి మేపుతున్నారు. మోదీ రాజకీయంగా అనేక దుర్మార్గాలు చేశారు. 700కుపైగా ఇతర పార్టీల ప్రజాప్రతినిధులను చేర్చుకుని ప్రభుత్వాలను కూల్చివేశారు. గతంలో 111 మంది ఎమ్మెల్యేలు ఉన్న మా ప్రభుత్వాన్ని కూడా కూల్చాలని చూశారు. అలాంటి పరిస్థితి రాకుండా.. మేం నైతిక పద్ధతుల్లో ఇతర పార్టీల ఎమ్మెల్యేలను చేర్చుకున్నాం.

పెట్రోల్ 'చార్ సౌ' దాటుతుంది

కేంద్రంలో బీజేపీ, మోదీ మళ్లీ అధికారంలోకి వస్తే.. వారి సీట్లే మోగానీ పెట్రోల్ 'చార్ సౌ' దాటడం పక్కా. ప్రధాని మోదీ దుర్మార్గుడు. మత విద్వేషాలు మినహా దేశ ప్రగతి ఆయనకు పట్టదు. రాష్ట్రాలను మున్సిపాలిటీల కంటే అధ్వానంగా దిగజార్చారు. మోదీ మూలంగా మతపిచ్చి వాళ్ల దేశమనే ముద్ర పడుతోంది. కవిత, కేజ్రీవాల్ అరెస్టుపై అమెరికా, జర్మనీ వంటి ప్రజాస్వామ్య దేశాలు కూడా ప్రతిస్పందించాయి.



రేవంత్ తప్పించుకోలేడు

ప్రధాని మోదీని రేవంత్ బడేభాయ్ అనడం వంటి వాటిపై కాంగ్రెస్‌లోనే వ్యతిరేకత వ్యక్తమవుతోంది. రేవంత్ ఒకవేళ బీజేపీలోకి వెళ్తే.. తాము 30 మందిమి రెడీగా ఉన్నామని, కలిసి పనిచేద్దామని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కొందరు బీఆర్ఎస్ నేతలతో చెప్తున్నారు. 'ఓటుకు కోట్లు' కేసులో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడిన రేవంత్ దాన్నుంచి తప్పించుకోలేడు. ఆయన అరెస్టు అయితే రాష్ట్రంలో రాజకీయ అనిశ్చితి వస్తుందని అంతా అనుకుంటున్నారు. తెలంగాణ ఉద్యమానికి రేవంత్‌కు సంబంధమే లేదు. ఉద్యమకారుల మీదికి తుపాకీతో వచ్చిన ఆయన తెలంగాణ ఆత్మగౌరవం గురించి మాట్లాడితే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉంటుంది. గుజరాత్‌తో తెలంగాణకు ఫైనల్ మ్యాచ్ అనేది బుద్ధిలేని వాదన.

బీజేపీకి వ్యతిరేకంగా నిలవడం వల్లే కవిత అరెస్టు

అవినీతికి పాల్పడాల్సిన అవసరం, ఖర్మ నా కూతురుకు లేవు. ఆమె నిర్దోషి, అమాయకురాలు. విచారణకు సహకరించినా అరెస్టు చేశారు. ఇలా చేస్తారని నాకు ముందే తెలుసు. రాజకీయ కక్ష సాధింపులకు బలి కాబోతున్నావు, నేరం చేయలేదు కాబట్టి ధైర్యంగా ఉండు అని కవితకు చెప్పా. బీజేపీ వాళ్లు దుర్మార్గాలకు పాల్పడుతారని వివరించా. నేను, కేజ్రీవాల్ ఇద్దరం బీజేపీకి వ్యతిరేకంగా బలంగా నిలబడటం వల్లే ఇది జరుగుతోంది. న్యాయ వ్యవస్థ మీద నమ్మకముంది. కవిత బెయిల్ కోసం నేను బీజేపీతో రాజీ పడ్డాననడం అర్థ రహితం.

నిఘా నుంచి సమాచారం మాత్రమే కోరాం..

ఫోన్ ట్యాపింగ్ అంటూ.. బాకా, కాకా మీడియాలో వస్తున్న వార్తలన్నీ ట్రాష్. ప్రపంచవ్యాప్తంగా ప్రతీ ప్రభుత్వానికి గూఢచార వ్యవస్థ ఉంటుంది. ఆ వ్యవస్థ ఎలా సమాచార సేకరణ జరిపిందనేది మాకు అనవసరం. సీఎం, మంత్రులకు అందులో ఏం పాత్ర ఉంటుంది. ఫోన్ ట్యాప్ చేయాలని ఏ సీఎం కూడా ఆదేశించరు. ప్రభుత్వ పనితీరు, శాంతిభద్రతల పరిరక్షణ కోసం నిఘా వ్యవస్థల నుంచి సమాచారం మాత్రం అడుగుతాం.

జగన్ మళ్లీ సీఎం అవుతారు

వైఎస్ జగన్ ఏపీలో రెండోసారి సీఎం అవుతారనే సమాచారం నాకు ఉంది. షర్మిల వంటి వ్యక్తులతో ఏదీ సాధ్యం కాదు. ఒకవేళ ఎవరైనా షర్మిల వంటి వారిని అడ్డుపెట్టుకుని ఇబ్బంది పెట్టాలని చూసినా అవి ఫలించవు.

మోదీ ఉల్లంఘనలు కనిపించట్లేదా?

ప్రధాని మోదీ ఏం మాట్లాడినా అడిగేవారు లేక 'బారా ఖూన్ మాఫ్' అన్నట్టుగా తయారైంది. మతం పేరిట ప్రధాని రెచ్చగొడుతున్నా చర్యలు లేవు. హైదరాబాద్ బీజేపీ అభ్యర్థి శివ లింగం మీద నీళ్లు పోస్తూ ఓట్లు అడిగితే ఉల్లంఘన కాదా? ఎన్నికల సంఘం నాపై మాత్రం 48 గంటల నిషేధం విధించింది. అది బీజేపీ అనుబంధ సంస్థగా మారింది.

ధరణి, ల్యాండ్ టైటిల్ వంటివి ఉత్తమ విధానాలు

చాన్నాళ్లుగా భూములను చిక్కుల్లో పెట్టి, రైతులను రాచి రంపాన పెట్టి.. ఎవరి భూములు ఎవరివో తెలియకుండా కన్ఫ్యూజన్‌లో పెట్టి.. లక్షలు, కోట్ల రూపాయలు దండుకున్నారు. ఎవరైనా సీఎం సాహసం చేసి దానిని సరిదిద్దాలని ప్రయత్నిస్తే.. కొన్ని ప్రతీపశక్తులు ప్రజల్లో భయాందోళన కలిగించే ప్రయత్నాలు చేస్తాయి. ధరణితో తెలంగాణలో ప్రజలకు మేలు జరిగింది. ఏపీలో సీఎం జగన్ కూడా ప్రజలకు మంచి చేసే ప్రయత్నం చేశారు. భూములను ఎవరూ లాక్కోకుండా ఉండేందుకే ధరణి, ల్యాండ్ టైటిల్ వంటి ఉత్తమ విధానాలు ఉపయోగపడతాయి. ప్రపంచంలో ఎక్కడా ఇలాంటి ఉత్తమ విధానాలు లేవు.

కాళేశ్వరం ప్రాజెక్టుపై బద్నాం చేసే ఉన్మాదం

కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో కేసీఆర్‌ను బద్నాం చేయాలనే ఉన్మాదం కాంగ్రెస్‌లో కనిపిస్తోంది. భారీ ప్రాజెక్టుల్లో బాలారిష్టాలు సహజం. ఒక బ్యారేజీ పిల్లర్లలో వచ్చిన సమస్యను సాకుగా చూపి పంటలను ఎండబెట్టారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ మధ్యంతర నివేదికలోనూ ప్రభుత్వాన్ని తప్పు పట్టింది. తక్షణమే మరమ్మతులు చేపట్టి నీళ్లు వినియోగించుకోవాలని సూచించింది. జ్యుడీషియల్ కమిషన్‌కు ఇంజనీరింగ్ విధానాల గురించి ఏం తెలుసు? మహానది, గోదావరి, కృష్ణా, కావేరి నదులను అనుసంధానించాలని 50 ఏళ్ల క్రితం అనుకున్నారు. మహానది విషయంలో ఒడిశా దుద్దుకర్ర పట్టుకుంది. దాంతో గోదావరి నుంచి అనుసంధానం మొదలు పెడతామని మోదీ అంటున్నారు. గోదావరిలో రెండు తెలుగు రాష్ట్రాల వాటా తేల్చిన తర్వాతే అనుసంధానం గురించి మాట్లాడాలి.

ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ జర్నలిజానికే మచ్చ

కేసీఆర్ ప్రజాస్వామ్యయుతంగా ఉండరనేది ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ వంటి కొందరు విషం చిమ్మేవాళ్లు చేసే తప్పుడు ప్రచారం. రాధాకృష్ణ జర్నలిస్టేనా? ఆయన కక్కేది విషం. దానికి వలువలు, విలువలు లేవు. కొత్త పలుకు అంటూ చెత్త రాస్తారు. ఆయన సొంత అభిప్రాయాలు, కోరికలను చెప్తూ.. ఎదుటి వాళ్ల మీద విషం కక్కుతుంటారు. ఏబీఎన్, ఆంధ్రజ్యోతి వంటివి జర్నలిజం పరువు తీసి బజారులో నిలబెట్టాయి. కాకా, బాకా ఊది గెలిపిస్తామని అనుకుంటున్న వీళ్లు.. గతంలో చంద్రబాబును ఏపీలో గెలిపించగలిగారా? రాధాకృష్ణ లాంటి వాళ్లు జర్నలిజానికి మచ్చ.

పుస్తకాలు చదువుతున్నా.. పాటలు వింటున్నా

సర్జరీ తర్వాత మెల్లగా కోలుకుంటున్నా. కొంత సమయం దొరికినప్పుడు పుస్తకాలు చదువుతున్నా. కిషోర్ కుమార్, లతా మంగేష్కర్, ముఖేశ్ పాటలు చాలా ఇష్టం. రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత సమయం దొరకదు. సీఎం బాధ్యతల నుంచి తప్పుకున్నాక ఎన్నికలు, పార్టీ కార్యకలాపాలపై దృష్టి పెట్టాను. కానీ కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు చూస్తే.. ప్రశాంతంగా ఉండలేకపోతున్నా..

బీఆర్ఎస్ ఎంపీలతోనే తెలంగాణకు బలం!

- ఢిల్లీ పాలకుల గల్లా పట్టి నిలదీసే ధైర్యం కాంగ్రెస్, బీజేపీ ఎంపీలకు ఉండదు: కేటీఆర్
- గత ఐదు నెలల్లో రాష్ట్రంలో అభివృద్ధి ఆగిపోయింది
- బీజేపీ గెలిస్తే రాజ్యాంగం మార్చి, రిజర్వేషన్లు రద్దు చేస్తుంది
- హైదరాబాద్‌ను కేంద్రపాలిత ప్రాంతం చేసేందుకు ప్రయత్నాలు
- ఇవన్నీ ఆగాలంటే.. రాష్ట్రం నుంచి కేసీఆర్ సైనికులు పార్లమెంటులో ఉండాలని వ్యాఖ్య
- మల్కాజిగిరి పరిధిలో ఎన్నికల ప్రచారం.. భైంసాలో రోడ్ షో, కార్నర్ మీటింగ్

నిర్మల్ కార్నర్ మీటింగ్‌కు హాజరైన ప్రజలు ▶



అల్వాల్/ కంటోన్మెంట్ (హైదరాబాద్)/ నిర్మల్

బీఆర్ఎస్ ఎంపీలతోనే తెలంగాణకు బలమని, రాష్ట్ర ప్రయోజనాల కోసం కొట్లాడేది తామేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు గెలిస్తే.. ఢిల్లీ పాలకుల గల్లాపట్టి నిలదీసే ధైర్యం ఉండదని స్పష్టం చేశారు. హైదరాబాద్‌ను కేంద్ర పాలిత ప్రాంతం చేసేందుకు కుట్రలు సాగుతున్నాయని.. అది ఆగాలంటే తెలంగాణ నుంచి కేసీఆర్ సైనికులు పార్లమెంట్‌లో ఉండాలని చెప్పారు. గురువారం మల్కాజిగిరి నియోజకవర్గంలోని అల్వాల్ వీబీఆర్ గార్డెన్‌లో, కంటోన్మెంట్ పరిధిలోని సిఖ్ విలేజ్ ఇంపీరియల్ గార్డెన్స్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో.. నిర్మల్ జిల్లా కేంద్రంలో, భైంసాలో నిర్వహించిన రోడ్ షో, కార్నర్ మీటింగ్‌లలో కేటీఆర్ మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

''పార్లమెంట్ ఎన్నికలు కదా బీఆర్ఎస్‌కు ఎందుకు ఓటు వేయాలని కొందరు అంటున్నారు. పార్లమెంట్‌లో తెలంగాణ ప్రజల గళం వినిపించడానికి కేసీఆర్ సైనికులు ఉండాలి. 2004లో ఐదుగురు ఎంపీలతో పార్లమెంట్‌లో అడుగుపెట్టిన కేసీఆర్.. 32 పార్టీలను ఒప్పించి, మెప్పించి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారు. రాహుల్ గాంధీని, నరేంద్ర మోదీని ఎదిరించే దమ్ము కాంగ్రెస్, బీజేపీ ఎంపీలకు లేదు. కాంగ్రెస్ పార్టీ ఎక్కడ ఉంటే అక్కడ బీజేపీ వాళ్లు రాష్ట్ర ప్రభుత్వాన్ని అలవోకగా పడగొట్టారు. అదే కేసీఆర్, మమతా బెనర్జీ, హేమంత్ సోరేన్, స్టాలిన్, కేజ్రీవాల్ ప్రభుత్వాలను పడగొట్టే ప్రయత్నాలు చేసినా విఫలమయ్యారు. బలమైన లీడర్లు ఉన్నచోట బీజేపీ ఆటలు సాగలేదు. అందుకే బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించి బలం ఇవ్వాలి.



నిర్మల్ కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

బీజేపీ ముందు తల వంచేది లేదు

బీఆర్ఎస్, బీజేపీ ఒకటేనంటూ అవాస్తవ ప్రచారం చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బండి సంజయ్, ఈటల, రఘునందన్‌రావు, సోయం బాపూరావు వంటి బడా లీడర్లను ఓడించింది బీఆర్ఎస్ వాళ్లేనని గుర్తుంచుకోవాలి. మేం తల నరుక్కుంటాం కానీ.. బీజేపీ ముందు తల వంచేది లేదు.

రేవంత్ ఊసరవెల్లిలా ప్రవర్తిస్తున్నారు

కాంగ్రెస్ వస్తే పరిస్థితి ఎలా ఉంటుందో అసెంబ్లీ ఎన్నికల సమయంలోనే చెప్పాం. ఆ పార్టీ అబద్ధపు గ్యారెంటీలతో అధికారంలోకి వచ్చి.. ప్రజలను ఇబ్బంది పెడుతోంది. గత ఐదు నెలల్లో రాష్ట్రంలో అభివృద్ధి ఆగిపోయింది. రేవంత్ చిల్లర మాటలు మాట్లాడటం తప్ప మరేమీ జరగలేదు. ఊసరవెల్లి రంగులు మార్చినట్టు హామీల అమలు గురించి నెలలు, తారీఖులు చెప్తున్నారు. కొడుకుల్లారా, పేగులు తీసి మెడలో వేసుకుంటా అంటూ రేవంత్ మాట్లాడుతున్నారు. ఆయన ముఖ్యమంత్రా.. బోటీ కొట్టేవాడా? మన ఖర్మకాలి ముఖ్యమంత్రి అయ్యిండు. పిచ్చోడి చేతిలో రాయిలా తెలంగాణ మారింది.

బీజేపీ హైదరాబాద్‌ను యూటీ చేస్తుంది

రిజర్వేషన్లను రద్దుచేసి అగ్రవర్ణాలకు మేలు చేసేలా బీజేపీ కుట్ర చేస్తోంది. ఇందుకోసం రాజ్యాంగాన్ని కూడా మార్చాలని ప్రయత్నిస్తోంది. ప్రధాని మోదీ పదేళ్ల క్రితం ఇచ్చిన హామీలకే గ్యారంటీ లేదు, ఇప్పుడు కొత్తగా చెప్పే మాటలకు గ్యారంటీ ఏముంది? జూన్ 2వ తేదీతో తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేళ్లు పూర్తవుతుంది. హైదరాబాద్ ఉమ్మడి రాజధాని గడువు ముగుస్తుంది. దీంతో కేంద్రం హైదరాబాద్‌ను కేంద్ర పాలిత ప్రాంతం చేయడానికి ప్రయత్నాలు చేస్తోంది. అదే జరిగితే హైదరాబాద్ అభివృద్ధి ఆగిపోతుంది'' అని కేటీఆర్ పేర్కొన్నారు. మల్కాజిగిరిలో బీజేపీ, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థులు ఇద్దరూ నాన్ లోకల్, బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి పక్కా లోకల్ అన్నారు. ఎంపీగా లక్ష్మారెడ్డిని, కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికలో నివేదిత సాయన్నను గెలిపించాలని పిలుపునిచ్చారు.

భైంసాలో కేటీఆర్‌పై ఉల్లిగడ్డలు.. జైశ్రీరాం నినాదాలు

భైంసా/ భైంసాటౌన్: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్మల్ జిల్లా భైంసాలో గురువారం సాయంత్రం కేటీఆర్ నిర్వహించిన రోడ్ షోలో.. కొందరు ఉల్లిగడ్డలు, చిన్నపాటి రాళ్లు విసిరారు. కార్నర్ మీటింగ్ నిర్వహించిన ప్రాంతానికి హనుమాన్ స్వాములు, మరికొందరు చేరుకున్నారు. కేటీఆర్ ఖబడ్దార్ అంటూ ముద్రించిన ప్లకార్డులను చూపుతూ.. జైశ్రీరాం అంటూ నినాదాలు చేశారు. కేటీఆర్ ప్రసంగిస్తున్నంత సేపు ఆయన వాహనంపైకి ఉల్లిగడ్డలు విసిరారు. ఈ సమయంలో బీఆర్ఎస్ శ్రేణులు నిరసనకారులవైపు దూసుకెళ్లే ప్రయత్నం చేయడంతో కొంత ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు చాలా కష్టపడి ఇరువర్గాలను అదుపుచేశారు. నిరసనకారులు విసిరిన ఉల్లిగడ్డలు, చిన్నరాళ్లతో ఓ యువకుడి తలకు స్వల్పంగా గాయమైంది.

దేవుడిని అడ్డంపెట్టుకుని రాజకీయాలా?

భైంసాలో తనపై ఉల్లిగడ్డలు, రాళ్లు విసిరినవారిపై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కొందరు కావాలనే యువకులను రెచ్చగొట్టి ఇలా పంపిస్తుంటారని, కార్యకర్తలు సంయమనం పాటించాలని సూచించారు. ''కేసీఆర్ తెలంగాణలో యాదాద్రి సహా ఎన్నో మందిరాలు నిర్మించారు. ఏమీ చేయనివారే దేవుడిని అడ్డంపెట్టుకుని రాజకీయం చేస్తారు. రాముడు ఎంతో ఆదర్శవంతుడు. మేం కూడా జైశ్రీరాం అంటాం. మరి రాముడు ఎదుటివారిపై రాళ్లు విసరాలని చెప్పాడా? మా పని మేం చేసుకుంటున్నాం. మీ పని మీరు చేసుకోండి. కానీ చిల్లర పనులు చేయవద్దు. ఇలాంటి వాటికి భయపడబోం'' అని కేటీఆర్ స్పష్టం చేశారు.

'మత' ముష్కరులపై పోరాటం కొనసాగుతుంది: 'ఎక్స్'లో కేటీఆర్

''భైంసా పట్టణంలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో నాపై కొందరు బీజేపీ గూండాలు రాళ్లతో దాడి చేసిన ఘటనతో అనేక మంది ఫోన్లు చేసి నా యోగక్షేమాలు అడుగుతున్నారు. నేను క్షేమంగా ఉన్నాను. మతం పేరిట విద్వేషాన్ని వ్యాప్తి చేస్తూ విషాన్ని చిమ్మే ఈ ముష్కరులపై నాపోరాటం కొనసాగుతుంది'' అని 'ఎక్స్'లో కేటీఆర్ పేర్కొన్నారు.



కేటీఆర్ వాహనంపై విసిరిన ఉల్లిగడ్డను చేతితో అడ్డుకునే యత్నంలో ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

సాక్షి ఉద్యోగ అవకాశాలు



G.PULLA REDDY ENGINEERING COLLEGE (Autonomous) :: KURNOOL

Accredited by NBA of AICTE and NAAC of UGC
Estd : 1985 Ph : 08518-270957, 271017 URL : www.gprec.ac.in

RECRUITMENT NOTIFICATION

Teaching Posts: We are looking for qualified and experienced candidates in the following departments, Eligible and interested candidates can register and apply through online by visiting our college website www.gprec.ac.in on or before 25th May 2024.

Dept.	Post	Qualifications & Experience
CSE	Professor	Ph.D. with 10 years teaching experience, out of which at least 5 years must be at the level of Associate Professor. Research publications in standard journals will carry more weight.
	Professor of Practice	B.Tech / M.Tech with 15 years of Industrial experience
CSE	Associate Professor	Ph.D. with 5 years teaching experience.
	Associate Professor of Practice	B.Tech / M.Tech with 10 years of Industrial experience.
CSE CIVIL MECH EEE	Asst. Professor	First Class in B.Tech & M.Tech. Experienced candidates will be given preference
	Asst. Professor of Practice in CSE	B.Tech with 05 years of Industrial experience
Physics, Chemistry Mathematics	Asst. Professor	Ph.D/M.Phil/ B.Sc. I class & M.Sc. I class

- Faculty from any department with 2 NPTEL/Swayam courses equivalent to 10 credits related to CSE subject can also apply for CSE department.

Non-Teaching Post:

Post	Qualifications & Experience
P.A. to Principal	First class Graduate in any discipline. Typewriting Higher Grade, Fluency in English with good communication skills and letter drafting are must. Computer knowledge in MS Office is mandatory. Candidates with 3 years or more experience in educational institutions shall be preferred. Interested candidates may submit their bio-data in person or they may send by post or courier on or before 25th May 2024.

- Salary commensurate with qualifications, experience and performance. Candidates will be shortlisted based on their profiles and will be called for interview at our college sometime in the second or third week of June 2024.

PRINCIPAL



నేడు, రేపు తేలికపాటి వానలు

- ఉపరితల ద్రోణి, ఆవర్తనం ప్రభావంతో కురుస్తాయన్న వాతావరణ శాఖ
- రెండ్రోజులు సాధారణం కంటే తక్కువగా నమోదవనున్న ఉష్ణోగ్రతలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రానున్న రెండ్రోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఉపరితల ద్రోణి, ఆవర్తనం ప్రభావంతో శుక్ర, శనివారాల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని పేర్కొంది. నిర్మల్, నిజామాబాద్, వరంగల్, హనుమకొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. గురువారం రాష్ట్రంలో పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిశాయి. రాష్ట్రవ్యాప్తంగా 1.1 సెంటీమీటర్ల సగటు వర్షపాతం నమోదైందని ప్రణాళికా శాఖ వివరించింది.

తగ్గిన గరిష్ట ఉష్ణోగ్రతలు: తేలికపాటి వర్షాల నేపథ్యంలో గురువారం తెలంగాణలోని చాలా ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు తగ్గాయి. సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీల సెల్సియస్ మేర తక్కువగా నమోదైనట్లు వాతావరణ శాఖ తెలిపింది. అత్యధికంగా నిజామాబాద్ జిల్లా జకొరలో 43.6 డిగ్రీలు, సలూరలో 43 డిగ్రీల సెల్సియస్ గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. రాష్ట్రవ్యాప్తంగా కొన్ని ప్రాంతాల్లో రానున్న వారం రోజులపాటు సాధారణం నుంచి కాస్త తక్కువగా ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ శాఖ చెప్పింది.

వడగాడ్పులకు బ్రేక్...: ప్రస్తుత వేసవి సీజన్‌లో వడగాడ్పులకు బ్రేక్ పడినట్లు వాతావరణ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. శుక్రవారం కేవలం పశ్చిమ రాజస్తాన్‌లోనే వడగాడ్పులు వీచే అవకాశం ఉన్నట్లు ఐఎండీ శాస్త్రవేత్త సోమా సేన్ తెలిపారు. బంగాళాఖాతం నుంచి తేమతో కూడిన బలమైన గాలులు వీస్తున్నాయని, దీని ప్రభావంతో ఉరుములతో కూడిన గాలివానలు పెరుగుతాయని చెప్పారు. అయితే భారీ వర్షాలకు మాత్రం ఆస్కారం లేదని, దీంతో ఎల్లో అలర్ట్ జారీ చేస్తున్నట్లు వివరించారు.

గురువారం ప్రధాన కేంద్రాల్లో నమోదైన గరిష్ట ఉష్ణోగ్రతలు (డిగ్రీల సెల్సియస్‌లలో)

కేంద్రం	గరిష్టం
నిజామాబాద్	41.9
ఆదిలాబాద్	40.3
మెదక్	39.6
నల్లగొండ	39.5
ఖమ్మం	39.2
రామగుండం	38.8
మహబూబ్‌నగర్	38.2
భద్రాచలం	38.0
దుండిగల్	37.0
హనుమకొండ	37.0
హైదరాబాద్	37.0

ఇప్పుడు ఈ పిటిషన్ ఎందుకు?

- కాంగ్రెస్ నేత మహేశ్‌కుమార్‌ను ప్రశ్నించిన హైకోర్టు
- అమిత్ షా ఫేక్ వీడియో కేసులో విచారణ వాయిదా


సాక్షి, హైదరాబాద్: 'అమిత్ షా ఫేక్ వీడియో కేసులో అరెస్టు సహా ఎలాంటి కఠిన చర్యలు చేపట్టవద్దని ఢిల్లీ పోలీసులకు ఇప్పటికే హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది కదా.. నిందితులను ఇక్కడి పోలీసులు అరెస్టు చేయడం, ట్రయల్ కోర్టు బెయిల్ జారీ చేయడం కూడా జరిగాయి. ఇప్పుడు ఈ పిటిషన్ ఎందుకు వేశారు' అని హైకోర్టు పిటిషనర్ (టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్)ను ప్రశ్నించింది. పిటిషన్‌లో విచారణ ముగిస్తామని తెలిపింది. అయితే పిటిషనర్ న్యాయవాది విజ్ఞప్తి చేయడంతో విచారణ సెలవుల తర్వాతకు వాయిదా వేసింది. ఢిల్లీ పోలీసులు తమ పార్టీ సోషల్ మీడియా కార్యదర్శులను అరెస్టు సహా ఎలాంటి కఠిన చర్యలు చేపట్టకుండా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ టీపీసీసీ పిటిషన్ దాఖలు చేసింది. ఢిల్లీ పోలీసులు నోటీసులు జారీ చేయకుండా వారి ఇళ్లకు వెళ్లి వ్యక్తిగత వివరాలను తెలుసుకోవడంతోపాటు పలు వస్తువులను సీజ్ చేస్తూ చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తున్నారని.. వారిని అరెస్టు చేస్తామని చెబుతూ మనోవేదనకు గురిచేస్తున్నారని పేర్కొంది. సంచలనం సృష్టించిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఫేక్ వీడియో కేసులో హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు తెలంగాణ కాంగ్రెస్ సోషల్ మీడియా ఇన్‌చార్జి మన్నె సతీశ్‌తోపాటు మరికొందరిని అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. ఆ తర్వాత వీరికి ట్రయల్‌కోర్టు బెయిల్ కూడా మంజూరు చేసింది. అయితే ఇదే అంశంపై ఢిల్లీ పోలీసులు కూడా కేసు నమోదు చేసి, ఎఫ్ఐఆర్ ఫైల్ చేశారు. ఈ ఎఫ్ఐఆర్‌ను సవాల్ చేస్తూ మహేశ్‌కుమార్‌గౌడ్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి గురువారం విచారణ చేపట్టారు. పిటిషనర్ న్యాయవాది విజ్ఞప్తితో వాదనలను వాయిదా వేశారు.


'మధ్యంతర ఉత్తర్వులను ఎత్తివేయలేం'

సాక్షి, హైదరాబాద్: అమిత్ షా ఫేక్ వీడియో కేసులో నిందితులను తాము అరెస్టు చేయకుండా గతవారం ఇచ్చిన ఆదేశాలను ఎత్తివేయాలని కోరుతూ ఢిల్లీ పోలీసు లు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. అయితే అందుకు న్యాయస్థానం నిరాకరించింది. అమిత్ షా ఫేక్ వీడియో కేసులో ఢిల్లీ పోలీసులు ఏప్రిల్ 29న జారీ చేసిన 41ఏ సీఆర్‌పీసీ నోటీసులను సవాల్ చేస్తూ మన్నె సతీశ్, అస్మా తస్లీమ్, అంబాల శివకుమార్, పి.నవీన్, కోయ గీత, పి.వంశీకృష్ణ హైకోర్టులో గతవారం లంచ్‌మోషన్ రూపంలో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన హైకోర్టు.. అమిత్ షా ఫేక్ వీడియో కేసులో చట్టప్రకారం విచారణ కొనసాగించాలని ఢిల్లీ పోలీసులను ఆదేశించింది. అరెస్టు సహా ఎలాంటి కఠిన చర్యలు చేపట్టవద్దని స్పష్టం చేస్తూ.. కౌంటర్ దాఖలు చేయాలని నోటీసులు జారీ చేసింది. ఈ ఉపశమన ఉత్తర్వులను ఎత్తివేయాలని కోరుతూ ఢిల్లీ పోలీసులు గురువారం లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి విచారణ చేపట్టారు. మధ్యంతర ఉత్తర్వులను ఎత్తివేయలేమని.. అయితే ఢిల్లీ పోలీసులు ట్రయల్ కోర్టును ఆశ్రయించవచ్చని, వారిని ప్రశ్నించడానికి పీటీ వారెంట్లను కోరవచ్చని న్యాయమూర్తి సూచించారు. తదుపరి విచారణను జూన్ 12కు వాయిదా వేశారు.

బసవేశ్వరుడు గొప్ప దార్శనికుడు: మంత్రి కొండా సురేఖ

సాక్షి, హైదరాబాద్: శతాబ్దాల క్రితమే విశ్వ మానవతత్వాన్ని బోధించిన బసవేశ్వరుడు గొప్ప దార్శనికుడని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. బసవేశ్వరుని 891వ జయంతి సందర్భంగా.. భారతీయ సామాజిక, ఆధ్యాత్మిక రంగాల్లో విప్లవాత్మక సంస్కరణలను తేవడంతోపాటు సంకుచిత ధోరణులతో దిగజారిపోతున్న నాటి సమాజంలో అందరూ సమానమనే భావనను ప్రవచించిన మహనీయుడని మంత్రి గురువారం ఓ ప్రకటనలో కొనియాడారు. కులాంతర వివాహాలను ప్రోత్సహించి, కుల వ్యవస్థను నిరసించిన బసవేశ్వరుని బోధనలు నాటి సమాజాన్ని ఓ కుదుపు కుదిపాయన్నారు. కాంగ్రెస్ పార్టీ బసవేశ్వరుని ఆశయాల సాధనకు ఆది నుంచి కృషి చేస్తున్నదని తెలిపారు.





క్లుప్తంగా...

డబ్బులు లేకనే అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయా

కాంగ్రెస్‌కు సంగారెడ్డిలో 10వేల మెజార్టీ రావాలి: జగ్గారెడ్డి



కొండాపూర్ (సంగారెడ్డి): గత అసెంబ్లీ ఎన్నికల్లో డబ్బులు లేకనే ఓటమి పాలయ్యానని, కానీ పార్లమెంట్ ఎన్నికల్లో కార్యకర్తలు తమ సొంత డబ్బులు ఖర్చుపెట్టి ఎంపీ అభ్యర్థి నీలం మధును గెలిపించాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సూచించారు. సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండల పరిధి మల్కాపూర్‌లోని ఓ ఫంక్షన్ హాల్లో గురువారం కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే కార్యకర్తలు ప్రస్తుతం ఎంపీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. అసెంబ్లీ ఎన్నికల్లో 8 వేల ఓట్ల తేడాతో ఓడిపోయామని, కానీ పార్లమెంట్ ఎన్నికల్లో మాత్రం సంగారెడ్డి నుంచి 10 వేల ఓట్ల మెజార్టీ సాధించాలని పిలుపునిచ్చారు. జగ్గారెడ్డి రావాలి.. రోడ్ షోలు చేయాలని ఎవ్వరూ అనుకోవద్దని, ఎవరికి వారే స్వయంగా గ్రామాలలోకి వెళ్లి ప్రచారం చేయాలన్నారు. ఈ ఎన్నికల్లో సంగారెడ్డిలో కాంగ్రెస్ పార్టీకి మెజార్టీ రాకపోతే మనం రాజకీయంగా శూన్యమేనని వ్యాఖ్యానించారు. అభ్యర్థి నుంచి డబ్బుల కోసం ఎదురు చూడొద్దని, ఎవరికి వారు తమ సొంత డబ్బులతో ప్రచారం చేయాలని, మీరు ఖర్చు పెట్టే ప్రతి పైసాకు తానే బాధ్యుడినని స్పష్టం చేశారు.

బీజేపీపై కాంగ్రెస్ దుష్ప్రచారం చేస్తోంది

బీజేపీ అధికార ప్రతినిధి రాణీ రుద్రమ మండిపాటు



సాక్షి, హైదరాబాద్: కేంద్రంలో అధికారంలోకి వస్తే ఏమి చేస్తామనే దానిపై కాంగ్రెస్‌పార్టీకి చెప్పుకోడానికి ఏమీలేక బీజేపీపై అబద్ధాలు ప్రచారం చేస్తోందని బీజేపీ అధికార ప్రతినిధి రాణీ రుద్రమ మండిపడ్డారు. మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు చర్చకు రాకుండా రకరకాల అంశాలను తెరపైకి తెచ్చి అబద్ధాల పార్టీగా మారిపోయిందని ఎద్దేవా చేశారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ...బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లను తొలగిస్తుందంటూ దేశవ్యాప్తంగా రాహుల్, ప్రియాంకా గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, ఇతర నేతలు దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. గత కొన్ని రోజులుగా దేశ, రాష్ట్రస్థాయిల్లో చేస్తున్న ప్రచారంతో కాంగ్రెస్ ఫేక్ పార్టీగా, రేవంత్‌రెడ్డి ఫేక్‌సీఎంగా మారిపోయారని ధ్వజమెత్తారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత మోదీ సర్కారుదేనని తెలిపారు.

టీపీసీసీ ప్రచార కమిటీ కో-కన్వీనర్‌గా శ్రీనివాస్‌గుప్తా

సాక్షి, హైదరాబాద్: టీపీసీసీ ప్రచార కమిటీ కో-కన్వీనర్‌గా ఉప్పల శ్రీనివాస్‌గుప్తా నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం శ్రీనివాస్‌గుప్తాకు టీపీసీసీ రాష్ట్ర కన్వీనర్ మధుయాష్కి నియామక పత్రం అందజేశారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన శ్రీనివాస్‌ గుప్తా పదేళ్లుగా వైశ్య కుల సంఘ అధ్యక్షునిగా, టూరిజం కార్పొరేషన్ చైర్మన్‌గా పనిచేశారు. అన్ని కులాల్లోని పేద వధూవరులకు ఉచితంగా మంగళసూత్రాలు పంపిణీ చేస్తున్నారు. టీపీసీసీ ప్రచార కమిటీ కో-కన్వీనర్‌గా తన నియామకానికి సహకరించిన సీఎం రేవంత్ రెడ్డి, మధుయాష్కిలకు శ్రీనివాస్‌గుప్తా కృతజ్ఞతలు తెలిపారు.



సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించిన జన జాతర సభలో పాల్గొన్న కాంగ్రెస్ శ్రేణులు



గురువారం మెదక్ జిల్లా నర్సాపూర్‌లో జరిగిన కాంగ్రెస్ జన జాతర సభలో పాల్గొన్న ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలు

భారత్ ఆత్మపై బీజేపీ దాడి

▶ మొదటి పేజీ తరువాయి

ప్రపంచంలోని ఏ శక్తికీ సాధ్యం కాదు. కాంగ్రెస్ పార్టీ, రేవంత్‌రెడ్డి, రాహుల్ గాంధీ, ఖర్గే, దేశ ప్రజలు, వెనుకబడిన వర్గాలు, దళితులు, గిరిజనులు, రైతులు, కూలీలు కలిసి ఈ రాజ్యాంగాన్ని రక్షించుకుంటాం..' అని ఆయన స్పష్టం చేశారు. ఇండియా కూటమి ఆధ్వర్యంలో కేంద్రంలో పేదలు, వెనుకబడిన, దళిత, ఆదివాసీల ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నామన్నారు.అధికారంలోకి రాగానే ఒక్క దెబ్బతోదేశంలో ఉన్న పేదరికాన్ని రూపు మాపుతామని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం మెదక్ జిల్లా నర్సాపూర్, హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించిన జన జాతర సభల్లో ఆయన మాట్లాడారు.

మేం కోట్లాదిమందిని లక్షాధికారుల్ని చేస్తాం

'ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల రిజర్వేషన్లను తొలగించేందుకే మోదీ సర్కారు పబ్లిక్ సెక్టార్ సంస్థలను ప్రైవేటీకరిస్తోంది. పెట్టుబడిదారీ వ్యవస్థను పెంపొందించడం ద్వారా రిజర్వేషన్లను తొలగించాలని చూస్తోంది. ఈ ఎన్నికలు రిజర్వేషన్లు తొలగించాలంటున్న వారికి.. రిజర్వేషన్లు పెంచాలని కోరుతున్న వారికి మధ్య పోరు. ప్రధాని మోదీ గత పదేళ్లలో ఓ 22 మంది కోసమే ప్రభుత్వాన్ని నడిపారు. అదానీ, అంబానీ లాంటి వాళ్ల కోసమే అన్నీ చేశారు. దేశ ప్రజలు, రైతులు, శ్రామికుల కోసం కొద్దిగా కూడా పని చేయలేదు. మోదీ 22–25 మందికి సంబంధించిన రూ.16 లక్షల కోట్ల అప్పులు మాఫీ చేశారు. ఆ విధంగా ఆయన 24 ఏళ్ల పాటు ఉపాధి హామీ పథకాన్ని అమలు చేసేందుకు సరిపడా డబ్బులను వారికి ఇచ్చారు. బీజేపీ సర్కారు 22 మందిని కుబేరుల్ని చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం కోట్లాది మందిని లక్షలాధికారుల్ని చేస్తుంది.

పేదల జాబితా తయారు చేస్తాం

కాంగ్రెస్ పార్టీ, సోనియాగాంధీ, ఖర్గే, నేను, రేవంత్‌రెడ్డి, తెలంగాణ నేతలందరం ఓ నిర్ణయానికి వచ్చాం. ఎన్నికల తర్వాత మా ప్రభుత్వం రాగానే దేశంలోని పేద కుటుంబాల జాబితా తయారు చేస్తాం. ప్రతి కుటుంబంలోని ఒక మహిళ పేరును ఎంపిక చేసి ఆమె బ్యాంకు ఖాతాలో ఇండియా కూటమి ప్రభుత్వం ఏటా రూ.లక్ష జమ చేస్తుంది. నెలకు మరో రూ.8,500 వేస్తుంది. ఈ డబ్బులతో దేశంలోని పేద కుటుంబాల జీవితాలు బాగుపడతాయి. విద్య, వైద్యం పొందుకోవడంతో పాటు పేదలు అనుకుంది ఏదైనా ఈ డబ్బులతో చేయగలుగుతారు. మోదీ సర్కారు రూ.16 లక్షల కోట్ల రుణాలు మాఫీ చేసినప్పుడు నోరువిప్పని మీడియా, ఇప్పుడు మేము పేదలకు డబ్బులిస్తామంటే.. వారి అలవాట్లను చెడగొడుతున్నామని విమర్శిస్తోంది. అదానీ మనుషులూ.. మీరేం చేసుకుంటారో చేసుకోండి. పేదల ఖాతాల్లో మేము రూ.కోట్లు వేయబోతున్నాం..' అని రాహుల్ స్పష్టం చేశారు.



సరూర్‌నగర్ సభలో సీఎం రేవంత్ ప్రసంగిస్తుండగా మొబైల్‌తో వీడియో తీస్తున్న రాహుల్‌గాంధీ

రైతులకు చట్టబద్ధంగా మద్దతు

'దేశంలో వరి, పత్తి, చెరుకు రైతులకు మద్దతు ధర లభించడం లేదు. నరేంద్ర మోదీ నల్ల చట్టాలు తెచ్చి వారి ధనాన్ని లాక్కోవడానికి ప్రయత్నించారు. కానీ మేము రైతుల కోసం జబర్దస్త్ పని చేయబోతున్నాం. మేనిఫెస్టోలో రెండు హామీలు పొందుపరిచాం. మా సర్కారు రాగానే రైతుల రుణాలు మాఫీ చేస్తాం. వారికి చట్టబద్ధంగా కనీస మద్దతు ధరను అందిస్తాం. రైతుల కష్టానికి తగిన ఫలితం లభించని రోజులు ఇక ఉండవు.

కులగణనతో రాజకీయాల్లో శాశ్వత మార్పు

'నరేంద్ర మోదీ ఎంపిక చేసిన వ్యక్తుల కోసం పనిచేశారు. మా ప్రభుత్వం పేద, బలహీన, వెనకబడిన వర్గాల కోసం పనిచేస్తుంది. తెలంగాణ తరహాలో మేము దేశ వ్యాప్తంగా కులగణనకు శ్రీకారం చుట్టబోతున్నాం. దేశంలోని పేద, వెనుకబడిన, దళిత, గిరిజన, పేద ఉన్నత కులాలు, మైనారిటీలకు జనాభాలో వారి దామాషా తెలిసిపోతుంది. ప్రజలకు వాస్తవాలు తెలిసిపోతాయి. ఈ విప్లవాత్మక చట్టం అమల్లోకి వచ్చాక దేశ రాజకీయాలు శాశ్వతంగా మారిపోతాయి..' అని ఏఐసీసీ నేత అన్నారు.

పక్కాగా తొలి కొలువు

మోదీ పెద్ద సంఖ్యలో నిరుద్యోగులను తయారు చేశారు. నోట్ల రద్దు, తప్పుడు జీఎస్టీ, అగ్నివీర్ పథకాల ద్వారా నిరుద్యోగ్యాన్ని పెంచారు. నిరుద్యోగులకు అప్రెంటిస్‌షిప్ హక్కు కల్పిస్తూ కొత్త చట్టాన్ని తీసుకొస్తాం. దేశంలోని పట్టభద్రులు, డిప్లొమా చేసినవారందరికీ ఈ హక్కుఇవ్వబోతున్నాం. దేశంలోని పబ్లిక్, ప్రైవేటు సెక్టార్లలో సుమారు 30 లక్షల ఉద్యోగ ఖాళీలు ఉన్నాయి. ఆగస్టు 15లోపు ఈ ఉద్యోగాలను ఇండియా కూటమి ప్రభుత్వం భర్తీ చేస్తుంది. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ వర్సిటీలు, కళాశాలలు, పాఠశాలలు, ఆస్పత్రుల్లో నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తాం. ఒక ఏడాది కాలం పక్కాగా తొలి ఉద్యోగం లభిస్తుంది. ఉత్తమ శిక్షణ లభిస్తుంది. కోట్లాది మంది నిరుద్యోగులకు ఏడాదికి రూ.లక్ష నగదు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తాం. నెలకు రూ.8,500 వేస్తాం. ఇప్పుడు ఉపాధి హామీ కూలీలకు లభిస్తున్న రోజువారీ కూలీని రూ.250 నుంచి రూ.400కు పెంచుతాం. ఆశా, అంగన్‌వాడీ మహిళల ఆదాయాన్ని రెట్టింపు చేస్తాం..' అని రాహుల్ ప్రకటించారు.

రేవంత్ బృందం బాగా పనిచేసింది

'రేవంత్, తెలంగాణ బృందం బాగా పని చేశారు. 30 వేల మంది యువతకు ఉద్యోగాలు లభించాయి. రూ.500కే గ్యాస్ సిలిండర్, రూ.10 లక్షల ఆరోగ్య బీమా, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నారు. తెలంగాణ తరహాలోనే దేశంలో కూడా ఈ పథకాలను అమలు చేస్తాం. మోదీ ఎంత డబ్బు కుబేరులకు ఇచ్చారో అంతే డబ్బును దేశ, తెలంగాణ పేదలకు ఇస్తాం. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించండి. నేను తెలంగాణ ప్రజల కోసం ఢిల్లీలో సైనికుడిలా పనిచేస్తా. తెలంగాణకు ఏది అవసరమైనా ఆ పని చేసేందుకు నేను ఢిల్లీలో సిద్ధంగా ఉంటా..' అని రాహుల్ హామీ ఇచ్చారు. ఈ సభల్లో ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, దామోదర రాజ నర్సింహ, నేతలు మధుయాష్కీ, మహేందర్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, లక్ష్మారెడ్డి, రంజిత్ రెడ్డి, సునీతా మహేందర్ రెడ్డి, నీలం మధు, చామల కిరణ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటే

- కవితను బయటకు తెచ్చేందుకే బీజేపీతో బీఆర్ఎస్ కలిసి పనిచేస్తోంది
- 12 చోట్ల బీఆర్ఎస్ డిపాజిట్లు తెచ్చుకుంటే చాలు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



మధిరలో మాట్లాడుతున్న భట్టి విక్రమార్క, పక్కన మంత్రి పొంగులేటి, అభ్యర్థి రఘురాంరెడ్డి

మధిర: రాష్ట్రంలో బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటేనని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పునరుద్ఘాటించారు. బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావును గెలిపిస్తే కేంద్ర మంత్రి అవుతారని ఇటీవల ఖమ్మం సభలో మాజీ సీఎం కేసీఆర్ చెప్పడమే ఇందుకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఖమ్మం లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ గురువారం రాత్రి ఖమ్మం జిల్లా మధిర, ఎర్రుపాలెంలో జరిగిన కార్నర్ మీటింగ్‌లో భట్టి మాట్లాడారు. ఎన్నికల కోడ్ పూర్తి కాగానే తాము ఇచ్చిన అన్ని హామీలన్నీ అమలు చేస్తామని తెలిపారు. పీఎం నరేంద్ర మోదీ మరోసారి అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు ఎత్తివేసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. జైల్లో ఉన్న కవితను బయటకు తీసుకురావాలనే బీఆర్ఎస్ బీజేపీతో కలిసి పనిచేస్తోందని భట్టి విమర్శించారు. బీఆర్ఎస్ రాష్ట్రంలో 12 ఎంపీ స్థానాలు గెలవడం కాదని, దమ్ముంటే 12 చోట్ల డిపాజిట్లు తెచ్చుకోవాలని సవాల్ విసిరారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్ నోరు తెరిస్తే అబద్ధాలు మాట్లాడుతున్నారని ఆరోపించారు. తప్పుడు ప్రచారం చేయడానికి కేసీఆర్‌కు సిగ్గు లేదా అని ప్రశ్నించారు.

తెలంగాణకు బీజేపీ చేసిందేమీ లేదు

- బీఆర్ఎస్‌వన్నీ నిరాధార ఆరోపణలు: మంత్రి ఉత్తమ్
- మున్షీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మ



గాంధీభవన్‌లో కాంగ్రెస్‌లో చేరిన శంకరమ్మ, ఇతర నేతలతో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ, మంత్రి ఉత్తమ్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణకు బీజేపీ చేసిందేమీ లేదని రాష్ట్ర సాగునీటి శాఖ మంత్రి కెప్టెన్.ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. నిజంగా తెలంగాణకు బీజేపీ చేసిందేదైనా ఉంటే ఫలానా పనిచేశానని మోదీ చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ అమరుడు శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మతో పాటు హుజూర్‌నగర్ నియోజకవర్గానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నేతలు ఆ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. గాంధీభవన్‌లో గురువారం ఉత్తమ్‌తో పాటు పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్‌మున్షీలు వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శంకరమ్మతో కలిసి ఉత్తమ్ మాట్లాడుతూ శ్రీకాంతాచారి తెలంగాణ కోసం తన ప్రాణాలను త్యాగం చేశాడని, శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మ చాలా కాలం బీఆర్ఎస్‌లో పనిచేసినా ఆమెకు న్యాయం చేయలేదన్నారు. తనపై శంకరమ్మ పోటీ చేసినా, ఎప్పుడూ తాము వ్యక్తిగత వైరాలకు వెళ్లలేదని, శంకరమ్మ చేరికతో హుజూర్‌నగర్‌లో బీఆర్ఎస్ ఖాళీ అయ్యిందని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలను మోసం చేసి గెలవాలని బీజేపీ, బీఆర్ఎస్‌లు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. ఎన్నికలు కాగానే కొత్త రేషన్‌కార్డులు ఇస్తామని, అర్హులైన వారందరికీ ఇళ్లు కట్టిస్తామని భరోసా ఇచ్చారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 13 చోట్ల గెలుపొందుతుందని, 3 చోట్ల బీజేపీతో, ఒక చోట ఎంఐఎంతో కాంగ్రెస్‌కు పోటీ ఉందన్నారు.

నాకు అన్యాయం జరిగింది: శంకరమ్మ

శంకరమ్మ మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీలో తమకు అన్యాయం జరిగిందని చెప్పారు. శ్రీకాంతాచారి మరణం చూసిన సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చారని, రానున్న లోక్‌సభ ఎన్నికల్లో అందరూ కాంగ్రెస్ పార్టీకి ఓటేయాలని ఆమె కోరారు.

విశ్వ నగరంలో విషం చిమ్ముతున్నారు

- 15 సెకన్ల సమయమిస్తే మైనార్టీలను తుద ముట్టిస్తామని బీజేపీ మహిళా నేత అన్నారు
- ఆమెపై కేసు పెట్టి అరెస్టు చేయాలి..బీజేపీ నుంచి బహిష్కరించాలి
- ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులకు డిపాజిట్లు కూడా రావు
- జనజాతర సభల్లో సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్/ సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: విశ్వ నగరం హైదరాబాద్‌లో బీజేపీ నేతలు విషం చిమ్ముతున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మండిపడ్డారు. బీజేపీ మహిళా నేత ఒకరు (నవనీత్ రాణా) మాట్లాడుతూ 15 సెకన్లు సమయమిస్తే మైనార్టీలను తుద ముట్టిస్తామని అన్నారని, ప్రజలను రెచ్చగొట్టే విధంగా మాట్లాడిన ఆమెపై కేసు పెట్టి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఆమె విద్వేష పూరిత మాటలను బీజేపీ నేతలు సమర్థించని పక్షంలో పార్టీ నుంచి ఆమెను బహిష్కరించాలని అన్నారు. తాము అన్ని పండుగలు చేసుకుంటున్నామని, తమకు హిందూత్వం గురించి బీజేపీ వాళ్ళు నేర్పాలా? అని ప్రశ్నించారు. ప్రజలు కూడా దీనిపై ఆలోచన చేయాలని కోరారు. గురువారం నర్సాపూర్, సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించిన జనజాతర సభల్లో ఆయన మాట్లాడారు.

రాజ్యాంగాన్ని రక్షించుకోవాలంటే కాంగ్రెస్‌ను గెలిపించాలి

'లోక్‌సభ ఎన్నికలు మనకు జీవన్మరణ సమస్య. దేశ రాజ్యాంగం ప్రమాదంలో పడింది. రాజ్యాంగాన్ని రక్షించుకోవాలంటే కాంగ్రెస్‌ను గెలిపించాలి. రిజర్వేషన్లను రద్దు చేసేందుకు బీజేపీ కుట్ర చేస్తోంది. రిజర్వేషన్లను కాపాడుకోవడం కోసం ఇండియా కూటమి అధికారంలోకి రావాలి. ఎన్నికలు రాగానే బీజేపీకి రాముడు, హనుమాన్ జయంతి.. బీఆర్ఎస్‌కు బతుకమ్మ పండగ గుర్తుకొస్తాయి. బిచ్చగాళ్లు అడుక్కున్నట్లుగా ఓట్లు అడుక్కునేందుకు రాముడిని, హనుమంతుడిని వాడుకుంటున్న బీజేపీని ఆ దేవుడు కూడా క్షమించడు. కేసీఆర్‌ను ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రజలు తిరస్కరించారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులకు డిపాజిట్లు కూడా రావు. బీఆర్ఎస్ పార్టీకి మెదక్‌లో ఒక్క మొనగాడు కూడా దొరక్క కరీంనగర్‌కు చెందిన వ్యక్తిని తీసుకువచ్చి మెదక్‌లో పోటీ చేయిస్తున్నారు.

మెదక్‌పై ఇందిరకు ప్రత్యేక మమకారం

దివంగత ప్రధాని ఇందిరాగాంధీకి మెదక్ అంటే ప్రత్యేక మమకారం ఉండేది. ఇందిరాగాంధీ ఇక్కడి నుంచి ప్రాతినిథ్యం వహించినప్పుడే ఈ ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందింది. బీడీఎల్, బీహెచ్‌ఈఎల్, ఓడీఎఫ్ వంటి ఫ్యాక్టరీలు వచ్చాయి. కానీ 1999 నుంచి 2024 వరకు మెదక్ నియోజకవర్గం బీజేపీ, బీఆర్ఎస్ చేతుల్లో మగ్గి పోయింది. బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులు వెంకట్రామ్‌రెడ్డి, రఘునందన్‌రావులను ఈ ఎన్నికల్లో ఓడించాలి. రాష్ట్రంలో 14 లోక్‌సభ స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలి. దేశంలో ఇండియా కూటమిని అధికారంలోకి తీసుకురావాలి. పేద ప్రజల కోసం రాహుల్ గాంధీ జీవితాన్ని అంకితం చేశారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణను ఇచ్చి ఆంధ్రలో, దేశంలో అధికారాన్ని త్యాగం చేసింది..'అని రేవంత్ అన్నారు.

బస్సెక్కిన రాహుల్

ప్రయాణికులతో ముచ్చట్లు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: సరూర్‌నగర్ స్టేడియంలో జనజాతర సభ ముగిసిన తర్వాత రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి అకస్మాత్తుగా ఎల్బీనగర్ నుంచి జేబీఎస్ వైపు వెళ్తున్న హయత్‌నగర్-1 డిపోకు చెందిన ఆర్టీసీ ఆర్డినరీ బస్సు ఎక్కారు. కండక్టర్ వెంకటేశ్వర్లుకు రూ.50 ఇచ్చి టికెట్లు తీసుకున్నారు. ఎల్బీనగర్ నుంచి నాగోల్ వరకు ప్రయాణించారు. రద్దీగా ఉన్న బస్సులోని మహిళా ప్రయాణికులతో రాహుల్ ముచ్చటించారు. ఉచిత బస్సు ప్రయాణం ఎలా ఉంది? అని ప్రశ్నించారు. గ్యాస్ సబ్సిడీ రూ.500 వస్తోందా? అని ఆరా తీశారు. ఎన్నికల తర్వాత మహిళలకు రూ.2,500 ఇవ్వనున్నట్లు చెప్పారు. కాగా బస్సులోని మహిళలు, యువతులు రాహుల్‌తో సెల్ఫీలు తీసుకునేందుకు పోటీ పడ్డారు.



బీజేపీ 200 స్థానాల్లో కూడా గెలవదు

టీపీసీసీ నేతలు కపిలవాయి, పుష్పలీల

సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా బీజేపీ 200 స్థానాల్లో కూడా గెలవదని టీపీసీసీ ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ నేతలు కపిలవాయి దిలీప్‌కుమార్, కొండ్రు పుష్పలీల వ్యాఖ్యానించారు. వారు గురువారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ మోదీ గ్రాఫ్ 100 శాతం పడిపోయిందని చెప్పారు. అందుకే ఆయన నిరాశానిస్పృహలతో మాట్లాడుతున్నారని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల అనంతరం దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి అవుతారని స్పష్టం చేశారు. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే రాష్ట్రాలపై పెత్తనం చెలాయిస్తోందని ఆరోపించారు. బీజేపీ 400 సీట్లు గెలిచి మళ్లీ అధికారంలోకి వస్తే రాష్ట్రాలు పూర్తిగా వాటి హక్కులను కోల్పోతాయన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తన కుమార్తె కోసం బాంచెన్ దొర అంటూ.. బీజేపీ చుట్టూ తిరుగుతున్నారని దిలీప్‌కుమార్, పుష్పలీల ఎద్దేవా చేశారు.



హుస్నాబాద్‌లో కార్నర్ మీటింగ్‌కు హాజరైన జనం

మీలా ట్యాపింగ్ డబ్బులతో ఓట్లు కొనేవాడిని కాను

కరీంనగర్ ఎంపీ బండి సంజయ్



మాట్లాడుతున్న ఎంపీ బండి సంజయ్

హుస్నాబాద్: 'నన్ను బిచ్చగాడు అని విమర్శిస్తున్నారు.. అవును.. ప్రజాస్వామ్యబద్ధంగా ఓట్లడిగే బిచ్చగాడిని, మీ లెక్క ఫోన్ ట్యాపింగ్ పైసలతో ఓట్లు కొనేటోడిని కాదు'అని బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులపై కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ నిప్పులు చెరిగారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో గురువారం రాత్రి ఆయన కార్నర్ మీటింగ్‌లో పాల్గొని ప్రసంగించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు తనను తిట్టడమే పనిగా పెట్టుకున్నారని అన్నారు. శ్రీరాముడిని, ప్రసాదాన్ని హేళన చేసి మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కరీంనగర్‌లో నేను పక్కాలోకల్ కనుకే రూ.12 వేల కోట్లకు పైగా నిధులు తెచ్చి అభివృద్ధి చేశానని చెప్పారు. 'ఆరు గ్యారంటీల హామీలపై నేను చర్చకు సిద్ధం.. కాంగ్రెస్ సిద్ధమా'అని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలపై ప్రశ్నిస్తే తనపై వ్యక్తిగత దూషణలు చేస్తున్నారని అన్నారు. హుస్నాబాద్ సాక్షిగా చెబుతున్నానని, రిజర్వేషన్లు రద్దు చేసే ప్రసక్తి లేదన్నారు. కాంగ్రెస్‌కు ముస్లింల రిజర్వేషన్లను అమలు చేయబోమని ప్రకటించే దమ్ముందా అని సవాల్ విసిరారు. రాజకీయ గురువు చొక్కారావును ఓడించిన జగపతిరావు కొడుకును వెంటవేసుకొని తిరుగుతూ గురువుకే పంగనామాలు పెట్టిన పొన్నం ప్రభాకర్ తనపై ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందని బండి అన్నారు. ఈ సందర్భంగా పలు పార్టీల నాయకులు బీజేపీలో చేరారు. కార్యక్రమంలో మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మనోహర్ రెడ్డి, రాంగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డబుల్ డిజిట్ పక్కా

▶ మొదటి పేజీ తరువాయి

ఆ పార్టీ చూస్తోంది. మోదీ మళ్లీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తారని అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. కానీ మోదీ పదేళ్లుగా ఫుల్ మెజార్టీతో అధికారంలో ఉండి కూడా రిజర్వేషన్లు తొలగించలేదనే విషయం గుర్తుంచుకోవాలి. కాంగ్రెస్ పార్టీయే తెలంగాణలో ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్లలో కోత విధించి ముస్లింలకు 4 శాతం అందిస్తోంది. మేం ముస్లింలకు ఇచ్చిన రిజర్వేషన్లను రద్దు చేసి ఎస్సీ, ఎస్టీ, బీసీలకు న్యాయం చేస్తాం. తెలంగాణలో బీజేపీని కనీసం పది సీట్లలో గెలిపించండి. దేశంలోనే నంబర్ వన్‌గా తెలంగాణను మార్చుతాం..' అని అమిత్ షా హామీ ఇచ్చారు.

ఏబీసీలు మూడూ ఒక్కటే

'తెలంగాణలో ఏబీసీలు (ఏ అంటే అసద్, బీ అంటే బీఆర్ఎస్, సీ అంటే కాంగ్రెస్) మూడూ ఒక్కటే. మూడూ ట్రయాంగిల్ లాంటివి. షరియత్, ఖురాన్ ప్రకారం పాలన కొనసాగించాలని చూస్తున్నారు. బుజ్జగింపు రాజకీయాలుచేస్తున్న వీరు హైదరాబాద్‌లో శ్రీ రామ నవ మి ఊరేగింపుపై ఆంక్షలు విధించారు. హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని నిర్వహించేందుకు అనుమతివ్వలేదు. సీఏఏను వ్యతిరేకిస్తున్నారు. మళ్లీ ట్రిపుల్ తలాక్ తీసుకురావాలనుకుంటున్నారు. రామ మందిర నిర్మాణాన్ని కాంగ్రెస్ పార్టీ 70 ఏళ్లు ఆపింది. కానీ మోదీ ఇచ్చిన వాగ్దానం ప్రకారం ఐదేళ్లలో రామమందిరానికి భూమి పూజ చేయడంతో పాటు ఆలయ నిర్మాణం , బాల రాముని ప్రాణ ప్రతిష్ఠను పూర్తి చేశారు. దేశంలో ఉగ్రవాదం, తీవ్రవాదాన్ని మోదీ అంతం చేశారు. నక్సలైట్ సిద్ధాంతాన్ని సమాప్తం చేశారు. 370 ఆర్టికల్ రద్దుతో కశ్మీర్ మనదే అని తేలిపోయింది. కొత్త టెక్స్‌టైల్ విధానంతో 8 లక్షల మంది చేనేత కార్మికులకు ఉపాధి లభించింది. రూ.1,500 కోట్లతో ఈ విధానం అమల్లోకి తెచ్చాం. మోదీ చేనేత పాలసీ తీసుకువచ్చారు..'అని వివరించారు. నర్సయ్యగౌడ్‌కు ఓటు వేస్తే మోదీకి, అభివృద్ధికి వేసినట్లే అని అన్నారు. ఈ సమావేశంలో నర్సయ్యగౌడ్‌తో పాటు గూడూరు నారాయణరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



గురువారం రాయిగిరిలో జరిగిన బీజేపీ సభలో పాల్గొన్న ప్రజలు, బీజేపీ కార్యకర్తలు

మత్తు ట్యాబ్లెట్లను విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

సాక్షి, హైదరాబాద్: తీవ్రగాయాలు, సర్జరీల సమయంలో నొప్పుల నుంచి ఉపశమనంగా వాడే ట్యాబ్లెట్లను అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తిని డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్, పోలీసులు జాయింట్ ఆపరేషన్‌లో అరెస్టు చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు, పోలీసులు చార్మినార్ ప్రాంతంలో నిర్వహించిన సోదాల్లో యాకత్‌పురాకు చెందిన అర్షద్‌ఖాన్ అనే వ్యక్తిని అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి రూ. 23 వేలు విలువ చేసే 400 టపెండోల్ 100 ఎంజీ ట్యాబ్లెట్లను స్వాధీనం చేసుకున్నట్టు డీసీఏ డీజీ కమలాసన్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ట్యాబ్లెట్లను డాక్టర్ సూచన మేరకు మాత్రమే విక్రయించాల్సి ఉంటుందని, నిబంధనలు అతిక్రమిస్తే చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని తెలిపారు. మత్తుపదార్థాలకు అలవాటు పడిన వారికి ఈ ట్యాబ్లెట్లను అర్షద్‌ఖాన్ సరఫరా చేస్తున్నట్టు దర్యాప్తులో గుర్తించారు. ఈ సోదాల్లో డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ హైదరాబాద్ అసిస్టెంట్ డైరెక్టర్ టి.రాజమౌళి, చార్మినార్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ బి.లక్ష్మి, హుస్సేనిఆలం పోలీస్ స్టేషన్ ఎస్సై ఎస్.నవీన్ పాల్గొన్నట్టు తెలిపారు.

తాగుడుకు డబ్బులు ఇవ్వలేదని..

- కన్న తండ్రిని కత్తితో పొడిచి చంపిన కొడుకు
- సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలంలో ఘటన


మృతుడు వలీఖాన్

దుబ్బాక: మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వలేదన్న కోపంతో ఓ వ్యక్తి తండ్రినే కత్తితో పొడిచి చంపాడు. సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం అహ్మద్‌నగర్‌లో బుధవారం అర్ధరాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీరామ్ ప్రేమ్‌దీప్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పఠాన్ వలీఖాన్ (60)కు ఫారూఖ్ (35) ఒక్కడే కుమారుడు. కాగా, ఫారూఖ్ తాగుడుకు బానిసయ్యాడు. నిత్యం తాగడానికి డబ్బులు ఇవ్వమని తల్లిదండ్రులను వేధింపులకు గురి చేసేవాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి 11 గంటల సమయంలో తాగేందుకు డబ్బులు ఇవ్వమని తండ్రిని వేధించాడు. ఆయన డబ్బులు ఇచ్చేందుకు నిరాకరించడంతో కోపంతో ఫారూఖ్, తండ్రి వలీఖాన్‌పై కత్తితో దాడి చేసి దారుణంగా పొడిచాడు. దీంతో వలీఖాన్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు గురువారం ఎస్‌ఐ తెలిపారు.

‘అయ్యర్’ సిఫార్సులు అమలు చేయాలి

- కాళేశ్వరం బ్యారేజీలను పరిరక్షించాలి
- జస్టిస్ చంద్రఘోష్ కమిషన్ ఆదేశం



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు మరింత నష్టం జరగకుండా కేంద్ర జలసంఘం(సీడబ్ల్యూసీ) మాజీ చైర్మన్ చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలోని నిపుణుల కమిటీ సమర్పించిన నివేదికను అమలు చేయాలని జస్టిస్ పినాకి చంద్రఘోష్ ఆదేశించారు. బీఆర్‌కేఆర్ భవన్‌లోని కాళేశ్వరం ప్రాజెక్టు విచారణ కమిషన్ కార్యాలయంలో గురువారం ఆయన నీటిపారుదల శాఖ అధికారులతో సమావేశమయ్యారు. ప్రజాప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని బ్యారేజీల మరమ్మతులు /పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని నిర్దేశించారు. వానాకాలం ముంచుకొస్తున్నందున తక్షణమే చర్యలకు ఉపక్రమించాలని ఆదేశించారు. మరమ్మతులకు అవసరమైన లాంఛనాలు పూర్తి చేయాలన్నారు. అయ్యర్ కమిటీ నివేదికను ప్రామాణికంగా చేసుకొని బ్యారేజీల రక్షణ కోసం చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. కాగా, బ్యారేజీల స్థితిగతులను తెలుసుకునేందుకు జియోఫిజికల్, జియో టెక్నికల్ ఇన్వెస్టిగేషన్ చేసి మరమ్మతులకు ఉపక్రమించాలని అయ్యర్ కమిటీ సిఫారసు చేసింది. ఈ నివేదిక అమలు కోసం అధికారులతో ఉన్నతస్థాయి కమిటీని వేస్తున్నామని నీటిపారుదల శాఖ అధికారులు ఆయనకు వివరించారు.

ఈఎన్‌సీ జనరల్ నేతృత్వంలో కమిటీ

అయ్యర్ కమిటీ నివేదికపై అధ్యయనం కోసం ఈఎన్‌సీ (జనరల్) జి.అనిల్ కుమార్ నేతృత్వంలో ప్రభుత్వం కమిటీ వేసింది. ఈ కమిటీలో ఈఎన్‌సీ (ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్) బి.నాగేంద్ర రావు, సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ (సీడీ వో) చీఫ్ ఇంజనీర్ మోహన్ కుమార్ సభ్యులుగా, మెంబర్ కన్వీనర్‌గా రామగుండం చీఫ్ ఇంజనీర్ సుధాకర్ రెడ్డి ఉన్నారు. నెలాఖరులోనే బ్యారేజీలకు వరద వచ్చే అవకాశం ఉన్నందున వెనువెంటనే చర్యలకు ఈ కమిటీ ఉపక్రమించనుంది.

కాళేశ్వరంపై ఇప్పటివరకు రెండే ఫిర్యాదులు

కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో జరిగిన లోపాలు, అవినీతిపై ప్రజాభిప్రాయ సేకరణ కోసం జస్టిస్ చంద్రఘోష్ కమిషన్ జారీచేసిన బహిరంగ ప్రకటనకు స్పందనగా ఇప్పటి వరకు రెండు ఫిర్యాదుల మాత్రమే అందాయి. గురువారం ఫిర్యాదుల పెట్టెను తెరవగా, వాటిలో రెండు ఫిర్యాదులున్నట్లు గుర్తించారు. ఈనెల 31తో ఫిర్యాదులకు గడువు ముగియనుంది.

కేసీఆర్ రాష్ట్రాన్ని నంబర్‌వన్‌గా నిలిపారు

బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

- అందుకు రిజర్వ్ బ్యాంక్ గణాంకాలే సాక్ష్యం
- రాష్ట్రంలో బలమైన ఆర్థిక వ్యవస్థ రూపొందించారు
- నీటిపారుదల, వ్యవసాయం, మహిళా సాధికారత, వైద్యవిద్య వంటి రంగాల్లో టాప్
- భవిష్యత్ తరాల కోసం ఆలోచించే నేత కేసీఆర్..
- ‘ఎక్స్’లో ఆర్‌బీఐ తాజా నివేదికను పోస్ట్ చేసిన కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: పదేళ్ల పాలనలో తెలంగాణ సీఎంగా కేసీఆర్ రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్‌వన్‌గా నిలిపారని, అందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తాజాగా విడుదల చేసిన గణాంకాలే సాక్ష్యాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. ఆర్‌బీఐ విడుదల చేసిన నివేదికను చూస్తే తెలంగాణ సాధించిన ప్రగతి కళ్లకు కడుతుందని, కేసీఆర్ ఈ రాష్ట్రానికి ఏం చేశారన్న మాటలకు ఆర్‌బీఐ లెక్కలే సమాధానమని అన్నారు. ఈ మేరకు ఆయన ఆర్‌బీఐ నివేదికను ‘ఎక్స్’లో పోస్ట్ చేస్తూ, వివరాలు వెల్లడించారు. బలమైన ఆర్థిక వ్యవస్థను రూపొందించడంతో పాటు నీటిపారుదల, వ్యవసాయం, అభివృద్ధి, పన్ను వసూళ్లు, మహిళా సాధికారత, వైద్యవిద్య మొదలైన రంగాల్లో టాప్‌గా నిలిపినట్లు వివరించారు. 2022–2023 ఆర్థిక సంవత్సరానికిగాను తెలంగాణ తలసరి ఆదాయం (ఎస్‌ఎస్‌డీపీ) రూ. 3.08 లక్షలకు చేరిందని, దేశంలోని అన్ని ప్రధాన రాష్ట్రాలను తలదన్ని తెలంగాణ ముందుందని తెలిపారు. తెలంగాణలోని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమ (ఎంఎస్‌ఎంఈ)లలో 40 శాతం వాటా మహిళలదేనని, జాతీయ సగటు 20 శాతంతో పోల్చితే రెట్టింపుతో మహిళా సాధికారతలోనూ మనమే ముందున్నామన్నారు. వైద్యవిద్య విషయంలో తెలంగాణలో ప్రతి 4,460 మందికి సగటున ఒక ఎంబీబీఎస్ సీటు అందుబాటులో ఉందని, దేశంలో సగటున 12,851 మంది విద్యార్థులకు ఒక సీటు మాత్రమే అందుబాటులో ఉందని తెలిపారు. పన్ను వసూళ్లలోనూ ఆదర్శంగా నిలిచామని, 2021–22 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ తలసరి ఎస్‌జీఎస్‌టీ పన్ను వసూళ్లు రూ. 7,665గా ఉందని, దేశ సగటు రూ. 4,461 మాత్రమేనని తెలిపారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీజేపీ, కాంగ్రెస్ పాలిత ఏ రాష్ట్రంలోనైనా ఇలాంటి ప్రగతిని చూపించే దమ్ముందా అని కేటీఆర్ సవాల్ విసిరారు. ఎన్నికలు వచ్చినప్పుడు మాత్రమే తెలంగాణ వచ్చి పోతున్న కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఈ గణాంకాలు చూసి పరిపాలన నేర్చుకోవాలని హితవు పలికారు. ఒక రాజకీయ నాయకుడు తరువాతి ఎన్నికల్లో గెలవటం కోసం మాత్రమే ఆలోచిస్తాడని, కానీ కేసీఆర్ లాంటి రాజనీతిజ్ఞుడు మాత్రమే తరువాత తరం కోసం ఆలోచిస్తారని కేటీఆర్ పేర్కొన్నారు.

ఆరు గ్యారంటీలు ఇవే: కేటీఆర్

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు సామాజిక మాధ్యమ వేదిక ‘ఎక్స్’లో వ్యంగ్యాస్త్రాలు విసిరారు. ‘ఇది బీఆర్‌ఎస్ ప్రభుత్వం కాదు.. కాంగ్రెస్ ప్రభుత్వం అని గుర్తుంచుకోండి. ఆరు గ్యారంటీలైన ఇన్వర్టర్లు, చార్జింగ్ బల్బులు, టార్చ్ లైట్లు, కాండిళ్లు, జనరేటర్లు, పవర్ బ్యాంకులు సమకూర్చుకుని నిలువ చేసుకోవాలని నా సహ తెలంగాణ పౌరులను కోరుతున్నా’ అని కేటీఆర్ పేర్కొన్నారు. ‘మోదీ చెప్తున్న ప్రకారం అదానీ, అంబానీ వ్యాన్ల కొద్దీ నోట్ల కట్టలను స్కాంగ్రెస్ (కాంగ్రెస్)కు పంపుతుంటే ఆయన ప్రియమైన భాగస్వాములు ఈడీ, ఐటీ, సీబీఐ ఎందుకు మౌనంగా ఉన్నాయి. పెద్ద నోట్ల రద్దు అనేది విఫలమైందని మోదీ అంగీకరిస్తున్నట్లేనా’ అని కేటీఆర్ మరో పోస్ట్ చేశారు.

అమెరికాలో తెలంగాణ విద్యార్థి అదృశ్యం

- వారం రోజులుగా కనిపించడం లేదంటున్న తల్లిదండ్రులు
- రాష్ట్ర ప్రభుత్వం సాయం చేయాలని వేడుకోలు


రూపేశ్ చంద్ర

నయీంనగర్(హనుమకొండ): అమెరికాలో తెలంగాణ విద్యార్థి కనిపించకుండా పోయాడు. హనుమకొండలోని నయీంనగర్ విద్యారణ్య పురికి చెందిన చింతకింది సదానందం, ఉమ దంపతుల చిన్న కొడుకు రూపేశ్ చంద్ర ఈ నెల 2 నుంచి కనిపించకుండా పోవడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. రూపేశ్ చంద్ర చికాగో విస్కాన్సిన్ కాంకార్డియా యూనివర్సిటీలో మాస్టర్స్ డిగ్రీ చదువుతున్నాడు. రూపేశ్ బ్లాక్ 4300, ఎన్. షేరిడన్ రోడ్ చికాగోలో నివాసం ఉంటుండగా, చివరిగా ఈ నెల 2న మధ్యాహ్నం కొడుకుతో వాట్సాప్ కాల్ మాట్లాడిన అనంతరం అతని ఫోన్ స్విచాఫ్‌లోకి వెళ్లిపోయిందని తండ్రి సదానందం ‘సాక్షి’కి తెలిపారు. కుటుంబ సభ్యులు అతని రూంమేట్‌తో మాట్లాడగా ఫ్రెండ్స్ వచ్చారని, వారిని కలవడానికి వెళ్తున్నా అని చెప్పాడని, వారు ఎవరో తమకు తెలియదన్నారని తెలిపారు. రూపేశ్ కనిపించకపోవడంతో రూంమేట్ ద్వారా చికాగో పోలీసులకు సమాచారం ఇచ్చిన తల్లిదండ్రులు, హైదరాబాద్‌లోని అమెరికా ఎంబసీలో కూడా ఫిర్యాదు చేశారు. అలాగే రూపేశ్ చంద్ర తల్లితండ్రులు సీఎస్ శాంతికుమారికి ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేయగా, ఆ ఫిర్యాదు కాపీ హనుమకొండ కలెక్టరేట్‌కు రావడంతో కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను కలసి కుటుంబ సభ్యులు జరిగిన విషయాన్ని వివరించారు. కాగా, కలెక్టర్ అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారన్నారు. సదానందం.. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి ఈ విషయం తెలిపి సహాయం కోరారు. ఆయన వెంటనే స్పందించి అమెరికాలో ఉన్న పరిచయస్తులకు కాల్ చేసి ఆరా తీశారు. 2023, డిసెంబర్ 11న అమెరికా వెళ్లాడు. రాష్ట్ర ప్రభుత్వం, ఐటీశాఖ మంత్రి వెంటనే స్పందించి తమ కుమారుడి ఆచూకీ లభించేలా చూడాలని తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

ఈతకు వెళ్లి ముగ్గురు పిల్లల మృతి

- ఖమ్మం జిల్లాలో విషాదం


తల్లితో లోకేశ్, హరీశ్


గణేశ్

ఖమ్మం రూరల్: వేసవి సెలవుల్లో సరదాగా ఈతకు వెళ్లిన ముగ్గురు పిల్లలు మట్టి కోసం తీసిన గుంతలో మునిగి మృతి చెందారు. తండ్రి వెంట వెళ్లిన ఇద్దరు కుమారులే కాక వీరి సమీపాన ఉండే మరో బాలుడు సైతం మృతి చెందడంతో రెండు కుటుంబాల్లో విషాదం నెలకొంది. ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ మండలం నంద్యాతండా సమీపాన గురువారం ఈ ప్రమాదం జరిగింది. ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలం జిన్నారానికి చెందిన ఆముదాల చిరంజీవి కుటుంబంతో సహా ఖమ్మం మమత ఆస్పత్రి సమీపంలోని రామచంద్రయ్యనగర్‌లో నివాసముంటున్నారు. ఆయన ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. ఇదేప్రాంతంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మరికొందరు గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారు. చిరంజీవి తన ఆటోలో ఇద్దరు కుమారులు లోకేశ్(14), హరీశ్ (12)తోపాటు వారి ఇంటి పక్కన ఉండే బానోతు కళావతి కుమారుడు బానోత్ గణేశ్ (13)ను తీసుకుని మున్నేటిలో ఈతకు వెళ్లారు. గ్రీన్ ఫీల్డ్ హైవే మట్టి కోసం మున్నేటిలో తవ్విన గుంతలో ఉన్న నీటిలో వారు ఈత కొడుతున్నారు. కాగా, గుంత లోతుగా ఉన్న విషయం తెలియక చిరంజీవి చూస్తుండగానే ఈత కొడుతున్న ముగ్గురు పిల్లలు మునిగిపోయారు. దీంతో అప్రమత్తమైన ఆయన కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా వారు పోలీసులకు తెలిపారు. పోలీసులు గజ ఈతగాళ్లను రప్పించి వెతికించగా ముగ్గురు పిల్లల మృతదేహాలు బయటపడ్డాయి. ఈ ఘటనతో రెండు కుటుంబాలు విషాదంలో మునిగాయి. కాగా, గ్రీన్‌ఫీల్డ్ హైవే కాంట్రాక్టర్ మున్నేటిలో గుంతలు తవ్వి నిర్లక్ష్యంగా వదిలేయడంతోనే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ట్రెయినీ ఐపీఎస్ మౌనిక తెలిపారు.


పిల్లల మృతికి కారణమైన నీటి గుంత

చెత్త కుప్పలో మగ శిశువు

- కుక్కలు పీక్కు తినడంతో మృతి
- సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలంలో దారుణం

జిన్నారం (పటాన్‌చెరు): అప్పుడే పుట్టిన ఓ మగ శిశువును గుర్తు తెలియని వ్యక్తులు చెత్త కుప్పలో పడేశారు. ఈ దారుణ ఘటన సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలంలోని దోమడుగు గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామంలోని ఓ కాలనీలో గురు వారం చెత్తకుప్పలో మగ శిశువు మృతదేహాన్ని కుక్కలు పీక్కు తింటుండగా గుర్తించిన స్థానికులు సమాచారాన్ని పోలీసులకు, శిశు సంక్షేమ శాఖ అధి కారులకు అందించారు. ఘటనా స్థలాన్ని ఎస్‌ఐ మహేశ్వర్‌రెడ్డి, ఐసీడీఎస్ అధికారి కవిత, ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు సందర్శించారు. అప్పుడే పుట్టిన మగశిశువుగా, కుక్కలు పీక్కు తినడంతో మృతి చెందినట్లు వైద్యులు, అధికారులు గుర్తించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. ఈ శిశువును ఎవరు పడేశారనే విషయమై విచారణ చేపడుతు న్నామని ఐసీడీఎస్ అధికారి కవిత వెల్లడించారు.



చిత్రంలో చూపించిన ఉత్పత్తి మార్కెట్‌లో లభించే అసలు ఉత్పత్తి కంటే వేరుగా ఉండవచ్చు. చిత్రంలో చూపించిన యాక్సెసరీస్ స్టాండర్డ్ సామగ్రిలో భాగం కాదు. ఫీచర్స్ రంగులు మరియు రకాలతో వేరుగా ఉండవచ్చు. ఫైనాన్స్ ఆఫర్ ఫైనాన్సర్ యొక్క స్వంత నిర్ణయంపై ఆధారపడింది, దీని సంబంధిత నియమాలు మరియు షరతులపై ఆధారపడింది. #ఆధారం: జూన్ 2001 నుండి జూన్ 2023 వరకు బ్రాండ్ యాక్టివా యొక్క మొత్తం సేల్స్ సంఖ్య. *నియమాలు మరియు షరతులు వర్తిస్తాయి.

కనీస వడ్డీ రేట్ @ 8.49%*
కనీస EMI ₹2499*
డీలర్ వివరాలు కోసం QR కోడ్ స్కాన్ చేయండి
ACTIVA 30 MILLION# HAPPY CUSTOMERS
CLICK BOOK RELAX

Honda Motorcycle & Scooter India Pvt. Ltd., Registered Office: Plot No. 1, Sector - 03, IMT Manesar, Distt. Gurugram, (Haryana) – 122050, India; Website: www.honda2wheelersindia.com; Customer Care: customercare@honda2wheelersindia.com

Honda Exclusive Authorized Dealerships: HIMAYAT NAGAR: Autofin Honda - 9985550099, 9908055755; NAMPALLY: Autofin Honda - 9985550099; 9701022300; UPPAL: Autofin Honda - 9985550099, 9989129090; DOMALGUDA: Autofin Honda - 9985550099, 8886629908; M.G. ROAD: Fortune Honda - 27570000, 9948888084; MALKAJGIRI: Fortune Honda - 27249166, 9948831000; SAINIKPURI: Fortune Honda - 27114200, 9948888085; KUSHAIGUDA: Fortune Honda - 65816112, 9948888767; NEW BHOIGUDA: Fortune Honda - 04029888801, 9948888051; W. MARREDPALLY: Fortune Honda - 29709044, 99488 88079; DAMMAIGUDA: Fortune Honda - 9948888048; SP ROAD: Fortune Honda - 48541878, 9948877736; KUKATPALLY: JSP Honda - 18005727177, 9959251133; MADINAGUDA: JSP Honda - 9959251188; CHINTAL: JSP Honda - 23084477, 9959891100; BALKAMPET: JSP Honda - 9959045592; MIYAPUR: JSP Honda - 9959891133; GANDIMAISAMMA: Ojasvi Honda - 9000003316; SOMAJIGUDA: Pratul Honda - 66732233, 7036532323; ERRAGADDA: Pratul Honda - 23801312, 9959532323; MALAKPET: Aadi Honda - 44178888/77/99, 9399999408; NAGOLE: Aadi Honda - 9399999402; MOOSARAMBAGH: Aadi Honda - 900030445; KOTHAPET: Aadi Honda - 9533120625; SANTOSH NAGAR: Aadi Honda - 9397999304, 8019798113; VANSTHALIPURAM: Deccan Honda - 8340866669, 8340866660; B N REDDY NAGAR: Deccan Honda - 04035164961, 04035164962; TADBUND: Raam Honda - 9100091054; BALANAGAR: Raam Honda - 9100211168; TIRUMALAGIRI: Raam Honda - 8886645057; ALWAL: Raam Honda - 9100091052; MEDCHAL: Sowmya Honda - 9951044400; TOLICHOWKI: Orange Honda - 9160188880; MASAB TANK: Orange Honda - 9581797921; BAHADURPURA: Maximus Honda - 7670820146/147/148/149, 9705806488; IBRAHIMPATNAM: Maximus Honda - 9293946999; ATTAPUR: Dwaraka Honda - 24001221, 8977001221; SHAMSHABAD: Dwaraka Honda - 9000633877; KONDAPUR: Vaishnaoi Honda - 9908822933, 9618277911; GACHIBOWLI: Vaishnaoi Honda - 8886604419, 8886604420; VIKARABAD: 8886720099, 8886940099; MADHAPUR: 7799345543, 7799765765; HABSIGUDA: Ride Honda - 7207022299, 9885418834; GHATESKAR: Ride Honda - 9885014931; MEDIPALLY: Ride Honda - 9885014935; KOMPALLY: Raam Honda - 9100771605; CHANDRAYANGUTTA: Maximus Honda - 8501026666, 24446477; NARSAPUR: A1 Honda - 9440202875; KOTHUR: Sun Honda - 08548-256161, 9000245092; TURKYAMJAL: Sri Sai Honda - 08415-234848, 9391334848; TUKKUGUDA: Dwarka Honda - 7730888843; MEDAK RC PURAM: Harmony Honda - 23180000, 9491025000; SANGAREDDY: VenkataSaai Honda - 9603755559; GAJWEL: VenkataSaai Honda -9133925559; SIDDIPET: Harmony Honda - 9491025048; ZAHEERABAD: Harmony Honda - 9491025020; SADASIVPET: Sree Krishna Honda - 9885921659; MEDAK: Sri Venkateshwara Honda - 9032003412, 08452-221999; TOOPRAN: VenkataSaai Honda - 9121095559; JOGIPET: VenkataSaai Honda - 9121395559.

For Bulk/Institutional enquiries, please write us at: institutionalsales@honda2wheelersindia.com

ఎన్నికల ప్రచారం ప్రాథమిక హక్కు కాదు

అరవింద్ కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ ఇవ్వొద్దు

- సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసిన ఈడీ
- మధ్యంతర బెయిల్ పిటిషన్‌పై నేడు తీర్పు!

న్యూఢిల్లీ: ఎన్నికల్లో ప్రచారం చేయడం అనేది ప్రాథమిక హక్కు లేదా రాజ్యాంగపరమైన హక్కు కాదని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ స్పష్టం చేసింది. అలాగే అది చట్టపరమైన హక్కు కూడా కాదని తేల్చిచెప్పింది. ఎన్నికల్లో ప్రచారం చేయాలన్న కారణంతో ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ ఇవ్వొద్దని సుప్రీంకోర్టుకు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు గురువారం కోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. ఢిల్లీ మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో అరెస్టయిన అరవింద్ కేజ్రీవాల్ మధ్యంతర బెయిల్ పిటిషన్‌పై సుప్రీంకోర్టు శుక్రవారం తీర్పు వెలువరించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆయనకు బెయిల్ ఇవ్వొద్దంటూ ఈడీ అఫిడవిట్ దాఖలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. రాజకీయ



నాయకులు జ్యుడీషియల్ కస్టడీలో ఉంటూ ఎన్నికల్లో పోటీ చేసి గెలిచిన సందర్భాలు గతంలో ఉన్నాయని, ప్రచారం చేసుకోవడానికి వారికి కోర్టులు మధ్యంతర బెయిల్ ఇవ్వలేదని ఈడీ తన అఫిడవిట్‌లో ప్రస్తావించింది. ఎన్నికల్లో పోటీ చేయకపోయినా కేవలం ప్రచారం కోసం మధ్యంతర బెయిల్ ఇచ్చిన ఉదంతాలు కూడా లేవని స్పష్టం చేసింది. చట్టం ముందు అందరూ సమానమేనని ఉద్ఘాటించింది. ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌కు ప్రత్యేక మినహాయింపు ఇవ్వడం చట్టముందు అందరూ సమానమేనన్న నిబంధనను ఉల్లంఘించినట్లు అవుతుందని వెల్లడించింది. అదేకాకుండా ఇప్పుడు ఆయనకు మధ్యంతర బెయిల్ ఇస్తే భవిష్యత్తులో రాజకీయ నాయకులు ఇలాంటి వెసులుబాటు కోరే అవకాశం ఉందని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సుప్రీంకోర్టు దృష్టికి తీసుకొచ్చింది.

కేజ్రీవాల్‌పై అతి త్వరలో ఈడీ చార్జిషీట్

ఢిల్లీలో ఎక్సయిజ్ విధానంలో అవకతవకల సంబంధ కేసులో ఈడీ అతి త్వరలో ప్రత్యేక మనీ లాండరింగ్ నిరోధక చట్టం(పీఎంఎల్‌ఏ) కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయనున్నట్లు తెలిసింది. ఈ చార్జిషీట్‌లో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, తెలంగాణకు చెందిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితతోపాటు ఇతర నిందితుల పేర్లతో అదనంగా మరిన్ని వివరాలు, ఆస్తుల గురించి ప్రస్తావించే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాలు గురువారం వెల్లడించాయి. మద్యం కుంభకోణంలో ఈడీ ఇప్పటిదాకా 18 మందిని అరెస్టు చేసింది. ఇప్పటికే ఆరు చార్జిషీట్లు దాఖలు చేసింది. మరో నాలుగైదు రోజుల్లో దాఖలు చేయబోయే చార్జిషీట్ ఏడోది కానుంది.





ఇది ఎన్నికల స్టంటు కాదు. ఈయన పేరు కుశేశ్వర్ భగత్. గుర్‌గావ్ లోక్‌సభ స్థానం నుంచి ఇండిపెండెంట్‌గా బరిలోకి దిగారు. ఈ పావ్ భాజి స్టాల్ ఈయనదే. ఇది బిజినెస్ అవర్... అందుకే ఇలా పావ్ భాజీ తయారు చేసి అందిస్తున్నారు.

నేను గెలిస్తే గాంధీలు గెలిచినట్లే

- గాంధీలు నమ్మకంతో నాకీ బాధ్యత అప్పగించారు
- అమేథీ కాంగ్రెస్ అభ్యర్థి కిశోరీ లాల్ శర్మ వ్యాఖ్య


అమేథీలో కాంగ్రెస్ ఇప్పటికే ఓటమిని అంగీకరించిందంటూ బీజేపీ వ్యాఖ్యానించడం ఆ పార్టీ దురహంకారానికి ప్రతీక అని అమేథీ లోక్‌సభ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి కిశోరీ లాల్ శర్మ వ్యాఖ్యానించారు. గురువారం పీటీఐతో ప్రత్యేక ముఖాముఖి సందర్భంగా ఆయన ప్రస్తావించిన అంశాలు, వెల్లడించిన అభిప్రాయాలు ఆయన మాటల్లోనే..

నేను సైతం సతీశ్ శర్మలా

'' 1990 దశకంలో గాంధీల సన్నిహితుడు, కాంగ్రెస్ నేత సతీశ్ శర్మ ఇదే అమేథీలో ఎంపీగా గెలిచారు. గాంధీల విజయపరంపరను కొనసాగించారు. తర్వాత తప్పుకుని సోనియాగాంధీ పోటీకి మార్గం సుగమం చేశారు. నేను భవిష్యత్తులో అలాగే చేస్తా. ఇక్కడ గెలిచి పార్టీ తరఫున ప్రాతినిధ్య బాధ్యతలు స్వీకరిస్తా. భవిష్యత్తులో గాంధీలు ఇక్కడి నుంచి పోటీ చేయాల్సి వస్తే అప్పుడు ఇవే ప్రాతినిధ్య బాధ్యతలను వారికి అప్పగిస్తా. అమేథీ నుంచి పోటీచేయకుండా రాహుల్ పారిపోయారని బీజేపీ వ్యాఖ్యానించడం చూస్తుంటే ఆ పార్టీకి గాంధీల చరిత్ర తెలియదని అర్థమవుతోంది. బ్రిటిషర్ల కాలం నుంచీ నెహ్రూ–గాంధీల కుటుంబం బ్రిటిషర్లను ఎదిరించిందేగానీ ఎక్కడికీ పారిపోలేదు. ఇప్పుడూ అంతే. రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా యాత్రచేశారు. బీజేపీని తరిమేయడమే ఆయన ధ్యేయం'' అని అన్నారు.

ప్యూన్, క్లర్క్ వ్యాఖ్యలపై..

''గాంధీల కుటుంబానికి ప్యూన్, ప్రియాంక గాంధీకి క్లర్క్ అంటూ నాపై బీజేపీ చేస్తున్న అనుచిత వ్యాఖ్యలు వింటూనే ఉన్నా. బీజేపీ



నాయకులకు వారి కుటుంబం నేర్పిన విలువలే అబ్బుతాయి. మా నాన్న నిరక్షరాస్యుడు. అయినా నాకు చక్కటి విద్యాబుద్ధులు, నడవడిక, విలువలు నేర్పించారు. కుటుంబం ఏం నేర్పిస్తే అవే ఆ కుటుంబసభ్యులకు వస్తాయి. నాపై బీజేపీ నేతలు చేసిన వ్యాఖ్యలకు నా స్పందన, సమాధానం పొందే స్థాయి, అర్హత వారికి లేవు'' అని వ్యాఖ్యానించారు.

నమ్మకాన్ని నిలబెడతా..

' నాపై నమ్మకంతో అమేథీ బాధ్యతలను గాంధీలు నాకు అప్పగించారు. అమేథీపై గాంధీల చెరగని ముద్ర ఉంది. ఆ ముద్ర చెరిగిపోకుండా, శాశ్వతంగా ఉండేందుకు ఇకమీదటా కృషిచేస్తా. 41 సంవత్సరాలుగా ఈ నియోజకవర్గం బాధ్యతల్ని చూసుకుంటున్నా. గెలిచి గాంధీల నమ్మకాన్ని నిలబెడతా'' అని అన్నారు.

కొన్ని పొరపాట్లతో ఓడారు

''కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో యోగి ప్రభుత్వాలు అమేథీలో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పనిచేశాయి. ప్రభుత్వ అధికారులు, పాలనాయంత్రాంగాన్ని ఈ నియోజకవర్గంలో దుర్వినియోగం చేశాయి. కాంగ్రెస్ సైతం కొన్ని పొరపాట్లు చేసింది. అందుకే గత ఎన్నికల్లో రాహుల్ ఓటమిని చవిచూడాల్సి వచ్చింది. వాస్తవానికి గత ఎన్నికల్లో ప్రజలు రాహుల్‌ను ఓడించలేదు. ఓడించాలనుకుంటే 3 లక్షల ఓట్ల తేడాతో ఓడించాలి. కానీ రాహుల్‌కు నాలుగు లక్షలకుపైగా ఓట్లు పడ్డాయి. గెలుపునకు కొంత దూరంలో ఆగిపోయారు. ఆయన ఓడిపోయారని అమేథీ ప్రజలపై నేను నిందారోపణలు మోపట్లేను'' అని అన్నారు.

స్మృతి హామీలు తీర్చారా?

'' ఐదేళ్ల క్రితం స్మృతి ఇరానీ అమేథీ ఓటర్లకు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చారా? నిరుద్యోగం, ధరలు, వీధి ఆవుల మాటేంటి? సమస్యలు అలాగే ఉన్నాయి కదా? ఎవరు గెలుస్తారని చెప్పట్లేను. ఎవరు గెలవాలో ప్రజలే నిర్ణయించుకోవాలి. నేను గెలిస్తే ఈ విజయం నిస్సందేహంగా గాంధీలదే'' అని అన్నారు. - అమేథీ

బీజేపీ నేతలు తెల్లకాగితాలపై సంతకాలు పెట్టించారు

- తృణమూల్ నాయకులపై వారే ఫిర్యాదు చేశారు
- మేము లైంగిక వేధింపులకు గురికాలేదు
- తెరపైకి వచ్చిన సందేశ్‌ఖాలీ మహిళల వీడియోలు

కోల్‌కతా: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పశ్చిమ బెంగాల్ సందేశ్‌ఖాలీ లైంగిక వేధింపులు, అత్యాచారాల వ్యవహారం మరో మలుపు తిరిగింది. అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ నేతలు తమపై ఎలాంటి వేధింపులకు పాల్పడలేదని సందేశ్‌ఖాలీకి చెందిన ముగ్గురు మహిళలు స్పష్టం చేశారు. స్థానిక బీజేపీ మహిళా నేత ఒకరు తెల్లకాగితాలపై తమతో బలవంతంగా సంతకాలు పెట్టించారని, ఈ కాగితాలపై బీజేపీ నాయకులే ఫిర్యాదులు రాసి, తమ పేరిట తృణమూల్ కాంగ్రెస్ నేతలపై పోలీసు స్టేషన్‌లో అత్యాచారం కేసులు పెట్టారని చెప్పారు. తమను మభ్యపెట్టి మోసం చేసిన బీజేపీ నాయకులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వారు తమను వేధిస్తున్నారని, తమకు రక్షణ కల్పించాలని కోరారు. ఈ మేరకు ముగ్గురు మహిళలు చెబుతున్నట్లుగా కొన్ని వీడియోలు సోషల్ మీడియాలో ప్రత్యక్షమయ్యాయి. ఈ వీడియోలను తృణమూల్ కాంగ్రెస్ షేర్ చేసింది. సందేశ్‌ఖాలీ మహిళలపై తమ పార్టీ నాయకులెవరూ లైంగిక వేధింపులకు పాల్పడలేదని, బీజేపీ నేతలే తప్పుడు ప్రచారం చేశారని పశ్చిమ బెంగాల్ మంత్రి, తృణమూల్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శశి పాంజా ఆరోపించారు. సందేశ్‌ఖాలీలో కొన్ని భూకబ్జా ఘటనలు మినహా లైంగిక వేధింపుల ప్రసక్తే లేదని అన్నారు. తమ పార్టీని అప్రతిష్టపాలు చేసేలా తప్పుడు ప్రచారం చేసిన బీజేపీ నాయకులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఇదంతా కుట్ర: సువేందు అధికారి

కొత్తగా తెరపైకి వచ్చిన వీడియోలపై బీజేపీ నేత, అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడైన సువేందు అధికారి స్పందించారు. వాటిని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మేనల్లుడు అభిషేక్ బెనర్జీ ఉద్దేశపూర్వకంగా సృష్టించాడని విమర్శించారు. దీనివెనుక ప్రైవేట్ ఎన్నికల, రాజకీయ వ్యూహ సంస్థ 'ఐ–ప్యాక్' ప్రోద్బలం ఉందని చెప్పారు. మహిళలను తీసుకొచ్చి, బీజేపీపై ఆరోపణలు చేయిస్తున్నారని, ఇదంతా కుట్రేనని స్పష్టం చేశారు. అభిషేక్ బెనర్జీ, ఐ–ప్యాక్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ త్వరలో కోర్టు ఆశ్రయిస్తామని అన్నారు.

బీజేపీ నేతలపై ఫిర్యాదు

సువేందు అధికారితోపాటు మరికొందరు బీజేపీ నేతలపై తృణమూల్ కాంగ్రెస్ నాయకులు గురువారం ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. తమ పార్టీ నాయకులపై అత్యాచార ఆరోపణలు చేసేలా సందేశ్‌ఖాలీ మహిళలను బీజేపీ నేతలు ప్రేరేపించారని, వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఎలక్షన్ బీట్

కొత్త ప్రభుత్వం వస్తే ఈవీఎంలు ఏట్లోకే: ఫరూక్

గండేర్బల్: ఎన్నికల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల(ఈవీఎంలు) వినియోగం ఇండియాలో తప్ప ప్రపంచంలో ఎక్కడా లేదని నేషనల్ కాన్ఫరెన్స్(ఎన్‌సీ) అధ్యక్షుడు, జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఫరూక్ అబ్దుల్లా చెప్పారు. ఈవీఎంలను మనపై బలవంతంగా రుద్దుతున్నారని విమర్శించారు. ఈ ఎన్నికల్లో బీజేపీ ఓడిపోయి, దేవుడి దయతో కేంద్రంలో కొత్త ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఈవీఎంలను నదిలో విసిరేయడం ఖాయమని అన్నారు. ఆయన గురువారం సెంట్రల్ కశ్మీర్‌లోని గండేర్బల్ జిల్లాలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడారు. ఈవీఎంలు దొంగ యంత్రాలు అని మండిపడ్డారు. ఈవీఎంలో ఓటు వేసినప్పుడు మన ఓటు సక్రమంగా నమోదైందో లేదో చూసుకోవాలని ప్రజలకు సూచించారు. అనుమానం ఉంటే అక్కడి అధికారులను ప్రశ్నించాలని చెప్పారు.

యువత దృష్టి మళ్లించడానికే మోదీ డ్రామాలు: రాహుల్

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి ఓటమి తప్పదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. ఈ సంగతి ప్రధాని మోదీకి కూడా అర్థమైందని, అందుకే యువత దృష్టిని మళ్లించడానికి కొత్త డ్రామాలు ప్రారంభించారని చెప్పారు. ప్రధానమంత్రి చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దని, ఆయన విసురుతున్న వలలో ఎవరూ చిక్కుకోవద్దని సూచించారు. మోదీ ఇక మన ప్రధానిగా ఉండబోరని తేల్చిచెప్పారు. జూన్ 4 తర్వాత కేంద్రంలో తమ ప్రభుత్వం రాగానే యువత సంక్షేమం కోసం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. భర్తీ భరోసా పథకం కింద కేంద్ర ప్రభుత్వ శాఖలు, విభాగాల్లో 30 లక్షల ఖాళీలు భర్తీ చేసే ప్రక్రియను ఈ ఏడాది ఆగస్టు 15 నాటికి ప్రారంభిస్తామని, యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని వెల్లడించారు. ఈ మేరకు రాహుల్ గాంధీ గురువారం 'ఎక్స్'లో ఓ వీడియో సందేశం పోస్టు చేశారు. మన దేశానికి యువతరమే బలమని చెప్పారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని 'ఇండియా' కూటమికి మద్దతు ఇవ్వాలని కోరారు. ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలను ఎంచుకోవాలి తప్ప విద్వేషాన్ని కాదని స్పష్టం చేశారు.

ప్రజల ప్రాణాలు ప్రమాదంలో: అఖిలేశ్

లక్నో: యూకేకు చెందిన ఔషధ తయారీ సంస్థ ఆస్ట్రాజెనెకా కోవిడ్ టీకా 'కోవిషీల్డ్'ను అంతర్జాతీయ మార్కెట్ నుంచి వెనక్కి తీసుకుంటున్నట్లు చేసిన ప్రకటనపై సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) చీఫ్ అఖిలేశ్ యాదవ్ స్పందించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కోట్లాది రూపాయల విరాళాలకు కక్కుర్తిపడి ప్రమాదకరమైన ఈ టీకాను అందుబాటులోకి తెచ్చి దేశ ప్రజల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టివేసిందని 'ఎక్స్'లో ఆరోపించారు. తమ శరీరంలో ఉన్న ప్రాణాంతక టీకాను వెనక్కి ఎలా తీసుకుంటారంటూ బీజేపీ ప్రభుత్వాన్ని ప్రజలు ఆగ్రహంతో నిలదీస్తున్నారన్నారు. కొత్త వెర్షన్ల టీకాలు మార్కెట్‌లోకి వచ్చినందున మిగులు టీకాలను వెనక్కి తీసుకుంటున్నట్లు ఆస్ట్రాజెనెకా బుధవారం తెలిపింది. అయితే, అరుదైన కేసుల్లో టీకా తీసుకున్న వారిలో థ్రాంబోసైటోపీనియా సిండ్రమ్(టీటీఎస్)తో థ్రాంబోసిస్ వస్తుందని ఇటీవలే ఆ సంస్థ అంగీకరించింది. ఆస్ట్రాజెనెకాతో ఒప్పందం మేరకు ఈ టీకా ఉత్పత్తిని భారత్‌లో 2021లోనే నిలిపివేసినట్లు సీరం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా(ఎస్ఐఐ)అంటోంది. ఇలా ఉండగా, గురువారం అఖిలేశ్ యూపీలోని బహ్రెయిచ్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో మాట్లాడుతూ.. ఒక పార్టీ సొంత వారిపైనే దాడులు చేస్తుండగా మరో పార్టీ సొంత వారినే బహిష్కరిస్తోందంటూ బీజేపీ, బీఎస్పీలపై మండిపడ్డారు. ఈ రెండు పార్టీలు లోపాయికారీగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు.

మోదీ చెప్పేవన్నీ అబద్ధాలు: ప్రియాంక

రాయ్‌బరేలీ(యూపీ): కాంగ్రెస్ గెలిస్తే అయోధ్య రామాలయానికి బాబ్రీ తాళం వేస్తారంటూ ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలను పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ తిప్పికొట్టారు. రాయ్‌బరేలీ, అమేథీ ప్రచార బాధ్యతలను భుజానికెత్తుకున్న ప్రియాంక గురువారం రాయ్‌బరేలీలో విలేకరులతో మాట్లాడారు. '' అయోధ్య భవ్య రామమందిరానికి బాబ్రీ తాళమంటూ ప్రధాని పలికేవన్నీఅబద్ధాలు. బాబ్రీ మసీదు–రామజన్మభూమి భూవివాదంలో సర్వోన్నత న్యాయస్థానం తీర్పును తాము గౌరవిస్తామని కాంగ్రెస్ పార్టీ గతంలో ఎన్నోసార్లు ప్రకటించింది'' అని ఆమె స్పష్టంచేశారు. అంబానీ, అదానీల నుంచి రాహుల్ గాంధీకి టెంపోల నిండా నల్లధనం పంపిస్తే వారిని నిందించడం రాహుల్ ఆపేస్తాడని మోదీ ఆరోపించడంపైనా ప్రియాంక స్పందించారు. ''ప్రధాని, నాకంటే వయసులో పెద్దవారు అయినాసరే ఆయనకు నాదో సలహా. కాంగ్రెస్ మేనిఫెస్టోను చదివి అర్థంచేసుకుని తర్వాతే మాట్లాడండి. ఆయన ఇంతవరకు దానిని చదవలేదు. మనసులో ఏది అనిపిస్తే అది మేనిఫెస్టోలో ఉండి ఉండొచ్చు అని ఖాయం చేసుకుని విమర్శిస్తుంటారు. ఆయన చెప్పేవేవీ మేనిఫెస్టోలో లేవు'' అని అన్నారు.

మోదీ స్వరం మారింది: శరద్ పవార్

పుణే: లోక్‌సభ ఎన్నికల్లో మొదటి మూడు విడతల పోలింగ్ పూర్తయ్యాక గెలుపుపై ధీమా సడలిన ప్రధాని మోదీ ముస్లింల గురించి బాహాటంగానే మాట్లాడుతున్నారని ఎన్సీపీ(ఎస్పీ) చీఫ్ శరద్ పవార్ పేర్కొన్నారు. సతారాలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'మూడు విడతల పోలింగ్ తర్వాత మోదీ అస్థిమితంగా కనిపిస్తున్నారు. అందుకే ఆయన స్వరం మారింది. ముస్లింల గురించి బాహాటంగానే మాట్లాడటం ప్రారంభించారు. ప్రజల్లో మతపరమైన ఆలోచనలను తీసుకొస్తే పరిస్థితి అనుకూలంగా మారొచ్చని ఆయన అనుకుంటున్నట్లుగా కనిపిస్తోంది. మూడు దశల తర్వాత మోదీ పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతోందని ఆయన పార్టీ నేతలే కొందరంటున్నారు' అని పవార్ చెప్పారు.

ఇద్దరు భార్యలుంటే రూ.2 లక్షలు

మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ అభ్యర్థి కాంతిలాల్ భూరియా ప్రకటన

భోపాల్: కేంద్రంలో తమ ప్రభుత్వం వస్తే మహాలక్ష్మి పథకం కింద ఒక వ్యక్తికి ఇద్దరు భార్యలు ఉంటే ఏటా రూ.2 లక్షల చొప్పున ఇస్తామని కేంద్ర మాజీ మంత్రి, మధ్యప్రదేశ్‌లోని రాట్లాం నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి కాంతిలాల్ భూరియా గురువారం ప్రకటించారు. మహాలక్ష్మి పథకం కింద పేద మహిళలకు నెలకు రూ.8,500 చొప్పున ప్రతిఏటా రూ.లక్ష అందజేస్తామని కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఎవరికైనా ఇద్దరు భార్యలు ఉన్నా సరే ఈ పథకం వర్తింపజేస్తామని కాంతిలాల్ భూరియా చెప్పారు. ఆయన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఓటర్లను ప్రలోభానికి గురిచేసేలా మాట్లాడిన కాంతిలాల్‌పై ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని మధ్యప్రదేశ్ బీజేపీ నేతలు డిమాండ్ చేశారు.

నేటి నుంచి చార్‌ధామ్ యాత్ర

డెహ్రాడూన్: ఉత్తరాఖండ్‌లోని గఢ్వాల్ హిమాలయాల్లో ఉన్న కేదార్‌నాథ్, గంగోత్రి, యమునోత్రి ఆలయాలను శుక్రవారం ఉదయం నుంచి భక్తుల దర్శనాల కోసం తెరిచి ఉంచనున్నారు. ఏటా ఈ ఆలయాలను శీతాకాలంలో మూసివేసి, వేసవి ఆరంభంలో తిరిగి తెరుస్తారు. కేదార్‌నాథ్, యమునోత్రి ఆలయాలను ఉదయం 7 గంటలకు, గంగోత్రి ఆలయ తలుపులను మధ్యాహ్నం 12.20 గంటలకు తెరుస్తారు. చార్‌ధామ్ యాత్రలో భాగమైన బద్రీనాథ్ ఆలయాన్ని ఈ నెల 12వ తేదీన ఉదయం 6 గంటలకు తెరుస్తారు. ప్రారంభ పూజల కోసం కేదార్‌నాథ్ ఆలయాన్ని 20 క్వింటాల పూలతో అలంకరించారు. ఇలా ఉండగా, గురువారం రిషికేశ్ నుంచి 135 వాహనాల్లో 4,050 మంది చార్‌ధామ్ యాత్రికులు బయలుదేరినట్లు బద్రీనాథ్–కేదార్‌నాథ్ ఆలయ కమిటీ తెలిపింది.

భారత ఎన్నికల్లో అమెరికా జోక్యం

సంచలన ఆరోపణలు చేసిన రష్యా

మాస్కో: భారత అంతర్గత వ్యవహారాలు, సార్వత్రిక ఎన్నికల్లో అమెరికా దురుద్దేశంతో కలగజేసుకుంటోందని రష్యా సంచలన ఆరోపణలు చేసింది. ఖలిస్తానీ ఉగ్రవాది గురుపత్వంత్ సింగ్ పన్నూను అమెరికాలో చంపేందుకు భారతీయ పౌరులు కుట్ర పన్నారని అమెరికా ఆరోపించిందిగానీ నమ్మదగ్గ సాక్ష్యాలను బయటపెట్టలేదని


రష్యా విదేశాంగ శాఖ ప్రతినిధి మారియా జఖారోవా

రష్యా గుర్తుచేసింది. రష్యా, సౌదీ అరేబియా తరహా పాలనా విధానాలను దేశంలో అమలుచేయాలని మోదీ సర్కార్ భావిస్తోందని అమెరికా ఒక నివేదిక వెల్లడించడంపై రష్యా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మారియా జఖారోవా గురువారం మాట్లాడారు. '' పన్నూను అంతమొందించేందుకు భారత 'రా' అధికారి, మరో భారతీయుడు నిఖిల్ గుప్తాతో కలిసి కుట్ర పన్నారని అమెరికా ఆరోపించింది. కానీ అందుకు బలమైన సాక్ష్యాలు ఒక్కదాని కూడా బయటపెట్టలేదు. సాక్ష్యాలు చూపకుండా ఊహాగానాలను వ్యాప్తిచేయడం తగదు. భారత విధానాలు, దేశ చరిత్రను అవగాహన చేసుకునే స్థాయి అమెరికాకు లేదు. అందుకే భారత్‌లో మత స్వేచ్ఛపై ఆరోపణలను అమెరికా నిరంతరం గుప్పిస్తోంది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో రాజకీయ వాతావరణాన్ని అస్థిరపరిచేందుకు అమెరికా ప్రయత్నిస్తోంది. అందుకే రాష్ట్రాల్లో మానవహక్కుల ఉల్లంఘన జరిగిందని, మత స్వేచ్ఛకు భంగం వాటిల్లిందని నివేదికలు ఇస్తోంది'' అని మారియా చెప్పినట్లు రష్యా అధికారిక 'ఆర్‌టీ న్యూస్' ఛానల్ ఒక వార్తను ప్రసారంచేసింది. గత ఏడాది అమెరికాలో పన్నూను భారత రీసెర్చ్ అండ్ అనాలసిస్ (రా) అధికారి చంపాలనుకున్న కుట్రను అమెరికా అధికారులు విజయవంతంగా భగ్నంచేశారని వాషింగ్టన్ పోస్ట్ ఒక కథనం వెలువరించింది. దీనిపై భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసింది. ఈ ఉదంతంపై దర్యాప్తు కొనసాగుతున్న వేళ ఇలాంటి నిరాధార ఆరోపణలు తగవని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ ఆనాడే ఢిల్లీలో ఆక్షేపించారు.

జనగణన లేకుండా ఈ లెక్కలేేల?

తేజస్వీ యాదవ్ ధ్వజం

పట్నా: ప్రధానమంత్రి ఆర్థికవ్యవహారాల సలహా మండలి(ఈఏసీ–పీఎం) నివేదికలోని గణాంకాలపై ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ సందేహం వ్యక్తంచేశారు. తాజాగా జనగణన చేపట్టకుండానే దేశంలో హిందూ, ముస్లింల జనాభాపై కేంద్రం ఎలా ఒక అంచనాకు వస్తుందని నిలదీశారు. దేశంలో ముస్లింల జనాభా పెరిగిందని, హిందువుల జనాభా తగ్గిందంటూ విడుదలచేసిన ఈఏసీ–పీఎం రిపోర్ట్‌పై తేజస్వీ స్పందించారు. '' అసలైన సమస్యల నుంచి దృష్టి మరల్చేందుకే హిందూ, ముస్లింల మధ్య మోదీ సర్కార్ చిచ్చుపెడుతోంది. జనాభా లెక్కలు లేకుండానే ఎలా ఈ కొత్త లెక్కలతో వచ్చారు? 2021లో కూడా జనగణన ఎందుకు సాధ్యంకాలేదు. అప్పుడు, ఇప్పుడు మీరే ప్రధాని. హిందూ, ముస్లింలను వేర్వేరుగా పక్షపాత ధోరణితో చూసే విధానాన్ని విడనాడండి. సమస్యల గురించే మాట్లాడండి' అని ప్రధానికి తేజస్వీ హితవు పలికారు. షేర్ ఆఫ్ రిలీజియస్ మైనారిటీస్: ఏ క్రాస్ కంట్రీ అనాలసిస్(1950–2015) పేరిట ఈఏసీ–పీఎం ఒక నివేదిను తయారుచేసింది. 1950వ సంవత్సరంను ప్రాతిపదికగా తీసుకుని లెక్కిస్తే దేశ జనాభాలో 84.68 శాతంగా ఉన్న హిందువులు 2015 ఏడాదివచ్చేసరికి 78.06 శాతానికి తగ్గారు. అంటే దేశజనాభాలో హిందువుల వాటా 7.82 శాతం తగ్గింది. అదే సమయంలో దేశజనాభాలో ముస్లింలు 9.84 శాతంగా ఉంటే 2015 ఏడాదినాటికి దేశజనాభాలో వారు 14.09 శాతానికి పెరిగారని నివేదిక పేర్కొంది.

బాణసంచా ఫ్యాక్టరీలో పేలుడు.. 9 మంది మృతి

విరుధునగర్: బాణసంచా తయారీకి పేరుగాంచిన తమిళనాడు రాష్ట్రం విరుధునగర్ జిల్లాలోని శివకాశీలో భారీ పేలుడు సంభవించింది. గురువారం మధ్యాహ్నం చోటుచేసుకున్న ఈ ఘటనలో ఐదుగురు మహిళలు సహా మొత్తం 9 మంది చనిపోయారు. 10 మంది తీవ్రంగా గాయపడ్డారు. సెంగమలపట్టి ప్రాంతంలోని ఈ ఫ్యాక్టరీలో పేలుడు ధాటికి మొత్తం ఏడుగదుల్లో నిల్వ ఉంచిన బాణసంచా పూర్తిగా ధ్వంసమైంది.

విధుల్లోకి ఎయిరిండియా సిబ్బంది

న్యూఢిల్లీ: ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ కేబిన్ క్రూ మంగళవారం రాత్రి నుంచి సాగిస్తున్న సమ్మెను విరమించుకుంటున్నట్లు ప్రకటించారు. గురువారం సాయంత్రం సిబ్బంది ప్రతినిధులు, కేంద్ర కార్మిక శాఖ అధికారుల సమక్షంలో ఢిల్లీలో చర్చలు జరిగాయి. ఈ సందర్భంగా యాజమాన్యం తమ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామంటూ ఇచ్చిన హామీతో తిరిగి విధుల్లోకి హాజరయ్యేందుకు సిబ్బంది అంగీకరించారు. అంతేకాకుండా 25 మంది సిబ్బందికి ఇప్పటికే పంపిన తొలగింపు నోటీసులను ఉపసంహరించుకునేందుకు సైతం ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ సంస్థ సమ్మతించింది. వీరిపై సర్వీసు నిబంధనల ప్రకారం చర్యలుంటాయని తెలిపింది. అంతకుముందు, మూడో రోజు గురువారం సుమారు 250 సిబ్బంది విధులకు హాజరు కాకపోవడంతో 85 సర్వీసులను రద్దు చేసినట్లు సంస్థ తెలిపింది. సమ్మెలో పాల్గొంటున్న 25 మంది సిబ్బందికి నోటీసులు పంపింది. మిగతా వారు గురువారం సాయంత్రం 4 గంటల్లోగా విధుల్లో చేరాలని కూడా హెచ్చరించింది.

మత ఘర్షణ భయాలు పెంచుతోంది

బీజేపీపై మెహబూబా ముఫ్తీ ఫైర్

శ్రీనగర్: తొలి మూడు దశల్లో పేలవ ప్రదర్శనతో డీలాపడ్డ బీజేపీ ఇప్పుడు మత ఘర్షణలు జరగొచ్చని భయపెడుతోందని పీడీపీ చీఫ్ మెహబూబా ముఫ్తీ ఆరోపించారు. '' బీజేపీ హిందూ, ముస్లింలను విభజించాలని చూసింది. ముస్లింలు మంగళసూత్రాలు దోచుకెళ్తారని ప్రచారంచేసింది. చివరకు గేదెలను రాజకీయాంశం చేసింది. మతం పేరు చెప్పి నెగ్గాలన్న లక్ష్యంతో బీజేపీ ఎన్నికల్లో పోటీచేస్తోంది'' అని అన్నారు.

త్రిముఖ 'కురుక్షేత్రం'

బీజేపీకి అధికార వ్యతిరేకత • ఐఎన్‌ఎల్‌డీకి జాట్ల దన్ను • ఆప్ సుడిగాలి ప్రచారం

హరియాణాలోని కురుక్షేత్ర లోక్‌సభ స్థానంలో ఎన్నికల పోరు రణరంగాన్నే తలపిస్తోంది. సాధారణంగా ముఖాముఖి పోరు సాగే ఈ నియోజకవర్గంలో ఈసారి మాత్రం బీజేపీ, ఆప్, ఇండియన్ నేషనల్ లోక్‌దళ్ (ఐఎన్‌ఎల్‌డీ) మధ్య త్రిముఖ పోరు నెలకొంది. గత రెండు ఎన్నికల్లో భారీ మెజారిటీ సాధించిన బీజేపీ ఈసారి మాత్రం గెలుపు కోసం చెమటోడుస్తోంది. ఇటీవలే కాంగ్రెస్ నుంచి వచ్చిన ప్రముఖ పారిశ్రామిక వేత నవీన్ జిందాల్‌కు టికెటిచ్చింది. ఇండియా కూటమి అభ్యర్థిగా ఆప్ నుంచి సుశీల్ గుప్తా, ఐఎన్‌ఎల్‌డీ తరఫున జాట్ నాయకుడు అభయ్ చౌతాలా పోటీ పడుతున్నారు. హరియాణా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీ ఇటీవలి దాకా ఇక్కడ బీజేపీ ఎంపీగా ఉన్నారు.

కురుక్షేత్రలో 2004, 2009ల్లో నవీన్ జిందాల్ కాంగ్రెస్ తరఫున గెలిచారు. 2014, 2019ల్లో బీజేపీ భారీ విజయాలు సాధించింది. కురుక్షేత్రలో జాట్ సామాజికవర్గ ప్రాబల్యమున్న స్థానం. 17.88 లక్షల మంది ఓటర్లలో జాట్లు 14 శాతముంటారు. బ్రాహ్మణులు, సైనీలు చెరో 8 శాతం, సిక్కులు 6 శాతం, అగర్వాల్ సామాజికవర్గం 5 శాతం ఉన్నారు. అభయ్ చౌతాలా జాట్ నాయకుడు కాగా జిందాల్, సుశీల్ గుప్తాలది బనియా సామాజికవర్గం. పోరు బీజేపీ, ఆప్ మధ్యేనని తొలుత భావించినా ఐఎన్‌ఎల్‌డీ నుంచి జాట్ నేత రంగంలోకి దిగడంతో పోరు త్రిముఖంగా మారింది.


సుశీల్ గుప్తా


నవీన్ జిందాల్


అభయ్ చౌతాలా

బీజేపీకి రైతుల సెగ

గత రెండుసార్లూ బీజేపీ భారీ మెజారిటీలు సాధించినా, కేంద్ర రాష్ట్రాల్లో అధికారంలో ఉన్నా పార్టీపై ప్రస్తుతం వ్యతిరేకత తీవ్రంగా ఉంది. దీనికితోడు రైతు సమస్యలు, కనీస మద్దతు ధరకు చట్టబద్ధత మరింత సమస్యగా మారాయి. ఇటీవలి రైతుల ఆందోళనలు ఆ పార్టీ పుట్టి ముంచుతాయన్న అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది. పైగా ఆ సందర్భంగా వేలాది రైతులపై కేసులు పెట్టడం బీజేపీకి చాలా వ్యతిరేకంగా మారింది. భారతీయ కిసాన్ యూనియన్ (చారిణి) ఇప్పటికే చౌతాలాకు మద్దతిచ్చింది. ఈ యూనియన్ ఊరూరా రైతులతో సమావేశాలు నిర్వహించి మరీ ఐఎన్‌ఎల్‌డీకి మద్దతివ్వాలని కోరుతోంది. ఆప్ కూడా రైతులకు 200 యూనిట్ల ఉచిత కరెంటు, యువత, మహిళలకు నెలకు రూ.వేయి ఆర్థిక సాయం వంటి హామీలతో దూసుకెళ్తోంది. ఆప్ నేత, పంజాబ్ సీఎం భగవంత్ మాన్ సుడిగాలి ప్రచారం చేస్తున్నారు.

జిందాల్ పొలం బాట

బీజేపీకి ఎదురు గాలి వీస్తున్న సంకేతాలు అందుతుండటంతో పార్టీ అభ్యర్థి జిందాల్ ప్రచార శైలిని మార్చారు. ముఖ్యంగా రైతులను ఆకట్టుకునే పనిలో పడ్డారు. ట్రాక్టర్‌లు నడపడం, వరి పొలాల్లోకి దిగి రైతులతో మాట్లాడటం వంటివి చేస్తున్నారు. తన సంస్థల ద్వారా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు ఏర్పాటు చేసి యువతకు భారీగా ఉపాధి కల్పిస్తానని హామీ ఇస్తున్నారు. కురుక్షేత్రలో ఈ నెల 25న ఆరో విడతలో పోలింగ్ జరగనుంది.


- సాక్షి, న్యూఢిల్లీ

18 నుంచి శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల కోటా విడుదల

తిరుమల: తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లకు సంబంధించిన ఆగస్టు నెల కోటాను ఈ నెల 18న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ సేవా టికెట్ల ఎలక్ట్రానిక్ డిప్ కోసం ఈ నెల 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. ఈ టికెట్లు పొంది, ఈ నెల 20 నుంచి 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు సొమ్ము చెల్లించిన వారికి లక్కీడిప్‌లో టికెట్లు మంజూరవుతాయి. కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవా టికెట్ల కోటా, అదేవిధంగా శ్రీవారి ఆలయంలో ఆగస్టు 15 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించనున్న వార్షిక పవిత్రోత్సవాల సేవా టికెట్లను ఈ నెల 21వ తేదీ ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. అలాగే 21న మధ్యాహ్నం 3 గంటలకు వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన కోటాను, 23న ఉదయం 10 గంటలకు అంగప్రదక్షిణం టోకెన్ల కోటాను, ఉదయం 11 గంటలకు శ్రీవాణి టికెట్ల ఆన్‌లైన్ కోటాను, మధ్యాహ్నం మూడు గంటలకు వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్న వారికి ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను టీటీడీ విడుదల చేయనుంది. 24న ఉదయం 10 గంటలకు ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను, మధ్యాహ్నం మూడు గంటలకు తిరుమల, తిరుపతిలో అద్దె గదుల కోటాను విడుదల చేస్తారు. 27న ఉదయం 11 గంటలకు శ్రీవారి సేవ కోటాను, మధ్యాహ్నం 12 గంటలకు నవనీత సేవ, మధ్యాహ్నం ఒంటి గంటకు పరకామణి సేవ కోటాను విడుదల చేయనున్నారు. భక్తులు https:// ttdevasthanams.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా శ్రీవారి ఆర్జిత సేవలు, దర్శన టికెట్లు బుక్ చేసుకోవచ్చునని టీటీడీ పేర్కొంది.

నేడు అప్పన్న చందనోత్సవం

- తెల్లవారుజాము నాలుగు నుంచి సర్వదర్శనం ప్రారంభం
- లక్ష మంది భక్తులు వస్తారని అంచనా


అప్పన్న నిజరూపం

సింహాచలం: వైశాఖ శుద్ధ తదియని పురస్కరించుకుని సింహగిరిపై కొలువై ఉన్న శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి చందనోత్సవం(స్వామి వారి నిజరూప దర్శనం) శుక్రవారం జరగనుంది. తెల్లవారు జామున నాలుగు గంటల నుంచి సర్వదర్శనం ప్రారంభం కానుంది. ఈ సారి లక్ష మంది భక్తులు వస్తారని అంచనా వేశారు. పాంచరాత్ర ఆగమశాస్త్రాన్ని అనుసరించి తెల్లవారుజామున ఒంటి గంట నుంచి దేవస్థానం అర్చకులు వైదిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. స్వామి వారిపై ఉన్న చందనాన్ని వలిచి నిజరూపభరితుణ్ణి చేస్తారు. అనంతరం ఉదయం నాలుగు గంటల నుంచి భక్తులకు దర్శనాలు కల్పిస్తారు. రాత్రి తొమ్మిది గంటల సమయంలో సహస్ర ఘటాభిషేకం నిర్వహిస్తారు. అనంతరం స్వామి వారికి తొలి విడతగా మూడు మణుగుల చందనం(120 కిలోలు) సమర్పిస్తారు. చందనోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టర్ ఎ.మల్లికార్జున ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

విద్యుత్ శాఖకు సీఎం అభినందన

సాక్షి, హైదరాబాద్: ఇటీవల రాష్ట్రంలో గాలివాన బీభత్సంతో చాలా ప్రాంతాల్లో దెబ్బతిన్న విద్యుత్ సరఫరా వ్యవస్థను 8 గంటల్లోగా పునరుద్ధరించిన విద్యుత్ శాఖను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అభినందించారు. ఎన్నికల ప్రచారంలో ఉన్న ఆయన విద్యుత్ సరఫరా పరిస్థితిపై ఎప్పటికప్పుడు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ నెలలో కురిసిన వర్షాలతో 2216 ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిచిపోగా, 8 గంటల్లోగా మరమ్మతులు పూర్తి చేసినట్టు అధికార వర్గాలు వెల్లడించాయి.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీకి ముగిసిన నామినేషన్లు

మొత్తం 69 మంది నామినేషన్లు దాఖలు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : నల్లగొండ - ఖమ్మం - వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు మొత్తం 69 మంది నామినేషన్లు దాఖలు చేయగా, 117 సెట్లు దాఖలయ్యాయి. చివరి రోజైన గురువారం ఒక్కరోజే 40 మంది నామినేషన్లు దాఖలు చేశారు. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీతోపాటు గుర్తింపు పొందిన పార్టీలు, రిజిస్టర్డ్ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఈ నెల 13వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంది. ఆ తరువాత పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితా ప్రకటించడంతో పాటు గుర్తులు కేటాయించనున్నారు. ఈ నెల 27వ తేదీన పోలింగ్, జూన్ 5న కౌంటింగ్ జరగనుంది.

యాప్‌ల్లో ఎన్నికల పందేలు



ఆన్‌లైన్‌లో కాయ్ రాజా కాయ్

- చట్టవిరుద్ధంగా ఆ యాప్‌లు హల్‌చల్
- పార్టీలు, రాష్ట్రం, అభ్యర్థుల వారీగా అక్రమ బెట్టింగ్‌లు
- రూ.100 నుంచి రూ.10 లక్షల వరకూ పందేలు
- డిజిటల్ లావాదేవీల కోసం మ్యూల్ బ్యాంక్ అకౌంట్లు
- ఆయా యాప్‌ల నిర్వహణ మొత్తం విదేశాల నుంచే
- యాప్‌లు డౌన్‌లోడ్ చేస్తే మాల్‌వేర్‌తో ఫోన్ హ్యాక్

సాక్షి, హైదరాబాద్: బంతి బంతికీ.. మ్యాచ్ మ్యాచ్‌కూ ఎలాగైతే క్రికెట్ బెట్టింగ్‌లు జరుగుతున్నాయో.. అచ్చం అదే తరహాలో దేశంలో జరుగుతున్న ఎన్నికలపై కూడా పందేలు కాస్తున్నారు. క్రికెట్, ఫుట్‌బాల్, రగ్బీ, సాకర్, బాక్సింగ్, హార్స్ రైడింగ్ వంటి అన్ని రకాల క్రీడలపై బెట్టింగ్‌లు నిర్వహిస్తున్న పలు ఆఫ్ షోర్ బెట్టింగ్ యాప్‌లు, వెబ్‌సైట్లు ఎన్నికల ఫలితాలపై కూడా బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నాయి. పార్టీల వారీగా వచ్చే ఫలితాలు, నియోజకవర్గం, అభ్యర్థుల విజయాలు, మెజారిటీ వారీగా పందేలు కడుతున్నాయి.

గత ఎన్నికల్లోనే మొదలు..

2019 సార్వత్రిక ఎన్నికల్లోనూ ఈ తరహా బెట్టింగ్‌లు జరిగినా అది తక్కువ స్థాయిలోనే జరిగాయి. కానీ, ఈసారి ఎన్నికలు అన్ని ప్రాంతీయ, జాతీయ పార్టీలకు ప్రతిష్టాత్మకం కావడంతో పందేలపై ఆసక్తి పెరిగింది. దీంతో బెట్టింగ్, గ్యాంబ్లింగ్ సంస్థలు వీటిపై దృష్టిసారించాయి. ఫెయిర్ ప్లే, జన్నత్‌బుక్, ఓం 247, జైబుక్, సాట్‌స్పోర్ట్, బకార్డీ వంటి సుమారు డజన్ యాప్‌లు, వెబ్‌సైట్లు ప్రత్యేకంగా ఎన్నికల్లో బెట్టింగ్‌లను నిర్వహిస్తున్నాయి.

రూ.100 నుంచి రూ.10 లక్షల వరకూ పందెం..

రూ.100 నుంచి రూ.10 లక్షల వరకు పందెం వేయవచ్చు. టెలిగ్రాం, వాట్సాప్ వంటి ఇన్‌స్టంట్ మెసేజ్ యాప్‌ల ద్వారా ఈ బెట్టింగ్‌లు ఎక్కువగా జరుగుతుంటాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు వంటి దక్షిణాదితో పాటు ఉత్తరాదిలోని పలు కీలకమైన రాష్ట్రాల్లో ఏ పార్టీ ఎన్ని సీట్లు గెలుస్తుందో ఫ్యాన్సీ పందేలుగా పేర్కొంటూ బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నాయి. ప్రధాన జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్‌లు ఒంటరిగా ఎన్ని సీట్లు సాధిస్తాయి? రాష్ట్రాల వారీగా ఆయా పార్టీలు కూటమితో కలిసి ఎన్ని సీట్లు గెలుస్తాయి? .. ఇలా విభాగాల వారీగా పందేలు నిర్వహిస్తున్నాయి.

మ్యూల్ ఖాతాల్లోనే లావాదేవీలు

బెట్టింగ్ యాప్‌లు ఇండియా వెలుపలి నుంచి నిర్వహిస్తుంటాయని ఓ పోలీసు ఉన్నతాధికారి తెలిపారు. యాప్‌లను నిర్వహణ చేసే కంపెనీలు సిండికేట్‌గా మారి ఈ ఎన్నికల పందేలను నిర్వహిస్తుంటాయని, యూపీఐ చెల్లింపులు, బ్యాంక్ లావాదేవీల కోసం మ్యూల్ బ్యాంక్ అకౌంట్లనే వినియోగిస్తుంటాయని తెలిపారు. పందెం డబ్బు మొత్తం ఆయా అకౌంట్ల నుంచి క్రిప్టో వ్యాలెట్ల ద్వారా ఎలాంటి పన్ను చెల్లింపులు లేకుండా దేశం దాటిస్తుందని పేర్కొన్నారు.

ఇదంతా చట్ట విరుద్ధం

తెలంగాణ, ఏపీతో సహా దేశంలోని చాలా రాష్ట్రాల్లో బెట్టింగ్, జూదం చట్టవిరుద్ధం. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం-2000, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రూల్స్-2021 ప్రకారం ఆన్‌లైన్‌లో బెట్టింగ్ అనేది జూదంగా పరిగణిస్తారు. యాప్‌లను డౌన్‌లోడ్ చేసేందుకు వీలుగా ఏపీకే ఫైల్స్‌ను అందుబాటులో ఉంచుతారు. డౌన్‌లోడ్ చేసుకునే క్రమంలో ఫోన్ కాంటాక్ట్‌లు, ఇతరత్రా పర్మిషన్స్‌ను అనుమతించాలని కోరతారు. పొరపాటున యాక్సెస్ చేయగానే హానికర సాఫ్ట్‌వేర్‌లు మొబైల్‌లో డౌన్‌లోడ్ అయిపోతాయి. దీంతో మన ఫోన్ హ్యాక్ అయిపోతుంది. సైబర్ నేరాల బారిన పడే ప్రమాదం ఉందని సైబర్ నిపుణులు హెచ్చరిస్తున్నారు.


కరీంనగర్‌లో రోడ్ షోకు హాజరైన ప్రజలు

వికసిత్ భారత్ కాదు.. విఫల భారత్

గత పదేళ్లలో మోదీ దేశానికి చేసిందేమీ లేదు
కరీంనగర్ రోడ్ షో, కార్నర్ మీటింగ్‌లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

- బీజేపీ ఎంపీలు విద్వేషాలు నింపడమే తప్ప రాష్ట్రానికి ఏమీ తేలేదు
- కాంగ్రెస్‌వి 420 హామీలు.. నాలుగైదు నెలల్లో తెలంగాణ ఆగమైంది
- కరెంటుకు ఏమైంది? నీళ్లెందుకు రావడం లేదని ప్రశ్న

సాక్షి ప్రతినిధి, కరీంనగర్

''పదేళ్ల పాలనలో ప్రధాని మోదీ చేసిన ఏ వాగ్దానం కూడా నెర్వలేదు. సబ్‌కా సాథ్ సబ్‌కా వికాస్ అన్న మోదీ.. దేశ్ కా సత్యనాశ్ చేసిండు. వికసిత భారత్ అంటూ దేశాన్ని విఫల భారత్‌గా చేసిండు..'' అని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ మండిపడ్డారు. నోటికొచ్చిన హామీలిచ్చి రాష్ట్రంలో గద్దెనెక్కిన కాంగ్రెస్.. వాటిని అమలు చేయలేక నాలుగైదు నెలల్లోనే తెలంగాణను ఆగమాగం చేసిందని విమర్శించారు. కేసీఆర్ గురువారం కరీంనగర్‌లో రోడ్ షో నిర్వహించి.. తెలంగాణ చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

''పదేళ్ల కింద మోదీ ప్రధాని అయినపుడు 150 హామీలిచ్చి ఒక్కటైనా నెరవేర్చలేదు. అచ్చేదిన్ అన్నారు.. సచ్చేదిన్ వచ్చింది. అంతా గ్యాస్.. ట్రాష్..! మాట్లాడితే పాకిస్తాన్, పుల్వామా అంటారు. పాకిస్తాన్ చిన్న దేశం. వాడిని చూపించి డ్రామా ఎమోషనల్ బ్లాక్‌మెయిల్ చేస్తున్నారు. దేశం నుంచి ఎగుమతులు నిలిచినయ్. విదేశీ మారకాలు తగ్గినయ్.. కొలువుల భర్తీలేదు. కార్పొరేట్లకు రూ.15 లక్షల కోట్లు రుణమాఫీ చేశారే తప్ప పేదలకు రుపాయి ఇవ్వలేదు. తెలంగాణలో ఒక్క ప్రాజెక్టుకైనా జాతీయ హోదా ఇవ్వలేదు. ఒక్క మెడికల్ కాలేజీ ఇవ్వలేదు.


గురువారం రాత్రి కరీంనగర్ రోడ్ షోలో మాట్లాడుతున్న కేసీఆర్. చిత్రంలో రసమయి బాలకిషన్, గంగుల కమలాకర్, కౌశిక్‌రెడ్డి, వినోద్‌కుమార్ తదితరులు

బీజేపీ ఎంపీలను గెలిపిస్తే ఏం చేశారు?

పోయినసారి మంచికో చెడుకో రాష్ట్రంలో నలుగురు బీజేపీ ఎంపీలు గెలిచారు. వారు నాలుగు రూపాయల పనైనా చేశారా. మత విద్వేషాలు పెంచడం తప్ప ఏమీ చేయలేదు. అసలు ఇక్కడి ఎంపీ బండి సంజయ్‌కు సరిగా మాట్లాడటం వస్తదా? అతన్ని పార్లమెంటుకు పంపుదామా? విద్యావంతుడైన వినోద్‌కుమార్‌ను పంపుదామా? ఆలోచించాలి.

మహిళలకు రూ.2,500 సాయం ఏది?

అసెంబ్లీ ఎన్నికల్లో అరచేతిలో వైకుంఠం చూపించి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. మహిళలకు రూ.2,500 ఇస్తామన్నరు, కల్యాణలక్ష్మి కింద తులం బంగారం ఇస్తామన్నరు. ఏవి? రుణమాఫీ, పింఛన్ల పెంపు ఏవి? మహిళలకు ఫ్రీ అని చెప్పి బస్సులు సరిగా వేయకపోతే.. మహిళలు జుట్లు పట్టుకుని కొట్టుకోవాల్సి వస్తోంది. 9 ఏళ్లపాటు రెప్పపాటు పోని కరెంటు ఇప్పుడు ఎక్కడికి పోయింది? మిషన్ భగీరథ నీళ్లు ఏవి? మహిళలు మళ్లీ బిందెలు పట్టుకుని నీళ్ల కోసం పోవడం చూసి నా కళ్లలోకి నీళ్లు వస్తున్నాయి. నాలుగైదు నెలల్లోనే తెలంగాణ ఎందుకింత ఆగమైంది? ముస్లింలంతా కాంగ్రెస్‌కు ఓటేస్తే.. బీజేపీ గెలుస్తుంది. బీజేపీకో హటానా చాహియే.. ఆ పని బీఆర్ఎస్‌తోనే సాధ్యం'' అని కేసీఆర్ పేర్కొన్నారు.

ఇంజనీరింగ్ సెట్‌కు భారీ హాజరు

94% పరీక్ష రాసిన విద్యార్థులు
మేథ్స్ పేపర్ సుదీర్ఘం... ఫిజిక్స్ మధ్యస్థం
పలు కేంద్రాల్లో ఆగిన కంప్యూటర్లు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ఇంజనీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్ కాలేజీల్లో ప్రవేశానికి నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్ష మూడో రోజు ప్రశాంతంగా ముగిసింది. గడచిన రెండు రోజులు అగ్రికల్చర్, ఫార్మసీ విభాగానికి సంబంధించిన సెట్ జరిగితే, గురువారం ఇంజనీరింగ్ సెట్ తొలి రోజు జరిగింది. ఈ విభాగానికి 2,54,539 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 1,01,956 మంది తొలి రోజు కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ రాయాల్సి ఉండగా 96,228 (94.4 శాతం) మంది పరీక్షకు హాజరైనట్టు ఈఏపీసెట్ కన్వీనర్ డీన్‌కుమార్ తెలిపారు. సూర్యాపేట జిల్లా కోదాడ కేంద్రంలో అత్యధికంగా 99 శాతం హాజరు కన్పించింది. ఏపీలోని తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, కర్నూల్ జిల్లాల్లో ఇంజనీరింగ్ సెట్ కేంద్రాలకు 90 శాతం పైనే విద్యార్థులు హాజరయ్యారు. అకాల వర్షం కారణంగా ఎదురైన సమస్యలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక ఏర్పాట్లు చేశామని సెట్ కో-కన్వీనర్ విజయ్‌కుమార్ రెడ్డి తెలిపారు. అన్ని చోట్లా జనరేటర్లు అందుబాటులో ఉంచామన్నారు. ఎక్కడా విద్యార్థులకు ఎలాంటి సమస్య తలెత్తలేదని తెలిపారు. అయితే, హైదరాబాద్‌లోని పలు కేంద్రాల్లో కంప్యూటర్లలో సాంకేతిక సమస్యలు తలెత్తాయి. కొద్దిసేపు కంప్యూటర్లు తెరుచుకోలేదు. సమస్య పరిష్కరించేసరికి 15 నిమిషాలు పట్టిందని కూకట్‌పల్లి విద్యార్థిని మనోజ్ఞ తెలిపారు. మరో రెండు రోజులు ఇంజనీరింగ్ సెట్ జరగాల్సి ఉంది.



పేపర్ మధ్యస్తం

తొలి రోజు ఇంజనీరింగ్ సెట్ పేపర్ మధ్యస్తంగా ఉన్నట్టు విద్యార్థులు, అధ్యాపకులు తెలిపారు. మేథమెటిక్స్‌లో ఇచ్చిన ప్రశ్నలు తెలిసినవే అయినప్పటికీ, సమాధానాలు రాబట్టేందుకు సుదీర్ఘంగా ప్రయత్నించాల్సి వచ్చినట్టు వరంగల్ విద్యార్థి అభిలాష్ తెలిపారు. సమాధానాల కోసం ఎక్కువ సేపు ప్రయత్నించాల్సి వచ్చినట్టు, దీనివల్ల ఇతర ప్రశ్నలు రాయలేక పోయామని ఖమ్మం విద్యార్థిని అలేఖ్య తెలిపారు. అయితే, సాధారణ విద్యార్థి 35 నుంచి 40 ప్రశ్నలకు సమాధానం తేలికగా చేసే వీలుందని మేథ్స్ సీనియర్ అధ్యాపకుడు ఎంఎన్‌రావు తెలిపారు. ఎక్కువ ప్రశ్నలు ఆల్‌జీబ్రా, ట్రిగ్నామెట్రీ, స్ట్రైట్‌లైన్స్, పెయిర్స్ ఆఫ్ లైన్స్, త్రీడీ చాప్టర్ల నుంచి వచ్చినట్టు ఆయన విశ్లేషించారు. రసాయనశాస్త్రంలో 25 ప్రశ్నలు తేలికగా, నేరుగా ఉన్నట్టు నిపుణులు తెలిపారు. ఆర్గానిక్ కెమెస్ట్రీ, ఆటమిక్ స్ట్రక్చర్, కెమికల్ బాండింగ్, పీరియాడిక్ టేబుల్, ఎస్.పీ.డీ బ్లాక్ ఎలిమెంట్స్ చాప్టర్స్ నుంచి వచ్చిన ప్రశ్నలు తేలికగా ఉన్నట్టు విశ్లేషించారు. ఫిజిక్స్ పేపర్ మధ్యస్థంగా ఉందని, 20 ప్రశ్నలు తేలికగా చేసే వీలుందని అధ్యాపకులు తెలిపారు. ఫార్ములా, కాన్సెప్ట్ విధానం నుంచి ప్రశ్నలు ఇచ్చారు. మెకానిక్స్, ఎస్‌హెచ్‌ఎం, విక్టరీస్, కరెంట్ ఎలక్ట్రిసిటీ, వేవ్స్, ఆప్టిక్స్ చాప్టర్ల నుంచి తేలికగా సమాధానం ఇవ్వగల ప్రశ్నలు వచ్చినట్టు చెప్పారు.

కూరెళ్ల విఠలాచార్యకు పద్మశ్రీ ప్రదానం చేస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము




'పద్మశ్రీ'ల ప్రదానం

కూరెళ్ల, వేలు ఆనందచారి, దాలిపర్తి ఉమామహేశ్వరికి..

అవార్డులు ప్రదానం చేసిన రాష్ట్రపతి

సాక్షి, న్యూఢిల్లీ: సాహిత్యం-శిక్ష రంగంలో 2024 సంవత్సరానికి తెలంగాణలోని యాదాద్రి భువనగిరి జిల్లా వెల్లంకి గ్రామానికి చెందిన ప్రముఖ కవి కూరెళ్ల విఠలాచార్య పద్మశ్రీ పురస్కారాన్ని అందుకున్నారు. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా కూరెళ్లను అభినందించారు. అలాగే, ఆలయ నిర్మాణ కళలో శిక్షణ పొందిన వేలు ఆనందచారి, సంస్కృత భాగవతాచారిణి దాలిపర్తి ఉమామహేశ్వరి కూడా పద్మశ్రీ అవార్డులు అందుకున్నారు.



గురువారం ఢిల్లీలో పద్మశ్రీ పురస్కారాలు అందుకుంటున్న దాలిపర్తి ఉమామహేశ్వరి, వేలు ఆనందచారి



గంటలో 1,123 చెట్ల ఆలింగనం!

వినూత్నంగా గిన్నిస్‌కెక్కిన ఆఫ్రికా యువకుడు

ఆఫ్రికాలోని ఘనా దేశానికి చెందిన ఓ 29 ఏళ్ల యువకుడు ప్రకృతి పరిరక్షణ అవసరాన్ని వినూత్న రీతిలో చాటిచెబుతూ గిన్నిస్‌కెక్కాడు. కేవలం గంట వ్యవధిలో ఏకంగా 1,123 చెట్లను ఆలింగనం చేసుకోవడం ద్వారా అబుబాకర్ తాహిరు సరికొత్త రికార్డు సృష్టించాడు. ఇటీవలి రంజాన్ పండుగ సందర్భంగా అలబామాలోని టస్కీగీ నేషనల్ ఫారెస్ట్‌లో అతను ఈ ఘనత సాధించాడు. ఇందుకు సంబంధించిన వీడియోను గిన్నిస్ బుక్ తన ఇన్‌స్టాగామ్ పేజీలో షేర్ చేసింది. ఈ రికార్డు సాధించేందుకు అబుబాకర్ సగటున ప్రతి 3 సెకన్లకు ఒక చెట్టును ఆలింగనం చేసుకున్నాడు. అయితే ఇది అంత ఆషామాషీగా ఏమీ జరగలేదు. ఒక చెట్టును ఒకసారి మాత్రమే ఆలింగనం చేసుకోవాలన్న గిన్నిస్ నిర్వాహకుల షరతుతో అతను అడవిలో ఉరుకులు పరుగులు పెట్టాడు. ఈ వీడియోకు ఇన్‌స్టాగామ్‌లో సుమారు 10 లక్షల వ్యూస్ లభించగా 28 వేలకుపైగా లైక్‌లు వచ్చాయి. ఉన్నత చదువుల కోసం 2023లో అమెరికాలోని అలబామాకు వచ్చి స్థిరపడిన అబుబాకర్ ప్రస్తుతం ఆబర్న్ యూనివర్సిటీలో అటవీ కోర్సులో మాస్టర్స్ చేస్తున్నాడు.

ఫ్రెండ్‌షిప్ మ్యారేజ్!



అరేంజ్డ్ మ్యారేజ్.. లవ్ మ్యారేజ్.. వైవాహిక జీవితంలోకి దంపతులు అడుగుపెట్టాలంటే ఇప్పటివరకు ఉన్న పద్ధతులు ఇవే. కానీ వీటికితోడు కొత్తగా ఓ హైబ్రీడ్ పెళ్లి బంధం తెరపైకి వచ్చింది! అదే ఫ్రెండ్‌షిప్ మ్యారేజ్!! జపాన్ యువతలో ఈ రిలేషన్‌షిప్ ఇప్పుడు ట్రెండింగ్‌లో ఉందట!! పరస్పర ప్రేమ భావాలు లేదా జీవితాంతం కలిసి జీవించాల్సిన అవసరం లేకపోవడమే ఈ మ్యారేజ్ ప్రత్యేకత. దీంతో చాలా మంది జపనీయులు ఈ బంధంలోకి అడుగుపెడుతున్నారు. వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది కూడా. ఫ్రెండ్‌షిప్ మ్యారేజ్‌లు చేయడంలో ప్రత్యేకత సంతరించుకున్న కొలొరస్ అనే ఏజెన్సీ ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించింది. ఆ సంస్థ లెక్కల ప్రకారం 2015 నుంచి 500 మంది ఫ్రెండ్‌షిప్ మ్యారేజ్ చేసుకున్నారు. ఈ జాబితాలో అలైంగికులు, స్వలింగ సంపర్కులు, బహులింగ సంపర్కులు కూడా ఉన్నారు.

జస్ట్ మ్యారేజ్.. నో లవ్.

మామూలు పెళ్లి బంధంలోలాగా ఫ్రెండ్‌షిప్ మ్యారేజ్‌లో శృంగార, ప్రేమ భావాలకు చోటు ఉండదు. ఈ బంధంలోకి ప్రవేశించే జంటలు కేవలం చట్టబద్ధంగానే ఒక్కటవుతాయి. పిల్లలను కనాలనుకుంటే కృత్రిమ గర్భధారణ పద్ధతులను ఫాలో అవుతాయి. అలాగే ఈ రిలేషన్‌షిప్‌లో ఉంటూనే ఒకరికన్నా ఎక్కువ మంది పార్ట్‌నర్‌లను కొనసాగించే వెసులుబాటు కూడా ఇందులో ఉందట! అయితే ఈ విషయాన్ని అగ్రిమెంట్ సమయంలోనే తెలియాల్సి ఉంటుందట. ఎంత కాలం కలిసి ఉండాలి.. అగ్రిమెంట్‌లో ఎలాంటి షరతులు పెట్టాలనే విషయంపై పరస్పర అంగీకారానికి వచ్చేందుకు ఆయా జంటలు కొన్ని గంటలు లేదా రోజుల తరబడి కూడా చర్చిస్తుంటాయని కొలొరస్ సంస్థ తెలిపింది. భోజనాలు, ఖర్చులు, లాండ్రీ సహా పెళ్లి తంతుకు సంబంధించిన అనేక రకాల అంశాలపై ముందుగానే అవగాహనకు వస్తాయని చెప్పింది. మూడేళ్లుగా ఫ్రెండ్‌షిప్ మ్యారేజ్ బంధంలో ఉన్న కొందరు దీని గురించి తమ అభిప్రాయాన్ని పంచుకున్నారు. 'ఫ్రెండ్‌షిప్ మ్యారేజ్ అనేది ఒకే రకమైన అభిరుచులు ఉన్న రూంమేట్‌ను ఎంపిక చేసుకోవడం లాంటిది' అని పేర్కొన్నారు. సంప్రదాయ పెళ్లి బంధాన్ని ఇష్టపడని ఓ యువతి ఈ రిలేషన్‌లోకి వెళ్లడానికి గల కారణాన్ని తెలియజేసింది. 'వేరొకరి గర్ల్‌ఫ్రెండ్‌గా ఉండేందుకు నేను తగను. కానీ నేను ఒక మంచి స్నేహితురాలిగా ఉండగలను. నా తరహా అభిరుచులు ఉన్న వ్యక్తితో సరదాగా మాట్లాడటం లాంటి పరస్పర ఇష్టమైన పనులను ఆస్వాదించగలను' అని చెప్పింది.

– సాక్షి సెంట్రల్ డెస్క్

యాభై ఏళ్ల కాంగ్రెస్ పాలనలో దేశం వెనుకబాటు

మధ్యప్రదేశ్ బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జి మురళీధర్‌రావు



మంచిర్యాల టౌన్: యాభై ఏళ్ల కాంగ్రెస్ పాలనలో దేశం వెనుకబడిందని బీజేపీ మధ్యప్రదేశ్ రాష్ట్ర ఇన్‌చార్జి మురళీధర్ రావు విమర్శించారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో గురువారం సాయంత్రం బీజేపీ ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. అనంతరం శ్రీనివాస థియేటర్ వద్ద పార్టీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్నర్ సమావేశంలో పెద్దపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి గోమాసే శ్రీనివాస్‌తో కలిసి ఆయన మాట్లాడారు. పదేళ్ల మోదీ పాలనలోనే దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని, ఉగ్రదాడులను అరికట్టారని మురళీధర్‌రావు ప్రశంసించారు.

వడదెబ్బతో ఇద్దరు కూలీల మృతి

ముత్తారం, తానూరు: ఎండదెబ్బకు తాళలేక గురువారం ఇద్దరు ఉపాధి హామీ కూలీలు ప్రాణాలు వదిలారు. పెద్దపల్లి జిల్లా ఓడెడ్‌కు చెందిన సార్ల లింగయ్య(62), నిర్మల్ జిల్లా తానూర్ మండలం భోసి గ్రామానికి చెందిన డి.విఠల్(60) మృతి చెందారు.

15 సెకన్లు కాదు.. 15 గంటలు ఇవ్వండి..

▶ మొదటి పేజీ తరువాయి

అసద్ వద్ద.. నవనీత్ కౌర్ వ్యాఖ్యలను మీడియా ప్రస్తావించింది. ఈ నేపథ్యంలో ఆయన తీవ్రంగా స్పందించారు.

దమ్ముంటే చేసి చూపించండి

'నరేంద్ర మోదీజీ 15 సెకన్లు కాదు.. గంట.. 15 గంటలు సమయం ఇవ్వండి.. అధికారం మీ చేతిలో ఉంది...ముస్లింలను ఏం చేస్తారో చేయండి.. మీలో మానవత్వం మిగిలి ఉందా? లేదా? అని మేము కూడా చూడాలని అనుకుంటున్నాం..అంతా మీదే.. అధికారం మీదే అయినప్పుడు ఎవరు ఆపుతున్నారు? మేం భయపడేది లేదు.. ఎక్కడికి రమ్మంటే అక్కడికి వస్తాం... దుమ్ముంటే చేసి చూపించాలి..' అంటూ అసదుద్దీన్ సవాల్ చేశారు.

హైదరాబాద్ ప్రజలు పశువులు కాదు

కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు హైదరాబాద్‌ను ఎంఐఎంకు లీజుకు ఇచ్చాయంటూ మోదీ చేసిన వ్యాఖ్యలపై కూడా అసదుద్దీన్ స్పందించారు. హైదరాబాద్ ప్రజలు పశువులు కాదని, వారు పౌరులని, రాజకీయ పార్టీల ఆస్తులు కాదని వ్యాఖ్యానించారు. నలభై ఏళ్లుగా హైదరాబాద్ హిందుత్వ దుష్ట భావజాలాన్ని ఓడిస్తూ ఎంఐఎంకు అప్పగిస్తోందన్నారు. హిందుత్వం మళ్లీ ఓడిపోతుందని చెప్పారు. ముస్లింలను ద్వేషించడమే ఆర్‌ఎస్‌ఎస్ ఆలోచన విధానమని, అందుకే మరోమారు బీజేపీ అధికారంలోకి రాకుండా అడ్డుకోవాలని పిలుపునిచ్చారు.



(నాగోజు సత్యనారాయణ)

'డబ్బులు ఎవరికీ ఊరికే రావు'.. ఓ వాణిజ్య ప్రకటనలో వినబడే మాటిది. ఈ చిన్న లాజిక్‌ను మర్చిపోతున్నారు కొందరు. కూర్చున్న చోటు నుంచి కదలకుండా పెద్ద మొత్తంలో డబ్బులు సంపాదించాలన్న అత్యాశకు పోతున్నారు. చివరకు తమ కష్టార్జితాన్ని కోల్పోతున్నారు. వీరిలో ఎక్కువ మంది చదువుకున్న వాళ్లే ఉంటుండటం గమనార్హం. సైబర్ మోసాలకు గురయ్యే వారిలో విద్యాధికులే ఎక్కువగా ఉంటున్నట్టు తెలంగాణ స్టేట్ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీఎస్‌సీఎస్‌బీ) విశ్లేషణలో వెల్లడైంది.
ఈ బ్యూరోను ఏర్పాటు చేసిన తర్వాత 2023 మే 1 నుంచి ఈ నెల 3 వరకు 1930 టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా, సైబర్ క్రైం రిపోర్టింగ్ పోర్టల్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 1,02,767 ఫిర్యాదులందాయి. మొత్తం బాధితుల్లో అండర్ గ్రాడ్యుయేషన్ నుంచి పీహెచ్‌డీ వరకు చేసిన వారు 56,437 మంది ఉండటం గమనార్హం. కాగా వీరంతా కేవలం 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేసినవారేనని..సైబర్ క్రైం రిపోర్టింగ్ పోర్టల్ ద్వారా నేరుగా ఫిర్యాదు చేస్తున్న వారు తమ విద్యార్హత, వృత్తిగత అంశాలను తెలియజేయడం లేదని, పోర్టల్‌లో ఫిర్యాదు చేసిన విద్యాధికులను కూడా పరిగణనలోకి తీసుకుంటే ఈ సంఖ్య మరింత పెరుగుతుందని అధికారులు తెలిపారు. ఇక సైబర్ మోసానికి గురైన వారిలో పూర్తిగా నిరక్షరాస్యులు కేవలం 837 మంది మాత్రమే ఉండడం విశేషం.

'సైబర్' ఉచ్చులో సదువుకున్నోళ్లు

మోసపోయిన వారిలో సగానికి పైగా విద్యాధికులే	1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేసిన 56,437 మంది బాధితులు	వీరిలో ఎక్కువమంది ప్రైవేటు ఉద్యోగులే..	నేరగాళ్ల బారిన పడిన వారిలో నిరక్షరాస్యులు కేవలం 837 మందే	ఒక్క ఏడాదిలో మొత్తం 1,02,767 ఫిర్యాదులు నమోదు	రూ.1148.40 కోట్లు కొట్టేశారంటున్న టీఎస్‌సీఎస్‌బీ గణాంకాలు

సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోనే ఎక్కువ

గతేడాది మే 1 నుంచి ఈ ఏడాది 3 వరకు అందిన ఫిర్యాదుల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా నేరగాళ్లు రూ.1148,40,87,056 కొల్లగొట్టినట్టు టీఎస్‌సీఎస్‌బీ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఇందులో ఒక్క సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోనే రూ.463,74,36,313 కొట్టేశారు. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో, రూ.279,96,41,030 కాజేయగా, రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో రూ.191,65,83,128 బాధితులు పోగొట్టుకున్నట్టు అధికారులు తెలిపారు. సైబర్ నేరగాళ్ల చేతికి వెళ్లిన డబ్బులో రూ.161,65,99,989 నగదును సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు బ్యాంకు ఖాతాల్లో స్తంభింపజేశారు. ఫిర్యాదు అందిన వెంటనే సకాలంలో చర్యలు తీసుకుని ఈ మొత్తం సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కకుండా ఆపారు. అదేవిధంగా సైబర్ నేరగాళ్లు కొల్లగొట్టిన సొమ్ములో ఇప్పటివరకు రూ.15,42,13,357 నగదును బాధితులకు తిరిగి ఇప్పించగలిగారు.

1930 టోల్ ఫ్రీ నంబర్‌కు రోజుకు 250 కాల్స్

టీఎస్‌సీఎస్‌బీ ఆధ్వర్యంలో పనిచేస్తున్న 1930 టోల్‌ఫ్రీ నంబర్ కాల్ సెంటర్‌లో ప్రస్తుతం 35 మంది టెలీకాలర్స్ పనిచేస్తున్నారు. 24 గంటల పాటు సేవలు అందుబాటులో ఉండే ఈ కాల్ సెంటర్‌కు సైబర్ నేరాలకు సంబంధించి రోజుకు సగటున 250 వరకు కాల్స్ వస్తున్నట్టు అధికారులు తెలిపారు. ఒకవేళ టెలీకాలర్స్ బిజీగా ఉంటే బాధితులకు తక్షణ సాయం అందేలా ఎస్‌ఎంఎస్ అలర్ట్‌లను పంపుతున్నారు. అందులో ఉండే సైబర్ క్రైం పోర్టల్ లింక్ ద్వారా బాధితులే నేరుగా ఫిర్యాదు చేయవచ్చు. టెలీకాలర్స్ సంఖ్యను మరింత పెంచే యోచనలో ఉన్నట్టు, అదేవిధంగా భవిష్యత్తులో మరింత ఆధునిక టెక్నాలజీని వాడాలని కూడా భావిస్తున్నట్లు ఉన్నతాధికారులు తెలిపారు.

1930 కాల్ సెంటర్‌కు ఫిర్యాదు చేసిన బాధితులు విద్యార్హతల వారీగా..

విద్యార్హత	బాధితుల సంఖ్య
పీహెచ్‌డీ	208
పోస్ట్ గ్రాడ్యుయేట్లు	7750
గ్రాడ్యుయేట్లు	38,361
అండర్ గ్రాడ్యుయేట్లు	10118
పదో తరగతి వారు	6828
పదో తరగతి లోపు వారు	2347
నిరక్ష్యరాస్యులు	837

అవగాహన, అప్రమత్తత అవసరం



సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా ఉండాలంటే ప్రధానంగా ఈ తరహా నేరాలపై అవగాహన కలిగి ఉండాలి. కొద్దిపాటి అప్రమత్తతతో వీటి నుంచి తప్పించుకోవచ్చు. ఏదైనా కారణంతో సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయినట్టు గుర్తిస్తే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలి. సత్వర ఫిర్యాదు వల్ల బాధితుల డబ్బును కాపాడేందుకు అవకాశం ఎక్కువగా ఉంటుంది. అయితే నేరగాళ్ల చేతిలో మోసపోతున్న వారిలో ఎక్కువ మంది చదువుకున్న వారే ఉండటం విచారకరం. – శిఖాగోయల్, డైరెక్టర్, టీఎస్ సైబర్ సెక్యూరిటీ బ్యూరో

1930 కాల్ సెంటర్‌కు అందిన ఫిర్యాదుల మేరకు సైబర్ నేరగాళ్ల వలలో పడిన వారు కేటగిరీల వారీగా..

కేటగిరీ	బాధితుల సంఖ్య
ప్రైవేటు ఉద్యోగులు	30,399
స్వయం ఉపాధి	6,960
విద్యార్థులు	6,114
వ్యాపారులు	5,864
సాఫ్ట్‌వేర్/ ఐటీ ఉద్యోగులు	5,140
గృహిణులు	4,632
ప్రభుత్వ ఉద్యోగులు	2,768
నిరుద్యోగులు	1,679
రైతులు	1,654
వృద్ధులు	1,239

ఫిర్యాదులు అందుతున్న టాప్ 5 ప్రాంతాలు

పోలీస్ కమిషనరేట్/ జిల్లా పేరు	అందిన ఫిర్యాదులు
సైబరాబాద్	30,630
హైదరాబాద్ సిటీ	24,171
రాచకొండ	17,305
సంగారెడ్డి	3,586
రామగుండం	2,416

చంద్రబాబంటేే.. అవకాశవాది, అబద్ధాలకోరు, కుట్రదారు!

- ఆయన ప్రవర్తనతో దెబ్బతింటున్న తెలుగువారి జీవన విధానం
- బూటకపు మేనిఫెస్టో ప్రకటనలో ఘనుడు
- వాటిని జనం విశ్వసించడం లేదు..
- జనరంజక పాలన సాగిస్తున్న ఏపీ సీఎం జగన్
- ప్రజలు మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారు..
- దళిత ఉద్యమకారుడు, కవి డాక్టర్ కత్తి పద్మారావు

పొన్నూరు: సీఎం వైఎస్ జగన్ ఐదేళ్ల కిందట ప్రవేశపెట్టిన మేనిఫెస్టో బడుగు, బలహీన వర్గాలకు ఆర్థికంగా తోడ్పాటునందించిందని, ఎన్నికలకు ముందు బూటకపు మేనిఫెస్టోలు ప్రకటించడంలో చంద్రబాబు ఘనత సాధించాడని దళిత ఉద్యమకారుడు, కవి డాక్టర్ కత్తి పద్మారావు అన్నారు. సీఎం జగన్ సంక్షేమ పాలన, 14 ఏళ్ల సీఎంగా చేసిన చంద్రబాబు పాలనలో ఉన్న వ్యత్యాసంపై పొన్నూరులోని ఆయన నివాసంలో 'సాక్షి'తో మాట్లాడారు. అధికార దాహంతో చంద్రబాబు కక్షపూరిత రాజకీయాలు చేస్తున్నాడని ఆరోపించారు. అంతటి కుట్రపూరితమైన వ్యక్తి దేశంలో మరొకరు ఉండడని చంద్రబాబు అవలంబిస్తున్న వైఖరే నిరూపిస్తోందన్నారు. తన రాజకీయ జీవితంలో ప్రజల కోసం ఏ పోరాటాలు చేసిన వ్యక్తి కాదు, మామ(ఎన్టీఆర్)కు వెన్నుపోటు ద్వారా టీడీపీని కైవసం చేసుకున్న దుర్మార్గుడు చంద్రబాబుని విమర్శించారు. నీచ నామవాచకాలలో(విషయుక్తమైన మనిషి, అవకాశవాది, కుతంత్రుడు, అబద్ధాలకోరు, ద్వేషం మూర్తీభవించిన రూపం)లో ఘనత సాధించిన నాయకుడు చంద్రబాబని పేర్కొన్నారు. భూదోపిడీదారులు, అక్రమార్కులపై వేయాల్సిన పిటిషన్లను, పేద ప్రజలకు అందుతున్న సంక్షేమంపై వేసిన చంద్రబాబు చరిత్రహీనుడిగా నిలిచిపోతాడని వ్యాఖ్యానించారు. సీఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమంతో వృద్ధుల్లో మరణాలు తగ్గాయని అభిప్రాయపడ్డారు. ప్రతి నెలా ఒకటో తేదీన ఇంటికి పింఛన్ అందించడం గొప్ప విషయమన్నారు. పచ్చ మీడియా, పెత్తందార్లు



కలసి ఉచిత పథకాలపై విష ప్రచారం చేసి వాటిని ఆపాలని చూశారని విమర్శించారు. 14 ఏళ్ల పాలన సాగించిన చంద్రబాబు ఏమీ చేయలేని స్థితిలో, జగన్ పథకాలనే అనుసరిస్తున్నాడనడంలో ఆశ్చర్యం లేదన్నారు. విషపూరిత వ్యాఖ్యలను చంద్రబాబు ప్రజలకు నేర్పుతాడని, ఆ విషయాన్ని ప్రజలు గ్రహించాలని సూచించారు. సచివాలయ వ్యవస్థ ద్వారా అర్హులైన పేదలను గుర్తించి మంజూరు చేసిన సంక్షేమ పథకాలను లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోనే నగదు జమ చేస్తున్న ప్రభుత్వ చర్యలతో పేదలు హర్షిస్తున్నారని తెలిపారు. వలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టడం ఏపీకి శుభపరిణామమని, ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ వైద్యశాలలను అభివృద్ధి చేయడంతో పాటు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో నాణ్యత ప్రమాణాలతో కూడిన వైద్యం ఇంటి వద్దనే అందించడంలో జగన్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించడంతో ప్రజలకు ఆరోగ్య భరోసా లభించిందన్నారు. పేదల మనుగడకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమాన్ని చంద్రబాబు ఉచితమని చెప్పడం అవివేకమని విమర్శించారు. ఎలాగైనా విజయం సాధించాలన్న లక్ష్యంతో చంద్రబాబు కూటమి రెట్టింపు ఉచితాలతో ప్రవేశపెట్టిన మేనిఫెస్టో సరైంది కాదని పేర్కొన్నారు. అధ్యయనం చేసిన మేనిఫెస్టో కాదన్నారు. బాబుకు సలహాలు ఇస్తున్న ఐదారుగురు ఆయన ఓటమి కోరుకుంటున్నారని ఆరోపించారు. జనరంజక పాలనతో ప్రజలను మెప్పించి సీఎం కుర్చీ సొంతం చేసుకోవాలిగానీ, సీఎం జగన్‌ను నెట్టేసి చంద్రబాబు ఆ కుర్చీలో కూర్చోవాలనుకోవడం కక్ష పూరిత వైఖరిని ప్రతిబింబిస్తోందని విమర్శించారు. చంద్రబాబు ప్రవర్తన కారణంగా తెలుగువారి జీవన విధానం దెబ్బతింటోందని అన్నారు. అబద్ధపు హామీలతో గెలుపు కోరుకుంటున్న చంద్రబాబును ప్రజలు విశ్వసించే పరిస్థితి లేదని స్పష్టంచేశారు. రాష్ట్రంలో జనరంజక పాలన అందిస్తున్న సీఎం జగన్ నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ప్రజలు మళ్లీ కోరుకుంటున్నారని తెలిపారు.



ఆర్.కృష్ణయ్యపై విసిరిన రాయి ఇదే



ఆర్.కృష్ణయ్య వీపుపై గాయం

చంద్రబాబు కుట్రలకు హైకోర్టు బ్రేక్

అక్కచెల్లెమ్మల ఖాతాల్లోకి డబ్బులు పడకుండా బాబు కుట్ర

రైతుల ఇన్‌పుట్ సబ్సిడీ, విద్యార్థుల విద్యాదీవెనకూ మోకాలడ్డు

- ఎన్నికల కమిషన్‌పై ఒత్తిడి తెచ్చి.. నిధులను నిలిపేసిన బాబు
- ఏపీ ప్రభుత్వం హైకోర్టును ఆశ్రయించటంతో ఊరట
- 10వ తేదీన నిధుల పంపిణీకి వెసులుబాటు ఇచ్చిన న్యాయస్థానం
- నిధులు పంపిణీ చేయొద్దన్న ఈసీ ఉత్తర్వులు 10 వరకూ నిలుపుదల
- 11 నుంచి 13 వరకు మాత్రం నిధులు పంపిణీ చేయొద్దని స్పష్టీకరణ
- నిధుల పంపిణీ అంశాన్ని ప్రచారం చేయడానికి వీల్లేదని కూడా ఆదేశం

సాక్షి, అమరావతి: సంక్షేమ పథకాల కింద రైతులు, మహిళలు, విద్యార్థులకు దక్కాల్సిన నిధులను అడ్డుకుంటూ తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు పన్నిన కుట్రలను హైకోర్టు పటాపంచలు చేసింది. కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్‌డీఏతో పొత్తు పెట్టుకుని... కేంద్ర ఎన్నికల సంఘం ద్వారా నిధుల పంపిణీని అడ్డుకునేందుకు చంద్రబాబు ముఠా కొద్దిరోజులుగా ప్రయత్నిస్తోంది. అవన్నీ ఐదేళ్లుగా కొనసాగుతున్న పథకాలని, లబ్ధిదారులు కూడా పాతవారేనని అలాంటపుడు దానికి ఎన్నికల కోడ్ అడ్డంకి కాదని ఎన్నికల కమిషన్‌కు వైఎస్సార్‌సీపీ, రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని వినతులు పంపినా... చంద్రబాబు ఒత్తిడితో ఈసీ వాటిని పట్టించుకోలేదు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టును ఆశ్రయించింది. హైకోర్టు జోక్యంతో బాబు కుట్రలు భగ్నమయ్యాయి. ఇన్‌పుట్ సబ్సిడీ, విద్యా దీవెనతో పాటు మహిళలకు ఆసరా, చేయూత, ఈబీసీ నేస్తం కింద రూ14,165 కోట్ల నిధులను లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి అనుమతిని నిరాకరిస్తూ ఎన్నికల సంఘం ఇచ్చిన ఉత్తర్వులను హైకోర్టు ఈ నెల 10వ తేదీ వరకు తాత్కాలికంగా నిలుపుదల (అబయన్స్) చేసింది. అయితే 11వ తేదీ నుంచి 13వ తేదీ వరకు మాత్రం సంక్షేమ పథకాల నిధులను పంపిణీ చేయడం గానీ, బదలాయించడం గానీ చేయరాదని ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీంతో 10వ తేదీన నిధుల పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు వెసులుబాటునిచ్చినట్లయింది. నిధుల పంపిణీకి సంబంధించి పత్రికలు, టీవీలు, రేడియో, ఇంటర్‌నెట్‌తో సహా ఏ ఇతర మాధ్యమం ద్వారా ఏ రకమైన ప్రచారం చేయడానికి వీల్లేదని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అలాగే నిధుల పంపిణీ విషయంలో ఎలాంటి ఆర్భాటాలు గానీ, సంబరాలు గానీ, రాజకీయ నాయకుల ప్రమేయం గానీ ఉండటానికి వీల్లేదని కూడా ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ విషయంలో ఎన్నికల సంఘం జారీ చేసిన ఎన్నికల ప్రవర్తనా నియమావళిని మీరడానికి వీల్లేదంది. ఈ మొత్తం వ్యవహారంలో పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఎన్నికల సంఘాన్ని, రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ... తదుపరి విచారణను జూన్ 27కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ గురువారం రాత్రి 10.20 గంటల సమయంలో మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు.

నిధుల కోసం కోర్టు తలుపుతట్టిన మహిళలు, రైతులు, విద్యార్థులు...

ఇన్‌పుట్ సబ్సిడీ, వైఎస్సార్ చేయూత, జగనన్న విద్యా దీవెన, వైఎస్సార్ ఆసరా, ఈబీసీ నేస్తం పథకాల కింద లబ్ధిదారులకు పంపిణీ చేయాల్సిన నిధులను ఎన్నికలు పూర్తయ్యే వరకు పంపిణీ చేయవద్దంటూ ఎన్నికల సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఎన్నికల సంఘం ఉత్తర్వులను సవాలు చేస్తూ ఆయా సంక్షేమ పథకాల లబ్ధిదారులైన రైతులు, మహిళలు, విద్యార్థులు వేర్వేరుగా హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఆయా పథకాల కింద నిధులను తక్షణమే విడుదల చేసేలా ఆదేశాలు జారీ చేయాలని అభ్యర్థించారు. ఈ వ్యాజ్యాలపై విచారణ జరిపిన జస్టిస్ కృష్ణమోహన్, నిధుల పంపిణీ ఎందుకు అత్యవసరమో వివరిస్తూ ఎన్నికల సంఘానికి వినతిపత్రం సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, ఆ వినతిపత్రంపై తగిన నిర్ణయం వెలువరించాలని ఎన్నికల సంఘాన్ని గతంలోనే ఆదేశించారు. ఈ వ్యాజ్యాలు గురువారం మరోసారి విచారణకు రాగా, కేంద్ర ఎన్నికల సంఘం తరఫు సీనియర్ న్యాయవాది అవినాష్ దేశాయ్ వాదనలు వినిపిస్తూ, రాష్ట్ర ప్రభుత్వ వినతిని పరిగణనలోకి తీసుకున్నామని, అందుకే పోలింగ్ పూర్తయ్యే వరకు నిధుల పంపిణీని ఆపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించామని చెప్పారు. ఇప్పుడు నిధులు పంపిణీ చేస్తే అది ఓటర్లను ప్రభావితం చేసినట్లే అవుతుందని తెలిపారు.

అప్పుడు చంద్రబాబుకు అనుకూలంగా.. ఇప్పుడు ఈ ప్రభుత్వానికి వ్యతిరేకంగా

అనంతరం పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది సీవీ మోహన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ, ఆయా పథకాల కింద రైతులు, మహిళలు, విద్యార్థులకు ఇవ్వాల్సిన నిధులను ఇచ్చి వారిని ఆదుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. ''ఇవేమీ కొత్త పథకాలు కావు. ఇప్పటికే కొనసాగుతున్న పథకాలు. వీటి ద్వారా లబ్ధిదారులకు నిధులను పంపిణీ చేయడం ప్రభుత్వ బాధ్యతల నిర్వహణలో భాగమే అవుతుంది తప్ప, ఓటర్లను ప్రభావితం చేయడం కిందకు రాదు. నిధుల పంపిణీకి అనుమతుల విషయంలో ఎన్నికల సంఘం వివక్షాపూరితంగా వ్యవహరిస్తోంది. గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పసుపు కుంకుమ పథకం కింద నిధుల పంపిణీకి ఎన్నికల సంఘం అనుమతినిచ్చింది. ఆ పథకం ఎన్నికల నియమావళి రాకముందే అమలవుతోందన్న కారణంతో నిధుల పంపిణీకి అనుమతిచ్చింది'' అని ఆయన కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. పసుపు కుంకుమ కింద నిధుల పంపిణీకి అనుమతినిచ్చిన విషయాన్ని ఎన్నికల సంఘం లిఖితపూర్వకంగా ఢిల్లీ హైకోర్టు ముందుంచిందని ఆయన వివరించారు. నిధుల పంపిణీపై ఎలాంటి ప్రచారం చేయకుండా చూడాలని అప్పటి ప్రధాన ఎన్నికల అధికారిని సైతం ఎన్నికల కమిషన్ ఆదేశించిందని ఆయన కోర్టుకు తెలిపారు. మరి చంద్రబాబు ప్రభుత్వ హయాంలో నిధుల పంపిణీకి అనుమతినిచ్చిన ఎన్నికల కమిషన్, ఇప్పుడు నిధుల పంపిణీని ఎందుకు అడ్డుకుంటోందని ప్రశ్నించారు. ''ప్రస్తుతం ఏ పథకాల కింద అయితే నిధులు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందో, ఆ పథకాలలన్నీ ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ) రావడానికి ముందే అమల్లో ఉన్నాయి. దీన్ని ఒకవైపు ఎన్నికల సంఘం అంగీకరిస్తూనే మరో వైపు నిధుల పంపిణీకి బ్రేక్ వేసింది'' అని ఆయన కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. పసుపు కుంకుమ కింద నిధుల పంపిణీపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ కొందరు ఎన్నికల సంఘానికి వినతి పత్రాలు ఇచ్చిన కూడా ఎన్నికల సంఘం వాటిని పట్టించుకోలేదన్నారు. ఎన్నికలకు ముందు పసుపు కుంకుమ కింద లబ్ధిదారులకు నిధుల పంపిణీని అడ్డుకోవాలంటూ ఏపీ హైకోర్టులో ఓ పిటిషన్ దాఖలైందని, అయితే నిధుల పంపిణీని అడ్డుకునేందుకు హైకోర్టు నిరాకరించిందని ఆయన కోర్టుకు నివేదించారు. చంద్రబాబు హయాంలో ఓ రకంగా, ఇప్పుడు మరో రకంగా ఎన్నికల కమిషన్ వ్యవహరిస్తోందని, ఇది ద్వంద్వ ప్రమాణాలను పాటించడమే అవుతుందని మోహన్‌రెడ్డి చెప్పారు. ఒక్కొక్కరి విషయంలో ఒక్కో రకంగా ఎన్నికల కమిషన్ వ్యవహరిస్తోందని, అందుకు ప్రస్తుత నిర్ణయాలే ఉదాహరణని ఆయన తెలిపారు.

నిధుల పంపిణీ బ్యాంకు ఖాతాల ద్వారానే జరుగుతుంది...

ఈ నిధులు రాకుంటే రైతులు, విద్యార్థులు, మహిళలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందని, అంతిమంగా అది అప్పులు చేసే స్థితికి దారి తీస్తుందని ఆయన వివరించారు. నిధుల పంపిణీ మొత్తం బ్యాంకు ఖాతాల ద్వారానే జరుగుతుందని, ప్రభుత్వం ఎక్కడా కూడా నిధుల పంపిణీపై ప్రకటనలు ఇవ్వడం గానీ, ప్రచారం చేసుకోవడం గానీ చేసే అవకాశం లేదన్నారు. నిధుల పంపిణీ ద్వారా లబ్ధి పొందాలన్న ఉద్దేశం ప్రభుత్వానికి లేదని తెలిపారు. గతంలో ఎప్పుడో ప్రకటించిన ఈ పథకాలకు ఎన్నికల నియమావళి వర్తించదన్నారు. ఈ పథకాల గురించి ప్రజలందరికీ ఎప్పుడో తెలుసునని, ఈ పథకాల వల్ల ప్రభుత్వానికి ఎంతో మంచి పేరు వచ్చిందని, కాబట్టి ఇప్పుడు వాటి ద్వారా ప్రభుత్వం కొత్తగా పొందే లబ్ధి గానీ, ప్రచారం గానీ ఏమీ ఉండదన్నారు. లబ్ధిదారుల గుర్తింపు, నిధుల బదిలీ మొత్తం అధికారుల కనుసన్నల్లోనే జరుగుతుందని, ఇందులో ప్రభుత్వానిది నామమాత్రపు పాత్రేనని వివరించారు. కాబట్టి అధికార పార్టీ లబ్ధి పొందుతున్న వాదన అర్థరహితమని మోహన్‌రెడ్డి తెలిపారు.

నిధుల లభ్యతను బట్టి పంపిణీ చేస్తూ వస్తున్నాం...

అటు తరువాత రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ, ఎన్నికల సంఘం నిలుపుదల చేసిన పథకాలేవీ కొత్తవి కావన్నారు. గత నాలుగు సంవత్సరాలుగా అమలవుతన్నాయని, నిర్దిష్ట సమయంలో నిధులను లబ్ధిదారులకు పంపిణీ చేయడం జరుగుతోందని చెప్పారు. ఇప్పుడు కూడా ఎన్నికల నియమావళి అమల్లోకి రావడానికి ముందే ఈ పథకాలను ప్రకటించడం, లబ్ధిదారులను గుర్తించడం జరిగిందన్నారు. నిధుల పంపిణీ అవసరాన్ని వివరిస్తూ ఎన్నికల కమిషన్‌కు వివరణ కూడా ఇచ్చామన్నారు. ఎన్నికల తేదీ దగ్గరలో ఉందని ఎన్నికల సంఘం ఇప్పుడు చెబుతోందని, వాస్తవానికి తాము ఎప్పుడో ఎన్నికల సంఘాన్ని నిధుల పంపిణీ కోసం అనుమతి కోరామని, అనుమతినివ్వడంలో సంఘం జాప్యం చేసిందని తెలిపారు. నిధుల లభ్యతను బట్టి పంపిణీ ఉంటుందని, ఈ నాలుగేళ్లు అలాగే చేస్తూ వచ్చామన్నారు. చంద్రబాబు హయాంలో ఎన్నికలకు ముందు భవిష్యత్తులో నగదుగా మార్చుకునే విధంగా లబ్ధిదారులకు పోస్ట్ డేటెడ్ చెక్కులు ఇచ్చారని, అప్పుడు ఎన్నికల సంఘం ఎలాంటి అభ్యంతరం చెప్పలేదని ఆయన కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఇప్పుడు మాత్రం లేని పోని రాద్ధాంతం చేస్తోందన్నారు. కొత్త పథకాలకు మాత్రమే ఎన్నికల నియమావళి వర్తిస్తుందని చెప్పారు.

మిగిలిన వారి అవకాశాలు దెబ్బతినకుండా ఉండేందుకే...

చివరగా ఎన్నికల సంఘం తరఫున సీనియర్ న్యాయవాది అవినాష్ దేశాయ్ వాదనలు వినిపిస్తూ, పోలింగ్ అయ్యేంత వరకు నిధుల పంపిణీని ఆపడం వల్ల వచ్చే నష్టం ఏమీ లేదన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే మిగిలిన వారి అవకాశాలు (లెవల్ ప్లేయింగ్ ఫీల్డ్) దెబ్బతినకుండా ఉండేందుకే నిధుల పంపిణీని ఆపాలంటూ ఉత్తర్వులిచ్చామని తెలిపారు. ఎన్నికల నియమావళికి లోబడే ఈ ఉత్తర్వులిచ్చామని చెప్పారు. ఎన్నికల నియమావళి కొత్త పథకాలతో పాటు పాత పథకాలకు సైతం వర్తిస్తుందని తెలిపారు. ఎన్నికలకు కొద్ది రోజుల ముందు నిధుల పంపిణీ జరిగితే ఓటర్లను ప్రభావితం చేసినట్లే అవుతుందన్నారు. అందుకు ఆస్కారం లేకుండా చేసేందుకే నిధుల పంపిణీని నిలుపుదల చేశామన్నారు. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని ఈ వ్యాజ్యాలను తోసిపుచ్చాలని ఆయన కోర్టును కోరారు. ఉదయం 10.45 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అందరి సుదీర్ఘ వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్ రాత్రి 10.20 గంటలకు ఉత్తర్వులు వెలువరించారు. ఈ వ్యాజ్యాలకున్న అత్యవసరం నేపథ్యంలో పూర్తి ఉత్తర్వుల కాపీ స్థానంలో అడ్వాన్స్ ఉత్తర్వుల కాపీని విడుదల చేశారు. పూర్తి కాపీ అందుబాటులోకి వచ్చేందుకు కాస్త సమయం పట్టే అవకాశం ఉంది.

బీసీ నేత ఆర్.కృష్ణయ్యపై దాడి

రాయి విసిరిన గుర్తు తెలియని దుండగుడు

- వీపు భాగంలో తీవ్ర గాయం
- ఏర్పేడు బహిరంగ సభలో మాట్లాడుతుండగా ఘటన
- నన్ను చంపాలని చూశారు.. ఇది చంద్రబాబు కుట్రే
- మండిపడ్డ కృష్ణయ్య

ఏర్పేడు/రేణిగుంట (తిరుపతి జిల్లా): బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్యపై గుర్తు తెలియని వ్యక్తులు రాయితో దాడి చేశారు. ఈ ఘటనలో ఆయన వీపు భాగంలో తీవ్రగాయమైంది. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి నియోజకవర్గం ఏర్పేడులో గురువారం వైఎస్సార్‌సీపీ అభ్యర్థి బియ్యపు మధుసూదన్‌రెడ్డికి మద్దతుగా కృష్ణయ్య ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ క్రమంలో గుర్తు తెలియని దుండగుడు ఆయనపై రాయితో దాడి చేశాడు. రాయి వేగంగా దూసుకొచ్చి ఆయన వీపునకు బలంగా తగిలింది. వెంటనే వాహనంపై ఉన్న మిగిలిన వారు తేరుకుని ఆయన చొక్కాను పైకి లేపి వీపుపైన గాయాన్ని గుర్తించారు. తలను లక్ష్యంగా చేసుకుని దాడి చేశారని అయితే రాయి వీపునకు తగిలిందని చెబుతున్నారు. వైఎస్సార్‌సీపీకి లభిస్తున్న ప్రజా స్పందనను తట్టుకోలేకే టీడీపీ నేతలే దాడికి పురిగొల్పారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తనపై దాడి జరిగినా కృష్ణయ్య తన ప్రసంగాన్ని కొనసాగించారు. అక్కడ నుంచి ఏర్పేడు పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని సీఐ శ్రీరామ శ్రీనివాసులుకు ఫిర్యాదు అందజేశారు. తర్వాత శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి వెళ్లారు. అక్కడ వైద్య సిబ్బంది కృష్ణయ్య గాయానికి బ్యాండేజ్ వేసి కట్టు కట్టారు. ఆయనకు నీరసంగా ఉండటంతో వైద్యుల సూచనల మేరకు సెలైన్ ఎక్కించారు.

చంద్రబాబే దాడి చేయించారు..

చంద్రబాబుకు ఓటమి భయం పట్టుకుందని కృష్ణయ్య ధ్వజమెత్తారు. బీసీలెవరూ టీడీపీకి ఓట్లేసే పరిస్థితి లేదన్నారు. దీంతో తనను చంపాలని శ్రీకాళహస్తి టీడీపీ అభ్యర్థికి చెప్పి దాడి చేయించారని ఆరోపించారు. ఇది కేవలం తనపై దాడి కాదని.. యావత్ బీసీలందరిపై జరిగిన దాడని ధ్వజమెత్తారు. తనను రాయితో కొట్టారని.. బీసీలు, బడుగులు, పేదలు ఓటు అనే ఆయుధంతో టీడీపీని ఈ ఎన్నికల్లో భూస్థాపితం చేయడం ఖాయమని తెలిపారు. బీసీల బాగోగుల గురించి చంద్రబాబు ఏనాడూ ఆలోచించలేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బీసీల అభ్యున్నతికి అనేక చర్యలు తీసుకున్నారని చెప్పారు. ఆయన వైపే బీసీలు, ఎస్సీ, ఎస్టీలు, అగ్రకులాల్లోని పేదలంతా ఉన్నారని వెల్లడించారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ ఖచ్చితంగా వైఎస్సార్‌సీపీ విజయం సాధిస్తుందని తేల్చిచెప్పారు.

బీసీల ఆత్మగౌరవాన్ని కాపాడింది జగన్

ఒంగోలు: బీసీ ప్రధానిగా ఉన్నంత మాత్రాన బీసీలంతా అభివృద్ధి చెందరని, పరిపాలించే నేతలకు బీసీలు అభివృద్ధి చెందాలనే ఆకాంక్ష అవసరమని కృష్ణయ్య చెప్పారు. ఆయన గురువారం ఒంగోలులో మీడియాతో మాట్లాడారు. చంద్రబాబుకు బీసీలంటే ఓటర్లు మాత్రమే అని, సీఎం జగన్‌కు మాత్రం బీసీలంటే బ్యాక్‌బోన్ అని తెలిపారు. అందుకే బీసీల ఆత్మగౌరవాన్ని జగన్ పెంపొందిస్తున్నారని కొనియాడారు. చంద్రబాబు హయాంలో బీసీలకు పనిముట్లు ఇచ్చి.. పదవులు మాత్రం అగ్రవర్ణాలకు కట్టబెట్టేవారని గుర్తు చేశారు. జగన్ పాలనలో బీసీలకు రాజ్యాధికారం కల్పించే దిశగా చట్టసభల్లో అనేక పదవులిచ్చారన్నారు. ఇటీవల 18 ఎమ్మెల్సీ సీట్లను భర్తీ చేస్తే అందులో 11 సీట్లు బీసీలకే ఇచ్చారని తెలిపారు. 23 మంది మంత్రులుంటే వారిలో నలుగురు ఉప ముఖ్యమంత్రులతో పాటు మరో ఏడుగురు మంత్రులుగా బీసీలే ఉన్నారన్నారు. ఇక నామినేటెడ్ పదవుల్లో అయితే 60 శాతం నుంచి 70 శాతం పదవులు బీసీలకే జగన్ ఇచ్చారని గుర్తు చేశారు. చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కావాలంటూ పార్లమెంట్‌లో ప్రైవేటు బిల్లు సైతం ప్రవేశపెట్టిన ఘనత వైఎస్సార్‌సీపీదన్నారు. కాగా దాన్ని అడ్డుకున్న చరిత్ర టీడీపీదని మండిపడ్డారు. తమిళనాడు, కర్ణాటక, మధ్యప్రదేశ్‌లో బీసీలు ముఖ్యమంత్రులుగా ఉన్నా ఆ రాష్ట్రాల కన్నా ఏపీలోనే బీసీల సంక్షేమం, అభివృద్ధి వేగవంతంగా జరుగుతోందన్నారు. ఇది కొనసాగాలంటే సీఎం వైఎస్ జగన్‌ను తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు.

కృష్ణయ్యపై టీడీపీ గూండాల దాడి హేయం

సాక్షి, హైదరాబాద్: శ్రీకాళహస్తిలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు అర్.కృష్ణయ్యపై తెలుగుదేశం పార్టీ గూండాలు జరిపిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్టు బీసీ సంక్షేమ సంఘం పేర్కొంది. మూడురోజుల్లో జరిగే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ సాధించబోయే విజయాన్ని తట్టుకోలేక టీడీపీ కూటమి కుట్రలకు తెర లేపిందని ఆరోపించింది. అందులో భాగంగానే వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడులకు తెగబడుతోందని విమర్శించింది. బీసీలు ఈ ఎన్నికల్లో సత్తా చూపిస్తారని, టీడీపీని చిత్తుగా ఓడిస్తారని జాతీయ బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు గవ్వల భరత్ కుమార్, తెలంగాణ బీసీ యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ రాజ్కుమార్, తెలంగాణ బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రవీణ్ ముదిరాజ్ ఒక సంయుక్త ప్రకటనలో స్పష్టం చేశారు.



జీహెచ్ఎంసీ సిబ్బంది బస్తీలు, కాలనీల్లోని ఇళ్లకు వెళ్లి మహిళలకు బొట్టు పెట్టి మీకు ఓటుందా అని అడిగి.. ఒకవేళ ఓటు ఉంటే.. తప్పకుండా ఓటేయాలంటూ పోలింగ్ కేంద్రం వైపు అడుగులేసేలా వారిని ఒప్పిస్తున్నారు.



బంజారాహిల్స్‌లోని జీవీకే వన్‌మాల్‌లో ఇటీవల ఓ ఫ్లాష్‌మాబ్‌లో భాగంగా మోడరన్, శాస్త్రీయ నృత్యాలూ ప్రదర్శించారు. ఎందుకిదంతా అని చూస్తే 'నా ఓటు-నా హక్కు' నినాదాలతో ప్లకార్డులు పట్టుకొని కనిపించారు. జీహెచ్ఎంసీలోని సెల్ఫ్‌హెల్ప్ గ్రూపుల సభ్యులు, రిసోర్స్‌పర్సన్స్ వారి పిల్లలతో నిర్వహించిన ఈ కార్యక్రమం మాల్‌కు వచ్చిన వారిని ఆకట్టుకుంది. ఓటుపై ఆలోచనలో పడేసింది.


నగరం ఓటెత్తాలని..

పోలింగ్ 'స్వీప్' చేసేందుకు కసరత్తు | 'ఇంటింటికీ బొట్టు' నుంచి 'పరమపద సోపానం' వరకు | సంకల్ప పత్రాల నుంచి ఫ్లాష్ మాబ్స్ దాకా.. | స్వచ్ఛ ఆటోల మైకులు.. ఎస్ఎంఎస్‌లతోనూ.. | ఎన్నికల అక్షరాస్యత క్లబ్‌లు.. అవగాహన కార్యక్రమాలు

పరమపద సోపానం (వైకుంఠపాళి) ఆటలో స్వర్గానికి చేరుకునేందుకు మెట్లెక్కించే నిచ్చెనలు, పాతాళానికి పడిపోయేలా మింగేసే పాములు ఉండటం తెలిసిందే. ఆ ఆటలో ఎప్పుడు పాము మింగుతుందో, ఎప్పుడు నిచ్చెన ఎక్కుతామో తెలియదు కానీ..



ప్రజాస్వామ్యానికి కీలకమైన ఓటును సద్వినియోగం చేసుకోకపోతే మాత్రం భవిష్యత్ అంధకారమవుతుంది అని చెబుతూ ఏ పనులు చేస్తే నిచ్చెన ఎక్కవచ్చో, ఏవి చేస్తే పాతాళానికి పడిపోతారో తెలియజేసేలా ఖైరతాబాద్ సర్కిల్‌లో పరమపద సోపానం ఆటతోనూ అవగాహన కల్పించారు.



సాక్షి, హైదరాబాద్: నగరంలో అక్షరాస్యతశాతం ఎక్కువగా ఉన్నా.. ఎన్నికలకు సంబంధించి నిరక్షరాస్యులుగా వ్యవహరిస్తూ పోలింగ్ కేంద్రాలకు వెళ్లడం లేదు. తమ భవిష్యత్‌కు తగిన ప్రజాప్రతినిధులను ఎన్నుకోవడంలో నిర్లక్ష్యం కనబరుస్తున్నారు. ఈ నేపథ్యంలో వారిని ఎన్నికల అక్షరాస్యులుగానూ మలిచేందుకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు హైదరాబాద్ జిల్లాలోని 14 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 287 ఎన్నికల అక్షరాస్యత క్లబ్‌లు ఏర్పాటు చేశారు. ఈ క్లబ్‌ల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. కూలీనాలీ చేసుకునే ప్రజలు, ప్రైవేట్ వ్యాపారాలు సాగిస్తున్న వారితోపాటు ఉద్యోగుల్లో సైతం ఇదే వైఖరి ఉంది. అందుకే వారికి కూడా అవగాహన కల్పించేందుకు ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలకు చెందిన ఉద్యోగులతో 158 ఓటర్ అవేర్‌నెస్ ఫోరమ్స్ ఏర్పాటు చేసి వివిధ కార్యాలయాల్లో అవగాహన కల్పిస్తున్నారు. వీటితోపాటు 584 పోలింగ్ బూత్‌ల పరిధిలో అవేర్‌నెస్ గ్రూపులు ఏర్పాటు చేశారు. తమ బూత్ పరిధిలోని వారిని పోలింగ్ కేంద్రాల దాకా అడుగేసేలా చేయడం ఈ గ్రూపుల పని. 'వాక్ టు పోలింగ్ స్టేషన్' పేరిట కార్యక్రమాలు చేపడుతూ పోలింగ్ శాతం పెరిగేందుకు పనిచేస్తున్నాయి.

ఇంకా ఏం చేస్తున్నారంటే..

18 ఏళ్లలోపు విద్యార్థులకు పెయింటింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులందజేస్తున్నారు. ఓటరు చైతన్యం కోసం రూపొందించే వీడియోల్లో ఉత్తమమైన పది వీడియోలకు రివార్డులివ్వనున్నారు. బూత్‌లెవెల్ అధికారులు తమ బూత్‌లో పోలింగ్‌శాతాన్ని గతంలో కంటే పదిశాతం పెంచితే రూ. 5 వేలు రివార్డుగా ఇచ్చే యోచనలో ఉన్నారు. ఆదివారం నగరవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో 5కే రన్ నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో తాము ఓటు వేస్తామంటూ ప్రతిజ్ఞలు చేయిస్తున్నారు. ప్రజలు గుమికూడే ప్రాంతాల్లో పోస్టర్లు, కరపత్రాలు, బ్యానర్ల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. డిజిటల్ బోర్డులపై ఎన్నికల సమాచారం తెలియజేస్తున్నారు. ఓటరు అవగాహనకు నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలను ఎక్స్, ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగామ్ వంటి సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారు. జీహెచ్ఎంసీ వెబ్‌సైట్‌లోనూ ఎన్నికలకు సంబంధించిన సమాచారం పొందుపరుస్తున్నారు. వారానికోమారు ఓటు వేయాల్సిందిగా సూచిస్తూ ఆస్తిపన్ను చెల్లింపుదారులకు ఎస్ఎంఎస్‌లు పంపుతున్నారు. స్వచ్ఛభారత్ మిషన్ కింద నగరంలో ఏర్పాటు చేసిన పబ్లిక్ టాయ్‌లెట్ల వద్ద ఓటరు అవగాహన బ్యానర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇంటింటి నుంచి చెత్త సేకరించే స్వచ్ఛఆటోల మైకుల ద్వారానూ ప్రచారానికి సిద్ధమయ్యారు.

ఎన్నికల దాకా..

ఎన్నికలు జరిగేంత వరకు ఇలా వివిధ ప్రాంతాల్లో, వివిధ రూపాల్లో స్వీప్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్ తెలిపారు. బొటానికల్ గార్డెన్ వద్ద ఇప్పటికే నిర్వహించిన 2కే రన్‌లో సీఈఓ వికాస్‌రాజ్, తదితరులు పాల్గొన్నారు.

ఇప్పటి వరకు..

- స్వీప్(సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్) కింద నా ఓటు హక్కును వినియోగించుకుంటాను అనే ప్రతిజ్ఞతో ప్రసాద్స్ ఐమాక్స్‌లో, కొన్ని పార్కుల్లో భారీ తెరలపై సంతకాల సేకరణ చేపట్టారు.
- జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ల ప్రతినిధులతో, పాతబస్తీలోని మక్కా మసీదులోనూ ఓటర్ అవేర్‌నెస్ కార్యక్రమం నిర్వహించారు.
- ఓటు వేస్తాననే సంకల్ప పత్రాలను విద్యార్థులకు అందజేస్తూవాటిపై వారి తల్లిదండ్రులు సంతకాలు చేశాక తిరిగి తీసుకుంటున్నారు. ఇప్పటివరకు అలా దాదాపు రెండు లక్షల సంకల్ప పత్రాలు సేకరించారు.
- ఓటుహక్కు గురించి బస్తీల్లో, కాలనీల్లో క్విజ్‌లు, మెహందీలు, రంగోలి వంటి పోటీలు నిర్వహిస్తున్నారు. పోటీల్లో విజేతలకు బహుమతులందజేస్తూ ఆసక్తి కల్పిస్తున్నారు.
- ఒక ఆదివారం హెరిటేజ్ వాక్ నిర్వహించిన సందర్భంగా దారుల్‌షిఫా నుంచి ఉస్మానియా ఆస్పత్రిలోని చింతచెట్టు వరకు ఓటు హక్కుకు సంబంధించిన బ్యానర్లు, పోస్టర్ల స్టాండ్లు ఏర్పాటు చేశారు.
- పార్కులు, బస్‌స్టేషన్లు, గోడలపై రాతల ద్వారానూ, రేషన్‌షాపులు, సిటిజెన్ సర్వీస్ సెంటర్లు, కూరగాయల మార్కెట్లు తదితర ప్రాంతాల్లో ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.
- 'ఓట్' అనే అక్షరాల్లా కనిపించేలా విద్యార్థులతో ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు.



కాళ్మొక్కుత.. ఓటెయ్యుండ్రి

మంచిర్యాల జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు దంపతులు గురువారం మందమర్రి పట్టణంలో పెద్దపల్లి లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్ల కాళ్లు పట్టుకుని కాంగ్రెస్ పార్టీకి ఓటేయాలని అభ్యర్థించారు.

- మందమర్రి రూరల్

మోదీ పరివార్‌లో అందరూ నేరస్తులే

మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు అల్కా లాంబా



సాక్షి, హైదరాబాద్: మోదీ పరివార్‌లో అందరూ నేరస్తులే ఉన్నారని మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు అల్కాలాంబా వ్యాఖ్యానించారు. మోదీ తన కుటుంబంగా భావించే వారిలో అదానీ, అంబానీలు దేశ సంపదను దోచుకున్నారని, ప్రజ్వల్ రేవణ్ణ వేల మంది మహిళలను బలాత్కారం చేశాడని ఆరోపించారు. అలాంటి రేవణ్ణ కోసం మోదీ ఎన్నికల ప్రచారం నిర్వహించడం దుర్మార్గమని వ్యాఖ్యానించారు. గురువారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఐసీసీ అధికార ప్రతినిధి సుజాతా పాల్, తెలంగాణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు తదితరులతో కలిసి ఆమె మోదీ పరివార్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మహిళా క్రీడాకారులను లైంగికంగా వేధించిన బ్రిజ్‌భూషణ్ కుటుంబానికి బీజేపీ టికెట్ ఇచ్చిందని, బీజేపీ హయాంలో దేశంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, మహిళలను వంటింటికే పరిమితం చేసేందుకు బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు ప్రయత్నం చేస్తున్నాయన్నారు. రాజ్యాంగాన్ని మార్చి రిజర్వేషన్లు ఎత్తివేయాలన్న కుట్రకు బీజేపీ పాల్పడుతోందని ఆరోపించారు. కాంగ్రెస్‌తోనే మహిళా సాధికారత సాధ్యమవుతుందని, చైతన్యవంతులైన తెలంగాణ మహిళలు ఆలోచించి ఓటు వేయాలని అల్కా లాంబా కోరారు.

లోక్‌సభ ఎన్నికలకు పోలీసులు సిద్ధం

- మావోయిస్టు ప్రభావిత జిల్లాల్లో కూంబింగ్ ముమ్మరం
- ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరిగేలా బందోబస్తు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఈ నెల 13న జరగనున్న పోలింగ్‌కు పోలీసులు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేశారు. అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా శాంతియుత వాతావరణంలో ఓటర్లు ఓటు వినియోగించుకునేలా పోలీసులతో పాటు 160 కంపెనీల కేంద్ర సాయుధ పోలీసు బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఇటీవల ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్ జిల్లా పరిధిలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 29 మంది మావోయిస్టులను భద్రతా బలగాలు మట్టుపెట్టిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలైన భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి, కొమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, ములుగు జిల్లాల్లో పోలీసులు మరింత అప్రమత్తంగా ఉండాలని పోలీసు ఉన్నతాధికారులు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. మావోయిస్టుల కదలికలు పెద్దగా లేనప్పటికీ, పోలింగ్ రోజు మావోయిస్టులు తమ ఉనికిని చాటుకునేందుకు ప్రయత్నాలు చేసే అవకాశాలున్న నేపథ్యంలో భద్రతను కట్టుదిట్టం చేశారు. సరిహద్దు జిల్లాల్లో కూంబింగ్ ముమ్మరం చేశారు. స్థానిక పోలీసులు, గ్రేహౌండ్స్‌తోపాటు కేంద్ర సాయుధ పోలీసు బలగాలు సైతం ఈ సోదాల్లో పాల్గొంటున్నాయి. సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉన్నామని, పరిస్థితి అదుపులో ఉందని ఓ పోలీసు ఉన్నతాధికారి తెలిపారు.

కాంగ్రెస్ దేశాన్ని విభజించాలని చూస్తోంది

- కులం, మతం, భాష పేరుతో కుట్ర చేస్తోంది
- సామ్ పిట్రోడాను బహిష్కరించాల్సిందే: బీజేపీ ఎంపీ డా.కె.లక్ష్మణ్



సాక్షి, హైదరాబాద్: దేశాన్ని కులం, మతం, భాష పేరుతో విభజించి, విచ్ఛిన్నం చేయాలని కాంగ్రెస్ పార్టీ చూస్తోందని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్య క్షుడు డా.కె.లక్ష్మణ్ ఆరోపించారు. ఇది కాంగ్రెస్‌కు కొత్తేమీ కాదని ఆ పార్టీ పుట్టినప్పటి నుంచి ఇదే చరిత్ర అని విమర్శించారు. దేశ, విదేశాల్లో భారత్ ప్రతిష్టను దిగజార్చే విధంగా రాహుల్ గాంధీ మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. గురువారం హైదరాబాద్‌లో లక్ష్మణ్ మీడియాతో మాట్లాడారు. రాహుల్‌కు పాకిస్తాన్ మీద ఉన్న ప్రేమ మాతృదేశం మీద లేదని ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ రహస్య ఎజెండా ఏమిటో తెలియదని, ముందు కాంగ్రెస్ చరిత్ర తెలుసుకుని రేవంత్ మాట్లాడితే మంచిదని హితవుపలికారు. కాంగ్రెస్ మోటివేషన్ స్పీకర్‌గా వ్యవహరిస్తున్న సామ్ పిట్రోడాను దేశం నుంచి బహిష్కరించాలని, ఆయన చేసిన వ్యాఖ్యలపై దేశ ప్రజ లందరికీ కాంగ్రెస్ పార్టీ బేషరతుగా క్షమాపణ చెప్పాలని లక్ష్మణ్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఆలోచనలనే పిట్రోడా ప్రజలు ముందు పెట్టా రని, ఆయన రాజీనామా కేవలం ఒక డ్రామానే అని నిందించారు. దక్షిణ భారత దేశం ప్రత్యేక దేశం కావాలని ఎంపీ డీకే సురేష్ డిమాండ్ చేస్తే కాంగ్రెస్ ఇప్పటికీ చర్యలు తీసుకోలేదని గుర్తు చేశారు.

సీఎం రేవంత్‌పై చర్య తీసుకోండి

హిందూ విశ్వాసాలపై వ్యాఖ్యలు చేశారంటూ సీఈఓకు వీహెచ్‌పీ ఫిర్యాదు

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు పోటీపడి అయోధ్య రాముడి ప్రాణప్రతిష్ట, శ్రీరామనవమి వేడుకలు, హనుమాన్ జయంతి శోభాయాత్రలపై విమర్శలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్‌కు విశ్వహిందూ పరిషత్ ఫిర్యాదు చేసింది. పార్టీలకతీతంగా ప్రతి హిందువు ఆరాధించే దైవాన్ని దూషిస్తే చూస్తూ ఊరుకోమని స్పష్టం చేసింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా హిందుత్వంపై, హిందూ విశ్వాసాలపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని కోరింది. ఇటీవల తుక్కుగూడ బహిరంగ సభలో రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. అయోధ్య శ్రీరామ జన్మభూమి అక్షింతలను అవమానపరిచారని వీహెచ్‌పీ ఆగ్రహం వ్యక్తం చేసింది. 'వీహెచ్‌పీ వాళ్లు పంచిన అక్షింతలు అయోధ్య నుంచి వచ్చినవి కాదు. అవి కంట్రోల్ బియ్యంతో తయారుచేసి పంచారు'.. అంటూ రేవంత్ వ్యాఖ్యానించడాన్ని తప్పుబడుతున్నట్టు తెలిపింది. హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా ఓటు బ్యాంకు రాజకీయాలకు ప్రాధాన్యమిస్తూ, ఇతర వర్గాల మెప్పు కోసం ప్రయత్నం చేసిన రేవంత్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. తాజాగా కాంగ్రెస్ నేత అద్దంకి దయాకర్ కూడా విచక్షణ కోల్పోయి హిందుత్వంపై దూషించడాన్ని ప్రస్తావించింది. గురువారం ఈ మేరకు సీఈవోకు వీహెచ్‌పీ నేతలు పండరీనాథ్, జగదీశ్వర్, రావినూతల శశిధర్, పగుడాకుల బాలస్వామి, సుభాశ్ చందర్, బజరంగ్ దళ్ రాష్ట్ర కన్వీనర్ శివ రాములు వినతిపత్రం సమర్పించారు.

11న సాయంత్రం 5 నుంచి మద్యం బంద్



సాక్షి, హైదరాబాద్: ఈ నెల 13న రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పోలింగ్‌కు 48 గంటల ముందు.. అంటే ఈ నెల 11న సాయంత్రం 5 గంటల నుంచి 13వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు రాష్ట్రంలో మద్యం అమ్మకాలపై నిషేధం విధిస్తున్నట్టు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి(సీఈఓ) వికాస్‌రాజ్ తెలిపారు. పోలింగ్ సమయం సాయంత్రం 6 గంటల వరకు పొడిగించిన నేపథ్యంలో ఆ మేరకు మద్యం అమ్మకాలపై నిషేధాన్ని సైతం పొడిగించాలని అబ్కారీ శాఖను ఆదేశించారు. జూన్ 4న ఓట్ల లెక్కింపు నేపథ్యంలో.. ఆ రోజు సైతం మద్యం అమ్మకాలపై నిషేధం అమలు చేయాలని స్పష్టం చేశారు. ఈ మేరకు డ్రైడే అమలుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

నేటి మోదీ సభ తెలంగాణకు కీలకం

ఈ సభలో ఎన్నికల సందేశం ఇస్తారు: కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సమాజాన్ని ఉద్దేశించి ప్రధాని నరేంద్రమోదీ ఎల్‌బీస్టేడియం సభవేదికగా ఎన్నికల సందేశం ఇస్తారని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్రఅధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు ఎల్‌బీస్టేడియంలో జరిగే బహిరంగసభ తెలంగాణకు కీలకమని పేర్కొన్నారు. 'ఐదుగురు బీజేపీ ఎంపీ అభ్యర్థులు ఈ సభలో పాల్గొంటారు. గ్రేటర్ హైదరాబాద్ ప్రజలు, యువత సభకు రావాలి. మోదీకి మనమంతా అండగా నిలబడాల్సిన అవసరముంది. దీనికంటే ముందు నారాయణపేటలో జరిగే బహిరంగసభలో ప్రధాని పాల్గొంటారు'అని కిషన్‌రెడ్డి చెప్పారు. గురువారం ఎల్‌బీస్టేడియంలో సభా ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.

రిజర్వేషన్లపై రాహుల్‌గాంధీ డైరెక్ట్ చేసిన సినిమా ఫ్లాప్

'అండర్ కరెంట్, ఓపెన్ కరెంట్ ఉంది.. ప్రజలు బీజేపీకి ఓటేయడానికి సిద్ధంగా ఉన్నామని చెబుతున్నారు. ఎన్నికల జిమ్మిక్కులు చేస్తూ బట్టకాల్చి మొహం మీద పడేసే ప్రయత్నం కాంగ్రెస్, బీఆర్ఎస్ చేస్తున్నాయి'అని కిషన్‌రెడ్డి మండిపడ్డారు. 'కేసీఆర్ మాటలు ప్రజలు సీరియస్‌గా తీసుకోవడం లేదు. నవ్వుకుంటున్నారు. గాడిద గుడ్డు ప్రచారానికే కాంగ్రెస్ పరిమితమైంది. తెలంగాణ ప్రజలెవరూ దాన్ని పట్టించుకోవడం లేదు. బీజేపీ హైకమాండ్ ఆదేశాలతో మేము 17 పార్లమెంట్ నియోజకవర్గాల్లో ప్రజలను కలిశాం. ఏ ఫ్రంట్ కూడా మోదీకి ప్రత్యామ్నాయంగా లేదు. కాంగ్రెస్‌కు విమర్శించడానికి ఏం లేదు. కాబట్టి దుష్ప్రచారం చేస్తుంది. రిజర్వేషన్ల అంశంపై కాంగ్రెస్ తప్పుడు ప్రచారాలు చేసింది. రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి మాటలను ఏ ఒక్కరూ సీరియస్‌గా తీసుకోవడం లేదు. రిజర్వేషన్ల అంశంపై డైరెక్ట్ చేసిన రాహుల్‌గాంధీ సినిమా ఫ్లాప్ అయ్యింది. సెకండ్, థర్డ్ ప్లేస్ వస్తుందని రేవంత్ రిజర్వేషన్ల అంశాన్ని ప్రచారం చేస్తున్నారు. సబ్‌కాసాత్.. సబ్ కా వికాస్ అనే నినాదంతో ముందుకు వెళుతున్నాం'అని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు.

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రాంరెడ్డిపై చర్యలు తీసుకోవాలి

- ఓటర్లను డబ్బు, మద్యం ఇతర రూపాల్లో ప్రలోభాలకు గురిచేస్తున్నారు
- సీఈఓకు బీజేపీ ప్రధాన కార్యదర్శి కాసం ఫిర్యాదు

సాక్షి, హైదరాబాద్: ఓటర్లను డబ్బు, మద్యం, చీరల పంపిణీ ఇతర రూపాల్లో ప్రలోభాలకు గురిచేస్తున్న బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రాంరెడ్డిపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో)కి బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కాసం వెంకటేశ్వర్లుయాదవ్ విజ్ఞప్తి చేశారు. ఆయనను పోటీకి అనర్హుడిగా ప్రకటించాలని వినతిపత్రం సమర్పించారు. తమ సమీప బంధువుకు చెందిన జేసీబ్రదర్స్, రాఘవ, రాజపుష్ప కన్‌స్ట్రక్షన్ సంస్థల ఉద్యోగుల ద్వారా ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, నర్సాపూర్, మెదక్ అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో ఓటర్లకు చీరలు, డబ్బు, మద్యం పంపిణీ చేస్తున్నట్లు తమకు సమాచారం అందిందని తెలిపారు. మెదక్ బీజేపీ అభ్యర్థి ఎం.రఘునందన్‌రావు తరపున ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. ఈ వినతిపత్రం ప్రతిని ఢిల్లీలోని కేంద్ర ఎన్నికల కమిషన్‌కు కూడా పంపించారు.

డీసీపీని బదిలీ చేయాలి: మర్రి

బోరబండ బీజేపీ డివిజన్ అధ్యక్షుడు కె.వెంకటేశం, ఇతర కార్యకర్తలపై దాడికి పాల్పడిన పోలీసులపై చర్య తీసుకోవాలని బీజేపీనేత, మర్రి శశిధర్‌రెడ్డి సీఈవోకు ఫిర్యాదు చేశారు. నగర వెస్ట్‌జోన్ డీసీపీ విజయకుమార్, బోరబండ పోలీస్‌స్టేషన్ డీఐ / ఎస్‌హెచ్ఓ భూపాల్ గౌడ్‌లను వెంటనే బదిలీచేసి స్వేచ్ఛగా ఎన్నికలు జరిగేలా చూడాలని వినతిపత్రం సమర్పించారు.

కొందరు పార్టీ మారినంత మాత్రాన నష్టమేమీ లేదు

ఇచ్చిన హామీల నుంచి తప్పించుకోవడానికే కేసీఆర్‌పై కాంగ్రెస్ నిందలు

- ఉద్యమ సమయంలో మా ఫోన్లు కూడా ట్యాప్ చేశారు
- మీట్ ది ప్రెస్‌లో మాజీ మంత్రి జి.జగదీశ్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: అధికారం కోసం కొందరు నాయకులు పార్టీ మారినంత మాత్రాన బీఆర్ఎస్‌కు వచ్చిన నష్టమేమీ లేదని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జి.జగదీశ్‌రెడ్డి చెప్పారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం నిర్వహించిన 'మీట్ ది ప్రెస్'తో జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడిరాష్ట్రంలో తెలంగాణ గురించి పార్లమెంటులో మాట్లాడేవారు, కొట్లాడేవారు లేక నష్టపోయామని, కేసీఆర్ టీఆర్ఎస్ స్థాపించిన తర్వాతే తెలంగాణ గొంతు పార్లమెంటులో వినిపించి, రాష్ట్రాన్ని సాధించిందని గుర్తు చేశారు. 16మంది బీఆర్ఎస్ ఎంపీలను గెలిపించి ఢిల్లీకి పంపితే తెలంగాణ ప్రయోజనాల కోసం పోరాడుతారన్నారు. కేసీఆర్ ఆ బాధ్యత తీసుకుంటారని, బీఆర్ఎస్‌కు అనుకున్నన్ని సీట్లు రాకపోతే తెలంగాణకే నష్టమని చెప్పారు. కృష్ణాజలాలపై ఉన్న హక్కును కృష్ణా రివర్‌బోర్డు మేనేజ్‌మెంట్ బోర్డుకు కాంగ్రెస్ అప్పగించడంపై బీఆర్ఎస్ గొంతెత్తిన తర్వాతే అసెంబ్లీలో తీర్మానం చేశారన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేసేందుకు కాంగ్రెస్, బీజేపీలకు అభ్యర్థులు లేక బీఆర్ఎస్ నుంచి తీసుకున్నారని, ఆ రెండు పార్టీల నుంచి పోటీచేస్తున్న వారిలో సగం మంది బీఆర్ఎస్ వారేనని తెలిపారు. ఎంపీ ఎన్నికల్లో ఎన్‌డీఏ, ఇండియా కూటమిలకు 200 సీట్లు మించవని, ప్రాంతీయ పార్టీలదే హవా ఉంటుందని చెప్పారు.

ఫోన్ ట్యాపింగ్ కొత్త వ్యవహారం కాదు

అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన 6 గ్యారంటీలు, ఇతర హామీల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకే ఫోన్‌ట్యాపింగ్ పేరుతో కాంగ్రెస్ హడావిడి చేస్తుందన్నారు. ఫోన్‌ట్యాపింగ్ కొత్తగా కనిపెట్టిందేమీ కాదని, 20, 30 ఏళ్ల కిందటే ప్రారంభమైందన్నారు. ఫోన్‌ట్యాపింగ్ మొదలు పెట్టిందే కాంగ్రెస్ ప్రభుత్వమని చెప్పారు. ఉద్యమ సమయంలో తమ ఫోన్లు కూడా ట్యాప్ చేశారన్నారు. పోలీస్‌వ్యవస్థలో ఒక భాగమైన ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారాన్ని రాజకీయం కోసం రేవంత్‌రెడ్డి, మంత్రులు వాడుకుంటున్నారని తెలిపారు. ఈ వ్యవహారం ఒక మీడియాలోనే డిటెక్టివ్ స్టోరీలాగా వస్తుందని, దంపతుల సంభాషణలు విన్నారని కూడా తెగించి రాస్తున్నారని ధ్వజమెత్తారు. తమ ఫోన్‌ట్యాప్ అయినట్టుగానీ, తమ సంభాషణలు విన్నట్టుగానీ ఫిర్యాదులు ఏమైనా వచ్చాయా అని ప్రశ్నించారు.

రేవంత్‌కు మోదీ సహకారం

ఆర్ఆర్ ట్యాక్స్ అంటూ సీఎం రేవంత్‌రెడ్డిపై ఆరోపణలు చేస్తున్న ప్రధాని మోదీ ఎందుకు విచారణ జరిపించడం లేదని ప్రశ్నించారు. ఢిల్లీకి డబ్బుల సంచులు మోస్తున్నారని రేవంత్‌పై ప్రధాని ఆరోపణలు చేస్తుంటే ఈడీ, సీబీఐలు ఏం చేస్తున్నా యన్నారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేణుగోపాలనాయుడు అధ్యక్షత వహించగా, కమిటీ ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రావు, సంయుక్త కార్యదర్శులు వైట్ల రమేష్, సీహెచ్ హరిప్రసాద్, కోశాధికారి రాజేష్ సభ్యులు ఉమ, వసంత్ పాల్గొన్నారు.

జైత్రయాత్ర 2024

గుసగుస

రూ.200 కోట్ల బడ్జెట్



జీరో బడ్జెట్ పాలిటిక్స్ అంటూ హీరోచిత వ్యాఖ్యలు చేసిన పవన్‌కల్యాణ్ .. భారీ బడ్జెట్ పాలిటిక్స్‌కు తెరతీశారు. తనతో సినిమా తీయాలనుకుంటే సినిమా బడ్జెట్లో తన రెమ్యునరేషనే సగం కంటే ఎక్కువన్నది అందరికీ తెలిసిందే. ఏపీ రాజకీయాల్లో కూడా తన మార్కు చూపాలనుకున్నారో.. ఏమో! పిఠాపురం చరిత్రలో కనీవినీ ఎరుగని స్థాయికి ఓట్ల కొనుగోళ్ల ప్రక్రియను తీసుకెళ్లారట. ఓటుకు హీనపక్షంగా రూ.5 వేలు నుంచి రూ.10 వేలు వరకు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశారట. ఇప్పటికే తన కుటుంబ సభ్యుల ద్వారా ఆ మొత్తాన్ని గొల్లప్రోలు, యు.కొత్తపల్లి, పిఠాపురం మండలాల్లోని వేర్వేరు ప్రాంతాలకు చేర్చారట. ఓటర్లతోపాటు, గ్రామ, మండల స్థాయి నాయకులకు కూడా భారీగానే ముట్టజెప్తున్నట్లు సమాచారం. హీనపక్షంగా రూ.200 కోట్లు పంచిపెడుతున్నట్లు స్థానిక నాయకులు చెప్పుకుంటున్నారు.



ప్రపంచం మెచ్చిన ఏపీ విద్య

విద్యా వ్యవస్థలో అభివృద్ధిని చూసి ఆశ్చర్యపోయాం

- ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు గొప్ప ఫలితాలు సాధిస్తారు.. ప్రపంచ అవసరాలకు తగ్గట్టు ఏపీ విద్యార్థులు
- ప్రభుత్వ పాఠశాలల్లో టెక్నాలజీ వినియోగం ఆకట్టుకుంది
- ప్రపంచ సమకాలీన సవాళ్లను అధిగమించేలా ఏపీ విద్య
- సీఎం వైఎస్ జగన్ పేద పిల్లల భవిష్యత్‌కు గొప్ప బాటలు వేశారు
- అంతర్జాతీయ మేధావులు, వివిధ సంస్థల ప్రతినిధుల ప్రశంసలు

క్యాంపస్ సెలక్షన్స్‌లో టాప్

అద్భుత ఫలితాలిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ నైపుణ్య సంస్కరణలు

- చదువు పూర్తయిన వెంటనే ఉద్యోగాలు సాధిస్తున్న ఏపీ యువత
- ఇంటర్న్‌షిప్, ఫ్యూచర్ స్కిల్స్ రెడీనెస్‌లోనూ అగ్రగామిగా రాష్ట్రం
- గతేడాది సంప్రదాయ డిగ్రీలో 60 వేల మందికి క్యాంపస్ కొలువులు
- సాంకేతిక విద్యలో ఏకంగా 1.20 లక్షల మందికి పైగా ఉద్యోగాలు
- ఈ ఏడాది 11 వేలకు పైగా డిప్లొమా విద్యార్థులకు జాబ్‌లు
- మైక్రోసాఫ్ట్ వంటి అంతర్జాతీయ సంస్థల ద్వారా శిక్షణ
- ఎడెక్స్‌తో కలిసి 2 వేల అంతర్జాతీయ వర్సిటీ కోర్సులు..
- ఏపీసీటీఈ ద్వారా ఏఐ, పైథాన్, క్లౌడ్ వంటి అంశాల్లో శిక్షణ

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి



ఊరూరా స్పష్టమైన మార్పు.. నాడు-నేడుతో స్కూళ్లు కళకళ

ఐదేళ్లు అడ్డగోలుగా అవినీతి, అక్రమాలకు పాల్పడి చంద్రబాబు సర్కార్ అధోగతిపాలు చేసిన రాష్ట్రాన్ని.. గత 59 నెలలుగా విద్య, వైద్య, వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో విప్లవాత్మక సంస్కరణలు.. సుపరిపాలనతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధిలో దేశంలోనే అగ్రగామిగా నిలిపారు. కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు శాఖ, నీతి ఆయోగ్ నివేదికలే అందుకు నిదర్శనం.

- ➤ రైతన్నను చేయి పట్టుకుని నడిపిస్తున్న ఆర్బీకేలు, అండగా రైతు భరోసా
- ➤ ధైర్యాన్నిస్తున్న ఇన్‌పుట్ సబ్సిడీ, మద్దతు ధర, నాణ్యమైన విత్తనాలు, పురుగు మందులు
- ➤ సచివాలయ, వలంటీర్ వ్యవస్థతో ఉన్న ఊళ్లోనే చకచకా పనులు
- ➤ ఆరోగ్య శ్రీ, విలేజ్ క్లినిక్, ఫ్యామిలీ డాక్టర్‌తో ఆరోగ్యానికి కొండంత అండ
- ➤ చేయూత, ఆసరాతో సొంత కాళ్లపై నిలబడ్డ మహిళలు
- ➤ పేదల చదువులకు ధైర్యాన్నిస్తున్న అమ్మ ఒడి, గోరుముద్ద, విద్యా దీవెన, వసతి దీవెన, ఇంగ్లిష్ మీడియం
- ➤ కళ్లెదుటే పోర్టులు, ఫిష్ ల్యాండింగ్ సెంటర్ల నిర్మాణంతో తీర ప్రాంతంలో విస్తారంగా ఉపాధి
- ➤ టాటాలు, బిర్లాలు, అదానీలు, అంబానీలు, మిట్టల్, సంఘ్వీ, భజాంకా, భంగర్‌లు క్యూ
- ➤ వివిధ రంగాల అభివృద్ధితో గత 59 నెలల్లో 58.22 లక్షల మందికి ఉద్యోగాలు, ఉపాధి
- ➤ రాష్ట్రంలో గత ఐదేళ్లలో 5.3 శాతం నుంచి 4.2 శాతానికి తగ్గిన నిరుద్యోగం
- ➤ దేశంలో సులభతర వాణిజ్యంలో ఏటా నంబర్ వన్ స్థానంలో నిలుస్తున్న రాష్ట్రం
- ➤ బాబు హయాంలో 11.77 శాతం ఉన్న పేదరికం ఇప్పుడు 4.19 శాతానికి తగ్గుముఖం
- ➤ కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు శాఖ, నీతి ఆయోగ్ నివేదికలే ఇందుకు సాక్ష్యం
- ➤ చంద్రబాబు అధోగతిపాలు చేసిన రాష్ట్రాన్ని తన సుపరిపాలనతో పునర్నిర్మిస్తున్న సీఎం జగన్

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

పేదరిక నిర్మూలనే ధ్యేయంగా ప్రజల జీవన ప్రమాణాలను పెంచడమే లక్ష్యంగా నవరత్నాలు-సంక్షేమ పథకాల ద్వారా డీబీటీ రూపంలో రాష్ట్రంలో సగటున 87 శాతం కుటుంబాల పేదల ఖాతాల్లో నేరుగా రూ.2.70 లక్షల కోట్లు జమ చేశారు. వాటిని సద్వినియోగం చేసుకున్న పేదలు దారిద్ర్యం నుంచి బయట పడుతున్నారు. రాష్ట్రంలో పేదరికం చంద్రబాబు సర్కార్ హయాంలో 11.77 శాతం ఉంటే.. ఇప్పుడు 4.19 శాతానికి తగ్గడమే అందుకు నిదర్శనం. రాష్ట్ర తలసరి ఆదాయం చంద్రబాబు హయాంలో 2018-19లో రూ.1,51,173లు ఉంటే.. సీఎం జగన్ హయాంలో 2022-23 నాటికి రూ.2,19,518కు పెరిగింది. కేంద్రం జీడీపీలో రాష్ట్ర వాటా చంద్రబాబు హయాంలో ఐదేళ్లు సగటున 4.47 శాతం ఉంటే.. సీఎం జగన్ హయాంలో 4.82 శాతానికి పెరిగింది.

సీఎం జగన్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సులభతర వాణిజ్యం(ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్)లో రాష్ట్రం నంబర్ వన్ స్థానంలో నిలుస్తూ వస్తోంది. ఎగుమతుల్లో రాష్ట్రం చంద్రబాబు హయాంలో తొమ్మిదో స్థానంలో నిలిస్తే.. సీఎం జగన్ హయాంలో ఐదో స్థానానికి చేరుకుంది. పరిశ్రమల స్థాపన కోసం చంద్రబాబు హయాంలో ఏడాదికి సగటున రూ.11,994 కోట్ల పెట్టుబడులు వస్తే.. సీఎం జగన్ హయాంలో ఏటా సగటున రూ.14,896 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఎంఎస్ఎంఈలు చంద్రబాబు హయాంలో 1.9 లక్షలు ఉంటే.. సీఎం జగన్ హయాంలో ఏడు లక్షలకు చేరుకున్నాయి.

పారిశ్రామికాభివృద్ధి శరవేగంగా సాగుతుండటంతో ఉపాధి అవకాశాలు పెరిగాయి. రాష్ట్రంలో పీఎఫ్ ఖాతాలు చంద్రబాబు హయాంలో 44.85 లక్షలు ఉంటే.. సీఎం జగన్ హయాంలో 2022-23 నాటికి 60.73 లక్షలకు పెరిగాయి. రాష్ట్రంలో చంద్రబాబు హయాంలో నిరుద్యోగ రేటు 5.3 శాతం ఉంటే.. ఇప్పుడు అది 4.2 శాతానికి తగ్గింది.

రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసిన సీఎం జగన్ విత్తనం నుంచి విక్రయం దాకా రైతులకు దన్నుగా నిలుస్తున్నారు. దాంతో వ్యవసాయాభివృద్ధిలో రాష్ట్రం అగ్రగామిగా నిలుస్తోంది. దేశంలో దేశీయ స్థూల ఉత్పత్తి (జీడీపీ)లో వ్యవసాయ రంగం వాటా 17-18 శాతం ఉంటే.. రాష్ట్రంలో గత నాలుగేళ్లుగా దేశ జీడీపీలో వ్యవసాయ రంగం వాటా 36 శాతం ఉంది. వ్యవసాయానికి పగటిపూటే 9 గంటల విద్యుత్ సరఫరాకు ఏటా సగటున రూ.8,700 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. ఉచిత పంటల బీమా, ఆర్బీకేలు దేశానికి ఆదర్శంగా నిలిచాయని నీతి ఆయోగ్ అభినందించింది.

గతంలో ఎన్నడూ లేని విధంగా పారిశ్రామిక దిగ్గజ గ్రూపులు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాయి. అచ్యుతాపురం వద్ద జపాన్‌కు చెందిన యకహోమా టైర్స్, అదానీ డేటా సెంటర్, ఇన్ఫోసిస్, రాండ్‌స్టాండ్, లారస్ ల్యాబ్, విజయనగరంలో శారదా మెటల్స్ ఉత్పత్తిని ప్రారంభించాయి. భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. బలభద్రపురంలో గ్రాసిమ్ ఇండస్ట్రీస్, కాకినాడలో లూపిన్ ఫార్మా, గుంటూరు జిల్లాలో ఐటీసీ స్పైసెస్ పార్కు, పిడుగురాళ్ల వద్ద శ్రీ సిమెంట్స్, నెల్లూరు జిల్లాలో ఇండోసోల్ సోలార్ ప్యానల్స్ తయారీ, క్రిభ్‌కో ఇథనాల్, గ్రీన్‌ల్యామ్ సొల్యూషన్స్, గోకుల్ ఆగ్రో ప్రారంభం అయ్యాయి. చిత్తూరులో బ్లూస్టార్, డైకిన్, హావెల్స్, యాంబర్, ఎన్‌జీసీ ట్రాన్స్‌మిషన్స్, టీసీఎల్, వైఎస్సార్ జిల్లాలో డిక్సన్, సెంచరీ ప్లైవుడ్స్, బిర్లా గార్మెంట్స్, కర్నూలు జిల్లాలో రాంకో సిమెంట్స్, జేఎస్‌డబ్ల్యూ సిమెంట్స్ వంటి భారీ పెట్టుబడులు వచ్చాయి.

సీమలో తు'ఫ్యాన్'

మరోసారి క్లీన్ స్వీప్ దిశగా వైఎస్సార్‌సీపీ

- గత ఎన్నికల్లో 49 శాసనసభ, 8 లోక్‌సభ స్థానాల్లో విజయం
- సీఎం జగన్ సుపరిపాలనతో రాయలసీమ ప్రజల్లో మరింతగా పెరిగిన ఆదరణ
- స్థానిక సంస్థలు, తిరుపతి లోక్‌సభ, బద్వేలు శాసనసభ స్థానం ఉప ఎన్నికల్లో రికార్డు విజయం
- గత ఎన్నికల్లో టీడీపీ గెలిచిన హిందూపురం, ఉరవకొండ, కుప్పంలోనూ స్థానిక సంస్థల్లో ఆధిపత్యం
- ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికలో బీసీ, ఎస్సీ, మైనార్టీలకు పెద్దపీట
- కూటమిని కుదేలు చేసిన రాప్తాడు సిద్ధం సభ, బస్సు యాత్ర, ప్రచార సభలు
- ప్రచారంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు ప్రజల బ్రహ్మరథం.. టీడీపీ ఆవిర్భావం నుంచి గెలుస్తూ వస్తున్న హిందూపురంలో ఈసారి సైకిల్' గల్లంతే
- ఉరవకొండలో పయ్యావులకు ఎదురుగాలి
- కుప్పంలో పోటాపోటీ.. బాబు వెన్నులో వణుకు



సాక్షి, అమరావతి: రాయలసీమలో ఫ్యాన్ గాలి ప్రచండంగా వీస్తోంది. ప్రభుత్వం వల్ల మీ కుటుంబానికి మంచి జరిగి ఉంటే మీ బిడ్డకు మీరే సైనికులుగా నిలబడండి అంటూ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఇచ్చిన పిలుపునకు 'సీమ' ప్రజలు పిడికిలి బిగించి సిద్ధం.. సిద్ధం.. అంటూ ప్రతిస్పందిస్తున్నారు. ప్రచారంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు జనం బ్రహ్మరథం పడుతుంటే.. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థులకు ప్రజల నుంచి నిరాశ ఎదురవుతోంది. వీటిని పరిగణనలోకి తీసుకుంటే సార్వత్రిక ఎన్నికల్లో సీమలోని ఉమ్మడి అనంతపురం, కర్నూలు, వైఎస్సార్, చిత్తూరు జిల్లాల్లోని 52 శాసనసభ, 8 లోక్‌సభ స్థానాలను వైఎస్సార్‌సీపీ చేజిక్కించుకోవడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. గత ఎన్నికల్లో సీమలో 8 లోక్‌సభ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ క్లీన్ స్వీప్ చేసింది. 52 శాసనసభ స్థానాలకుగాను 49 స్థానాలను చేజిక్కించుకుంది. హిందూపురం, ఉరవకొండ, కుప్పంలలో మాత్రమే టీడీపీ గెలిచి ఉనికి చాటుకుంది.

సంక్షేమాభివృద్ధి పథకాలు.. సుపరిపాలనకు పట్టం

గత 59 నెలలుగా సంక్షేమాభివృద్ధి పథకాలు, సుపరిపాలన అందిస్తున్న సీఎం జగన్ నాయకత్వంపై సీమ ప్రజల్లో విశ్వసనీయత మరింత పెరిగింది. నిర్వాసితులకు పునరావాసం కల్పించిన సీఎం జగన్.. గండికోట, చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లలో పూర్తి స్థాయిలో నీటిని నిల్వ చేశారు. తెలుగు గంగ ప్రధాన కెనాల్‌కు లైనింగ్‌ను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి.. మట్టికట్ట లీకేజీలకు డయాఫ్రమ్ వాల్‌తో అడ్డుకట్ట వేసి బ్రహ్మంసాగర్‌లో పూర్తి స్థాయిలో నీటిని నిల్వ చేశారు. కృష్ణా, తుంగభద్ర, పెన్నా, కుందూ వరదను ఒడిసిపట్టి దుర్భిక్ష సీమను సస్యశ్యామలం చేశారు. కృష్ణా జలాలపై సీమ హక్కులను పరిరక్షించేలా రాయలసీమ ఎత్తిపోతలను చేపట్టిన సీఎం జగన్.. వరదను ఒడిసి పట్టి ప్రాజెక్టులను నింపేందుకు కరవు నివారణ ప్రణాళిక కింద కాలువలు, ఎత్తిపోతల సామర్థ్యం పెంచే పనులు చేపట్టారు. ఇది స్థానిక సంస్థల (పంచాయతీ, మున్సిపల్, మండల పరిషత్, జిల్లా పరిషత్) ఎన్నికల్లో ప్రస్ఫుటితమైంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేసిన వైఎస్సార్‌సీపీ చరిత్ర సృష్టించింది. 2019 ఎన్నికల్లో టీడీపీ గెలిచిన కుప్పం, హిందూపురం, ఉరవకొండ నియోజకవర్గాల్లోనూ స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ స్పష్టమైన ఆధిపత్యాన్ని సాధించింది.

రాప్తాడు 'సిద్ధం' సభతో ఖాయమైన వైఎస్సార్‌సీపీ విజయం

ఎన్నికలకు వైఎస్సార్‌సీపీ శ్రేణులను సన్నద్ధం చేయడానికి రాప్తాడులో సీఎం జగన్ నిర్వహించిన సిద్ధం సభకు సీమ ప్రజలు ఊళ్లకు ఊళ్లు కదలివచ్చారు. ఉమ్మడి, తెలుగు రాష్ట్రాల చరిత్రలో అతి పెద్ద ప్రజాసభగా రాప్తాడు సిద్ధం సభ నిలిచింది. ఈ సభ వేదికగా ఎన్నికల్లో సీమలో వైఎస్సార్‌సీపీ క్లీన్ స్వీప్ చేయడం ఖాయమని ప్రజానీకం చాటిచెప్పారు. ఎన్నికల తొలి విడత ప్రచారంలో భాగంగా మేమంతా సిద్ధం పేరుతో సీఎం జగన్ నిర్వహించిన బస్సు యాత్రకు కెరటాల్లా జనం పోటెత్తితే.. మలి విడత ప్రచారంలో సీఎం జగన్ నిర్వహిస్తున్న సభలు జనసముద్రాలను తలపిస్తున్నాయి. ప్రధాని మోదీ, అమిత్ షాలను రప్పించి చంద్రబాబు, పవన్ కల్యాణ్ నిర్వహించిన కూటమి సభలు జనం లేక వెలవెలబోయాయి. ప్రచారంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు ఇంటింటా జనం బ్రహ్మరథం పడుతుంటే.. కూటమి అభ్యర్థులకు ప్రజలు మొహం చాటేస్తున్నారు. ఎన్నికలు ఏకపక్షంగా సాగుతాయనడానికి ఇదే నిదర్శనమని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు.

ఆ మూడు స్థానాల్లోనూ వైఎస్సార్‌సీపీ విజయం ఖాయం

గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలిచిన 49 శాసనసభ, ఎనిమిది లోక్‌సభ స్థానాల్లో ఈ ఎన్నికల్లో విజయం నల్లేరుపై నడకే. సొంతూరు ఉన్న చంద్రగిరి నియోజకవర్గంలో 1985 ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోయిన చంద్రబాబు.. 1989 ఎన్నికల్లో కుప్పానికి వలస వెళ్లారు. అప్పటి నుంచి దొంగ ఓట్లు, దౌర్జన్యాలు, నోట్ల కట్టలు వెదజల్లి గెలుస్తూ వస్తున్నారు. అలాంటి చంద్రబాబు కోటను స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బద్దలు చేసింది. కుప్పం బ్రాంచ్ కెనాల్‌ను పూర్తి చేసి కుప్పానికి సీఎం జగన్ కృష్ణా జలాలను తరలించడంతో ఆ నియోజకవర్గ ప్రజల్లో సింహభాగం వైఎస్సార్‌సీపీకి మద్దతు పలుకుతున్నారు. దాంతో చంద్రబాబు, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి భరత్ మధ్య పోటీ నువ్వా-నేనా అన్నట్లు సాగుతోంది. కుప్పంలో ఈసారి వైఎస్సార్‌సీపీ పతాకం ఎగరడం ఖాయమని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. టీడీపీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీ గెలుస్తూ వస్తున్న హిందూపురంలో ఈసారి సైకిల్ గల్లంతు కానుంది. హిందూపురంలో సీఎం జగన్ ప్రచార సభకు పోటెత్తిన జనసంద్రమే అందుకు తార్కాణం. టీడీపీ అభ్యర్థి, సిటింగ్ ఎమ్మెల్యే బాలకృష్ణపై వైఎస్సార్‌సీపీ అభ్యర్థి, బీసీ వర్గానికి చెందిన దీపిక విజయం సాధించడం ఖాయం. ఉరవకొండ నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి, సిటింగ్ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్‌కు ఎదురుగాలి తీవ్రంగా వీస్తోంది. ఆ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వై.విశ్వేశ్వరరెడ్డి భారీ మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

తేలిపోయిన చంద్రబాబు..

సీఎం జగన్ క్రేజే వేరు

- ఒకే సమయంలో ఇద్దరి ఇంటర్వ్యూలు ప్రసారం
- జగన్ ఇంటర్వ్యూకు 12 లక్షల వ్యూస్
- అదే సమయంలో బాబు ఇంటర్వ్యూను వీక్షించింది 54 వేల మందే
- యూట్యూబ్ లైవ్ వాచ్‌లోనూ అదరగొట్టిన జగన్



సాక్షి, అమరావతి: సీఎం వైఎస్ జగన్‌కు జనంలో క్రేజ్ ఏ స్థాయిలో ఉంటుందో మరోసారి స్పష్టమైంది. వైఎస్ జగన్, చంద్రబాబు ఇంటర్వ్యూలు ఒకే సమయంలో రెండు వేర్వేరు టీవీ చానళ్లలో ప్రసారం అవ్వగా, జగన్‌కు వచ్చిన వ్యూస్ ముందు చంద్రబాబు తేలిపోయారు. బుధవారం రాత్రి 8 గంటలకు టీవీ9లో జగన్ ఇంటర్వ్యూ ప్రసారం కాగా, అదే సమయంలో ఏబీఎన్ చానల్‌లో చంద్రబాబు ఇంటర్వ్యూ వచ్చింది. ఒకే టైమ్‌లో రెండు వేర్వేరు ఇంటర్వ్యూలకు వచ్చిన వ్యూస్ మధ్య లక్షల్లో తేడా ఉంది. జగన్ ఇంటర్వ్యూకు 20 గంటల వ్యవధిలో 12 లక్షలకు పైగా వ్యూస్ వచ్చాయి. ఇదే సమయంలో చంద్రబాబు ఇంటర్వ్యూకు వచ్చిన వ్యూస్ లక్ష కూడా దాటలేదు. కేవలం 64 వేల వ్యూస్ మాత్రమే వచ్చాయి. జగన్ ఇంటర్వ్యూ యూట్యూబ్ లైవ్‌ను 54 వేల మంది వీక్షించారు. అదే సమయంలో చంద్రబాబు ఇంటర్వ్యూను ఏబీఎన్ యూట్యూబ్ చానల్‌లో 15 వేల మంది మాత్రమే లైవ్‌లో చూశారు. దీన్నిబట్టి ప్రజాదరణలో జగన్ ముందు చంద్రబాబు దిగదుడుపేనని మరోసారి తేలిపోయింది. బహిరంగ సభల్లోనూ ఇద్దరికున్న ప్రజాదరణలో చాలా తేడా కనిపిస్తోంది. జగన్ సభలకు జనం పోటెత్తుతుంటే బాబు సభలు వెలవెలబోతున్నాయి. సిద్ధం సభలకు లక్షల మంది రావడంతో టీడీపీ శ్రేణులు నివ్వెరపోయాయి. ఇప్పుడు ఇంటర్వ్యూల్లోనూ ఇద్దరికి ఉన్న ప్రజాదరణ బయటపడింది. జగన్ టీవీ9 ఇంటర్వ్యూకు భారీ వ్యూస్ వచ్చిన విషయం వైరల్ అవడంతో టీడీపీ సోషల్ మీడియా బాబు ఏబీఎన్ ఇంటర్వ్యూకు పెయిడ్ ప్రమోషన్ మొదలుపెట్టింది.

కాపులు, ముస్లింలకు

రిజర్వేషన్లు అక్కర్లేదు

ఓ ఇంగ్లిష్ టీవీ చానల్ ఇంటర్వ్యూలో పవన్ సంచలన వ్యాఖ్యలు

- ఆ రిజర్వేషన్లు ఇవ్వడం సాధ్యమే కాదంటూ వ్యాఖ్య
- వాటి అమలుకన్నా ఉపాధికి ఉపయోగపడే నైపుణ్యాల్లో యువతకు శిక్షణే మేలని వెల్లడి



సాక్షి, అమరావతి/వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ) : రాష్ట్రంలో చాలాకాలంగా డిమాండ్ చేస్తున్న కాపు రిజర్వేషన్లతో పాటు ముస్లిం రిజర్వేషన్లు అసలు అవసరమేలేదంటూ జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అసలు ఆ రిజర్వేషన్లనే ఆయన వ్యతిరేకిస్తూ పరోక్షంగా పలు వ్యాఖ్యలు చేశారు. ఓ ఇంగ్లీషు ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. ముస్లిం రిజర్వేషన్ల అంశంలో ఇటీవల బీజేపీ జాతీయ నేతలు చేస్తున్న ప్రకటనలకు జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ పూర్తి మద్దతు ప్రకటించడంతో పాటు కోరుకునే వారందరికీ రిజర్వేషన్లు కల్పించడం సాధ్యమేకాదని తన మనస్సులోని మాటను కుండబద్దలు కొట్టారు. ఈ రిజర్వేషన్లకు ప్రత్యామ్నాయ మార్గాలు గురించి ఆలోచన చేయాలన్నారు. ఆ ఇంటర్వ్యూలో సంబంధిత మీడియా ఛానల్ ప్రతినిధి.. ముస్లింలకు సంబంధించి బీజేపీ వైఖరి గురించి పవన్‌ను ప్రశ్నించినప్పుడు, బీజేపీ ముస్లింలకు వ్యతిరేకం కాదని వ్యాఖ్యానించారు. కానీ, వాళ్లు (బీజేపీ) ముస్లిం రిజర్వేషన్లు అమలుచేయబోమని ఆ పార్టీ నేతలు నేరుగా చెబుతున్నారు కదా.. దానిపై మీరేమీ నిరాశ చెందడంలేదా అన్న ప్రశ్నకు పవన్ బదులిస్తూ.. ముస్లిం రిజర్వేషన్లపై బీజేపీ నేతల ప్రకటనల పట్ల తానేమీ నిరాశ, ఆందోళన చెందడంలేదని చెప్పారు. అయినా, రిజర్వేషన్ల అమలుకన్నా యువతకు ఉపాధి అవకాశాలు, నైపుణ్యాలు పెంచేలా వివిధ అంశాల్లో శిక్షణ ఇవ్వాలని సూచించారు.

అందరికీ రిజర్వేషన్లు కూడా కుదరదు..

రిజర్వేషన్లు కావాలని కోరుకుంటున్న అన్ని వర్గాలకు రిజర్వేషన్లు కల్పించాలన్నా సాధ్యమయ్యే పరిస్థితి కాదని పవన్ తేల్చిచెప్పారు. ప్రత్యేకంగా తమ సొంత (కాపు) కులం కూడా రిజర్వేషన్ల కోసం కొన్ని దశాబ్దాలుగా పోరాటం చేస్తోందన్నారు. అందరికీ రిజర్వేషన్లు ఇవ్వాలన్నా కుదరదని.. మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించకూడదని సుప్రీంకోర్టు స్పష్టంచేసిందని పవన్ గుర్తుచేశారు. రిజర్వేషన్లు ఇవ్వడానికి సాధ్యంకానప్పుడు, ప్రత్యామ్నాయ మార్గాల గురించి ఆలోచించాలని ఆయన చెప్పారు.

యువగళాన్ని అసెంబ్లీలో వినిపిస్తా..

మరోవైపు.. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం విజయవాడలో పవన్ పలు ప్రాంతాల్లో పర్యటిస్తూ.. రాష్ట్రంలోని యువకుల గళాన్ని అసెంబ్లీలో బలంగా వినిపిస్తానన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చలేదన్నారు. మైనార్టీల ప్రాథమిక హక్కులకు తాను అండగా ఉంటానని.. కాపులకు రిజర్వేషన్లను అడుగుతున్నారని, న్యాయస్థానాల్లో ఉన్న అంశాలపై తాము మాట్లాడకూడదంటూ ఇంగ్లీష్ టీవీ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూకు భిన్నంగా మాట్లాడారు. ఇక ఇక్కడ తాను పెంచి పెద్దచేసిన నాయకుడు తనపై విమర్శలు చేస్తూ తిటడం బాధ కలిగిస్తోందని పోతిన మహేష్ పేరు ప్రస్తావించకుండా వ్యాఖ్యానించారు.



మధ్యాహ్నం 11.40 గంటలకు కర్నూలులో సీఎం వైఎస్ జగన్ ఎన్నికల ప్రచార సభకు హాజరైన అశేష జనవాహిని...



మధ్యాహ్నం 1.50 గంటలకు అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలో సీఎం వైఎస్ జగన్ ఎన్నికల ప్రచార సభకు ఎండను సైతం లెక్కచేయకుండా హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం



సాయంత్రం 4.45 గంటలకు రాజంపేటలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచార సభకు హాజరైన అశేష జనవాహినిలో ఓ భాగం

అది పెత్తందార్ల కూటమి

కర్నూలు, కళ్యాణదుర్గం, రాజంపేట ఎన్నికల సభల్లో సీఎం జగన్ ధ్వజం

- దుష్ట చతుష్టయానికి ఏం కావాలో మోదీ, షా అదే మాట్లాడుతున్నారు
- పదేళ్ల క్రితం హామీ ఇచ్చిన హోదాపై ప్రకటన చేస్తారని అందరూ ఆశించారు
- ప్రజలకు తీవ్ర నిరాశ మిగిల్చి.. మనపై నాలుగు రాళ్లేసి వెళ్లారు
- చంద్రబాబు అంత అవినీతిపరుడు దేశ చరిత్రలోనే లేడన్న నోటితోనే పొగడ్తలా?

సాక్షి ప్రతినిధి కర్నూలు/సాక్షి, అనంతపురం/సాక్షి ప్రతినిధి, కడప: ఆంధ్రప్రదేశ్ ప్రజలు కోరుకున్న వాటి గురించి కాకుండా కేవలం చంద్రబాబు, దత్తపుత్రుడు, వదినమ్మ, రామోజీరావు లాంటి దుష్ట చతుష్టయానికి ఏం కావాలి? అని మాత్రమే ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షా ఆలోచిస్తున్నారని ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విమర్శించారు. ఎన్నికల సందర్భంగా ఏపీకి వచ్చిన ఢిల్లీ పెద్దలంతా మన రాష్ట్ర ప్రజలకు ఊరట కల్పించేలా ఎలాంటి ప్రకటన చేయకుండా నాలుగు రాళ్లేసి వెళ్లారని వ్యాఖ్యానించారు. అక్కచెల్లెమ్మల అభ్యున్నతి, అవ్వాతాతల చిరునవ్వులు, సామాజిక వర్గాల వికాసానికి పాటుపడతామని కూటమి నేతలు చెప్పడం లేదని, చంద్రబాబుది పెత్తందార్ల కూటమి అని ధ్వజమెత్తారు. గురువారం కర్నూలులోని వైఎస్సార్ సర్కిల్, అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలోని కొల్లాపురమ్మ టెంపుల్ రోడ్డు వాల్మీకి సర్కిల్, అన్నమయ్య జిల్లా రాజంపేటలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభల్లో సీఎం జగన్ ప్రసంగించారు. ఆ వివరాలివీ..

దేశంలోనే అంత అవినీతిపరుడు లేడన్న నోటితోనే

చంద్రబాబు ఈమధ్య ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షాతో ఏపీలో ఉమ్మడి సభలు పెట్టిస్తున్నాడు. చంద్రబాబు ఉమ్మడి సభలు పెట్టిస్తున్నప్పుడు ప్రజలంతా ఏం ఆశించారంటే.. పదేళ్ల క్రితమే మనకు రావాల్సిన ప్రత్యేక హోదాను ఇప్పటికైనా ఇస్తారేమో! ఈ మాట వారి నోటి నుంచి వస్తుందేమోనని ఆశగా ఎదురు చూశారు. ఆ ప్రకటన చేస్తారేమోనని ఎదురు చూసిన ప్రజలకు నిరాశే మిగిలింది. రాష్ట్ర ప్రజలకు కావాల్సిన మాట ఒక్కటీ మాట్లాడకుండా... చంద్రబాబు నాయుడుకి ఏం కావాలి? దత్తపుత్రుడికి ఏం కావాలి? వదినమ్మకు ఏం కావాలి? దుష్ట చతుష్టయానికి ఏం కావాలి? అని వీళ్లకు సంబంధించిన మాటలు మాత్రమే మాట్లాడి, మన మీద నాలుగు రాళ్లు వేసి వెళ్లారు! అదే మోదీ గారు మొన్నటిదాకా ఇదే చంద్రబాబును 'ఇంతటి అవినీతిపరుడు దేశ చరిత్రలోనే ఉండడు' అని చెప్పిన నోటితోనే ఇవాళ వారి కూటమిలో చేరినందుకు పొగిడి వెళ్లిపోయారు! మరి దీనివల్ల రాష్ట్రంలో రైతులకుగానీ, అక్కచెల్లెమ్మలకుగానీ, అవ్వాతాతలకుగానీ, పిల్లలకుగానీ, సామాజిక వర్గాలకుగానీ ఏ ఒక్కరికైనా లాభం జరిగిందా?

2014 హామీలపై మాట్లాడని కూటమి నేతలు...

మరి దేశ ప్రధాని, కేంద్ర హోంమంత్రి, చంద్రబాబు, దత్తపుత్రుడు, వదినమ్మ వీరంతా 2014లో ఇచ్చిన మేనిఫెస్టోను చూపించి ఇదిగో ఇవన్నీ చెప్పాం.. ఆ ముఖ్యమైన హామీలను నెరవేర్చాం!! అని ఎందుకు చెప్పలేకపోతున్నారు? కూటమి అంటారు.. డబుల్ ఇంజన్ అంటారు! 2014లో ఇదే ముగ్గురి ఫొటోలతో, చంద్రబాబు సంతకం పెట్టి ఇంటింటికీ పంపిన పాంప్లెట్, మేనిఫెస్టోలోని ముఖ్యమైన అంశాలనే అమలు చేయలేకపోతే, అందులో చెప్పిన ఏ ఒక్కటీ అమలు చేయలేనప్పుడు ఇక డబుల్ ఇంజనూ...డబుల్ ఇంజనూ! అని ఎందుకు అంటున్నారు?

అంటరానితనంపై యుద్ధం మిగిలే ఉంది!

ఈ పెత్తందార్ల కూటమి అంతా పేద పిల్లలకు గవర్నమెంట్ బడుల్లో ఇంగ్లిష్ మీడియం చదువులు చెప్పిస్తుంటే తట్టుకోలేకపోతున్నారు. మొన్న వచ్చి చంద్రబాబును పక్కన పెట్టుకుని మాట్లాడిన అమిత్ షా, ఢిల్లీ పెద్దలను అడుగుతున్నా. బాబును, దత్తపుత్రుడినీ అడుగుతున్నా. వీళ్లకు మద్దతు ఇస్తున్న ఈనాడు రామోజీరావు, ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ, టీవీ 5నూ అడుగుతున్నా. మీ పిల్లలు, మీ మనవళ్లు.. మీవాళ్లలో ఏ ఒక్కరికైనా కూడా ఇంగ్లిష్ మీడియం బడుల్లో కాకుండా తెలుగు మీడియంలోగానీ లేదా మీ స్థానిక భాషలోగానీ చదివిస్తున్నారా? పేదలకు వేరే మీడియం అట! మన గవర్నమెంట్ స్కూళ్ల పిల్లలకు మాత్రం తెలుగు మీడియం అట! ఇటువంటి పెత్తందారీ భావజాలంతో వాళ్లు ప్రజల ముందుకు వచ్చి ఓటు వేయమని అడుగుతున్నారు. ఇలాంటి వారికి ఓటు వేస్తే పేద పిల్లలకు, గవర్నమెంట్ బడుల్లో చదువుతున్న ఆ పిల్లలకు ఒక్కరికైనా ఇంగ్లిష్ మీడియం నేర్పుతారా? అందుకే ఆలోచన చేయండి. ఈ రూపం మార్చుకున్న అంటరానితనం మీద మనం చేయాల్సిన యుద్ధం ఇంకా ఎంత ఉందో గుర్తుపెట్టుకోమని కోరుతున్నా.

మోసపూరిత హామీలతో బాబు మేనిఫెస్టో

మరో నాలుగు రోజుల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఇవి కేవలం ఎమ్మెల్యేలు, ఎంపీలను ఎన్నుకునేవి కావు. రాబోయే ఐదేళ్లు ఇంటింటి అభివృద్ధి, పథకాల కొనసాగింపును నిర్ణయించే ఎన్నికలివి.

> "ముఖ్యమంత్రి అనే వ్యక్తి ఆప్యాయత చూపిస్తేనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల్లో ఆత్మస్థైర్యం పెరుగుతుంది. గుండెల్లో పెట్టుకుని ప్రేమ చూపిస్తే గ్రామాలు, రాష్ట్రంలో వారికిచ్చే గౌరవం పెరుగుతుంది. వారి ఆత్మగౌరవం ఇనుమడిస్తుంది" "ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేస్తామని చెబుతున్న బీజేపీతో చంద్రబాబు కొనసాగుతున్నారు. ఆరు నూరైనా ముస్లిం మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్లు కొనసాగాల్సిందే. ప్రధాని మోదీ సమక్షంలో ఇలా మాట్లాడే ధైర్యం చంద్రబాబుకు ఉందా? ఒక్క రిజర్వేషన్లే కాదు.. ఎన్ఆర్‌సీ, సీఏఏతో పాటు ఏ అంశమైనా సరే ముస్లిం మైనార్టీల మనోభావాలకు, ఇజ్జత్, ఇమాన్‌కు అండగా నిలబడతాం. 175 అసెంబ్లీ సీట్లకుగానూ 4 శాతం అంటే ఏడు అసెంబ్లీ సీట్లు ముస్లింలకు ఇచ్చి పొలిటికల్ రిజర్వేషన్లు కూడా కల్పించిన ఏకైక పార్టీ మీ బిడ్డది మాత్రమే. మైనార్టీలకు ఏనాడైనా మంచి చేసిన చరిత్ర చంద్రబాబుకు ఉందా? ఎన్ని జన్మలకైనా వస్తుందా? చంద్రబాబుది ఊసరవెల్లి రాజకీయం. ఆయన బాగా ముదిరిపోయిన తొండ"
>
> – కర్నూలు సభలో సీఎం జగన్

జగన్‌కు ఓటేస్తే పథకాలన్నీ కొనసాగింపు, ఇంటింటి అభివృద్ధి జరుగుతుంది. పొరపాటున చంద్రబాబుకు ఓటు వేస్తే పథకాలన్నింటికీ ముగింపు, మళ్లీ మోసపోవడమే! చంద్రబాబుకు ఓటు వేయడం అంటే కొండ చిలువ నోట్లో తలకాయ పెట్టడమే. ఆయన జీవితమంతా మోసాలు, అబద్ధాలే. అధికారం దక్కిన ప్రతిసారీ పేదలను మోసం చేశాడు. ఇది చరిత్ర చెబుతున్న సత్యం. సాధ్యం కాని హామీలతో చంద్రబాబు మోసపూరితంగా ఇచ్చిన మేనిఫెస్టోకు అర్థం లేదు. ఎన్నికల తరువాత మేనిఫెస్టోను చెత్తబుట్టలో వేసే సంప్రదాయాలను మారుస్తూ 99 శాతం వాగ్దానాలను చిత్తశుద్ధితో అమలు చేశాం. గతంలో రాష్ట్రంలో కేవలం నాలుగు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు మాత్రమే ఉంటే మీ బిడ్డ ఏకంగా మరో 2.31 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు కొత్తగా ఇచ్చాడు. రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ చూడని విధంగా రూ.2.70 లక్షల కోట్లు బటన్ నొక్కి వివిధ పథకాల ద్వారా అక్క చెల్లెమ్మల కుటుంబాలకు అందించాం.

వ్యవస్థల్లో సమూల మార్పులు..

నాడు–నేడుతో బాగుపడిన ప్రభుత్వ పాఠశాలలు, ఇంగ్లీషు మీడియం, ఆరో తరగతి నుంచి డిజిటల్ బోధన, 8వ తరగతి నుంచి పిల్లలకు ట్యాబ్‌లు, తొలిసారిగా బైలింగ్యువల్ పాఠ్య పుస్తకాలు, మూడో తరగతి నుంచే సబ్జెక్ట్ టీచర్లు, సీబీఎస్ఈ నుంచి ఐబీ దాకా ప్రయాణం, బడులు తెరవగానే విద్యాకానుక, గోరుముద్ద, అమ్మ ఒడి, పూర్తి ఫీజులు చెల్లిస్తూ విద్యాదీవెన, వసతి దీవెన, కరిక్యులమ్‌లో సమూల మార్పులు, అంతర్జాతీయ వర్సిటీల నుంచి సర్టిఫైడ్ ఆన్‌లైన్ కోర్సులు, తప్పనిసరి ఇంటర్న్‌షిప్.. ఇలాంటి విద్యా విప్లవాలను గతంలో ఎప్పుడైనా చూశారా? ఇంజనీరింగ్, డాక్టర్, డిగ్రీ లాంటి ఉన్నత చదువులు అభ్యసించే విద్యార్థుల్లో ఏకంగా 93% మంది జగనన్న విద్యా దీవెన అందుకుంటున్నారు. నా అక్క చెల్లెమ్మలు వారి కాళ్లపై నిలబడేలా ఆసరా, సున్నావడ్డీ, ఓ చేయూత, కాపునేస్తం, ఈబీసీ నేస్తంతో పాటు 31లక్షల ఇళ్లపట్టాలు వారి పేరుపై రిజిస్ట్రేషన్ చేశాం. ఏకంగా 22 లక్షల ఇళ్ల నిర్మాణం చేపట్టడం గతంలో ఎప్పుడైనా జరిగిందా?

రైతన్నలకు తోడుగా..

గతంలో ఎప్పుడూ చూడని విధంగా రైతన్నలకు పెట్టుబడి సాయంగా రైతు భరోసా, ఉచిత పంటల బీమా, సీజన్ ముగిసేలోపు ఇన్‌పుట్ సబ్సిడీ, పగటి పూట 9 గంటలు నాణ్యమైన ఉచిత విద్యుత్ లాంటి పథకాలను తీసుకొచ్చాం. రైతన్నలను ఇంతగా ప్రేమించే ప్రభుత్వం కానీ పథకాలు కానీ గతంలో ఉన్నాయా? స్వయం ఉపాధికి అండగా ఆటోలు, టాక్సీలు నడిపే డ్రైవర్లకు వాహనమిత్ర, నేతన్న నేస్తం, మత్స్యకార భరోసాతో పాటు చిరువ్యాపారులకు తోడు, చేదోడు అందించాం.

ఆరోగ్యం.. పౌరసేవలు

వైద్యం కోసం ఏ ఒక్కరూ అప్పుల పాలయ్యే పరిస్థితి రాకూడదని రూ.25 లక్షల వరకూ ఆరోగ్యశ్రీని విస్తరించి ఉచితంగా సేవలందిస్తున్నాం. విశ్రాంతి సమయంలో ఆరోగ్య ఆసరా ద్వారా అండగా నిలిచాం. గ్రామంలోనే విలేజ్ క్లినిక్, ఫ్యామిలీ డాక్టర్, ప్రతి ఇంటినీ జల్లెడ పడుతూ ఆరోగ్య సురక్ష తెచ్చాం. ప్రజల ఆరోగ్యం కోసం ఇంతగా పరితపించిన ప్రభుత్వం గతంలో ఉందా? ఇవాళ ఏ గ్రామానికి వెళ్లి చూసినా 600 రకాల పౌరసేవలు అందిస్తున్న గ్రామ సచివాలయం కనిపిస్తోంది. 60–70 ఇళ్లకు వలంటీర్ల సేవలు, ఇంటికే రూ.3 వేల పింఛన్, రేషన్, పౌరసేవలు, పథకాలు, గ్రామాల్లో అక్క చెల్లెమ్మలకు అండగా మహిళా పోలీసు, దిశ యాప్ లాంటివి గతంలో ఎప్పుడైనా అమలయ్యాయా? మరి 14 ఏళ్లు సీఎంగా చేశానని చెప్పుకునే చంద్రబాబు పేరు చెబితే ఏ పేదవాడికైనా ఒక్కటైనా మంచి పని గుర్తుకొస్తుందా?



అభివాదం చేస్తున్న సీఎం వైఎస్ జగన్

బాబు ఇచ్చే డబ్బులన్నీ మీవే..

బటన్లు నొక్కి మీ బిడ్డ మీకు మంచి చేశాడు. ఎలాంటి బటన్లు నొక్కని చంద్రబాబు వద్ద డబ్బులు దండిగా ఉన్నాయి. మీకు ఇవ్వాల్సిన డబ్బులను ఆయన దోచుకున్నాడు. ఆ దోచుకున్న డబ్బులో నుంచి ఓటుకు రూ.2 వేలు, రూ.3 వేలు, కొన్ని చోట్ల రూ.4 వేలు కూడా ఇచ్చేందుకు తయారుగా ఉన్నాడు. చంద్రబాబు డబ్బులిస్తే వద్దనకుండా తీసుకోండి. ఎందుకంటే.. ఆ డబ్బు అంతా మనదే. మన దగ్గర నుంచి దోచేసిన సొమ్మే అదంతా. కానీ ఓటు వేసేటప్పుడు మాత్రం ప్రతి ఒక్కరూ ఆలోచన చేయండి. మీకు ఎవరి వల్ల మంచి జరిగిందో ఆలోచించండి. మీ కుటుంబ సభ్యులతోనూ చర్చించండి. చిన్నపిల్లల అభిప్రాయం కూడా తీసుకుని నిర్ణయం తీసుకోండి. ఎవరి వల్ల ఈ మంచి కొనసాగుతుందో గమనించి ఓటేయాలని కోరుతున్నా. మంచి చేసిన ఫ్యాను ఇంట్లోనే ఉండాలి. చెడు చేసిన సైకిల్ ఇంటి బయటే ఉండాలి. తాగేసిన టీ గ్లాస్ సింకులోనే ఉండాలి. మళ్లీ వలంటీర్లు మన ఇంటికే రావాలన్నా, పేదవాడి భవిష్యత్తు బాగుండాలన్నా, పథకాలన్నీ కొనసాగాలన్నా, లంచాలు, వివక్ష లేని పాలన కొనసాగాలన్నా, బడులు, పేద పిల్లల చదువులు బాగుండాలన్నా, వైద్యం, వ్యవసాయం మెరుగ్గా ఉండాలన్నా ఫ్యాన్ గుర్తుపై రెండు బటన్లు నొక్కి 175 అసెంబ్లీ, 25 ఎంపీ స్థానాల్లో మన అభ్యర్థులనే గెలిపించాలి.

ముస్లింలపై బాబు కపట ప్రేమ..

ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లను రద్దు చేస్తామని బీజేపీ శపథం చేసింది. అలాంటి పార్టీతో చంద్రబాబు జత కట్టాడు. మైనార్టీల రిజర్వేషన్లను రద్దు చేస్తామంటున్న బీజేపీ తోనే కొనసాగుతానంటున్నాడు. మైనార్టీలను మోసం చేసేందుకు డ్రామాలాడుతూ కపట ప్రేమ నటిస్తున్నాడు. ఇంతకంటే ఊసరవెల్లి రాజకీయాలు ఉంటాయా? ఈ రోజు నేను మీ అందరి సమక్షంలో చెబుతున్నా.. ఆరు నూరైనా నూరు ఆరైనా 4 శాతం రిజర్వేషన్లు ఉండి తీరాల్సిందే. ఇది మీ బిడ్డ జగన్ ఇస్తున్న మాట. వైఎస్సార్ బిడ్డ మాట. ఈ మాట ప్రధాని మోదీ సమక్షంలో చంద్రబాబు చెప్పగలరా? మైనార్టీల రిజర్వేషన్లను రద్దు చేస్తామని బీజేపీ చెప్పిన తర్వాత కూడా ఎందుకు కొనసాగుతున్నారు? మైనార్టీలపై మీ బిడ్డ జగన్‌ది నిజమైన ప్రేమ. ఇవాళ ఇక్కడున్న వేలాది మందితోపాటు అందరికీ ఒక్క విషయం చెబుతున్నా..! ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు మతం ప్రాతిపదికన ఇచ్చినవి కాదు. ముస్లింలలోనూ ఉన్నత వర్గాలకు రిజర్వేషన్లు వర్తించడం లేదు. వారిలో పేదవారికి మాత్రమే ఇచ్చారు. అన్ని మతాల్లోనూ బీసీలు, ఓసీలు ఉంటారు. అలాంటప్పుడు రాజకీయం స్వార్థంతో మైనార్టీలను వేరేగా చూసి వారి నోటిదాకా వచ్చిన కూడును తీసేయాలనుకోవడం ఎంత వరకూ ధర్మం? రాజకీయ స్వార్థం కోసం వారి జీవితాలతో ఆడుకోవడం దుర్మార్గం కాదా? ఎట్టిపరిస్థితుల్లోనూ వారికి రిజర్వేషన్లు కొనసాగుతాయి. రిజర్వేషన్‌లతో పాటు ఎన్ఆర్‌సీ, సీఏఏ లాంటి ఏ అంశంలోనైనా వారికి అండగా నిలబడతా.

బాబు హేళన చేస్తే జగన్ ఆత్మస్థైర్యం కల్పించాడు

'నేను ప్రతీ సందర్భంలోనూ నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు అంటూ ప్రేమను బాహాటంగా ఎందుకు చూపిస్తానో తెలుసా? ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్నప్పుడు వారిని గుండెల్లో పెట్టుకుని ప్రేమ చూపిస్తే గ్రామాలు, రాష్ట్రంలో వారికిచ్చే గౌరవం పెరుగుతుంది. వారిలో ఆత్మస్థైర్యం, ఆత్మగౌరవం ఇనుమడిస్తుంది. ఇది జరగాలంటే ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి "నా..."అనే ఆప్యాయత చూపించాలి. చంద్రబాబును చూస్తే ఇలాంటి ప్రేమ, న్యాయం దేవుడెరుగు! అధికారంలో ఉంటే బడుగు, బలహీన వర్గాలను హేళన చేసి కించపరుస్తూ బెదిరిస్తారు. దారుణమైన మోసాలూ చేస్తారు.

ఢిల్లీ దాకా సౌండ్ వినిపించాలి..

మీరు ఇక్కడ నొక్కే బటన్ సౌండ్ ఢిల్లీ దాకా వినిపించాలి. మీ బిడ్డ పెన్షన్లు నేరుగా ఇంటికే పంపుతుంటే అడ్డుకున్న వారికి ఆ సౌండ్ వినిపించాలి. అంత గట్టిగా సౌండ్ వినిపించేలా భారీ మెజార్టీతో మన అభ్యర్థులను గెలిపించాలని ప్రార్థిస్తున్నా.

రాజకీయాల్లో పవన్ చీడ పురుగు

పార్టీ పెట్టిన పదేళ్లలో రూ.2,000 కోట్ల అక్రమాస్తులు సంపాదించారు

- తనను నమ్ముకున్న నేతలను బలిపశువుల్ని చేశారు
- ఆయన ముమ్మాటికీ ప్యాకేజీ స్టారే
- పవన్ బినామీలపై ఈడీ, సీబీడీలు విచారణ చేపట్టాలి
- వైఎస్సార్‌సీపీ నేత పోతిన మహేష్ తీవ్ర ఆరోపణలు

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): రాజకీయాల్లో పవన్‌కళ్యాణ్ పెద్ద చీడపురుగని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత పోతిన మహేష్ తీవ్రస్థాయిలో ఆరోపించారు. జనసేన స్థాపించిన పదేళ్లలో ఆయన సుమారు రూ.15 వందల కోట్ల నుంచి రూ.రెండు వేల కోట్ల వరకు అక్రమంగా సంపాదించారని ఆయన వెల్లడించారు. 2014లో కేవలం ఒక అపార్ట్‌మెంట్‌లో ఉంటూ కారు ఈఎంఐ కూడా చెల్లించలేకపోతున్నానని చెప్పిన పవన్ ఇప్పుడు లగ్జరీ కార్లు, విలాసవంతమైన ఇల్లు, తిరగటానికి హెలికాప్టర్, అనేక ఆస్తులను తొమ్మిదేళ్లలో ఎలా సంపాదించారో చెప్పాలని డిమాండ్ చేశారు. విజయవాడలోని తన కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే..




ఇటీవల కాలంలో పవన్ ఏ సినిమా కూడా అద్భుతమైన విజయం సాధించకపోయినా.. రూ.వందల కోట్ల లాభాలు రాకపోయినా జనసేన పార్టీ పెట్టాకే పవన్‌కు రూ.వేల కోట్ల ఆస్తులు వచ్చాయి. ప్రజారాజ్యం పార్టీని నడపలేక తీసేశారుగానీ.. జనసేన పార్టీని మాత్రం ముందే చంద్రబాబుకి అమ్మేసి డబ్బులు తెచ్చుకున్న దుర్మార్గుడు పవన్. మాలాంటి వాళ్లందర్నీ రాజకీయంగా, ఆర్థికంగా బలిపశువులు చేసి ఆయన మాత్రం అన్ని రకాలుగా బాగుపడ్డారు. కాపులను పెద్దన్న పాత్ర పోషించాలని చెప్పి, బీసీలను మార్పుకోసం పోరాడాలని సూచించి ఆయన మాత్రం చంద్రబాబుకు పాలేరు పాత్ర పోషిస్తున్నారు. ఈ ఎన్నికల్లో చంద్రబాబుకు ఎక్కడా ఇబ్బంది కలగకుండా ముందు నుంచే ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీలనివ్వను, నేను చంద్రబాబు సేవకుణ్ణి, చంద్రబాబు పాలేరుని అంటూ ప్యాకేజీ తీసుకుని మాలాంటి వాళ్లను పవన్ బలి పశువులని చేసి ఆయన మాత్రం బాగా ఆర్థికంగా బలపడ్డారు.

ఈ సమావేశంలో పవన్ ఆక్రమాస్తులు.. బినామీల పేర్లతో కొనుగోలు చేసిన వాటి వివరాలను పోతిన మహేష్ వెల్లడించారు. అవి..

- మంగళగిరి పార్టీ ఆఫీస్ పక్కన పవన్ బినామి అయినా నర్రా శ్రీనివాస్ మిత్రుడు పోషడుపు వెంకటేశ్వరరావు పేరు మీద రూ.100 కోట్ల విలువైన ఐదెకరాల భూమిని కొనుగోలు చేశారు. ఆధార్ కార్డుపై అనేక అనుమానాలున్నాయి. పోషడుపు వెంకటేశ్వరరావు గుంటూరు అయితే చెల్లించిన బ్యాంకు చెల్లింపులు హైదరాబాద్‌లోని ఐసీఐసీఐ బ్యాంకువి. వీటిపై సమాధానం చెప్పాలి. రెండు రిజిస్ట్రేషన్లకి పోషడుపు వెంకటేశ్వరరావు హాజరుకాగా.. మరొక రెండు రిజిస్ట్రేషన్లకు నర్రా శ్రీనివాస్ కారు డ్రైవర్ వి. నవీన్‌కుమార్ హాజరయ్యారు. డాక్యుమెంట్ నెంబర్లు : 704/2024, 2244/2024, 2818/2024, 3555/2024, 5002/2014.
- రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లిలో పవన్ ఫామ్‌హౌస్ 14 ఎకరాల్లో ఉందని అఫిడవిట్‌లో చూపించారు. కానీ, అది 45–50 ఎకరాల్లో ఉంది. పాతది 14 ఎకరాలైతే.. 2019 ఎన్నికల తర్వాత పవన్ మరొక 30 ఎకరాలు కొనుగోలు చేశారు. ఒక్కో ఎకరం ఏడున్నర కోట్లు అంటే సుమారు రూ.250 కోట్ల విలువైన ఆస్తిని కొనుగోలు చేశారు. అది కూడా బినామీ పేర్ల మీద పెట్టారు.
- 2019 ఎన్నికల్లో పవన్‌కు ఎన్ఆర్ఐలు, కాపు సామాజిక వర్గానికి చెందిన కొంతమంది పెద్దలు రూ.125 కోట్ల విరాళాలిచ్చారు. వాటిని వసూలుచేసింది పీపీ రావు, ఆర్ఆర్ రామ్మోహన్, చింతల పార్థసారధి, ముత్తంశెట్టి కృష్ణారావు. అందులో 90శాతం నగదు రూపంలో, పది శాతం డీడీల రూపంలో ఇచ్చారు. ఆ వివరాలు అడిగినందునే వాళ్ల మధ్య వివాదాలొచ్చాయి.
- పవన్ నిజస్వరూపం తెలియాలంటే 2018–2024 వరకు చిరంజీవి, ఆయన కుమారుడు రామ్‌చరణ్ తప్ప పవన్ కుటుంబ సభ్యుల ఆస్తుల వివరాలన్నీ బయటపెట్టాలి.
- పవన్ హైదరాబాదులో కొనుగోలు చేసిన 4,200 గజాల విలువ రూ.50 కోట్లుగా చూపించారు. దానిని 2021–2024 మధ్యే కొనుగోలు చేశారు. నిజానికి.. దాని విలువ సుమారు 125 కోట్లుగా ఉంది. మిగిలిన రూ.75 కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయో చెప్పాలి. సినిమాలు లేకుండా ఈ నగదు ఎక్కడి నుంచి వచ్చిందో చెప్పాలి.
- పవన్ బ్యాంకుల్లో ఫిక్స్ డిపాజిట్ల కింద రూ.28 కోట్లు ఉన్నాయని చూపించారు. కానీ, బయట వ్యక్తుల దగ్గర రూ.46 కోట్ల అప్పులను కూడా చూపించారు. బ్యాంకులో రూ.28 కోట్లు ఉండగా ఎక్కువ వడ్డీకి ఎవరైనా బయట నుంచి అప్పు తెచ్చుకుంటారా?
- సినీ పరిశ్రమలోను, బయట పవన్ బినామీలున్నారు. వారిలో ప్రధానంగా నర్రా శ్రీనివాస్, త్రివిక్రమ్ శ్రీనివాస్, పీపుల్స్ మీడియా ప్రొడ్యూసర్ టీజీ విశ్వప్రసాద్. వీరితోపాటు అమెరికాలోని పవన్ పిన్ని కొడుకు అనిల్, అలాగే, తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, తంగేళ్ల సుమన్ వీరంతా కూడా ఆయన బినామీలే.
- ఇక పవన్ కొనుగోలు చేసిన ఆస్తులు కాకుండా అనేక ఆస్తులు అగ్రిమెంట్ మీద స్వాధీనం చేసుకున్నారు. వాటినింకా రిజిస్ట్రేషన్ చేసుకోలేదు. ఎన్నికల తర్వాత కొన్ని సినిమా అడ్వాన్సుల కింద తీసుకున్నట్లు చూపించి ఆపై రిజిస్ట్రేషన్ చేయించుకోనున్నారు. హైదరాబాద్‌లో ఆంధ్రజ్యోతి కార్యాలయం వెనుక నాలుగు నెలలు కిందటి వరకు జనసేన కార్యాలయంగా ఉన్న స్థలం సొంత కార్యాలయంగా మారిపోయింది.
- టీ టైమ్ తంగెళ్ల శ్రీనివాస్‌కు 2,500 టీ దుకాణాలు ఉన్నాయి. పవన్ తన బ్లాక్‌మనీని వైట్‌మనీగా మార్చుకునేందుకు ఈ దుకాణాలను మార్గంగా ఎంచుకున్నారు.
- పవన్ తన పిల్లల పేర్లు మీద ఫిక్స్‌డ్ డిపాజిట్లు రద్దుచేశానని చెప్పారుగానీ ఎప్పుడు ఏ బ్యాంకులో ఎంత మొత్తానివి రద్దుచేసి ఏ ఆస్తి కొన్నారో చెప్పాలి.
- జనసేన కార్యాలయాల కోసం కొనుగోలు చేస్తున్న స్థలాలన్నీ కూడా పవన్ పేరు మీద ఎందుకు పెట్టాలి? పార్టీ పేరు మీద ఎందుకు రిజిస్ట్రేషన్ చేయించడంలేదు?
- ప్యాకేజ్ ద్వారా తీసుకున్న డబ్బుల్ని ఫ్లోరిడాలో పెట్టుబడులు పెట్టేందుకే పవన్ విరాళాల ముసుగులో అమెరికా వెళ్తున్నారు.
- త్రివిక్రమ్ శ్రీనివాస్‌తో కలిసి బెంగళూరులో కమర్షియల్ కాంప్లెక్స్ కొనుగోలు చేయడానికి పవన్ యత్నిస్తున్నారు. హాసిని ప్రొడక్షన్స్ ద్వారా ఈ డబ్బులు చెల్లించేందుకు సిద్ధమయ్యారు.
- పవన్‌తో తీసిన సినిమాలు ఫ్లాప్ అయినా, డబ్బులు రాకపోయినా నిర్మాత విశ్వప్రసాద్ పవన్‌తో ఏడు సినిమాలు తీస్తానని చెప్తున్నారు. ఈ చిదంబర రహస్యం ఏంటి?
- పవన్ ప్రధాన బినామి టీజీ విశ్వప్రసాద్‌పై సీబీఐ విచారణ చేయాలి. ఈడీ, సీబీడీలు కేసులు నమోదు చేయాలి. రేణుదేశాయ్‌కు ప్రతి నెలా రూ.10 లక్షలు టీజీ విశ్వప్రసాద్ తీసుకెళ్లి ఇస్తున్నారు.
- ప్యాకేజీకి అదనంగా పవన్‌కళ్యాణ్ సీట్లు అమ్ముకున్న మాట ముమ్మాటికి నిజం. జనసేన టికెట్లను తెలుగుదేశం వాళ్లకు ఇచ్చినందుకు ఒక్కో టికెట్‌కు రూ.10 కోట్లు పవన్ వసూలుచేశారు.

రామోజీ రూ.2 వేల కోట్లు అడిగారు

- ఆ డబ్బులిస్తే 'ఈనాడు'లో వైఎస్ జగన్‌కు అనుకూలంగా రాస్తానన్నారు
- ప్రమాణం చేసి కాదని చెప్పగలరా?
- రామోజీరావుకు టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి సవాల్
- సినిమా టికెట్ కోసం రూ.2 దొంగిలించిన దొంగ బాబు



తిరుపతి సభలో మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్ భూమన, వేదికపై ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు మద్దిల గురుమూర్తి, భూమన అభినయ్‌రెడ్డి

సాక్షి, తిరుపతి: 'రామోజీరావు నాకు చాలా సన్నిహితులు. నేను ఆయనను 15 సార్లకుపైగా కలిశా. గంటల గంటలు మాట్లాడుకునేవాళ్లం. ఒకసారి వెళ్లి కలిసినప్పుడు ముసలి గుంటనక్క రామోజీరావు.. 'కరుణాకర్‌రెడ్డి గారు.. రూ.2వేల కోట్లు జగన్ నుంచి ఇప్పిస్తే ఈనాడంతా మీ గురించే రాస్తాం' అన్నారు. ఇది వాస్తవం.. ఏ ప్రమాణానికైనా నేను సిద్ధం. తన బిడ్డలు, మనవళ్లపై ప్రమాణం చేసి కాదని రామోజీ చెప్పగలరా' అని టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తిరుపతిలో గురువారం నిర్వహించిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ రామోజీ, చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌పై ధ్వజమెత్తారు. గత కొంత కాలంగా తమపై, సీఎం వైఎస్ జగన్‌పై ఇష్టమొచ్చినట్టు అక్కసు వెళ్లగక్కుతున్నారని మండిపడ్డారు. రామోజీ కుమారుడు సుమన్ తనకు బాగా తెలుసన్నారు. ఒకసారి కలిసిన సమయంలో సుమన్ తన తండ్రి అన్నమాటలను తనకు చెప్పుకుని బాధపడ్డారన్నారు. రామోజీరావుకు తాను పుట్టలేదన్నారని.. అటువంటి నైజం తన తండ్రిదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి రామోజీ తమపై ఇష్టమొచ్చినట్టు రాస్తున్నారని మండిపడ్డారు. తిరుపతిలో తాను దోపిడీ చేసినట్టయితే ఏ విచారణకైనా సిద్ధమని సవాల్ విసిరారు. గతంలో టీటీడీ చైర్మన్‌గా ఉన్న సమయంలో చంద్రబాబు టీటీడీ పరిపాలన భవనం ముందు ధర్నా చేసిన విషయాన్ని భూమన గుర్తుచేశారు. అప్పుడు తానే నేరుగా వెళ్లి గవర్నర్ నరసింహన్‌ని కలిసి తనపై వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపించాలని కోరానన్నారు. గవర్నర్ నిరాకరించడంతో నాడు సీఎంని కూడా కలిసి తనపై విచారణ కోరినట్లు గుర్తుచేశారు. తనపై విచారణ చేయాలని తానే నిరసనకు దిగితే.. కుర్తాళం పీఠాధిపతి వచ్చి స్వయంగా నిరసన విరమింపజేశారన్నారు.

బాబు, పవన్‌లాంటి దొంగలు పడ్డారు..

1974లో రాడికల్ స్టూడెంట్ నాయకుడిగా ఉన్న సమయంలో నిధుల సేకరణ కోసం తిరుపతిలో 'చక్రపాణి' సినిమాను బెనిఫిట్ షోగా వేశామని భూమన తెలిపారు. అప్పుడు యూనివర్సిటీలో చంద్రబాబుని తాను శ్రీధర్, హైకోర్టు అడ్వొకేట్ సారధి వెళ్లి కలిశామన్నారు. ఆ సమయంలో చంద్రబాబు కూర్చొని, ఆయన స్నేహితుడు పడుకుని ఉన్నాడన్నారు. సినిమా టికెట్ కొనుగోలు చేయాలని అడిగితే.. నిద్రిస్తున్న తన స్నేహితుడి జేబులో ఉన్న రూ.2లను చంద్రబాబు దొంగిలించి తన చేతిలో పెట్టారని తెలిపారు. అటువంటి దొంగ చంద్రబాబు తన గురించి మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. తిరుపతిలో చంద్రబాబు, పవన్ రూపంలో దొంగలు పడ్డారన్నారు. పవన్‌కళ్యాణ్ సంస్కారహీనుడన్నారు. తిరుపతిలో ఆకు రౌడీలను ఏర్పాటు చేసుకుని తన గురించి మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి మద్దెల గురుమూర్తి, ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్‌రెడ్డి, మేయర్ శిరీష ప్రసంగించారు.

యువర్స్

● ఇన్నోవేషన్

సోలార్ వీడ్-కిల్లర్


రామ్‌ధన్



రాజస్థాన్‌కు చెందిన పద్దెనిమిది సంవత్సరాల రామ్‌ధన్ లోధా ఎకో-ఫ్రెండ్లీ ఫామింగ్‌కు ఉపయోగపడే సోలార్ వీడ్-కిల్లర్ మెషిన్‌ను తయారుచేశాడు. ఇది ఇండియన్ సిలికాన్ వ్యాలీ చాలెంజ్‌లో బహుమతి గెలుచుకుంది. కలుపును నిర్మూలించే ఈ యంత్రం సురక్షితమైన వ్యవసాయ పద్ధతులకు ఊతం ఇస్తుంది. పర్యావరణాన్ని దృష్టిలో పెట్టుకొని రామ్‌ధన్ తయారుచేసిన యంత్రానికి స్కేలర్ స్కూల్ ఆఫ్ టెక్నాలజీ నిర్వహించిన 'ఇండియన్ సిలికాన్ వ్యాలీ చాలెంజ్'లో అద్భుత స్పందన వచ్చింది. న్యాయమూర్తులు రామ్‌ధన్‌ను ప్రోత్సహిస్తూ మాట్లాడారు.

రైతుబిడ్డ అయిన రామ్‌ధన్‌కు తన తండ్రితో పాటు ఇతర రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్ల గురించి అవగాహన ఉంది. రసాయన పురుగుమందుల వల్ల రైతుల ఆరోగ్యానికి కలుగుతున్న హాని ఆందోళన కలిగించేది. ఆ ఆందోళన నుంచి వచ్చిందే... సోలార్ ఆపరేటెడ్ వీడ్-కిల్లర్ ఐడియా.

'వ్యవసాయ కుటుంబంలో పుట్టిన నేను రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను, రసాయనాలు అధికంగా వాడడం వల్ల వారు ఎదుర్కొన్న ఆరోగ్య సమస్యలను ప్రత్యక్షంగా చూశాను. సంప్రదాయ వ్యవసాయ పద్ధతుల్లోని పర్యావరణ అనుకూల అంశాలు గుర్తుకు వచ్చాయి. వాటి గురించి ఆలోచిస్తున్నప్పుడు కలుపు నియంత్రణకు... సురక్షితమైన, పర్యావరణానికి హాని కలిగించని యంత్రాన్ని రూపొందించాలనుకున్నాను' అంటాడు రామ్‌ధన్.

తనకు ఒక ఆలోచన వచ్చిన రోజు నుంచి రకరకాలుగా ప్రయోగాలు చేయడం మొదలు పెట్టాడు. ఆర్థిక ఇబ్బందుల వల్ల యంత్ర తయారీ ప్రక్రియ ఒక కొలిక్కి రావడానికి నాలుగు సంవత్సరాలు పట్టింది. చివరికి సోలార్ ఆపరేటెడ్ వీడ్-కిల్లర్ రూపంలో తన కల ఫలించింది.

'ఇండియన్ సిలికాన్ వ్యాలీ చాలెంజ్‌లో పాల్గొనడం గొప్ప అవకాశంగా భావిస్తున్నాను. ఈ అద్భుత అవకాశం వల్ల నేను తయారుచేసిన యంత్రానికి అంతర్జాతీయ గుర్తింపు లభించింది. సోలార్ ఆపరేటెడ్ వీడ్-కిల్లర్ మెషిన్‌ను మన దేశంలోని రైతులందరూ ఉపయోగించాలనేది నా కోరిక' అంటున్నాడు రామ్‌ధన్.

● యంగ్ ఎంటర్‌ప్రెన్యూర్

సూపర్ బేకర్


ఎలీషా పారీఖ్

ఎలీ ది బేకర్, కేక్‌పై మిక్సెస్‌లతో ఎంటర్‌ప్రెన్యూర్‌గా విజయపథంలో దూసుకుపోతోంది ముంబైకి చెందిన పదిహేడేళ్ల ఎలీషా పారీఖ్.

ఏడేళ్ల వయసు నుంచే బేకింగ్ చేయడం మొదలు పెట్టింది ఎలీషా. 'మా పేరెంట్స్ ఆహారప్రియులు. బేకింగ్‌పై ఆసక్తి వారి నుంచే వచ్చింది. నాన్నకు ఫుడ్ బ్లాగ్ కూడా ఉంది' అంటుంది ఎలీషా. పిల్లల కుక్‌బుక్ 'స్టార్ట్ టు కుక్' స్ఫూర్తితో బేకింగ్ చేయడం మొదలు పెట్టింది. సరదాగా మొదలైన బేకింగ్ చిన్న వయసులోనే తనను ఎంటర్‌ప్రెన్యూర్ చేసి పెద్ద పేరు తెస్తుందని ఎలీషా ఊహించి ఉండదు.

పదిహేనేళ్ల వయసులో ఇన్‌స్టాగ్రామ్‌లో పేజీతో పాటు సొంతంగా ఒక వెబ్‌సైట్ స్టార్ట్ చేసింది. ఇన్‌స్టాగ్రామ్ పేజీతో ఆర్డర్లు కూడా రావడం మొదలైంది. దీనికి ముందు పొరుగింటి వారు బ్లాక్ ఫారెస్ట్ కేక్ కోసం ఆర్డర్ ఇచ్చారు. అది వారికి బాగా నచ్చడంతో ఎలీషాకు తన మీద నమ్మకం పెరిగింది.

'ఆర్డర్లపై మొదట ఆసక్తి లేదు. అయితే కస్టమర్‌ల నుంచి వచ్చిన స్పందన చూసిన తరువాత ఆసక్తి పెరిగింది. మొదట్లో ఒత్తిడిగా అనిపించేది. ఆ తరువాత అలవాటైపోయింది' అంటుంది ఎలీషా..

ఎవరి మీదా ఆధారపడకుండా తనదైన బిజినెస్ మైండ్‌తో ప్రతి పని స్వయంగా తానే చేస్తుంది. 'ఏం చేయాలి? ఎలా చేయాలి' అనే దాని గురించి ఎలీషాకు స్పష్టత ఉంది. ఒక్కచోటే ఆగిపోకుండా ఎప్పటికప్పుడు కొత్త టెక్నిక్‌లను నేర్చుకోవడంలో ముందు ఉంటుంది ఎలీషా.

దీపికా పదుకొణెలాంటి ఎంతోమంది సెలబ్రిటీలు తన క్లయింట్‌లలో ఉన్నారు. ఎలీషా గురించి తన ఇన్‌స్టాగ్రామ్ పేజీలో హైలెట్ చేసింది దీపిక.

తన వ్యాపారం గురించే కాదు ఇతరులకు సహాయం చేసే విషయంలోనూ ముందుంటుంది ఎలీషా. కోవిడ్ మహమ్మారి సమయంలో పేదలకు మాస్కులు ఉచితంగా ఇవ్వడం నుంచి రోగులకు నిత్యావసర వస్తువులు అందించడం వరకు ఎన్నో చేసింది.

'ఇతరులకు సహాయం చేయాలనే తపన నాకు చిన్నప్పటి నుంచి ఉంది. నా ఆదాయంలో కొంత నిరుపేదల కోసం వెచ్చిస్తున్నాను' అంటుంది ఎలీషా పారీఖ్.

● టెక్.. టాక్

ఇన్‌ఫినిక్స్ నోట్ 40 ప్రో ప్లస్



సైజు: 6.78 అంగుళాలు; రిఫ్రెష్ రేట్: 120 హెచ్‌జడ్; బ్యాటరీ: 4,600 ఎంఏహెచ్; ర్యామ్: 12జీబి స్టోరేజ్: 256 జీబి

హువావే వాచ్ ఫిట్ 3



డిస్‌ప్లే: 1.82
రిజల్యూషన్: 480×480 పిక్సెల్స్
బరువు: 26 గ్రా.
బ్యాటరీ: 400 ఎంఏహెచ్

- హార్ట్‌రేట్ అండ్ బ్లడ్- ఆక్సిజన్ సెన్సర్స్
- బ్లూటూత్ 5.2

ఓపెన్ ఏఐలో...

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ జనరేటెడ్ కంటెంట్ ప్రభావం గురించి ఆందోళన పెరుగుతున్న నేపథ్యంలో టెక్స్ట్-టు-ఇమేజ్ జనరేటర్ డిఎఎల్-ఇ 3 ద్వారా సృష్టించిన చిత్రాలను గుర్తించే టూల్‌ను 'ఓపెన్ ఏఐ' లాంచ్ చేసింది. ఇంటర్నల్ టెస్టింగ్‌లో ఈ టూల్ సత్ఫలితాలు ఇచ్చింది. ట్యాంపర్-రెసిస్టెంట్ వాటర్ మార్కింగ్‌ను కూడా తెచ్చేప్రయత్నంలో ఉంది ఓపెన్ ఏఐ

స్నాప్‌చాట్‌లో కొత్త ఫీచర్‌లు



సోషల్ మీడియ ప్లాట్‌ఫామ్ స్నాప్‌చాట్ ఎడిటింగ్ చాట్స్, ఇమోజీ రియాక్షన్స్, మై ఏఐ రిమైండర్స్, మ్యాప్‌రియాక్షన్ అనే కొత్త ఫీచర్‌ల గురించి ప్రకటించింది. న్యూ కస్టమైజబుల్ బిట్‌మోజీ లుక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్-పవర్డ్ లెన్స్‌ను కూడా స్నాప్‌చాట్ ఇంట్రడ్యూస్ చేసింది. ఈ ఫీచర్‌లు మొదట స్నాప్‌చాట్ ప్లస్ సబ్‌స్క్రైబర్‌లకు అందుబాటులోకి వస్తాయి.

యాపిల్ బీట్స్ సోలో బడ్స్, బీట్స్ 4 వైర్‌లెస్ హెడ్‌ఫోన్స్




బీట్స్ సోలో బడ్స్, బీట్స్ సోలో 4 వైర్‌లెస్ హెడ్‌ఫోన్స్‌ను యాపిల్ లాంచ్ చేసింది. బీట్స్ సోలో బడ్స్ ధర రూ.6,700 (సుమారుగా). కలర్ ఆప్షన్స్: ఆర్కిటిక్ పర్పుల్, మ్యాటీ బ్లాక్, స్టోమ్ గ్రే, ట్రాన్స్‌పరెంట్ రెడ్

బీట్స్ 4 హెడ్‌ఫోన్స్ ధర రూ. 16,700 (సుమారుగా). **కలర్ ఆప్షన్స్**: క్లౌడ్ పింక్, మ్యాటీ బ్లాక్, స్లేట్ బ్లూ షేడ్స్. హెడ్‌ఫోన్స్‌పై ఉండే 'బి' బటన్ ద్వారా యూజర్‌లు మ్యూజిక్ ప్లేబ్యాక్, వాల్యూమ్‌ని కంట్రోల్ చేయవచ్చు. కాల్స్‌ను మేనేజ్ చేయవచ్చు. వాయిస్ అసిస్టెంట్స్‌ను యాక్టివేట్ చేయవచ్చు.

సైగ చాలు


అయాన్‌ఖాన్



వీడియో గేమ్ ఆడితే మజా వస్తుంది. గేమింగ్‌కు ఉపయోగపడే టూల్ తయారుచేస్తే మరింత మజా వస్తుంది.

బెంగళూరుకు చెందిన పద్దెనిమిది సంవత్సరాల అయాన్‌ఖాన్‌కు ఆటలే కాదు ఆవిష్కరణల గురించి ఆలోచించడం అంటే కూడా ఇష్టం. అయాన్ తయారుచేసిన హ్యాండ్ గెశ్చర్ కంట్రోల్ సిస్టమ్ గేమింగ్ ప్రేమికులను ఆకట్టుకుంటోంది.

గేమింగ్ రంగంలోకి అగ్‌మెన్‌టెడ్ రియాలిటీ, మిక్స్‌డ్ రియాలిటీలాంటి ర్యాపిడ్ అడ్వాన్స్‌మెంట్ టెక్నాలజీ అడుగుపెట్టడం ప్లేయర్స్‌కు సరికొత్త ఉత్సాహాన్ని ఇచ్చింది. దీనికి తనదైన జోడింపుగా ఇన్నోవేటివ్ హ్యాండ్ జెశ్చర్ కంట్రోల్ సిస్టమ్‌ను తయారు చేశాడు అయాన్.

అయాన్ రూపొందించిన సాఫ్ట్‌వేర్ ప్రత్యేకత ఏమిటంటే కీబోర్డ్, జాయ్‌స్టిక్‌ను టచ్ చేయకుండానే గేమర్స్ గేమ్స్‌లోని వర్చువల్ క్యారెక్టర్లను సైగలతో కంట్రోల్, నేవిగేట్ చేయవచ్చు.



■ డాగ్ డేస్ ఆఫ్ సమ్మర్

వేసవి తీవ్రతను తెలియజేసే మాట.... **డాగ్ డేస్ ఆఫ్ సమ్మర్**

ఉదా: మై ఫ్రెండ్ హ్యాజ్ ఏ స్విమ్మింగ్‌పూల్ టు కూల్ ఆఫ్ డ్యూరింగ్ ది డాగ్ డేస్ ఆఫ్ సమ్మర్

■ విమ్ అండ్ విగర్

ఫుల్ ఎనర్జీ, ఉత్సాహానికి సంబంధించి వాడే మాట.... **విమ్ అండ్ విగర్.**

ఉదా: ఐ హ్యావ్ టు కిక్ స్టార్ట్ మై న్యూ బిజినెస్ విత్ విమ్ అండ్ విగర్

అంతరిక్ష ఆట

● గేమింగ్



రియల్-టైమ్ స్ట్రాటజీ వీడియో గేమ్ 'హోమ్‌వరల్డ్ 3' ఈ నెల 13న విడుదల అవుతుంది. స్పేస్ నేపథ్యంగా సాగే ఆట ఇది. 'హోమ్‌వరల్డ్: డిజర్ట్ ఆఫ్ ఖరక్, ప్రాజెక్ట్ ఈగల్, మైన్‌క్రాఫ్ట్ ఎర్త్, హార్డ్‌స్పేస్: షిప్‌బ్రేకర్, క్రాస్‌ఫైర్, మైన్‌క్రాఫ్ట్ లెజెండ్స్‌తో సుపరిచితమైన కెనడియన్ వీడియో గేమ్ డెవలప్‌మెంట్ స్టూడియో 'బ్లాక్‌బర్డ్ ఇంటరాక్టివ్' ఈ గేమ్‌ను డెవలప్ చేసింది. 'హోమ్‌వరల్డ్3' మాసివ్ స్పేస్ స్ట్రక్చర్, న్యూ కో-ఆప్ మోడ్‌తో వస్తోంది.

సిరీస్: హోమ్‌వరల్డ్ **ఇంజిన్:** అన్‌రియల్ ఇంజిన్ 4 **ప్లాట్‌ఫామ్:** విండోస్ **జానర్:** రియల్-టైమ్ స్ట్రాటజీ **మోడ్స్:** సింగిల్-ప్లేయర్, మల్టీ ప్లేయర్

సినిమా

కన్నప్ప సెట్స్‌లో...


● ప్రభాస్


వరుస పాన్ ఇండియా చిత్రాలతో దూసుకెళుతున్న హీరో ప్రభాస్ తాజాగా 'కన్నప్ప' చిత్రం షూటింగ్‌లో జాయిన్ అయ్యారు. విష్ణు మంచు హీరోగా రూపొందుతున్న ఈ చిత్రానికి ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు. అవా ఎంటర్‌టైన్‌మెంట్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్‌లపై మంచు మోహన్‌బాబు ఈ సినిమా నిర్మిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ చిత్రంలో ప్రభాస్, అక్షయ్ కుమార్, మోహన్‌బాబు, మోహన్ లాల్, శరత్‌కుమార్, బ్రహ్మానందం వంటి వారు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే అక్షయ్ కుమార్, మోహన్‌బాబు, మోహన్ లాల్, శరత్ కుమార్ తమ పాత్రలకు సంబంధించిన చిత్రీకరణలను పూర్తి చేశారు. తాజాగా ప్రభాస్ 'కన్నప్ప' సెట్స్‌లోకి అడుగుపెట్టారు. ఈ విషయాన్ని మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయనకి సాదర స్వాగతం పలికింది యూనిట్. ''విష్ణు మంచు కలల ప్రాజెక్టుగా 'కన్నప్ప' రూపొందుతోంది. శివ భక్తుడైన భక్త కన్నప్ప అచంచలమైన భక్తిని, విశ్వాసాన్ని చూపించబోతున్నాం. ఆకర్షణీయమైన విజువల్స్, అద్భుతమైన కథా కథనాలతో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. హాలీవుడ్ సినిమాటోగ్రాఫర్ షెల్డన్ చౌ, యాక్షన్ డైరెక్టర్ కెచా ఖంపక్డీ వంటి వారు 'కన్నప్ప'కి పని చేస్తున్నారు.






కళారంగానికి చేసిన సేవలకుగాను ప్రముఖ నటుడు చిరంజీవి, ప్రముఖ నటి వైజయంతీ మాల బాలి పద్మ విభూషణ్ పురస్కారాన్ని అందుకున్నారు. గురువారం ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. ప్రముఖ తమిళ నటుడు విజయ్‌కాంత్ మరణించడంతో ఆయన సతీమణి ప్రేమలత పద్మభూషణ్ అందుకున్నారు. ఈ కార్యక్రమానికి ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ప్రధాని మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, పలువురు కేంద్ర మంత్రులతో పాటు చిరంజీవి కుటుంబ సభ్యులు సురేఖ, రామ్‌చరణ్, ఉపాసన హాజరయ్యారు.

లొంగని రాక్షసుడు


● ధనుష్

ధనుష్ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'రాయన్'. సందీప్ కిషన్, కాళిదాసు జయరామ్ లీడ్ రోల్స్‌లో నటించారు. కళానిధి మారన్ నిర్మించారు. ఈ సినిమాను తెలుగు, తమిళ, హిందీ భాషల్లో జూన్ 13న రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించి, 'అడంగాద అసురన్ (లొంగని రాక్షసుడు) పాట లిరికల్ వీడియోను విడుదల చేశారు. ఈ పాటకు లిరిక్స్ రాయడంతో పాటు ఈ చిత్ర సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్‌తో కలిసి పాడారు ధనుష్. ''అడంగాద అసురన్' పాటను ఏఆర్ రెహమాన్‌గారు రెడీ చేసినప్పట్నుంచి, మీతో (ప్రేక్షకులు) ఈ పాటను షేర్ చేసుకునేందుకు ఎదురు చూస్తున్నాను. ఈ పాటను ఇప్పుడు రిలీజ్ చేశాం'' అంటూ 'ఎక్స్'లో షేర్ చేశారు ధనుష్.

డబుల్ ధమాకా


● విజయ్ దేవరకొండ

హీరో విజయ్ దేవరకొండ క్రేజీ ప్రాజెక్ట్స్‌తో బిజీగా ఉన్నారు. గురువారం (మే 9) తన బర్త్ డే సందర్భంగా మరో రెండు కొత్త చిత్రాల అప్‌డేట్స్‌తో అభిమానులకు డబుల్ ధమాకా ఇచ్చారు విజయ్ దేవరకొండ. వాటిలో ఓ చిత్రానికి 'రాజావారు రాణిగారు' మూవీ ఫేమ్ రవికిరణ్ కోలా దర్శకత్వం వహించనున్నారు. ఈ మూవీని శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్‌పై (ఎస్వీసీ) 'దిల్' రాజు, శిరీష్ నిర్మించనున్నారు. విజయ్ హీరోగా 'దిల్' రాజు, శిరీష్ నిర్మించిన 'ది ఫ్యామిలీ స్టార్' ఏప్రిల్ 5న విడుదలైంది. మరోసారి విజయ్ హీరోగా ఎస్వీసీ సంస్థ తన 59వ చిత్రాన్ని ప్రకటించింది. ఈ సినిమా ప్రకటన సందర్భంగా రిలీజ్ చేసిన పోస్టర్‌లో విజయ్ కత్తి పట్టుకుని, వయొలెంట్ మోడ్‌లో ఉన్నారు. 'కత్తి నేనే, నెత్తురు నాదే, యుద్ధం నాతోనే..' అనే క్యాప్షన్ ఇచ్చారు. ''రూరల్ యాక్షన్ డ్రామా నేపథ్యంతో పాన్ ఇండియా ప్రాజెక్ట్‌గా రూపొందనున్న ఈ చిత్రం పూర్తి వివరాలు త్వరలో తెలియజేస్తాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

మైత్రీతో మూడోసారి... 'డియర్ కామ్రేడ్, ఖుషి' వంటి సక్సెస్‌ఫుల్ సినిమాల తర్వాత మైత్రీ మూవీ మేకర్స్, విజయ్ దేవరకొండ కాంబినేషన్‌లో మూడో సినిమా 'వీడీ 14' (వర్కింగ్ టైటిల్) ప్రకటన వచ్చింది. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమాని నిర్మించనున్నారు. 'టాక్సీవాలా' వంటి సూపర్ హిట్ చిత్రం తర్వాత విజయ్ దేవరకొండ, డైరెక్టర్ రాహుల్ సంకృత్యాన్ కాంబినేషన్‌లో ఈ చిత్రం రూపొందనుంది. ''పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా 'వీడీ 14' తెరకెక్కనుంది. 19వ శతాబ్దం నేపథ్యంతో 1854 నుంచి 1978 మధ్య కాలంలో జరిగిన వాస్తవ చారిత్రక ఘటనల ఆధారంగా ఈ సినిమాను రూపొందించనున్నాం. త్వరలో మరిన్ని వివరాలు వెల్లడిస్తాం'' అన్నారు మేకర్స్.

కృష్ణమ్మ నదిలో మలుపుల్లా...


● సత్యదేవ్, వీవీ గోపాలకృష్ణ

సత్యదేవ్ హీరోగా నటించిన చిత్రం 'కృష్ణమ్మ'. ఈ చిత్రంలో అతీరా రాజ్ హీరోయిన్. దర్శకుడు కొరటాల శివ సమర్పణలో వీవీ గోపాల కృష్ణ దర్శకత్వంలో కృష్ణ కొమ్మాలపాటి నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా గురువారం జరిగిన విలేకర్ల సమావేశంలో సత్యదేవ్ మాట్లాడుతూ– ''వించిపేట భద్ర, శివ, కోటి అనే ముగ్గురి స్నేహితుల నేపథ్యంలో సాగే కథ ఇది. కథ ప్రధానంగా 2003–2015 మధ్యకాలంలో జరుగుతుంది. కొంతకాలంగా నేను ఎదురు చూస్తున్న మంచి హిట్ 'కృష్ణమ్మ'తో లభిస్తుందని నమ్ముతున్నాను'' అన్నారు. ''రాజకీయాలు, రౌడీయిజం అంశాలు 'కృష్ణమ్మ' సినిమాలో లేవు. విజయవాడను మరో కోణంలో చూసేలా ఈ చిత్రం ఉంటుంది. హ్యూమన్ ఎమోషన్స్‌కు పెద్ద పీట వేశాం. కృష్ణమ్మ నదిలో ఎలా అయితే మలుపులు ఉంటాయో భద్ర, కోటి, శివ జీవితాల్లో కూడా మలుపులు ఉంటాయి. ఈ మలుపులను థియేటర్స్‌లో చూడండి'' అన్నారు వీవీ గోపాలకృష్ణ.

సికందర్‌తో జోడీ


● రష్మిక

సికందర్‌తో జోడీ కట్టారు హీరోయిన్ రష్మికా మందన్నా. బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్, ఏఆర్ మురుగదాస్ కాంబినేషన్‌లో రూపొందనున్న యాక్షన్ థ్రిల్లర్ మూవీ 'సికందర్'. సాజిద్ నడియాడ్ వాలా ఈ సినిమాను నిర్మించనున్నారు. ఈ సినిమాలో హీరోయిన్‌గా రష్మికా మందన్నా నటించనున్నట్లు చిత్ర యూనిట్ వెల్లడించింది. ''కొంతకాలంగా నా నెక్ట్స్ మూవీ ఏంటని అడుగుతున్నారు. 'సికందర్'లో నటించనున్నాను. ఈ విషయాన్ని సర్‌ప్రైజ్‌గా ఫీలవుతారని అనుకుంటున్నాను. 'సికందర్'లో భాగం కావడం గౌరవంగా భావిస్తున్నాను'' అని రష్మికా మందన్నా పేర్కొన్నారు. ఇది ఆమె కెరీర్‌లో 25వ చిత్రమని తెలుస్తోంది. ఇక 'సికందర్' వచ్చే ఏడాది రంజాన్‌కి రిలీజ్ కానుంది.

ఆలస్యంగా వస్తున్న గ్యాంగ్


● విశ్వక్ సేన్

కాస్త లేట్‌గా థియేటర్స్‌లోకి రానున్నారు గోదావరి గ్యాంగ్. విశ్వక్ సేన్ హీరోగా నటించిన యాక్షన్ చిత్రం 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి'. ఈ చిత్రంలో నేహా శెట్టి హీరోయిన్‌గా నటించగా, కీలక పాత్రలో అంజలి నటించారు. కృష్ణచైతన్య దర్శకత్వంలో శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 17న రిలీజ్ కావాల్సింది. కానీ వాయిదా వేసి, ఈ నెల 31న రిలీజ్ చేయనున్నట్లు యూనిట్ ప్రకటించింది. ఈ సినిమా థీమ్ సాంగ్ 'బ్యాడ్' లిరికల్ వీడియో నేడు విడుదలవుతోంది. 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' సినిమాలో లంకల రత్నగా విశ్వక్ సేన్, రత్నమాలగా అంజలి, బుజ్జిగా నేహా శెట్టి కనిపిస్తారు.

సైంటిఫిక్ థ్రిల్లర్


● శ్రీరామ్

శ్రీకాంత్ (శ్రీరామ్) ప్రధాన పాత్రలో సుగి విజయ్, రూపాలీ భూషణ్ జంటగా రూపొందిన చిత్రం 'మాత్రు'. జాన్ జక్కీ దర్శకత్వంలో శ్రీ పద్మినీ సినిమాస్‌పై బి. శివప్రసాద్ నిర్మించారు. తాజాగా ఈ చిత్రం ఫస్ట్ లుక్ పోస్టర్‌ని రచయిత, దర్శకుడు విజయేంద్ర ప్రసాద్ లాంచ్ చేసి, సినిమా విజయం సాధించాలని ఆకాంక్షించారు. ''యాక్షన్ సైంటిఫిక్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం 'మాత్రు'. పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తయ్యాయి. త్వరలోనే సినిమా రిలీజ్ డేట్‌ని ప్రకటిస్తాం'' అన్నారు మేకర్స్. అలీ, ఆమని ఇతర కీలక పాత్రలు పోషించిన ఈ చిత్రానికి సంగీతం: శేఖర్ చంద్ర, కెమెరా: రాహుల్ శ్రీవాస్తవ్.

ఆరంభం అదిరిపోవాలి

- హీరో శ్రీ విష్ణు


● మోహన్ భగత్, శ్రీ విష్ణు

''**ఆ**రంభం' మూవీలోని ఓ పాటని నేను రిలీజ్ చేశాను. అప్పుడు ఈ సినిమా టీజర్ కూడా చూశాను. పాట, టీజర్ బాగున్నాయి. నా ఫ్రెండ్ ధీరజ్ మొగిలినేని ఈ మూవీని డిస్ట్రిబ్యూట్ చేస్తున్నాడు. 'ఆరంభం' అదిరిపోవాలి. మంచి కథ కుదిరితే ఈ టీమ్‌తో సినిమా చేయాలనిపిస్తోంది'' అని హీరో శ్రీ విష్ణు అన్నారు. మోహన్ భగత్, సుప్రితా సత్యనారాయణ్ జంటగా నటించిన సినిమా 'ఆరంభం'. అజయ్ నాగ్ వి. దర్శకత్వంలో అభిషేక్ వీటీ నిర్మించిన ఈ మూవీ నేడు రిలీజ్ అవుతోంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి శ్రీ విష్ణు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అభిషేక్ వీటీ మాట్లాడుతూ– ''సరికొత్త కథతో రూపొందించిన ఈ చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు. ''మా మూవీ ఎలా ఉంటుందనే ప్రశ్నలకు ట్రైలర్‌తో సమాధానం దొరికిందని భావిస్తున్నాను'' అన్నారు అజయ్ నాగ్. ''మా అమ్మ ఇటీవలే దూరమయ్యారు. ఆమె ఓ శక్తిలా నన్ను ముందుకు నడిపిస్తోందని భావిస్తున్నాను'' అన్నారు మోహన్ భగత్.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	1,062	72,404
నిఫ్టీ ▽	345	21,957

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ		
నాస్‌డాక్	16,350	▲ 48
డోజోన్స్	39,306	▲ 265
ఎఫ్‌టీఎస్ఈ 100	8,381	▲ 27
డాక్స్	18,687	▲ 188
షాంఘై	3,154	▲ 26
నికాయ్	38,074	▽ 128

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.ల్లో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	71,502
బంగారం (99.5 స్వచ్ఛత)	71,216
వెండి (కిలో)	82,342

ఫారెక్స్ రేట్లు రూ.ల్లో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.19	84.11
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	103.14	105.68
€	యూరో	ఎస్‌బీఐ	91.01	88.56
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	54.34	53.11
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.06	55.99
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.28	63.95
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.38	22.93
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.85	23.64
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.44	12.51

మార్కెట్‌కు ఎన్నికల కలవరం

- మూడు దశల పోలింగ్‌లో తగ్గిన ఓటింగ్ శాతం
- అధికార పార్టీ విజయావకాశాలపై సందేహాలు
- సెన్సెక్స్ 1,062 పాయింట్లు క్రాష్ • 22,000 స్థాయి దిగువకు నిఫ్టీ
- ఇన్వెస్టర్లకు రూ.7.34 లక్షల కోట్ల నష్టం

ముంబై: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఇప్పటి వరకు జరిగిన మూడు దశల పోలింగ్‌లో తక్కువ శాతం ఓటింగ్ నమోదు ఇన్వెస్టర్లను కలవరపెట్టింది. ఎన్నికలకు ముందు ఊహించినట్లు ప్రస్తుత అధికార పార్టీ గెలుపు అంత సులువు కాదనే అనుమానాలతో అమ్మకాలకు పాల్పడ్డారు. ఆటో మినహా అన్ని రంగాల షేర్లలో విక్రయాలు వెల్లువెత్తడంతో గురువారం సెన్సెక్స్ 1,062 పాయింట్లు నష్టపోయి 72,404 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 345 పాయింట్లు పతనమైన ఏప్రిల్ 19 తర్వాత తొలిసారి 22,000 దిగువన 21,957 వద్ద నిలిచింది. సెన్సెక్స్ ఒకటిన్నర శాతం పతనంతో బీఎస్ఈలో రూ.7.34 లక్షల కోట్లు ఆవిరియ్యాయి. ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.393 లక్షల కోట్లకు దిగివచ్చింది. బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ పాలసీ నిర్ణయాలు, అమెరికా ఉద్యోగ గణాంకాల వెల్లడి ముందు ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి.

ఆద్యంతం అమ్మకాలే

ఉదయం స్వల్ప లాభాలతో ప్రారంభమై సూచీలు వెంటనే నష్టాల్లోకి జారుకున్నాయి. ఇన్వెస్టర్లు అమ్మకాలకే మొగ్గు చూపడంతో ట్రేడింగ్ గడిచే కొద్ది నష్టాల తీవ్రత మరింత పెరిగింది. చిన్న, మధ్య, పెద్ద షేర్లలో పెద్ద ఎత్తున అమ్మకాలు జరిగాయి. ఒక దశలో సెన్సెక్స్ 1,132 పాయింట్లు క్షీణించి 72,404 వద్ద, నిఫ్టీ 370 పాయింట్లు పతనమై 21,932 వద్ద ఇంట్రాడే కనిష్టాలకు దిగివచ్చాయి. ట్రేడింగ్ ముగిసే వరకు అమ్మకాలు కొనసాగాయి. బీఎస్ఈలో మిడ్, స్మాల్ సూచీలు వరుసగా 2.41%, రెండు శాతం క్షీణించాయి.



- సూచీల వారీగా ఆయిల్అండ్ గ్యాస్ 3.50%, క్యాపిటల్ గూడ్స్, మెటల్, పారిశ్రామికోత్పత్తి ఇండెక్సులు 3%, యుటిలిటీ, కమోడిటీ సూచీలు 2.50%, బ్యాంకులు, ఫైనాన్స్, సర్వీసెస్ సూచీలు 2% పతనమయ్యాయి.
- మార్చి క్వార్టర్‌లో నికర లాభం 15% వృద్ధి చెందడంతో టీవీఎస్ మోటార్స్ షేరు 3% పెరిగి రూ.2,061 వద్ద నిలిచింది. ట్రేడింగ్ 6% దూసుకెళ్లి రూ.2,121 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది.
- క్యూ4 ఆర్థిక ఫలితాల ప్రకటన నేపథ్యంలో ఎస్‌బీఐ షేరు ఒకశాతం పెరిగి రూ.820 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో మూడున్నర శాతం బలపడి రూ.840 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది.

ఎస్‌బీఐ లాభం రికార్డ్



ముంబై: ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ) గత ఆర్థిక సంవత్సరం (2023–24) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి (క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర

క్యూ4లో రూ. 21,384 కోట్లు

లాభం 18 శాతం ఎగసి రూ. 21,384 కోట్లను అధిగమించింది. అంతక్రితం ఏడాది(2022–23) క్యూ4లో రూ. 18,094 కోట్లు మాత్రమే ఆర్జించింది. స్టాండెలోన్ లాభం సైతం రూ. 16,695 కోట్ల నుంచి రూ. 20,698 కోట్లకు దూసుకెళ్లింది. మొత్తం ఆదాయం రూ. 1.06 లక్షల కోట్ల నుంచి రూ. 1.28 లక్షల కోట్లకు బలపడింది. నిర్వహణ వ్యయాలు రూ. 29,732 కోట్ల నుంచి రూ. 30,276 కోట్లకు పెరిగాయి. మొత్తం ప్రొవిజన్లు రూ. 3,315 కోట్ల నుంచి సగానికి తగ్గి రూ. 1,609 కోట్లకు పరిమితమయ్యాయి. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 2.78 శాతం నుంచి 2.24 శాతానికి తగ్గాయి.

పూర్తి ఏడాదికి సైతం..

ఇక పూర్తి ఏడాదికి ఎస్‌బీఐ నికర లాభం కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన 21 శాతం జంప్ చేసింది. రూ. 67,085 కోట్లకు చేరింది. 2022–23లో రూ. 55,648 కోట్లు ఆర్జించింది. వెరసి అటు క్యూ4, ఇటు పూర్తి ఏడాదికి రెండు శతాబ్దాల బ్యాంక్ చరిత్రలోనే అత్యధిక లాభాలు ఆర్జించినట్లు ఎస్‌బీఐ చైర్మన్ దినేష్ కుమార్ ఖారా పేర్కొన్నారు. క్యూ4లో నికర వడ్డీ ఆదాయం 3 శాతం బలపడి రూ. 41,655 కోట్లను తాకింది. 3.46 శాతం నికర వడ్డీ మార్జిన్లు సాధించింది. మొత్తం ప్రొవిజన్లు రూ. 8,049 కోట్ల నుంచి రూ. 7,927 కోట్లకు తగ్గాయి. స్లిప్పేజీలు రూ. 3,185 కోట్ల నుంచి రూ. 3,867 కోట్లకు పెరిగాయి. స్థూల మొండిబకాయిలు 2.78 శాతం నుంచి 2.42 శాతానికి దిగివచ్చాయి. వడ్డీయేతర ఆదాయం 24 శాతం జంప్‌చేసి రూ. 17,369 కోట్లకు చేరింది. గత నాలుగేళ్లలో 27,000 మంది ఉద్యోగులు తగ్గినప్పటికీ రిటైర్ అవుతున్న సిబ్బందిలో 75 శాతంమందిని విధుల్లోకి తీసుకుంటున్నట్లు ఖారా వెల్లడించారు. టెక్నాలజీ, ఏఐలపై భారీగా ఇన్వెస్ట్ చేస్తున్నట్లు తెలియజేశారు.

పీఎన్‌బీ హైజంప్

రూ. 3,010 కోట్ల లాభం



ముంబై: పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) చివరి త్రైమాసిక నికర లాభం దాదాపు మూడు రెట్లు ఎగసి రూ. 3,010 కోట్లను తాకింది. గత నాలుగేళ్లలో ఇది అత్యధికం. మొండి రుణాలు తగ్గడం, వడ్డీ ఆదాయం పుంజుకోవడం ఇందుకు సహకరించింది. మొత్తం ఆదాయం రూ. 27,269 కోట్ల నుంచి రూ. 32,361 కోట్లకు బలపడింది. నికర వడ్డీ ఆదాయం రూ. 9,499 కోట్ల నుంచి రూ. 10,363 కోట్లకు ఎగసింది. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 8.74 శాతం నుంచి 5.73 శాతానికి, నికర ఎన్‌పీఏలు 2.72 శాతం నుంచి 0.73 శాతానికి దిగివచ్చాయి. మొత్తం ప్రొవిజన్లు రూ. 3,625 కోట్ల నుంచి సగానికి తగ్గి రూ. 1,958 కోట్లకు పరిమితమయ్యాయి. ఇక పూర్తి ఏడాదికి పీఎన్‌బీ నికర లాభం మూడు రెట్లు జంప్‌చేసి రూ. 8,245 కోట్లకు చేరింది. మొత్తం ఆదాయం రూ. 97,287 కోట్ల నుంచి రూ. 1,20,285 కోట్లకు దూసుకెళ్లింది. నికర వడ్డీ మార్జిన్లు 3.09 శాతం. క్విప్ ద్వారా రూ. 7,500 కోట్లు సమీకరించేందుకు బోర్డు అనుమతించినట్లు బ్యాంక్ వెల్లడించింది.

ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో పీఎన్‌బీ షేరు 2.4 % నష్టంతో రూ. 122 వద్ద ముగిసింది.

ఏషియన్ పెయింట్స్ ఫ్లాట్

- షేరుకి రూ. 28.15 డివిడెండ్



న్యూఢిల్లీ: ఏషియన్ పెయింట్స్ చివరి త్రైమాసిక లాభం నామమాత్ర వృద్ధితో రూ. 1,258 కోట్ల నుంచి రూ. 1,275 కోట్లకు చేరింది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 8,787 కోట్ల నుంచి రూ. 8,731 కోట్లకు స్వల్పంగా క్షీణించింది. వాటాదారులకు షేరుకి రూ. 28.15 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. పూర్తి ఏడాదికి ఏషియన్ పెయింట్స్ నికర లాభం రూ. 4,195 కోట్ల నుంచి రూ. 5,558 కోట్లకు జంప్‌చేసింది. మొత్తం ఆదాయం సైతం రూ. 34,489 కోట్ల నుంచి రూ. 35,495 కోట్లకు బలపడింది.

బీఎస్ఈలో ఏషియన్ పెయింట్స్ షేరు 4.7 శాతం పతనమై రూ. 2,711 వద్ద ముగిసింది.

మారుతీ స్విఫ్ట్ కొత్త మోడల్



ధర రూ. 6.49 లక్షల నుంచి ప్రారంభం

న్యూఢిల్లీ: మారుతీ సుజుకీ తమ ప్రీమియం హ్యాచ్‌బ్యాక్ స్విఫ్ట్ కారులో 4వ జనరేషన్ మోడల్‌ను విడుదల చేసింది. దీని ధర రూ. 6.49 లక్షల నుంచి రూ. 9.64 లక్షల వరకు (ఢిల్లీ ఎక్స్‌షోరూం) ఉంటుంది. ఈ కారును అభివృద్ధి చేయడంపై రూ. 1,450 కోట్లు ఇన్వెస్ట్ చేసినట్లు సంస్థ ఎండీ హిసాషి తకెయుచి తెలిపారు. హ్యాచ్‌బ్యాక్ సెగ్మెంట్ అమ్మకాల్లో ప్రీమియం విభాగం వాటా 60 శాతంగా ఉంటోందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఏటా 7 లక్షల యూనిట్లుగా ఉన్న ఈ సెగ్మెంట్ 2030 నాటికి పది లక్షల యూనిట్లకు చేరగలదని అంచనా వేస్తున్నట్లు పేర్కొన్నారు.

బీపీసీఎల్ 1:1 బోనస్ షేర్లు

- నికర లాభం నేలచూపు
- షేరుకి రూ. 21 డివిడెండ్



న్యూఢిల్లీ: భారత్ పెట్రోలియం కార్పొరేషన్ చివరి త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ నికర లాభం 30 శాతం క్షీణించి రూ. 4,790 కోట్లకు పరిమితమైంది. కాగా.. వాటాదారులకు బోర్డు 1:1 నిష్పత్తిలో బోనస్ షేర్ల జారీకి అనుమతించింది. వెరసి ప్రతీ షేరుకు మరో షేరు ఉచితంగా కేటాయించనుంది. షేరుకి రూ. 21 చొప్పున తుది డివిడెండ్ సైతం ప్రకటించింది. అయితే బోనస్ తదుపరి రూ. 10.5 చొప్పున వర్తించనుంది. కాగా పూర్తి ఏడాదికి బీపీసీఎల్ కొత్త రికార్డ్ నెలకొల్పుతూ రూ. 26,859 కోట్ల నికర లాభం ఆర్జించింది. కొత్తగా 308 పెట్రోల్ పంప్‌లు, 323 సీఎన్‌జీ స్టేషన్లను తెరిచింది.

బీఎస్ఈలో బీపీసీఎల్ షేరు 4.6 శాతం పతనమై రూ. 592 వద్ద ముగిసింది.

హెచ్‌పీసీఎల్ లాభం డౌన్

క్యూ4లో రూ. 2,709 కోట్లు • 1:2 నిష్పత్తిలో బోనస్ షేర్లు • షేరుకి రూ. 16.5 డివిడెండ్



న్యూఢిల్లీ: హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ చివరి త్రైమాసిక కన్సాలిడేటెడ్ నికర లాభం 25 శాతం క్షీణించి రూ. 2,709 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఏడాది(2022–23) క్యూ4లో రూ. 3,608 కోట్లు ఆర్జించింది. స్థూల చమురు శుద్ధి మార్జిన్(జీఆర్ఎం) నీరసించడంతోపాటు.. మార్చి నుంచి పెట్రోల్, డీజిల్ ధరలను లీటర్‌కు రూ. 2 చొప్పున తగ్గించడం ప్రభావం చూపింది. మొత్తం ఆదాయం రూ. 1.15 లక్షల కోట్ల నుంచి రూ. 1.22 లక్షల కోట్లకు ఎగసింది. కాగా.. వాటాదారులకు బోర్డు 1:2 నిష్పత్తిలో బోనస్ షేర్ల జారీకి అనుమతించింది. వెరసి ప్రతీ 2 షేర్లకు 1 షేరు ఉచితంగా కేటాయించనుంది. షేరుకి రూ. 16.50 తుది డివిడెండ్ ప్రకటించింది. అయితే బోనస్ తదుపరి రూ. 11 చొప్పున వర్తించనుంది. పూర్తి ఏడాదికి నికర లాభం రూ. 6,980 కోట్ల నుంచి రూ. 16,015 కోట్లకు పెరిగింది. ఆదాయం రూ. 4,66,192 కోట్ల నుంచి రూ. 4,61,638 కోట్లకు తగ్గింది. విశాఖ రిఫైనరీ సంస్థ చరిత్రలోనే అత్యధికంగా 12.69 ఎంటీ చమురును ప్రాసెస్ చేసింది.

బీఎస్ఈలో హెచ్‌పీసీఎల్ షేరు 4.2% తగ్గి రూ. 501 వద్ద ముగిసింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

10-5-2024 ఫామ్ ధర...

విశాఖ	540-00
చిత్తూరు	573-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	525-00
విజయవాడ	525-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	510-00
వరంగల్	512-00
రిటైల్ ధర	5.70

సాక్షి స్పోర్ట్స్



క్వార్టర్ ఫైనల్లో మనిక ఓటమి

సౌదీ స్మాష్ వరల్డ్ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) టోర్నమెంట్ మహిళల సింగిల్స్‌లో భారత స్టార్ మనిక బత్రా పోరాటం ముగిసింది. బుధవారం జెద్దాలో జరిగిన క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 39వ ర్యాంకర్ మనిక 11–7, 6–11, 4–11, 11–13, 2–11తో ప్రపంచ ఐదో ర్యాంకర్ హినా హయాటా (జపాన్) చేతిలో ఓడిపోయింది. మనిక బత్రాకు 17,000 డాలర్ల (రూ. 14 లక్షల 18 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 350 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

బజరంగ్‌పై యూడబ్ల్యూడబ్ల్యూ వేటు



భారత స్టార్ రెజ్లర్ బజరంగ్ పూనియాపై యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ (యూడబ్ల్యూడబ్ల్యూ) కూడా సస్పెన్షన్‌వేటు వేసింది. ఈ ఏడాది ముగిసేవరకు నిషేధం కొనసాగుతుందని తెలిపింది. పారిస్ ఒలింపిక్స్ ట్రయల్స్ వేదిక వద్ద బజరంగ్ డోప్ టెస్టుకు నిరాకరించడంతో జాతీయ డోపింగ్ నిరోధక ఏజెన్సీ గత నెల 23న బజరంగ్‌పై తాత్కాలిక నిషేధం విధించింది.



భారత్ క్లీన్‌స్వీప్

- 5–0తో సిరీస్ సొంతం
- బంగ్లాదేశ్‌పై చివరి టి20లోనూ విజయం

సిల్హెట్: బంగ్లాదేశ్ పర్యటనలో ఐదు టి20ల సిరీస్‌ను భారత మహిళల జట్టు 5–0తో క్లీన్‌స్వీప్ చేసింది. గురువారం జరిగిన ఆఖరి పోరులో హర్మన్‌ప్రీత్ కౌర్ బృందం 21 పరుగుల తేడాతో బంగ్లాదేశ్‌పై విజ యం సాధించింది. టాస్ నెగ్గిన భారత్ ముందుగా బ్యాటింగ్‌కు దిగి నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 156 పరుగులు చేసింది. టాపార్డర్ బ్యాటర్ హేమలత (28 బంతుల్లో 37; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), ఓపెనర్ స్మృతి మంధాన (25 బంతుల్లో 33; 4 ఫోర్లు, 1 సిక్స్) ధాటిగా ఆడారు. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (24 బంతుల్లో 30; 3 ఫోర్లు, 1 సిక్స్), రిచా ఘోష్ (17 బంతుల్లో 28 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. బంగ్లాదేశ్ బౌలర్లలో రాబియా ఖాన్, నహిదా అక్తర్ చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన బంగ్లాదేశ్ మహిళల జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 135 పరుగులే చేసి పరాజయం పాలైంది. రీతూ మోని (33 బంతుల్లో 37; 4 ఫోర్లు), షోరిఫా ఖాటున్ (21 బంతుల్లో 28 నాటౌట్; 3 ఫోర్లు) మెరుగ్గా ఆడారు. భారత స్పిన్నర్లు రాధా యాదవ్ 3, ఆశా శోభన 2 వికెట్లు తీశారు. కీలక వికెట్లు తీసిన రాధా యాదవ్‌కే 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'... 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డులు లభించాయి.

జ్యోతి యర్రాజీకి స్వర్ణం



సెర్టోహన్‌బాష్ (నెదర్లాండ్స్): కొత్త సీజన్‌ను భారత స్టార్ అథ్లెట్, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన జ్యోతి యర్రాజీ స్వర్ణ పతకంతో ప్రారంభించింది. గురువారం జరిగిన హ్యారీ షుల్టింగ్ గేమ్స్‌లో బరిలోకి దిగిన జ్యోతి మహిళల 100 మీటర్ల హర్డిల్స్ ఈవెంట్‌లో విజేతగా నిలిచింది. హ్యారీ షుల్టింగ్ గేమ్స్ వరల్డ్ అథ్లెటిక్స్‌లో 'ఇ' కేటగిరీ కిందికి వస్తాయి. 100 మీటర్ల హర్డిల్స్ ఫైనల్ రేసును విశాఖపట్నంకు చెందిన జ్యోతి 12.87 సెకన్లలో ముగించి అగ్రస్థానాన్ని దక్కించుకుంది. ఆమె కెరీర్‌లో ఇది నాలుగో అత్యుత్తమ సమయం. మిరా గ్రూట్ (నెదర్లాండ్స్; 13.67 సెకన్లు) రెండో స్థానంలో, హనా వాన్ బాస్ట్ (నెదర్లాండ్స్; 13.84 సెకన్లు) మూడో స్థానంలో నిలిచారు. పారిస్ ఒలింపిక్స్ అర్హత ప్రమాణ సమయాన్ని (12.77 సెకన్లు) జ్యోతి ఇంకా అందుకోకపోయినా ర్యాంకింగ్స్ ప్రకారం జ్యోతికి ఒలింపిక్ బెర్త్ ఖరారు కానుంది. ప్రస్తుతం ర్యాంకింగ్స్‌లో జ్యోతి 26వ స్థానంలో ఉంది. మొత్తం 40 మంది ఒలింపిక్స్‌కు అర్హత సాధిస్తారు. ఇందులో 25 మంది అర్హత ప్రమాణ సమయం ఆధారంగా... మరో 15 మంది వరల్డ్ ర్యాంకింగ్ ఆధారంగా అర్హత సాధిస్తారు.

ఐదో ర్యాంక్‌లో అర్జున్



వార్సా: గ్రాండ్ చెస్ టూర్‌లో భాగంగా జరుగుతున్న సూపర్‌బెట్ ర్యాపిడ్ టోర్నమెంట్‌లో ఆరో రౌండ్ ముగిశాక తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ ఆరు పాయింట్లతో ఐదో ర్యాంక్‌లో ఉన్నాడు. గురువారం జరిగిన మూడు గేముల్లో అర్జున్‌కు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. క్రిస్టాఫ్ డూడా (పోలాండ్)తో జరిగిన నాలుగో గేమ్‌లో అర్జున్ 43 ఎత్తుల్లో ఓడిపోయాడు. షెవ్‌చెంకో (రొమేనియా)తో జరిగిన ఐదో గేమ్‌లో అర్జున్ 43 ఎత్తుల్లో గెలిచాడు. నొదిర్‌బెక్ (ఉజ్బెకిస్తాన్)తో జరిగిన ఆరో గేమ్‌ను అర్జున్ 71 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్నాడు. భారత్‌కే చెందిన ప్రజ్ఞానంద ఏడు పాయింట్లతో నాలుగో ర్యాంక్‌లో, గుకేశ్ ఆరు పాయింట్లతో ఆరో ర్యాంక్‌లో ఉన్నారు.

భారత రెజ్లర్లకు నిరాశ

ఇస్తాంబుల్: వరల్డ్ ఒలింపిక్ క్వాలిఫయింగ్ రెజ్లింగ్ టోర్నమెంట్ పురుషుల గ్రీకో రోమన్ స్టయిల్‌లో భారత రెజ్లర్లు నిరాశపరిచారు. ఆరు వెయిట్ కేటగిరీల్లో ఒక్కరు కూడా పారిస్ ఒలింపిక్స్ బెర్త్‌ను దక్కించుకోలేకపోయారు. సుమిత్ (60 కేజీలు), ఆశు (67 కేజీలు), వికాస్ (77 కేజీలు), సునీల్ (87 కేజీలు), నితీశ్ (97 కేజీలు), నవీన్ (130 కేజీలు) ప్రిలిమినరీ రౌండ్ బౌట్‌లలోనే ఓడిపోయారు.

బెంగళూరు జోరు...

వరుసగా నాలుగో గెలుపు

- 60 పరుగులతో ఘనవిజయం
- చెలరేగిన కోహ్లి, పటిదార్
- వరుసగా పదో ఏడాది ప్లే ఆఫ్స్ చేరలేకపోయిన పంజాబ్ కింగ్స్



'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కోహ్లి



పటిదార్

ధర్మశాల: ఐపీఎల్‌లో ఆరు వరుస ఓటముల తర్వాత ఒక్కసారిగా చెలరేగుతున్న రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) ఇప్పుడు వరుసగా నాలుగో విజయాన్ని అందుకుంది. ఫలితంగా ఎనిమిదో ఓటమితో పంజాబ్ కింగ్స్ జట్టు వరుసగా పదో ఏడాది 'ప్లే ఆఫ్స్' అవకాశాలు కోల్పోయింది. గురువారం జరిగిన పోరులో ఆర్‌సీబీ 60 పరుగుల తేడాతో పంజాబ్ కింగ్స్‌ను ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 241 పరుగులు చేసింది. విరాట్ కోహ్లి (47 బంతుల్లో 92; 7 ఫోర్లు, 6 సిక్స్‌లు), రజత్ పటిదార్ (23 బంతుల్లో 55; 3 ఫోర్లు, 6 సిక్స్‌లు), కామెరాన్ గ్రీన్ (27 బంతుల్లో 46; 5 ఫోర్లు, 1 సిక్స్) వీరవిహారం చేసి ఆర్‌సీబీ భారీ స్కోరులో కీలకపాత్ర పోషించారు. అనంతరం పంజాబ్ 17 ఓవర్లలో 181 పరుగులకు ఆలౌటైంది. రిలీ రోసో (27 బంతుల్లో 61; 9 ఫోర్లు, 3 సిక్స్‌లు) టాప్ స్కోరర్‌గా నిలిచాడు.

భారీ భాగస్వామ్యాలు...

కొత్త బౌలర్ కావేరప్ప తక్కువ వ్యవధిలో డుప్లెసిస్ (9), జాక్స్ (12)లను అవుట్ చేసి పంజాబ్‌కు తగిన ఆరంభం అందించాడు. అయితే మరో ఎండ్‌లో కోహ్లి చెలరేగిపోగా, అతనికి పటిదార్ జత కలిశాక మరింత వేగంగా పరుగులు వచ్చాయి. చహర్ ఓవర్లో పటిదార్ 3 సిక్స్‌లు కొట్టాక జోరు పెరిగింది. 21 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్న తర్వాత పటిదార్ వెనుదిరిగాడు. ఈ దశలో వర్షంతో కొద్దిసేపు ఆట ఆగిపోయింది. మ్యాచ్ మళ్లీ మొదలయ్యాక 32 బంతుల్లో హాఫ్ సెంచరీని అందుకున్న కోహ్లి దూకుడు పెంచాడు. స్యామ్ కరన్ బౌలింగ్‌లో అతను కొట్టిన భారీ సిక్సర్ ఇన్నింగ్స్‌లో హైలైట్‌గా నిలిచింది. అయితే మరో భారీ షాట్‌కు ప్రయత్నించి కోహ్లి సెంచరీ చేజార్చుకున్నాడు. కోహ్లి, గ్రీన్ ఐదో వికెట్‌కు 46 బంతుల్లోనే 96 పరుగులు జత చేశారు. ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్లో 3 పరుగులే ఇచ్చి హర్షల్ పటేల్ 3 వికెట్లు తీశాడు. పంజాబ్ భారీ ఛేదనలో బెయిర్‌స్టో (27) కొంత ధాటిగా ఆడగా... రోసో ఇన్నింగ్స్ మాత్రమే కొద్దిసేపు ఆశలు రేపింది. అతను వెనుదిరిగిన తర్వాత శశాంక్ (19 బంతుల్లో 37; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) పోరాడినా లాభం లేకపోయింది.

క్యాచ్‌లు వదిలేసి...

పంజాబ్ పేలవ ఫీల్డింగ్ కూడా బెంగళూరుకు కలిసొచ్చింది. ఆరంభంలోనే వచ్చిన మంచి అవకాశాలను పంజాబ్ ఫీల్డర్లు వృథా చేశారు. కెరీర్‌లో తొలి ఐపీఎల్ మ్యాచ్ ఆడిన కావేరప్ప మాత్రం తీవ్రంగా నిరాశ చెందాల్సి వచ్చింది. అతని బౌలింగ్‌లోనే కోహ్లి (0, 10 వద్ద) ఇచ్చిన క్యాచ్‌లను అశుతోష్, రోసో వదిలేయగా... పటిదార్ (0 వద్ద) ఇచ్చిన క్యాచ్‌ను హర్షల్ నేలపాలు చేశాడు. పటిదార్ 33 వద్ద ఉన్నప్పుడు చహర్ బౌలింగ్‌లో కొంత కష్టమైన క్యాచ్‌ను బెయిర్‌స్టో అందుకోలేకపోయాడు. 'సున్నా' వద్ద బతికిపోయిన కోహ్లి 92 వరకు చేరడం పంజాబ్‌ను అన్నింటికంటే బాగా దెబ్బ తీసింది.

స్కోరు వివరాలు

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: కోహ్లి (సి) రోసో (బి) అర్ష్‌దీప్ 92; డుప్లెసిస్ (సి) శశాంక్ (బి) కావేరప్ప 9; జాక్స్ (సి) హర్షల్ (బి) కావేరప్ప 12; పటిదార్ (సి) బెయిర్‌స్టో (బి) స్యామ్ కరన్ 55; గ్రీన్ (సి) స్యామ్ కరన్ (బి) హర్షల్ 46; దినేశ్ కార్తీక్ (సి) స్యామ్ కరన్ (బి) హర్షల్ 18; లోమ్రోర్ (బి) హర్షల్ 0; స్వప్నిల్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 241. వికెట్ల పతనం:** 1–19, 2–43, 3–119, 4–211, 5–238, 6–240, 7–241. **బౌలింగ్:** కావేరప్ప 4–0–36–2, అర్ష్‌దీప్ 3–0–41–1, స్యామ్ కరన్ 3–0–50–1, హర్షల్ 4–0–38–3, రాహుల్ చహర్ 3–0–47–0, లివింగ్‌స్టోన్ 3–0–28–0.

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్: ప్రభ్‌సిమ్రన్ (ఎల్బీ) (బి) స్వప్నిల్ 6; బెయిర్‌స్టో (సి) డుప్లెసిస్ (బి) ఫెర్గూసన్ 27; రోసో (సి) జాక్స్ (బి) కరణ్ 61; శశాంక్ సింగ్ (రనౌట్) 37; జితేశ్ శర్మ (బి) కరణ్ 5; లివింగ్‌స్టోన్ (సి) కరణ్ (బి) స్వప్నిల్ 0; స్యామ్ కరన్ (బి) ఫెర్గూసన్ 22; అశుతోష్ శర్మ (ఎల్బీ) (బి) సిరాజ్ 8; హర్షల్ (సి) ఫెర్గూసన్ (బి) సిరాజ్ 0; చహర్ (నాటౌట్) 5; అర్ష్‌దీప్ (సి) కరణ్ (బి) సిరాజ్ 4; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (17 ఓవర్లలో ఆలౌట్) 181. వికెట్ల పతనం:** 1–6, 2–71, 3–107, 4–125, 5–126, 6–151, 7–164, 8–170, 9–174, 10–181. **బౌలింగ్:** స్వప్నిల్ 3–0–28–2, సిరాజ్ 4–0–43–3, యశ్ దయాళ్ 2–0–22–0, ఫెర్గూసన్ 3–0–29–2, జాక్స్ 1–0–5–0, గ్రీన్ 1–0–16–0, కరణ్ శర్మ 3–0–36–2.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
కోల్‌కతా	11	8	3	16	1.453
రాజస్తాన్	11	8	3	16	0.476
హైదరాబాద్	12	7	5	14	0.406
చెన్నై	11	6	5	12	0.700
ఢిల్లీ	12	6	6	12	-0.316
లక్నో	12	6	6	12	-0.769
బెంగళూరు	12	5	7	10	0.217
ముంబై	12	4	8	8	-0.212
పంజాబ్	12	4	8	8	-0.423
గుజరాత్	11	4	7	8	-1.320

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

గుజరాత్ × చెన్నై
వేదిక: అహ్మదాబాద్

రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

కేఎల్ రాహుల్‌పై లక్నో యాజమాన్యం అసంతృప్తి



న్యూఢిల్లీ: భారత స్టార్ క్రికెటర్, లక్నో సూపర్ జెయింట్స్ జట్టు కెప్టెన్ కేఎల్ రాహుల్ ఆటతీరు, సారథ్యంపై ఫ్రాంచైజీ యాజమాన్యం అసంతృప్తితో ఉంది. హైదరాబాద్‌లో సన్‌రైజర్స్‌తో మ్యాచ్ ముగిశాక లక్నో ఫ్రాంచైజీ యజమాని సంజీవ్ గోయెంకా మైదానంలోకి వచ్చి రాహుల్‌పై తీవ్ర అసహనాన్ని ప్రదర్శించారు. రాహుల్‌తో గోయెంకా మాట్లాడుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఫ్రాంచైజీ అసంతృప్తి నేపథ్యంలో రాహుల్ మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో పగ్గాలు వదిలేసి పూర్తిగా బ్యాటింగ్‌పై శ్రద్ధ పెడతాడా లేదా అనేది కొన్ని రోజుల్లో స్పష్టమవుతుంది. 'లక్నో ఈ నెల 14న ఢిల్లీ క్యాపిటల్స్‌తో తలపడుతుంది. ఇంకా ఐదు రోజుల గడువు ఉండటంతో ఏ నిర్ణయం తీసుకోలేదు. మేనేజ్‌మెంట్ తప్పిస్తుందా లేదంటే కెప్టెన్ రాహులే వైదొలగుతాడా అనే దానిపై త్వరలోనే స్పష్టత వస్తుంది' అని ఐపీఎల్ వర్గాలు తెలిపాయి.

ఐదు లక్షల ఎకరాల్లో డ్రోన్ స్ప్రేయింగ్

ఇఫ్కోతో మారుత్ డ్రోన్స్ భాగస్వామ్య ఒప్పందం

వ్యవసాయ డ్రోన్‌లకు ప్రభుత్వ రాయితీ ఉంటుందని వెల్లడి



సాక్షి, హైదరాబాద్: ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లోని 5 లక్షల ఎకరాల వ్యవసాయ భూముల్లో డ్రోన్ స్ప్రేయింగ్‌కు ఇండియన్ ఫార్మర్స్ ఫర్టిలైజర్ కోఆపరేటివ్ లిమిటెడ్ (ఇఫ్కో)తో మారుత్ డ్రోన్స్ భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది. ఆయా రాష్ట్రాల్లో వ్యవసాయ ఉత్పాదకత, సామర్థ్యం పెంపొందించేందుకు ఒక కీలక అడుగుపడింది. ఈ విషయంపై మారుత్ డ్రోన్స్ సహ వ్యవస్థాపకుడు, సీఈఓ ప్రేమ్‌కుమార్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సహకారం వ్యవసాయ పద్ధతుల్లో విప్లవాత్మక మార్పు తీసుకొస్తుందన్నారు. డ్రోన్ వాడకంతో పురుగుమందుల ప్రభావం రైతులపై పడదని, తద్వారా వారి ఆరోగ్యాన్ని కాపాడుతుందని తెలిపారు. డ్రోన్‌ల వినియోగంతో కార్మికుల కొరతను నివారించవచ్చని చెప్పారు. ఒప్పందం ప్రకారం మారుత్ డ్రోన్స్ ఇఫ్కో అగ్రి–ఉత్పత్తులను వినియోగించేందుకు అత్యాధునిక డ్రోన్ సాంకేతికతను ఉపయోగిస్తుందన్నారు. పర్యావరణ ప్రభావాన్ని తగ్గించడంతోపాటు పంట దిగుబడిని పెంచుతుందని, స్థిరమైన వ్యవసాయ పద్ధతులకు దోహదం చేయడం లక్ష్యంగా పెట్టుకుందని చెప్పారు. వ్యవసాయ డ్రోన్లు కొనుగోలు చేయాలనే ఆసక్తి ఉన్న వ్యక్తులు ప్రభుత్వ రాయితీలను పొందవచ్చని, చిన్నతరహా రైతులకు కూడా అందుబాటు ఉంటుందన్నారు. డ్రోన్ యజమానులు, సర్వీస్ ప్రొవైడర్లు ప్రతి ఎకరానికి ఇఫ్కో ఉత్పత్తులను చల్లడం కోసం ప్రోత్సాహకాలను పొందడానికి మారుత్ వద్ద నమోదు చేసుకోవచ్చన్నారు.

ఉత్పత్తి, ఉత్పాదకతపై శాస్త్రవేత్తలు దృష్టి పెట్టాలి

- ఐసీఏఆర్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ టి.ఆర్ శర్మ

సాక్షి, హైదరాబాద్: తరుగుతున్న భూ, నీటివనరులు, వాతావరణ మార్పులు, పెరుగుతున్న డిమాండ్లను దృష్టిలో పెట్టుకొని ఉత్పత్తి ఉత్పాదకతల్ని పెంపొందించడానికి శాస్త్రవేత్తలు ప్రణాళికలు రూపొందించాలని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ఐసీఏఆర్) డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ టి.ఆర్ శర్మ పిలుపునిచ్చారు. భవిష్యత్ అవసరాలకి తగ్గట్లుగా అధునాతన సాంకేతికతను వినియోగించుకుంటూ, వాతావరణ మార్పులని తట్టుకునే వంగడాల సహాయంతో మొక్కజొన్న ఉత్పత్తి, ఉత్పాదకతల్ని అధికం చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, భారత మొక్కజొన్న పరిశోధనా సంస్థలు సంయుక్తంగా నిర్వహిస్తున్న 67వ మొక్కజొన్న పరిశోధనా కేంద్రాల వార్షిక సదస్సులో ఆయన గురువారం ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. మూడు రోజులపాటు జరిగే ఈ సదస్సు శనివారంతో ముగియనుంది. పరిశోధన సంస్థలు, ప్రభుత్వ, ప్రైవేట్ పరిశ్రమలు పరస్పర సహకారం, సమన్వయంతో పనిచేయాలని టి.ఆర్ శర్మ అభిప్రాయపడ్డారు. సుమారు 165 దేశాల్లో సాగవుతూ మొక్కజొన్న ప్రధాన ప్రపంచ పంటగా గుర్తింపు పొందిందని పీజేటీఎస్ఏయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్, పరిశోధనా సంచాలకులు డాక్టర్ పి. రఘురామిరెడ్డి అన్నారు. ఈ సదస్సులో ఐసీఏఆర్ అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ (ఫుడ్, పాడర్ క్రాప్స్) డాక్టర్ ఎస్‌కే ప్రధాన్, ఐసీఏఆర్ అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ (సీడ్స్) డాక్టర్ డీకే యాదవ, భారత మొక్కజొన్న పరిశోధన సంస్థ డైరెక్టర్ డాక్టర్ హెచ్ఎస్ జాట్, నోడల్ అధికారి డాక్టర్ రమేశ్‌కుమార్, మొక్కజొన్న పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ నగేశ్‌కుమార్, విశ్వవిద్యాలయ అధికారులు, శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు.





Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.


'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే
నాకు అసలైన పండుగ రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+8 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 48

శుక్రవారం 10-5-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఏం మొఖం పెట్టుకొని వచ్చినవ్?

రైతుల ఆదాయం డబుల్ చేస్తనంటివి.. రుణభారాన్ని రెట్టింపు చేసి, లక్షల మంది రైతుల ఆత్మహత్యలకు కారణమైతివి..

ప్రతి ఖాతాలో రూ. 15 లక్షలు వేస్తనంటివి.. నల్లధనాన్ని మూడింతలు చేస్తివి..

పదేండ్లలో 20 కోట్ల ఉద్యోగాలిస్తనంటివి .. 45 ఏండ్లలోనే అత్యధికంగా నిరుద్యోగాన్ని 42 శాతం పెంచితివి..

ధరలు తగ్గిస్తనంటివి.. పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసరాలపై భారాన్ని మూడు రెట్లు పెంచితివి..



సబ్ కా వికాస్ అని కథలు చెప్తివి.. రిజర్వేషన్లను తీసేయవడితివి..

అవినీతిపై యుద్ధం చేస్తనంటివి.. రూ. 3.8 లక్షల కోట్ల ఎలక్టోరల్ బాండ్ల స్కామ్ చేస్తివి..

బేటీ బచావో అంటివి.. మణిపూర్, ఉన్నావ్, హత్రాస్‌లో ఆడబిడ్డల మాన ప్రాణాలు పోతే గమ్మునుంటివి..

56 ఇంచుల ఛాతి అని ఏతులు కొడ్తివి.. 2000 చ. కి. మీ. మన భూమిని చైనా కబ్జా చేస్తుంటే కళ్లుమూసుకుంటివి..

పారదర్శక పాలనంటివి.. CBI, ED , IT లను హఫ్తా వసూలీకి వాడుకుంటివి..

అదానీ పెంచుతనంటివి.. రూపాయిని పడగొట్టి, దేశం అప్పులని మూడింతలు చేస్తివి..



పదేండ్ల కన్నీళ్లను యాదుంచుకుందాం
ప్రజా ద్రోహుల పాలనను అంతం చేద్దాం



హస్తం గుర్తుకే ఓటేద్దాం.. కాంగ్రెస్ పార్టీని గెలిపిద్దాం..!

నిశ్చయంగా, నా ప్రభువు తన దాసులలో తాను కోరినవారికి జీవనోపాధిని పుష్కలంగా ప్రసాదిస్తాడు మరియు (తాను కోరిన) వారికి మితంగా ఇస్తాడు. మీరు (ఆయన మార్గంలో) ఖర్చుపెట్టేదంతా ఆయన మీకు తిరిగి ఇస్తాడు. ఆయనే సర్వశ్రేష్ఠుడైన జీవనోపాధి ప్రదాత.

– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 10 మే 2024

భరోసా కావాలి!

పిల్ల పోయినా... పురుటి కంపు పోలేదని ఒక ముతక సామెత. కరోనా అనే మాట క్రమంగా విన మరుగవుతూ వస్తున్నా, దాని ప్రకంపనలు మాత్రం మానవాళిని ఆందోళనకు గురి చేస్తూనే ఉన్నాయి. కరోనా టీకా కోవిషీల్డ్‌పై తాజాగా వస్తున్న వార్తలే అందుకు తార్కాణం. సదరు టీకా తీసుకోవడం వల్ల మనిషిలో రక్తం గడ్డలు కట్టడం, రక్తంలోని ప్లేట్‌లెట్ల సంఖ్య తగ్గడం (వైద్య పరిభాషలో 'థ్రోంబో సైటోపేనియా సిండ్రోమ్' – టీటీఎస్) లాంటి అరుదైన దుష్ప్రభావాలుంటాయని దాన్ని రూపొందించిన బ్రిటన్ దిగ్గజ ఔషధ సంస్థ ఆస్ట్రాజెనెకా లండన్ కోర్టులో ఒప్పుకుంది. దాంతో గత వారం గందరగోళం మొదలైంది. తాజాగా ప్రపంచవ్యాప్తంగా ఆ టీకాను ఉపసంహరిస్తున్నట్టు ఆస్ట్రాజెనెకా బుధవారం ప్రకటించడంతో, భారత్‌లో కోవిషీల్డ్‌గా, యూరప్‌లో వాక్స్‌జెవ్రియాగా అమ్ముడైన కోవిడ్ టీకాపై రచ్చ పరాకాష్ఠకు చేరింది. కరోనా టీకాల భద్రతపై చాలాకాలంగా జరుగుతున్న చర్చలకు తాజా పరిణామాలు యాదృచ్ఛికంగా కొత్త ఊపిరినిచ్చాయి. మన దేశంలో సుప్రీమ్ కోర్ట్ సైతం ఆస్ట్రాజెనెకా టీకాపై వచ్చిన పిటిషన్ విచారణకు అంగీకరించడం గమనార్హం.

ఒక్కసారి వెనక్కి తిరిగి చూస్తే – కోవిడ్ మహమ్మారితో ప్రపంచం అల్లాడుతున్న సమయంలో ప్రజారోగ్యంలో ఆక్స్‌ఫర్డ్ – ఆస్ట్రాజెనెకా టీకా కీలక భూమిక పోషించింది. క్లినికల్ పరీక్షల అనంతరం 2021 జనవరి 4న టీకా తొలి డోస్ వినియోగించారు. ఆ ఒక్క ఏడాదే దాదాపు 250 కోట్ల డోసులు వేశారు. లక్షలాది ప్రాణాలను కాపాడారు. 2021 ప్రథమార్ధంలో భారతదేశంలో డెల్టా వేరియంట్ పెచ్చరిల్లినప్పుడు కూడా ఇదే సంజీవని. ప్రపంచదేశాల మధ్య టీకాల సరఫరాలో చిక్కులున్నప్పుడూ ఆ మానవతా సంక్షోభ పరిష్కారానికి అందుబాటులో ఉన్న కొన్నిటిలో ఇదీ ఒకటి. ఫైజర్, మోడర్నా, నోవావ్యాక్స్, వగైరాల లానే ఈ టీకా కూడా అనేక స్థాయుల పరీక్షలకు లోనైంది. మూడు విడతల ట్రయల్స్‌లో వేలాది ప్రజలపై పరీక్షలు చేసి, సురక్షితమనీ, ప్రభావశీలమనీ తేలాకనే అనుమతులిచ్చారు. బ్రిటన్ సహా యూరప్‌లోని పలు దేశాల్లో 2021 ఆరంభంలో దీన్ని పంపిణీ చేశారు.

నిజానికి, ఈ టీకా వినియోగం వల్ల కొన్ని దుష్ఫలితాలు ఉండవచ్చని బ్రిటన్ ప్రభుత్వం 2021 ఫిబ్రవరిలోనే చెప్పింది. కానీ, ప్రపంచవ్యాప్తంగా వారానికి 40 లక్షల కొత్త కేసులొస్తూ, కరోనా తీవ్రత భయం రేపుతున్న సమయమది. దిక్కుతోచని ఆ పరిస్థితుల్లో... టీకాతో అరుదుగా వచ్చే ముప్పు కన్నా ఉపయోగాలే ఎక్కువని ప్రపంచ ఆరోగ్య సంస్థ లాంటివి భావించాయి. పైగా, మహిళలు వాడే గర్భనిరోధక మాత్రల లాంటి అనేక ఇతర ఔషధాలతో పోలిస్తే ఈ టీకాతో రక్తం గడ్డలు కట్టే రేటు బాగా తక్కువనీ, ప్రతి వెయ్యిమందిలో ఒక్కరికే ఆ ప్రమాదం ఉంటుందనీ లెక్కల్లో తేల్చారు. అందుకే, ప్రపంచ క్షేమం కోసం ఈ టీకాను కొనసాగించారు. ఇక, భారత్ సంగతెలా ఉన్నా విదేశాల్లో కరోనా టీకాతో సహా ఏ ఔషధంతో ఇబ్బంది తలెత్తినా బాధితులకు నష్టపరిహార పథకాలున్నాయి. అయితే, అక్కడ కూడా నష్టపరిహారం అందడంలో చిక్కులు ఎదురవడంతో సమస్య వచ్చింది. టీటీఎస్ వల్ల బ్రిటన్‌లో కనీసం 81 మంది చనిపోగా, వందల మంది అనారోగ్యం బారిన పడ్డారు. నష్టపరిహారం కోరుతూ బాధిత కుటుంబాలు కోర్టుకెక్కాయి. అలా దాదాపు 51 కేసులు ఎదుర్కొంటున్న ఆస్ట్రాజెనెకా లండన్‌లోని హైకోర్ట్‌లో తొలిసారిగా టీకా దుష్ప్రభావాలను అంగీకరించింది.

సహజంగానే ఈ పరిణామం ప్రపంచవ్యాప్తంగా, మరీ ముఖ్యంగా 175 కోట్లకు పైగా కోవిషీల్డ్ టీకా డోసులు తీసుకున్న మన దేశ ప్రజానీకంలో కలకలం రేపింది. ఒక దశలో లక్షలాది ప్రజానీకాన్ని కాపాడి, ప్రపంచానికి రక్షాకవచంగా కనిపించిన టీకా ఇప్పుడిలా భయాందోళనలకు కారణం కావడం విచిత్రమే. కానీ, ప్రాణాంతక మహమ్మారిని కట్టడి చేసేందుకు మరో మార్గం లేని దశలో ఈ టీకాలే దిక్కయ్యాయని మర్చిపోరాదు. ప్రాణరక్షణ కోసం ప్రపంచంలోని అన్ని ప్రభుత్వాలూ, ఔషధ సంస్థలూ టీకాలను తీసుకురావడంలో కొంత హడావిడి పడివుండవచ్చు. లాభనష్టాలపై ప్రజల్ని మరింత చైతన్యం చేసి, టీకా కార్యక్రమం చేపట్టి ఉండవచ్చు. అయితే, కోట్లాది ప్రాణాలకు ముందుగా ప్రాథమిక భద్రతే ధ్యేయంగా టీకాల వినియోగం త్వరితగతిన సాగిందని అర్థం చేసుకోవాలి. పైగా, టీకా దుష్ప్రభావాలు అత్యంత అరుదుగా కొందరిలోనే కనిపిస్తాయని వైద్య నిపుణులు ఇప్పటికీ స్పష్టం చేస్తున్నందున అతిగా ఊహించుకొని ఆందోళన చెందడం సరికాదు.

ఆస్ట్రాజెనెకా వారి టీకా మంచిదే అయినా, ఫైజర్, మోడర్నా లాంటి ఇతర టీకాలు మెరుగైనవని నిపుణుల మాట. మరింత భద్రత, ప్రభావశీలత ఉన్న ఎంఆర్ఎన్ఏ వెర్షన్లు ఇప్పుడు అందుబాటులోకి వచ్చాయి. దానికి తోడు బాధితుల కేసులు. ఫలితంగా, ఆస్ట్రాజెనెకా తన టీకాలను ఉపసంహరించుకోక తప్పలేదు. కోర్టు కేసులకూ, తమ ఉపసంహరణకూ సంబంధం లేదనీ, రెండూ కాకతాళీయమేననీ ఆ సంస్థ చెబుతున్నా, ఇదంతా నష్టనివారణ చర్యల్లో భాగంగానే కనిపిస్తోంది. అది అటుంచితే, రోగుల భద్రతే తమ ప్రాధాన్యమని ఆస్ట్రాజెనెకా పునరుద్ఘాటిస్తే సరిపోదు. టీకా వాడకం వల్ల తలెత్తిన ఆరోగ్య సమస్యలకు విరుగుడు ఆలోచించి, ప్రజల్లో భరోసా పెంచాలి. బాధ్యత వహించి, బాధిత రోగులకు సత్వర నష్టపరిహారం చెల్లించి తీరాలి. టీకాలో లోపమెక్కడ జరిగిందో క్షుణ్ణంగా పరిశోధించాలి. ప్రభుత్వాలు సైతం ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరిపించాలి. టీకా వినియోగం సురక్షితమేనని ప్రకటించడానికి అనుసరిస్తున్న ప్రమాణాలేమిటో ఒకసారి సమీక్షించాలి. కఠినమైన ప్రమాణాలు పాటించకుండానే కోవిషీల్డ్ వినియోగానికి పచ్చజెండా ఊపిన నియంత్రణ అధికారులపై చర్యలు తీసుకోవాలి. ఎందుకంటే, ప్రస్తుత పరిణామాలతో ప్రజలకు టీకాల పైన, వాటి తయారీదార్లపైన, చివరకు ఆరోగ్య వ్యవస్థ మీదే నమ్మకం సడలితే అది మరింత ప్రమాదం.

రంగును బట్టి రాజకీయాలా?

విశ్లేషణ



టంకశాల అశోక్

దక్షిణ భారతీయులు ఆఫ్రికన్లను పోలి ఉంటారన్న శామ్ పిట్రోడా వ్యాఖ్యలపై దుమారం రేగింది. ఆధునిక మానవుని ఆవిర్భావం తొలుత ఆఫ్రికాలోనే జరిగిందనీ, అక్కడి నుంచి వారు వివిధ ప్రాంతాలకు వలస పోయారనీ, అందులో ప్రస్తుత భారతదేశం కూడా ఒకటనీ శాస్త్రవేత్తలు అంగీకరిస్తున్నారు. అలాంటప్పుడు ఆఫ్రికన్లతో పోలిక ఎవరికైనా ఎందుకంత ఉలికిపాటుకు గురి చేయాలి? వలసలు, సాంకర్యాల క్రమంలో మనుషులు తమ ఒరిజినల్ లక్షణాలలో కొన్నింటిని నిలుపుకొన్నారు, కొన్నింటిని కోల్పోయారు. ఇందుకు అనుగుణంగా దక్షిణ భారతీయుల రంగు ఉత్తరాదివారితో తేడాగా ఉండటం సహజం. ఆ చర్మపు రంగును గురించి, 'వీరంతా ద్రవిడులు' అనే ఈసడింపులు తెలిసిన విషయమే. ఈ విధమైన భావనలు ఏవీ దేశానికి మంచివి కావు.

దక్షిణ భారతీయులు ఆఫ్రికన్లను పోలి ఉంటారంటూ శామ్ పిట్రోడా (ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ చైర్మన్‌గా రాజీనామా చేశారు) చేసిన వ్యాఖ్యలపై తీవ్ర దుమారం సాగుతున్నది. రాజకీయాలను పక్కన ఉంచి మానవ వికాస శాస్త్రాన్ని, మానవ వలసల కోణాలను పరిశీలిస్తే ఆ వ్యాఖ్యలలో తప్పేమిటో అర్థం కాదు. వానరాల నుంచి ఆధునిక మానవుని ఆవిర్భావం తొలుత ఆఫ్రికాలోనే జరిగిందనీ, అక్కడి నుంచి వారు భూగోళంలోని వివిధ ప్రాంతాలకు వలస పోయారనీ, అందులో ప్రస్తుత భారతదేశం కూడా ఒకటనీ శాస్త్రవేత్తలు అంగీకరిస్తున్నారు. ఈ సూత్రీకరణను ప్రపంచమంతా కూడా ఆమోదిస్తున్నది. మనకు మాత్రం సైన్సు కన్నా రాజకీయాలు ముఖ్యం గనుక పిట్రోడా మాటలపై భూమ్యాకాశాలను ఏకం చేసే హంగామాను సృష్టిస్తున్నాము.

ఇంతకూ పిట్రోడా అన్నదేమిటి? ఆయన దక్షిణ భారతీయులు ఆఫ్రికన్లను పోలి ఉంటారని మాత్రమే అనలేదు. దేశంలోని తూర్పు ప్రాంతాల వారు చైనీయులవలె, పశ్చిమ ప్రాంతాల వారు అరబ్బుల వలె, ఉత్తరాది వారు శ్వేతజాతీయులవలె ఉంటారని కూడా అన్నారు. ఈ పోలికలలో తక్కిన మూడింటిని వదలి, దక్షిణ భారతీయులు ఆఫ్రికన్ల వలె ఉంటారన్న మాట ఒక్కటే వివాదమైంది. వివాదమైంది అనటంకన్న వివాదంగా మార్చారనటం సరైనదవుతుంది. ఈ చర్చలోకి వెళ్లే ముందు ఒక విషయం గుర్తు చేసుకోవాలి. స్వయంగా బీజేపీకి చెందిన తరుణ్ విజయ్ అనే నాయకుడు, తను రాజ్యసభ సభ్యునిగా, 'పాంచజన్య' పత్రిక సంపాదకునిగా ఉండినపుడు, ''మనం (అనగా ఉత్తరాది వారం) దక్షిణాది వారితో కలిసి ఉండటం లేదా?'' అని వ్యాఖ్యానించారు. అనగా, తాము తెల్లగా ఉంటామని, ఉత్తమ స్థాయి వారమని, దక్షిణాది వారు నల్లగా ఉంటారని, అధమ స్థాయి వారని, అయినప్పటికీ తమది ఉదార స్వభావం గనుక అటువంటి వారితో కలిసి జీవిస్తున్నామని అర్థం.

వాస్తవానికి దక్షిణాది వారి చర్మపు రంగును గురించి, కనుముక్కుల తీరు గురించి, భాషా సంస్కృతుల గురించి, 'వీరంతా ద్రవిడులు' అనే పద్ధతిలో ఈసడింపులు చేయటం అందరికీ తెలిసిన విషయమే. ఎన్టీఆర్ రాక వరకు అందరూ కట్టగట్టి 'మద్రాసీ'లే. ఈ ధోరణికి బీజేపీ, సంఘ్ పరివార్ సైతం మినహాయింపు కాదన్నది ఇక్కడ గుర్తించవలసిన విషయం. ప్రస్తుత వివాద సందర్భంలోనూ ఈ సంగతి గుర్తించాలి. పిట్రోడా కాంగ్రెస్ నేత అయినందున, ఆయన మాటలను వివాదం చేస్తే తమకు రాజకీయంగా లాభిస్తుందనే సంకుచిత ఆలోచన తప్ప, ఇందులో బీజేపీ వివేకం ఏమీ కన్పించదు.

మనకు తెలిసి మానవ వికాస శాస్త్రం, ప్రపంచవ్యాప్తంగా వలసల చరిత్ర, ఇటీవలి సంవత్సరాలలో జరిగిన డీఎన్ఏ పరిశోధనలు చెప్తున్న విషయాలు కొన్నున్నాయి. ఇండియా, చైనా, ఉత్తర యూరప్‌లలో ప్రాథమిక స్థాయి మానవ జాతులు స్వల్ప స్థాయిలో రూపుదిద్దుకున్నప్పటికీ, ఆధునిక మానవుని ఆవిర్భావం తొలుత జరిగింది ఆఫ్రికాలోని తూర్పు భాగాన గల రిఫ్ట్ వ్యాలీలో. వేలాది సంవత్సరాల కాలంలో అటువంటి ఆవిర్భావం ఏ విధంగా జరిగిందో శాస్త్రీయమైన పురావస్తు అధ్యయనాలు చెప్పాయి. వాటిపై కెన్యా రాజధాని నైరోబీ, ఇథియోపియా రాజధాని అడ్డిస్ అబాబాలలోని జాతీయ మ్యూజియాలలో గొప్ప ప్రదర్శనలున్నాయి. ఈ రెండింటినీ నేను స్వయంగా చూడటమే గాక, రిఫ్ట్ వ్యాలీలోని కొంత భాగంలో ప్రయాణించాను. ఆధునిక మానవుని ఆవిర్భావం పరిస్థితి ఇది కాగా, ఆ ప్రాంతం నుంచి మానవులు రెండు లక్షల సంవత్సరాల క్రితం నుంచి మొదలుకొని ప్రపంచం నలువైపులా ఎట్లా వలస వెళ్లారో, ఆ విధంగా 70 వేల ఏళ్ల క్రితం ప్రస్తుతం మనం అంటున్న భారతదేశంలోకి ఏ విధంగా ప్రవేశించారో అనేక అధ్యయనాలున్నాయి.



అండమాన్ దీవుల్లోని అండమానీస్ తెగ ప్రజలు (ఫైల్ ఫొటో)

తర్వాత వేల సంవత్సరాలలో ప్రపంచమంతటా జరిగినట్లే ఇండియాలో కూడా లెక్కలేనన్ని జాతి సాంకర్యాలు జరిగాయి. పైన చెప్పుకున్నట్లు అప్పటికే ఇక్కడ స్వల్ప స్థాయిలో ప్రాథమిక మానవులు ఉండగా, తర్వాత కాలాలలో తూర్పు ఆసియా నుంచి మంగోలాయిడ్లు, మధ్య ఆసియాలోని కాస్పియన్ సముద్ర ప్రాంతం నుంచి ఆర్యులు, పశ్చిమాసియా నుంచి అరబ్బులు, పారశీకుల పూర్వీకులు ఇటువైపు వలసలు వస్తూ పోయారు. తిరిగి వీరందరి మధ్య సాంకర్యాలు, వలసలు వేలకు వేల సంవత్సరాల పాటు సాగాయి. దేశంలోని అన్ని ప్రాంతాల స్త్రీ, పురుషుల డీఎన్ఏలపై జరిగిన ఆధునిక శాస్త్ర పరిశోధనలు, పురావస్తు పరిశోధనలు తేల్చిన విషయాలివి. అయితే ఈ వలసలు, సాంకర్యాల క్రమంలో వేర్వేరు జాతులు, ప్రాంతాల మనుషులు తమ ఒరిజినల్ లక్షణాలలో కొన్నింటిని తరతరాలుగా నిలుపుకోవటం, కొన్నింటిని ఒక మేర కోల్పోవటం జరుగుతూ వస్తున్నదని శాస్త్రవేత్తలు నిర్ధారించారు. ఉదాహరణకు అండమాన్, నికోబార్ ఆదిమవాసి తెగలు, దేశంలోని మారుమూల అడవులలో నివసించే ఆటవిక జాతులకు ఇతరులతో సాంకర్యం దాదాపు లేనందున, వారిలో ఇప్పటికీ ఆఫ్రికన్ డీఎన్ఏ యథాతథంగా కనిపిస్తుందంటారు. అటువంటి స్థితిలో ఆఫ్రికన్లతో పోలిక ఎవరికైనా ఎందుకంత ఉలికిపాటుకు, వ్యతిరేక భావనకు గురి చేయాలి?

దక్షిణాది ప్రజలు, ఈశాన్య భారత లేదా తూర్పు భారత వాసులు, పశ్చిమ, ఉత్తర ప్రాంతాల వారి రంగు తేడాలకు మూలాలు దీనంతటిలో ఉన్నాయి. దక్షిణ–ఉత్తర భారత భాషలు, సంస్కృతులు, దేవతలు, ఆలోచనా ధారల మధ్య, చివరకు రాజకీయాల మధ్య కనిపించే వ్యత్యాసాలకు గల మూలాలను శాస్త్రీయంగా శోధిస్తూ పోతే బోధపడేది ఇదే. ఆధునిక మానవుల ఆవిర్భావానికి, వారి వలసలకు, పరస్పర సాంకర్యాలకు లక్షలాది, వేలాది సంవత్సరాల చరిత్ర ఉంది. ఇందుకు ప్రపంచంలోని ఏ ప్రాంతంగానీ, భారతదేశంగానీ ఎంత మాత్రం మినహాయింపు కావు. పైన చెప్పుకొన్నట్లు, ఈ పరిణామ క్రమం ఒకవైపు అనంతంగా సాగుతూనే, మరొకవైపు అనేకులు తమ ఒరిజినల్ డీఎన్ఏలోని, ఒరిజినల్ లక్షణాలలోని కొన్ని భాగాలను అదేవిధంగా నిలుపుకొన్నారు. అట్లా ఎవరెంత నిలుపుకొన్నారు, అవి ఏ మేరకు నిలిచి ఉన్నాయనేది అనేక పరిస్థితులపై ఆధారపడి సాగుతూ వస్తున్నది.

ఇందుకు అనుగుణంగా దక్షిణ భారతీయుల రంగు కన్నా ఉత్తరాదివారు, పశ్చిమ, తూర్పువాసుల రంగు తేడాగా ఉండటం సహజం. కానీ దానినిబట్టి వివక్షలు ఏర్పడాలంటే, తక్కిన ముగ్గురిలోనూ ఆఫ్రికన్ డీఎన్ఏ ఉంది. వారి పూర్వీకులు సైతం ఆఫ్రికన్లే. అటువంటపుడు, ఇంకా ఒక మేర మిగిలి ఉన్న రంగును బట్టి తరుణ్ విజయ్ అనే పెద్దమనిషి గానీ, మరొకరుగానీ, తమవంటి పూర్వీకులే గల దక్షిణ భారత ప్రజలను చిన్నచూపు చూడటం విజ్ఞతగల పని అవుతుందా? ఇంతకూ పిట్రోడా ఆ మాటలన్నది ఎందుకో తెలియదు గానీ, మానవ వికాస శాస్త్రం దృష్టితో, ప్రపంచవ్యాప్త వలసల చరిత్ర దృష్టితో, డీఎన్ఏ పరిశోధనల దృష్టితో సరిగా ఇవే మాటలను ఇప్పటికి ఎందరో అన్నారు, రాశారు. ఎన్నికల సమయం గనుక ఇది అధికార పక్షానికి ఒక మంచి ఆయుధంగా మారింది.

ఈ సందర్భంలో మరొకటి గుర్తుకు వస్తున్నది. ఆర్యుల, ఉత్తరాది వారి ఆధిపత్యంగల పార్టీలు, ప్రభుత్వాలు ద్రవిడుల దక్షిణాదిని రాజకీయంగా జయించాలని, తమ ఆధిపత్యం కిందకు తెచ్చుకోవాలని ప్రయత్నిస్తున్నాయని, నిరంతరం వివక్షకు గురి చేస్తున్నాయనే వాదనలు పెరియార్ రామస్వామి తర్వాత, హిందీ వ్యతిరేక, ఉత్తరాది వ్యతిరేక ఉద్యమాల తర్వాత ఇప్పటికీ ముందుకు వస్తుంటాయి. ఈ విధమైన భావనలు ఏవీ దేశానికి మంచివి కావు.

వ్యాసకర్త సీనియర్ సంపాదకులు

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

వ్యాప్తి లేకనా?



గుప్తుల వంశానికి చెందిన కుమార గుప్తుడు నిర్మించిన అసలైన నలందా విశ్వవిద్యాలయాన్ని సందర్శించడం బాగుంది. దాని విస్తృతి, సంరక్షణ, విభ్రాంతి గొలిపే తీరు దృష్ట్యా చూస్తే ప్రపంచంలోనే అంతర్జాతీయ యాత్రికులు అత్యంత తక్కువగా సందర్శించే చారిత్రక ప్రదేశంగా ఇది నిలుస్తుంది.

– ఆండ్రూ ఫ్లెమ్మింగ్, బ్రిటన్ దౌత్యవేత్త

తగ్గినా నెగ్గుతారు!



బీజేపీలో పగుళ్లను గుర్తిస్తూ ప్రతిపక్షం సంబరపడుతుండొచ్చు గాక! కానీ సందేహం లేకుండా బీజేపీ, దాని మిత్రపక్షాలు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాయి. వాళ్లు దాని మీద ఏళ్లుగా పనిచేస్తున్నారు. వారి మార్కెటింగ్ వ్యూహం కచ్చితంగా ఉంది. 400 స్థానాలు రాకపోవచ్చు, కానీ ప్రభుత్వమైతే ఏర్పడుతుంది.

– అతుల్ ఖత్రీ, యూట్యూబర్

మతం మారిన గోడలు



హాజియా సోఫియా తర్వాత, టర్కీ అధ్యక్షుడు ఎర్డోగాన్ మరో ప్రాచీన ఆర్థోడాక్స్ చర్చిని మసీదుగా మార్చారు. చర్చి నుంచి మసీదుగా, అటుపై మ్యూజియంగా మారినదాన్ని మళ్లీ మసీదు చేశారు. ఇంకెక్కడైనా మసీదును ఇస్లామేతర ప్రార్థనాస్థలంగా మార్చితే ఎర్డోగాన్ కచ్చితంగా కోపోద్రిక్తులవుతారు.

– తస్లీమా నస్రీన్, రచయిత్రి

మనమే కాపాడుకోవాలి!



ఇజ్రాయెల్‌కు పంపాల్సిన ఆయుధాలను అమెరికా నిలిపివుంచిందని వార్త. దాదాపుగా తన 51వ రాష్ట్రం లాంటి ఇజ్రాయెల్‌కే అమెరికా అలా చేయగలిగితే, అది ఇండియాకు ఏం చేయగలదో ఊహించండి. రక్షణ రంగంలో ఆత్మనిర్భరతకు మించిన ప్రత్యామ్నాయం లేదు.

– దివా జైన్, డెవలపర్

కావాలనే...



మనం భరించాల్సి వస్తున్న ఈ ఎండలు, వాతావరణ సంక్షోభం ఏదో ప్రమాదవశాత్తూ సంభవించినవి కాదు; అది ఉద్దేశపూర్వక రాజకీయ ఎంపిక.

– దిశా రవి, యాక్టివిస్ట్

ఆయనకు ప్రజలే దేవుళ్ళు

అభిప్రాయం



డా॥ కాలువ మల్లయ్య

ప్రజాస్వామ్య యుగంలో కత్తి ఉన్నవాడిదే రాజ్యం కాదు. ప్రజాబలం ఉన్నవాడిదే రాజ్యం. ప్రజాబలం ఏ నాయకుడికైనా ఓటు ద్వారా లభిస్తుంది. ఓటరు తలచుకుంటే ఎవరినైనా గద్దెనెక్కించగలడు. కాని ఈ ఓటరును అయోమయంలో ముంచి కులమతాలను రెచ్చగొట్టి, సామాజిక అంతరాలను సృష్టించి, డబ్బు ప్రలోభాలు పెట్టి, అబద్ధాలను అనంత సంఖ్యలో ప్రచారం చేసి గెలుద్దామనుకునే చంద్రబాబు నాయుడు లాంటి నాయకులున్నారు. తానిదివరకు పద్నాలుగేళ్ళు ముఖ్యమంత్రిగా ఉండి ప్రజలను ఏమాత్రం పట్టించుకోకుండా నేలవిడిచి సాము చేసినట్లు పాలన చేసిన చంద్రబాబు నాయుడు కాపీ కొట్టిన ఉచితాల పథకంతో, తప్పుడు వాగ్దానాలతో ప్రజలను మరోసారి మభ్యపెట్టాలని చూస్తున్నారు.

చంద్రబాబుకు జగన్‌ను ఇష్టమున్నట్టు తిట్టడమే మ్యానిఫెస్టో. ఐదేళ్ళ పాలనలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి యాభై ఏళ్ళ భరోసానిచ్చిన జగన్‌ను బదనాం చేయడమే బాబు బృందం పనిగా పెట్టుకుంది. చంద్రబాబు ఎన్ని ప్రయత్నాలు చేసినా గత ఐదేళ్ళలో జగన్ ఆంధ్రప్రదేశ్ ప్రజలకు చేసిన మేలు, వాగ్దానాల అమలును ప్రజలు మరచి పోయేట్టు చేయలేకపోతున్నారు. ఇంగ్లిష్ మీడియం నాణ్యమైన చదువులు, ఆరోగ్యశ్రీ, అమ్మ ఒడి, నవరత్నాలు, రైతు భరోసా, రుణమాఫీ, వలంటీర్ వ్యవస్థ, లక్షలాది ఉద్యోగాల కల్పన, పారిశ్రామికాభివృద్ధి, సామాజిక అంతరాల తొలగింపుకై చేస్తున్న కృషి లాంటి వన్నీ జగన్‌ను ఎన్నటికీ ప్రజలు మరచిపోలేని విధంగా మార్చాయి. చంద్రబాబు 14 ఏళ్ళపాలనలో బాబు పేరును జ్ఞాపకం చేసుకోవడానికి వీలున్న ఒక్క పథకమూ లేనందువల్ల ఆయన ఎన్ని ఉచితాలు ప్రకటించినా అవి ఉత్తుత్తివే అని ప్రజలు భావిస్తున్నారు.

తెలుగు రాష్ట్రాలను ఏలిన ఏ రాజకీయనాయకుడూ సంపాదించనంత ప్రజాదరణను, కీర్తి ప్రతిష్ఠలను జగన్ ఐదేళ్ళలో సంపాదించారు. ఆయనకున్న అసమాన పథక రచనా చాతుర్యం, ప్రజాస్వామ్యంలో పాలకుడు ఇలా ఉండాలన్న విషయంపై ఉన్న క్లారిటీలే అందుకు కారణం. మౌలిక మార్పులు తీసుకురావడంలో, ఆంధ్రప్రదేశ్‌ను దేశానికే ఉదాహరణ ప్రాయంగా నిలబెట్టడంలో, సామాజిక న్యాయబాటను సువిశాలం చేయడంలో జగన్ తీసుకున్న చర్యల వల్ల ఈ విజయం సాధ్యమైంది.

మతాన్ని, కులాన్ని సెంటిమెంట్లను రెచ్చగొడుతూ ఓట్లు సంపాదించుకునే మతతత్వ పార్టీలు, సిద్ధాంత ప్రాతిపదిక అంటూ ఏదీ లేకుండా పార్టీలు నడిపే కప్పదాటు నాయకుల సమూహం ఎన్నికల వేళ జగన్‌కు వ్యతిరేకంగా దుష్ప్రచారం చేస్తున్నాయి. కానీ ప్రజలు వీటిని పట్టించుకోవడం లేదు. జగన్‌కు ఆచరణశీలత ఉంది. ప్రజలను ప్రేమించే గుణముంది. ఆ ప్రజల కోసం ఏమైనా చేసి తీరాలన్న తపనుంది. తండ్రి రాజశేఖరరెడ్డి వారసత్వంగా వచ్చిన 'ప్రజలే దేవుళ్లు' అనే భావముంది. ఆ ప్రజలకు సేవ చేయాలన్న సేవా తత్పరత ఉంది. అందుకే ప్రజలంతా జగన్ వెంటున్నారు. అప్పుడు వైఎస్సార్‌ను హృదయానికి హత్తుకున్నట్టే ఇప్పుడు జగన్‌ను హత్తుకుంటున్నారు. జగన్ నడిపిస్తున్న వైఎస్సార్ సీపీని ఆంధ్రులు గెలిపించి తీరుతారు. బూటకపు ఉచితాల చంద్రబాబుకిది చివరి ఎన్నిక కావడం ఖాయమని అనేక సర్వేలు చెబుతున్నాయి.

వ్యాసకర్త ప్రముఖ కథారచయిత I 91829 18567

ఎంతకాలం మోసం చేయగలరు?

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీజేపీ, ఆర్ఎస్ఎస్ మీద చేసిన నిరాధారమైన అబద్ధాలపై లోతైన విశ్లేషణ చేయాల్సిన అవసరం ఉంది. ఆయన చెప్పినవన్నీ అబద్ధాలే. వాటిని ప్రజల ముందు ఉంచాలి. లేకుంటే అవన్నీ నిజాలని నమ్మే ప్రమాదం ఉంది. గత అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీ, బీఆర్ఎస్‌లు ఒక్కటే అని తప్పుడు ప్రచారం చేయటం, అలవి కాని తప్పుడు హామీలు ఇవ్వడం ద్వారా అసెంబ్లీ ఎన్నికలలో గెలిచారు. ఆ హామీలు ఇంతవరకు అమలుకు నోచుకోలేదు. ఇప్పుడు సార్వత్రిక ఎన్నికల్లో కొత్త అబద్ధాలతో ఎన్నికల ప్రచారం మొదలు పెట్టారు.

ఆర్ఎస్ఎస్ మూల సిద్ధాంతమే రిజర్వేషన్లు రద్దు చేయడం అని సొంత థియరీ చెప్పడం ఆయన అవగాహనా రాహిత్యానికి నిదర్శనం. ఎందుకంటే ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకులు డా॥ కేశవ్ బలిరామ్ హెడ్గేవార్ సంఘ్ 'విజన్ అండ్ మిషన్'ను స్పష్టంగా చెప్పారు. 'జనతా జనార్దన' అనే భావనను ఆయన చెప్పారు. అనగా 'ప్రజలే దేవుడి అవతారం, ప్రజాసేవ చేయడం అంటే దైవ సేవ చేయటం' అని అర్థం. అటువంటి దైవిక పునాదుల మీద నిర్మితమైన ఆర్ఎస్ఎస్ ఎన్నో తరాలుగా నష్టపోయిన నిరుపేద ఎస్సీ, ఎస్టీ ప్రజలకు ఇచ్చిన, రాజ్యాంగ బద్ధంగా లభించిన రిజర్వేషన్లను రద్దు చేసే ప్రణాళికతో ఉందనడం దేశ ప్రజలను తప్పుదోవ పట్టించటమే అని చెప్పాలి. రాజకీయ పార్టీగా ఎదిగిన బీజేపీ నిరంతరం హిందూ సమాజంలోని అసమానతలను తొలగించి ఒక నూతన భారతాన్ని నిర్మించేందుకు కృషి చేస్తూ వస్తున్నది. అటువంటి బీజేపీ మీద రిజర్వేషన్లు రద్దు చేస్తారనే ఊహాజనితమైన నింద వేయడం ఆయన రాజకీయ దిగజారుడుతనాన్ని తెలియజేస్తుంది.

ముఖ్యమంత్రి సంఘ్, బీజేపీ నాయకులను అభాసుపాలు చేసేముందు సావర్కర్ హిందూ సమాజంలోని కుల రుగ్మతలకు వ్యతిరేకంగా అప్పట్లోనే నిర్వహించిన 'సహపంక్తి' భోజనాల వంటి కార్యక్రమాల గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. అంతేకాక బీజేపీ సిద్ధాంతకర్త అయిన దీన్ దయాల్ ఉపాధ్యాయ్ 'అంత్యోదయ', 'ఏకాత్మ మానవతా వాదం' వంటి తాత్విక చింతనల గురించి అధ్యయనం చేసి మాట్లాడి ఉండాల్సింది. ప్రజాస్వామ్యంలో ఓట్లు పొందాలంటే ప్రజలను మెప్పించే విధానం ప్రజాసేవ మాత్రమే కానీ... రాజకీయ ఆరోపణలు, అబద్ధాలు కావని గుర్తుంచుకోవాలి.

రేవంత్ రెడ్డి మీద వచ్చిన ఫిర్యాదు, నమోదైన కేసు విషయాన్ని పరిశీలిస్తే ఆయన చేస్తున్న వితండవాదం ఏంటో ఇట్టే అర్థమవుతుంది. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా మాటల్ని వక్రీకరించి ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా రూపొందించిన ఒక 'డీప్ ఫేక్' వీడియోకి సంబంధించి ఢిల్లీ పోలీసులు ఆయనకు నోటీస్ జారీచేశారు. అమిత్ షా చాలా స్పష్టంగా మతపరమైన రిజర్వేషన్లు తమ విధానం కాదనీ ఎస్సీ, ఎస్టీలకు దక్కాల్సిన న్యాయబద్ధమైన వాటాను ముస్లింలకు బదిలీ చేసే ప్రయత్నాలను బీజేపీ అడ్డుకుంటుందనే అర్థంలో మాట్లాడితే దాన్ని మార్చి అసలు ఎస్సీ, ఎస్టీలకు ఉన్న రిజర్వేషన్లను తీసివేస్తామన్న అర్థం వచ్చేలా ఫేక్ వీడియో తయారుచేసి ప్రచారం చేశారు.



రాజ్యాంగ బద్ధమైన ముఖ్యమంత్రి పదవిలో ఉన్న రేవంత్ రాజ్యాంగ సమీక్ష కొరకు నియమించిన జస్టిస్ వెంకటాచలయ్య కమిషన్‌ను రాజ్యాంగాన్ని మార్చడానికి వేశారని ఏమాత్రం అవగాహన లేకుండా మాట్లాడటం ఆయన విషయ పరిజ్ఞానానికి నిదర్శనం. రేవంత్ తూలనాడినట్టుగా బీజేపీ రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నం ఏనాడూ చేయలేదు. నిజానికి కాంగ్రెస్ పార్టీనే తరచూ రాజ్యాంగ సవరణలు చేసింది. ఒక్క ఇందిరా గాంధీ కాలంలోనే 42వ రాజ్యాంగ సవరణతో పాటు అనేకసార్లు రాజ్యాంగాన్ని సవరణల పేరుతో తన ఇష్టం వచ్చినట్టుగా మార్పు చేశారు. రాజ్యాంగ ప్రాథమిక స్వరూపాన్ని మార్చే ఏ హక్కూ పార్లమెంట్‌కు లేదని 'కేశవానంద భారతి' వంటి సుప్రీం కోర్టు తీర్పులు చెబుతుంటే... రేవంత్ రెడ్డి ఇలాంటి అనైతికమైన ఆరోపణలు చేయటం ఆయన స్థాయికి తగదు.

హిందూ మతం నుంచి వేరే మతానికి మారిన వారు కూడా రిజర్వేషన్లు అనుభవించడాన్ని కాంగ్రెస్ ఇంతకాలం చూస్తూ ఊరుకుంది. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఎస్సీ, ఎస్టీలకు న్యాయం జరిగేలా మత మార్పిడి చేసుకున్న వాళ్ళకి మత పరమైన రిజర్వేషన్లు తీసివేస్తామని పేర్కొన్నారు తప్ప రిజర్వేషన్లను రద్దు చేస్తామని ఎక్కడా ప్రస్తావించలేదు. దీని మీద అబద్ధపు ప్రచారం చేసిందే కాకుండా ఆర్ఎస్ఎస్ సిద్ధాంతకర్త గురూజీ గోల్వాల్కర్ 2015 తర్వాత రిజర్వేషన్లను రద్దు చేయాలని రాశారని అతిపెద్ద అబద్ధం చెప్పారు రేవంత్. అబద్ధాలనే ప్రచారాస్త్రాలుగా చేసుకున్న రేవంత్ జాతీయ రాజకీయాలను తాత్కాలికంగా ఆకర్షించవచ్చేమో గానీ... అవి ఆయన్ను విశ్వసనీయత గల దీర్ఘకాలిక నేతగా మాత్రం నిలబెట్టలేవు.

– డా॥ దొంతగాని వీరబాబు, హెచ్‌సీయూలో రాజనీతి శాస్త్రం అసిస్టెంట్ ప్రొఫెసర్,

చందనోత్సవం

ఎటు చూసినా సంపెంగలు, పనస ఫలాల పరిమళాలు విరజిమ్మే ప్రకృతి రమణీయతతో విరాజిల్లే శ్రీ వైష్ణవ క్షేత్రం సింహాచలం. నర, వరాహ, సింహ అవతారాల కలయికతో త్రిభంగి మూర్తిగా సాక్షాత్తు శ్రీ మహా విష్ణువే అప్పన్నగా వెలసిన దివ్యధామం సింహగిరి. నిత్యం చందన అలంకారంతో లింగాకృతిలో భక్తులను అనుగ్రహిస్తున్న స్వామి తన నిజ రూపంలో, అదీ సంవత్సరంలో కొన్ని గంటల పాటు దర్శనం ఇచ్చే పవిత్ర దినం అక్షయ తృతీయగా వ్యవహరించే వైశాఖ శుద్ధ తదియ.

సింహాచల చందనోత్సవానికి వారం రోజులు ముందు నుంచే ప్రత్యేక జప, హోమ, పూజలతో చందనం అరగదీసే ప్రక్రియ ప్రారంభిస్తారు. రంగరించిన చందనంలో 60 రకాల వన మూలికలు, సుగంధ ద్రవ్యాలు కలుపుతారు. అక్షయ తృతీయ వేకువ జామునే స్వామికి ప్రత్యేక ఆరాధన ముగిసిన పిమ్మట ఆలయ అర్చకులు తమ నాసికలకు వస్త్రం చుట్టుకుని బంగారు బొరిగలతో స్వామి మీద ఉన్న చందనాన్ని తొలగిస్తారు. అనంతరం గంగాజల ధారతో అభిషేక పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఆ రాత్రి వరకు నిజ రూపాన్ని లక్షలాది మంది భక్తులు దర్శించుకుంటారు. తిరిగి సాయంత్రం ఆరాధన అనంతరం చందనయాత్రలోనే అపురూపమైన ఘట్టం మొదలవుతుంది. అదే సహస్ర ఘటాభిషేకం. దేశం నలుమూలల నించి వచ్చిన శ్రీ వైష్ణవ స్వాములు సంప్రదాయంగా శ్రీ సూక్త, పురుష సూక్త, విష్ణుసహస్ర నామాలు పఠిస్తూ గంగాధర నుంచి ఘటాలతో తెచ్చిన జలాలతో స్వామికి సహస్ర ఘటాభిషేకం జరుగుతుంది. అనంతరం స్వామికి తొలి విడతగా మూడు మణుగుల చందన సమర్పణ చేస్తారు.

శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి వారికి చందనాన్ని తొలి విడతగా అక్షయ తదియనాడు అనంతరం వైశాఖ, జ్యేష్ఠ, ఆషాఢ పౌర్ణమి రోజుల్లో మూడు విడతలుగా తొమ్మిది మణుగుల చందనాన్ని సమర్పిస్తారు. అంటే స్వామికి సుమారు 500 కిలోల చందనాన్ని సమర్పిస్తారు. ఎంతో వైభవంగా జరిగే ఈ చందన యాత్రను తిలకించేందుకు వేలాదిమంది భక్తులు వస్తారు. నారసింహ నామంతో సింహగిరులు ప్రతిధ్వనిస్తాయి.

– అద్దంకి శ్రీరామ కుమార్, ఆకాశవాణి విశ్రాంత వార్తా ప్రతినిధి

(నేడు సింహాచల అప్పన్న చందనోత్సవం)

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, **తిథి:** శు.విదియ ఉ.8.44 వరకు, తదుపరి తదియ తె.4.45 వరకు (తెల్లవారితే శనివారం), **నక్షత్రం:** రోహిణి ప.12.34 వరకు, తదుపరి మృగశిర, **వర్జ్యం:** సా.6.11 నుండి 7.44 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.05 నుండి 8.56 వరకు, తదుపరి ప.12.19 నుండి 1.12 వరకు, **అమృతఘడియలు:** ఉ.9.27 నుండి 11.02 వరకు, అక్షయతృతీయ.; **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 5.34, **సూర్యాస్తమయం:** 6.17.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.

టోల్ ఫ్రీ నం: 1800 425 9899

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+8 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 48

శుక్రవారం 10-5-2024

'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసి గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

జోయాలుక్కాస్
వరల్డ్స్ ఫేవరేట్ జ్యువెలర్



సాక్షి ఫ్యామిలీ IV
హైదరాబాద్
శుక్రవారం ॥ 10-5-2024

ఫ్యాషన్

ఒక్క మార్క్కూ వదల్లేదు!

నూటికి నూరు శాతం అంకితం



చదువుల తల్లి సరస్వతే అయినా ఆడపిల్ల చదువుకు వెనుకా ముందు ఆలోచించేవారు ఇంకా ఉన్నారు. అలాంటి వారందరూ అంకితను చూసి ఆలోచన మార్చుకోవాలి. ఎందుకంటే కర్నాటక రైతు బిడ్డ **అంకిత** పదవ తరగతి ఫలితాల్లో 625కు 625 మార్కులు తెచ్చుకుంది. రాష్ట్రం మొత్తం మీద సెంట్ పర్సెంట్ వచ్చింది అంకితకే. ఇలాంటి అంకితలు ఎందరో ఉంటారు చదువులో ప్రోత్సహిస్తే.

మే 9 వ తేదీ.

ఆ ఫోన్ వచ్చేసరికి బసప్ప పొలంలో ఉన్నాడు.

అవతలి వైపు ఉన్నది స్కూల్ టీచరు.

'బసప్ప గారు మీ అమ్మాయికి పదవ తరగతిలో స్టేట్ ఫస్ట్ మార్కులు వచ్చాయి'

'ఓ.. ఎన్ని మార్కులు వచ్చాయి సార్?'

'ఎన్ని వచ్చాయి ఏంటి బసప్ప గారు. అంతకు మించి వేయలేక 625కు 625 వేశారు. అంత బాగా చదివింది మీ అమ్మాయి. ఇన్ని మార్కులు ఇంకెవరికీ రాలేదు'...

కర్నాటకలోని బాగల్‌కోట్‌కు దాదాపు గంట దూరంలో ఉండే చిన్న పల్లె వజ్రమట్టి. ఆ ఊరే బసప్పది. ఆరెకరాల రైతు. పెద్దమ్మాయి అంకిత. ఇంకా ఇద్దరు అబ్బాయిలు ఉన్నారు. వార్త తెలిశాక ఇంటికి ఆఘమేఘాల మీద చేరుకున్నాడు. మరి కాసేపటిలో ఊరు ఊరంతా ఆ ఇంటి ముందే ఉంది. సందడి చేసింది. కోలాహలం సృష్టించింది. పులకరించింది. మరి ఒక చిన్న పల్లెటూరి నుంచి అంత బాగా చదివితే ఆ అమ్మాయిని ఆశీర్వదించకుండా ఎలా? అంకితను చూసి ప్రతి ఒక్కరూ మెటికలువిరవడమే.


● తల్లిదండ్రులు గీత, బసప్పలతో అంకిత

హాస్టల్‌లో ఉండి

అంకిత తన ఊరికి నలభై నిమిషాల దూరంలో ఉన్న ముధోల్‌లోని ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూల్‌లో చదువుకుంది. స్కూల్ హాస్టల్‌లో ఉండి చదువుకుంటూనే సెలవుల్లో ఇంటికి వచ్చేది. 'నేను సెల్‌ఫోన్ వాడను. ఏ రోజు పాఠాలు ఆ రోజు చదువుకుంటాను. డిజిటల్ లైబ్రరీలో అదనపు మెటీరియల్ చదివాను. ఉదయం ఐదుకు లేస్తాను. మళ్లీ రాత్రి చదువుతూనే నిద్రపోతాను. ఇంట్లో ఉంటే ఇంటి పనులు ఏవో ఒకటి చేయాల్సి వస్తుంది. కాని హాస్టల్‌లో ఉంటే చదువు తప్ప వేరే పనేముంది. నా పాఠాలు అయ్యాక ఆడుకోవడం కూడా నేను మానలేదు. మా స్కూల్ టీచర్లు ముందు నుంచి నాకు మంచి మార్కులు వస్తాయని ఊహించారు. వారు నాకు అన్ని విధాల సపోర్ట్ చేస్తూ వచ్చారు. నాకు సెంట్ పర్సెంట్ వచ్చినందుకు ఆనందమే. కాని నా కంటే మా అమ్మానాన్నలు, స్కూల్ టీచర్లు ఎక్కువ సంతోషపడటం నాకు ఎక్కువ ఆనందాన్ని ఇచ్చింది. మా స్కూల్‌లో మంచి క్రమశిక్షణ ఉంటుంది. అందువల్లే నేను బాగా చదివాను' అని చెప్పింది అంకిత.

ఐ.ఏ.ఎస్. కావాలని

'మా అమ్మాయి బాగా చదువుతుందనుకున్నాము గాని ఇంత బాగా చదువుతుందని అనుకోలేదు. మేము ఇక ఆమె ఎంత చదవాలంటే అంత చదివిస్తాము. ఏది చదవాలన్నా ఎంత కష్టమైనా చదివిస్తాము' అన్నారు బసప్ప, అతని భార్య గీత. భర్తతో పాటు పొలానికి వెళ్లి పని చేసే గీత కూతురిని చూసి మురిసిపోతోంది.

'నేను ఇంటర్‌లో సైన్స్ చదివి ఇంజనీరింగ్ చేయాలనుకుంటున్నాను. ఆ తర్వాత ఐ.ఏ.ఎస్. చేస్తాను' అంది అంకిత.

ముఖ్యమంత్రి ప్రశంస

అంకితకు వచ్చిన మార్కుల గురించి విని కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అభినందనలు తెలియచేశారు. ఇంకా బాగల్‌కోట్ ప్రభుత్వ అధికారులు ప్రశంసలు తెలియచేశారు. ఇక కర్నాటక డెప్యూటీ చీఫ్ మినిస్టర్ డి.కె.శివకుమార్ తానే స్వయంగా ఇంటికి వచ్చి అభినందిస్తానని కబురు పంపారు. అంకిత విజయం బాగా చదివే అమ్మాయిలందరికీ అంకితం.





వేసవిలో కాటన్ డ్రెస్సుల ప్రాముఖ్యత గురించి తెలిసిందే. అలాగే, ఈ సీజన్‌కి టెక్స్‌టైల్ జ్యువెలరీ అంతే స్పెషల్‌గా ఉంటుంది. ఎంచుకునే ఫ్యాబ్రిక్ ఏదైనా చేతితో రూపొందించే ఈ జ్యువెలరీ కొనుగోలు ఖర్చు తక్కువే. అలాగే, ఎవరికి వారు నచ్చినట్టు ఇంట్లోనూ తయారుచేసుకోవచ్చు. యువతను ఎప్పుడూ ప్రత్యేకంగా ఉంచే ఈ స్పెషల్ జ్యువెలరీ అంతే తాజాదనపు అనుభూతిని సొంతం చేస్తుంది.

సీజనల్ స్పెషల్

ప్రకృతికి దగ్గరగా!

పువ్వులంటేనే ప్రకృతి తెలియపరిచే ప్రేమ భాష. డిజైనర్ స్టూడియోలలో వాడగా ఉపయోగించిన మెటీరియల్‌తో అందమైన పూలను తయారుచేయవచ్చు. వాటిని పూసలు, జరీ దారాలతో ఆభరణాలుగా మార్చవచ్చు. ఈ పువ్వుల ఆభరణాలు దుస్తుల అందాన్ని మరింతగా పెంచుతాయి.

ఫ్యాబ్రిక్ ఎంపిక

పాదం నుంచి తల వరకు ప్రతి ఆభరణాన్ని వస్త్రాలంకరణతో మెప్పించవచ్చు. చందేరీ, సిల్క్, నెటెడ్, కాటన్ వంటి ఏ మెటీరియల్ అయినా ఈ ఆభరణాల తయారీలో ఉపయోగించవచ్చు.



బన్ స్టిక్

కాటన్ దారాలు, క్లాత్‌తో తయారుచేసిన పువ్వులను ఉపయోగించి చేసిన బన్ క్లిప్స్ వేసవి సీజన్‌కి ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నాయి.

కంఠాభరణాలు

గార్మెంట్స్, బీడ్స్, జరీ లేదా కాటన్ దారాలను ఉపయోగించి చేసిన నెక్‌పీస్‌లు సంప్రదాయ చీరల మీదకే కాదు వెస్టర్న్ డ్రెస్సుల మీదకూ ప్రత్యేక హంగుగా నిలుస్తున్నాయి.

ఎంపిక చేసుకున్న ఫ్యాబ్రిక్‌కి కాంబినేషన్‌గా సిల్వర్ లేదా ఇతర లోహాలతో తయారైన మువ్వలు, గవ్వలు, జూకాలను జత చేయవచ్చు. దీని వల్ల ఈ జ్యువెలరీకి మరిన్ని హంగులు అమరుతాయి.

హెయిర్ కేర్

చుండ్రు వదలాలంటే...



● రెండు టీ స్పూన్‌ల నిమ్మరసాన్ని తీసుకుని ఒక టీస్పూన్ రసాన్ని తలకు (జుట్టు కుదుళ్లకు) పట్టించి పది నిమిషాల తర్వాత తలస్నానం చేయాలి. మరొక టీ స్పూన్ రసంలో కప్పు నీటిని కలిపి తలస్నానం పూర్తయిన తర్వాత తల మీద (స్కాల్ప్‌కు పట్టేలా) పోసుకోవాలి.

● వారం పాటు తలకు ఆలివ్ ఆయిల్ రాస్తే చుండ్రు వదులుతుంది. రోజూ తలస్నానం చేసే వాళ్లు రాత్రి పడుకునే ముందు ఆలివ్ ఆయిల్ పెట్టి ఉదయం తలస్నానం చేయవచ్చు.

● రెండు టేబుల్ స్పూన్‌ల కొబ్బరి నూనెలో అంతే మోతాదు నిమ్మరసం కలిపి తలకు పట్టించి పది నిమిషాల సేపు మర్దన చేయాలి. మర్దన చేసిన తర్వాత ఇరవై నిమిషాలకు మామూలు షాంపూ లేదా కుంకుడుకాయ రసంతో తలస్నానం చేయాలి.

● టేబుల్ స్పూన్ మెంతులను రాత్రి నానబెట్టి ఉదయం మిక్సీలో మెత్తగా గ్రైండ్ చేసి అందులో నిమ్మరసం (ఒక కాయ) కలిపి తలకు పట్టించాలి. అరగంట తర్వాత తలస్నానం చేయాలి. తలకు మెంతుల పేస్ట్ పెట్టినప్పుడు కొద్దిగా తేమగా ఉండగానే తలస్నానం చేయాలి. పూర్తిగా ఎండిపోయే వరకు ఉంచితే జుట్టుకు పట్టేసిన మెంతుల పేస్టును వదిలించడం కష్టం.

● కప్పు పుల్లటి పెరుగులో టీ స్పూన్ నిమ్మరసం కలిపి తలకు పట్టించాలి. ఆరిన తర్వాత తలస్నానం చేయాలి.

● చుండ్రును వదిలించడంలో వేపాకు కూడా బాగా పని చేస్తుంది. వేపనూనె తలకు పట్టించి పది నిమిషాల సేపు మర్దన చేయాలి. ఆ తర్వాత తలస్నానం చేయాలి. వేప నూనె లేకపోతే వేపాకు రసం పట్టించి మర్దన చేయవచ్చు.

బ్యూటిప్స్

మృదువైన హస్తాల కోసం...

- పులిసిన పెరుగుపైన ఉండే మీగడ తీసుకుని చేతులకి మసాజ్ చేస్తూ ఉంటే చేతులు మృదువుగా ఉంటాయి. పెట్రోలియమ్ జెల్లీతో కూడా మసాజ్ చేసుకోవచ్చు.
- ఆలివ్ ఆయిల్ ఒక చెంచా, నిమ్మరసం ఒక చెంచా, గ్లిజరిన్ ఒక చెంచా, గోధుమరవ్వ రెండు చెంచాలు, పాలు ఒక చెంచా కలిపి చేతులకి రాసుకుని గంట తర్వాత వేడి నీటితో శుభ్రంగా కడుక్కోవాలి.



- స్పూను దానిమ్మరసం, స్పూను టొమాటో గుజ్జు కలిపి దానిలో కొన్ని గ్లిజరిన్ చుక్కలు కలిపి చేతులకి పట్టించి ఒక గంట అయిన తర్వాత కడుక్కుంటే చేతులు చక్కగా మెరుస్తాయి.
- రెండు స్పూన్ల దానిమ్మరసంలో స్పూను పంచదార కలిపి చక్కెర కరిగిన తర్వాత చేతులకి పట్టించి నెమ్మదిగా మసాజ్ చేస్తే చేతులు నున్నగా ఉంటాయి.
- చెంచా బాదం పొడిలో తగినన్ని పాలు కలిపి పేస్ట్ చేసుకొని చేతులకి రాసుకొని పావుగంట తర్వాత కడుక్కోవాలి.
- నారింజ రసం రెండు చెంచాలు, తేనె రెండు చెంచాలు కలిపి చేతులకి రాసుకొని ఇరవై నిమిషాల తర్వాత వేడి నీటితో కడుక్కోవాలి.
- రెండు చెంచాలు గ్లిజరిన్, రెండున్నర చెంచాలు రోజ్ వాటర్ కలిపి చేతులకి మసాజ్ చేస్తే చేతులు మృదువుగా ఉంటాయి.
- రాత్రి పడుకోబోయే ముందు చేతులకి బేబీ ఆయిల్ పూసి మృదువుగా మసాజ్ చేస్తే చేతులు కోమలంగా ఉంటాయి.

వంటిల్లు

సిప్ సిప్పులోనూ... రుచి అదే చల్లదనం!

ఈ కాలంలో ఏమి తిన్నా... చల్లగా తినాలని ఉంటుంది. సీజనల్ ఫ్రూట్స్ అన్నింటినీ రుచి చూడాలనీ ఉంటుంది. ఆరోగ్యాన్నిచ్చే పండ్లు పాలతో చల్లని డ్రింక్స్ సిప్ చేద్దాం.



థండయ్ కుల్ఫీ



కావలసినవి: వెన్న తీయని పాలు – 2 కప్పులు
కోవా– 100 గ్రాములు ; కండెన్స్‌డ్ మిల్క్ – కప్పు; పాల పొడి– పావు కప్పు ; బాదం – 10 ; గసగసాలు – టేబుల్ స్పూన్ ; మిరియాలు – 5 ; యాలకులు – 2 ; సోంపు – టీ స్పూన్.

తయారీ: ● బాదం పప్పులను నానబెట్టి తొక్క వలిచి పలుకుగా గ్రైండ్ చేయాలి ● గసగసాలను పది నిమిషాల సేపు నీటిలో నానబెట్టి గ్రైండ్ చేయాలి. అవి ఒక మోస్తరుగా మెదిగిన తర్వాత అందులోనే మిరియాలు, యాలకులు, సోంపు వేసి అవి కూడా మెత్తగా మెదిగే వరకు గ్రైండ్ చేయాలి ● పాలను ఒక వెడల్పాటి పాత్రలో పోసి మరిగించాలి. కాగిన పాలలో కోవా, కండెన్స్‌డ్ మిల్క్, పాలపొడి వేసి కలిపి సన్న మంట మీద మరిగించాలి. ఇవి మరిగినంత సేపూ అడుగుపట్టకుండా గరిటెతో అడుగు వరకు కలుపుతూ ఉండాలి. ఈ మిశ్రమం చిక్కబడిన తర్వాత అందులో ముందుగా గ్రైండ్ చేసి పెట్టుకున్న గసగసాల మిశ్రమాన్ని, బాదం పలుకులను వేసి కలుపుతూ ఐదు నిమిషాల సేపు మరగనిచ్చి దించేయాలి. చల్లారిన తర్వాత మిశ్రమాన్ని కుల్ఫీ మౌల్డ్‌లో పోసి ఫ్రీజర్‌లో పెట్టాలి. సెట్ అవడానికి 8 గంటలు పడుతుంది. డ్రింక్‌గా తాగాలంటే గంట చాలు.

వాటర్ మెలన్ గోలా

కావలసినవి: పుచ్చకాయ – ఒకటి (మీడియం సైజు); చక్కెర– టేబుల్ స్పూన్ ; నిమ్మకాయ – 1 (రసం తీసుకోవాలి) ; ఉప్పు – చిటికెడు ; చాట్ మసాలా – చిటికెడు ; ఐస్ క్యూబ్‌లు – 4.

తయారీ: ● పుచ్చకాయ ముక్కల్లో చక్కెర, ఉప్పు, నిమ్మరసం, చాట్ మసాలా, ఐస్ క్యూబ్‌లు వేసి మిక్సీలో బ్లెండ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని నేరుగా గ్లాసులో పోసుకుని తాగవచ్చు లేదా ఐస్ క్యాండీగా కావాలంటే మౌల్డ్‌లో పోసి ఎనిమిది గంటల పాటు ఫ్రీజర్‌లో పెట్టాలి. ఫ్రీజర్‌లో నుంచి తీసిన తర్వాత మౌల్డ్ నుంచి ఐస్ క్యాండీని వేరు చేసి పిల్లలకివ్వడమే. క్యాండీ మధ్యలో విరిగిపోకుండా సులువుగా బయటకు రావాలంటే మౌల్డ్‌ను పది సెకన్లపాటు గోరువెచ్చటి నీటిలో పెట్టాలి.



ఆమ్ర శ్రీఖండ్

కావలసినవి: చిక్కటి పెరుగు – 3 కప్పులు ; చక్కెర – ఒకటిన్నర కప్పులు ; మామిడి పండ్లు – 2 (పెద్దవి) ; యాలకుల పొడి – పావు టీ స్పూన్ ; కుంకుమ పువ్వు – చిటికెడు ; బాదం పప్పు – పది (పలుకులు చేయాలి).

తయారీ: ● మామిడి పండ్ల తొక్క తీసి ముక్కలు చేయాలి. మిక్సీ జార్‌లో మామిడి ముక్కలు, పెరుగు, యాలకుల పొడి, కుంకుమ పువ్వు, చక్కెర వేసి మెత్తగా అయ్యే వరకు బ్లెండ్ చేయాలి ● ఈ మిశ్రమాన్ని రెండు గంటల పాటు ఫ్రిజ్‌లో పెట్టాలి ● ఫ్రిజ్‌లో నుంచి తీసి కప్పులో లేదా గ్లాసులో పోసి బాదం పలుకులతో గార్నిష్ చేసి సర్వ్ చేయాలి. పిల్లలు దీనిని పూరీ, చపాతీల్లోకి కూడా ఇష్టపడతారు.

భాపా ఆమ్ దోయి



కావలసినవి: చిక్కటి పెరుగు – ఒకటిన్నర కప్పులు ; కండెన్స్‌డ్ మిల్క్ – 6 టేబుల్ స్పూన్‌లు ; క్రీమ్ – ఒకటిన్నర కప్పు ; మామిడి పండు గుజ్జు – అర కప్పు; యాలకుల పొడి – పావు టీ స్పూన్.

తయారీ: ● వీటన్నింటినీ ఒక పాత్రలో వేసి సమంగా కలిసే వరకు బాగా చిలకాలి. ఈ మిశ్రమాన్ని మట్టి పాత్రలో పోసి అల్యూమినియం ఫాయిల్‌తో కవర్ చేయాలి ● ప్రెషర్ కుక్కర్‌లో స్టాండ్ పెట్టి నీరు పోసి ఐదు నిమిషాల సేపు వేడి చేయాలి. నీరు మరిగి ఆవిరి రావడం మొదలైన తర్వాత మట్టి పాత్రను జాగ్రత్తగా స్టాండ్ మీద పెట్టి కుక్కర్ మూత పెట్టి స్టవ్ ఆపేయాలి ● అర గంట తర్వాత తీసి చల్లారనిచ్చి ఫ్రిజ్‌లో రెండు గంటల సేపు పెడితే ఆమ్ దోయి రెడీ.

సాక్షి
హైదరాబాద్

శుక్రవారం । 10 । మే । 2024

హాయ్.. హలో





నగరంలోని సరూర్‌నగర్‌లో గురువారం రాత్రి నిర్వహించిన కాంగ్రెస్ జన జాతర సభకు ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ హాజరై మాట్లాడారు. సభలో సీఎం రేవంత్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, చేవెళ్ల, మల్కాజిగిరి, భువనగిరి లోక్‌సభ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు రంజిత్‌రెడ్డి, సునీతా మహేందర్‌రెడ్డి, చామల కిరణ్‌కుమార్, ఇతర నేతలు పాల్గొన్నారు.

ఆటోగ్రాఫ్‌లిచ్చి.. సెల్ఫీలు దిగి..



కంటోన్మెంట్ సిఖ్ విలేజీలోని ఇంపీరియల్ గార్డెన్స్‌లో గురువారం జరిగిన బీఆర్‌ఎస్ యువ సమ్మేళనంలో విద్యార్థినులకు ఆటోగ్రాఫ్ ఇస్తున్న కేటీఆర్..



ఓల్డ్‌బోయిన్‌పల్లిలో చిన్నారితో సెల్ఫీ దిగుతున్న కేటీఆర్

కూలీల మృతి కేసులో బాధ్యుల రిమాండ్

నిజాంపేట్: బాచుపల్లిలోని రేణుకా ఎల్లమ్మ కాలనీలో మంగళవారం రాత్రి రైజ్ కన్‌స్ట్రక్షన్ రిటైనింగ్ వాల్ కూలి ఏడుగురు మృతి చెందిన ఘటనకు బాధ్యులను గురువారం బాచుపల్లి పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ప్రహరీ నిర్మాణంలో నాణ్యత పాటించక పోవడం, కార్మికుల భద్రత ప్రమాణాల్లో నిర్మాణ సంస్థ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పోలీసులు చర్యలు చేపట్టారు. వెంకన్న అరవింద్ రెడ్డి (బిల్డర్), మురుగేషన్ సతీష్‌కుమార్ (సైట్ ఇంజినీర్), మార్య ఫ్రాన్సిస్ జేవేయర్ రాజ్ (ప్రాజెక్టు మేనేజర్), దడియాల రాజేశ్(కాంట్రాక్టర్), అల్లు రామిరెడ్డి (కాంట్రాక్టర్)లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

పోలింగ్ రోజు రెండు క్యూలే: సీపీ కొత్తకోట

సాక్షి, సిటీబ్యూరో: లోక్‌సభ ఎన్నికలు, కంటోన్మెంట్ ఉప ఎన్నిక పోలింగ్ సోమవారం జరగనున్న నేపథ్యంలో ఆ రోజు పోలింగ్ కేంద్రాల వద్ద కేవలం రెండు క్యూలకు మాత్రమే అనుమతి ఉందని నగర కొత్వాల్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన గురువారం కీలక ప్రకటనలు జారీ చేశారు. పురుషులకు ఒకటి, మహిళలకు ఒకటి చొప్పున క్యూలు ఉంటాయని, వీటిని మించి మరొకటి ఏర్పాటు చేయకూడదని స్పష్టం చేశారు. ఆదివారం సాయంత్రం 6 నుంచి మంగళవారం ఉదయం 6 గంటల వరకు నగరంలో మద్యం విక్రయాలను నిషేధించారు. పోలింగ్ కేంద్రాలకు 200 మీటర్ల పరిధిలో 144వ సెక్షన్ అమలులో ఉంటుందని, దీని ప్రకారం ఆ ప్రాంతంలో నలుగురి కంటే ఎక్కువ మంది గుమిగూడటం నిషేధమని కొత్వాల్ స్పష్టం చేశారు.

బాచుపల్లి రైజ్ కన్‌స్ట్రక్షన్స్‌కు నోటీసులు

సాక్షి, సిటీబ్యూరో: బాచుపల్లిలో గోడకూలి పలువురు దుర్మరణం పాలైన ఉదంతంలో భవన నిర్మాణ సంస్థ రైజ్ కన్‌స్ట్రక్షన్స్‌కు హెచ్‌ఎండీఏ షోకాజ్ నోటీసులను జారీ చేసింది. ఇప్పటి వరకు చేపట్టిన నిర్మాణ పనులపై యథాతథ స్థితిని కొనసాగిస్తూ తాము తిరిగి అనుమతించే వరకు పనులను నిలిపివేయాలని సూచించింది. నిర్మాణ సంస్థ నిర్లక్ష్యం, భారీ వర్షం కారణంగా భవనం రిటైనింగ్ గోడ కూలి వలస కూలీలు మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంలో మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. బాచుపల్లి రేణుకా ఎల్లమ్మ కాలనీలో సుమారు 4,232 చదరపు గజాల స్థలంలో రైజ్ కన్‌స్ట్రక్షన్స్ అపార్ట్‌మెంట్ నిర్మాణం చేపట్టింది. అయిదు అంతస్తుల భవనాలకు హెచ్‌ఎండీఏ అనుమతినిచ్చింది. తాజాగా ప్రమాద ఘటన నేపథ్యంలో భవన నిర్మాణం కొనసాగించకుండా ఆంక్షలు విధించినట్లు హెచ్‌ఎండీఏ అధికారులు తెలిపారు. మరోవైపు భవనం నిర్మాణ సామర్థ్యం, డిజైన్ తదితర అంశాలపై జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ నిపుణుల విభాగం తనిఖీల కోసం లేఖ రాసినట్లు పేర్కొన్నారు. నిపుణుల కమిటీ అందజేసే నివేదిక ఆధారంగానే నిర్మాణ అనుమతులను కొనసాగించేందుకు లేదా రద్దు చేసేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

సుడిగాలిలా చుట్టేస్తూ..

- ఈసారి ఎన్నికల ప్రచారానికి విరివిగా హెలికాప్టర్ల వినియోగం
- అనూహ్యంగా పెరిగిన డిమాండ్
- భారీగా ధరలు పెంచిన ఏవియేషన్ కంపెనీలు
- గంటకు రూ.6 లక్షలకు పైగా అద్దె

సాక్షి, సిటీబ్యూరో: లోక్‌సభ ఎన్నికల ప్రచారం కీలక దశకు చేరుకుంది. ప్రధాన పార్టీల అగ్రనేతలు సుడిగాలి పర్యటనలతో ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లు పోటాపోటీగా నిర్వహిస్తోన్న ఎన్నికల ప్రచారం మరో రెండు రోజుల్లో ముగియనుంది. ఈసారి ఎన్నికల ప్రచారం కోసం హెలికాప్టర్ల వినియోగం కూడా బాగా పెరిగింది. వివిధ పార్టీలకు చెందిన నాయకులు ఒకేరోజు నాలుగైదు చోట్ల సభలు, రోడ్‌షోలు, కార్నర్ మీటింగ్‌లు తదితర కార్యక్రమాల్లో పాల్గొనేందుకు హెలికాప్టర్లను విస్తృతంగా వినియోగిస్తున్నారు.

అగ్రనేతలు.. ముఖ్యమంత్రులు..

బీజేపీ ప్రచారంలో ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, అధ్యక్షుడు జేపీ నడ్డా, వివిధ రాష్ట్రాలకు చెందిన ఆ పార్టీ ముఖ్యమంత్రులు ఉధృతంగా ప్రచారం కొనసాగిస్తున్నారు. దీంతో సకాలంలో చేరుకొనేందుకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఎస్‌- 76, డూఫిన్ వంటి హెలికాప్టర్లను వినియోగిస్తుండగా, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రియాంకా గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తదితరులు అగస్టా లాండ్ హెలికాప్టర్లను విరివిగా వినియోగిస్తున్నారు. మరోవైపు దేశవ్యాప్తంగా రాజకీయ పార్టీలు తమ ప్రచారానికి వీటిని ఎక్కువగా వినియోగిస్తుండడంతో అనూహ్యంగా డిమాండ్ పెరిగింది. దీంతో ఏవియేషన్ కంపెనీలు గతంలో కంటే చార్జీలను రెట్టింపు చేశాయి. ఎన్నికల ప్రచారం కోసం తెలంగాణలో ప్రధాన పార్టీలు 7 హెలికాప్టర్లను వినియోగిస్తున్నాయి.

భారీగా పెరిగిన చార్జీలు..

ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల ప్రచారం కోసం చక్కర్లు కొడుతున్న హెలికాప్టర్లకు రెండు ఇంజిన్‌లు ఉన్నాయి. కొన్నింటిలో ఆరుగురు కూర్చొని ప్రయాణం చేసే సదుపాయం ఉండగా, మరికొన్నింటిలో 8 మంది ప్రయాణం చేసే అవకాశం ఉంది. దీంతో సీటింగ్ కెపాసిటీకి అనుగుణంగానే ఏవియేషన్ కంపెనీలు చార్జీలను విధిస్తున్నాయి. గంటకు రూ.6 లక్షల నుంచి రూ.6.5 లక్షల చొప్పున వసూలు చేస్తున్నాయి. 8 సీట్ల హెలికాప్టర్లకు మాత్రం గంటకు రూ.7 లక్షలకు పైగానే చార్జీలు విధిస్తున్నాయి. ప్రస్తుతం ఒక్కో పార్టీ రోజుకు కనీసం 4 గంటల చొప్పున హెలికాప్టర్లను వినియోగిస్తున్నట్లు అంచనా. దీంతో ఎన్నికల ప్రచారం కోసం వెచ్చిస్తున్న ఖర్చుల్లో హెలికాప్టర్ల కోసమే రోజుకు సుమారు రూ.25 లక్షలకు పైగా ఖర్చు చేస్తున్నట్లు సమాచారం. 'గత లోక్‌సభ ఎన్నికల సమయంలో గంటకు రూ.3 లక్షల నుంచి రూ.3.5 లక్షల చొప్పున చార్జీలు ఉండేవి. కానీ హెలికాప్టర్లకు డిమాండ్ పెరగడంతో ఏవియేషన్ కంపెనీలు సైతం చార్జీలను పెంచాయి' అని నగరానికి చెందిన పైలెట్ ఒకరు తెలిపారు. ప్రస్తుతం అగస్టా వెస్ట్‌లాండ్- 139, 169 (లాంగర్), అగస్టా 109 (లైట్ వెయిట్), బెల్ 429 (గ్లోబల్ రేంజర్), సికోర్‌స్కై (ఎస్)-76, డూఫిన్ తదితర హెలికాప్టర్లు వినియోగంలో ఉన్నాయి. ముంబై, బెంగళూరు, ఢిల్లీకి చెందిన ఏవియేషన్ కంపెనీలు హెలికాప్టర్లను అందజేస్తున్నాయి.

మరో రెండు రోజుల పాటు విస్తృత పర్యటనలు

ఎన్నికల ప్రచారానికి మరో 48 గంటలే మిగిలింది. శనివారం సాయంత్రం వరకు గడువు ఉంది. ఆదివారం నుంచి మైకులు మూగబోనున్నాయి. ఆ మరుసటి రోజు సోమవారం బ్యాలెట్ బాక్స్‌లో ఓటర్లు తన తీర్పును నమోదు చేయనున్నారు. ఈ క్రమంలో మిగిలిన రెండు రోజుల పాటు ప్రచారాన్ని తుది దశకు తీసుకెళ్లేందుకు పార్టీలు పోటీ పడుతున్నాయి.

వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థులు, నాయకులు మరిన్ని ఎక్కువ ప్రాంతాల్లో పర్యటించేందుకు పరుగులు తీస్తున్నారు. దీంతో ఈ రెండు రోజుల పాటు హెలికాప్టర్ల వినియోగం కూడా బాగా పెరిగే అవకాశం ఉన్నట్లు కాంగ్రెస్ నాయకుడు ఒకరు వెల్లడించారు. తక్కువ సమయంలో ఎక్కువ ప్రాంతాలకు చేరుకునేందుకు వీటి వినియోగం తప్పనిసరిగా మారింది. దీంతో అదనపు హెలికాప్టర్లను కూడా ఏర్పాటు చేసుకొనే అవకాశం లేకపోలేదని పేర్కొన్నారు.





పోలీసులపై సీఈఓకు బీజేపీ ఫిర్యాదు



సీఈఓ వికాస్‌రాజ్‌కి వినతి పత్రం ఇస్తున్న మర్రి శశిధర్‌రెడ్డి, కిలారి మనోహర్

శ్రీనగర్‌కాలనీ: బీజేపీ కార్యకర్తలపై దుర్భాషలాడుతూ, చేయి చేసుకున్న బోరబండ పోలీస్ స్టేషన్ డీఐలతో పాటు వెస్ట్‌జోన్ డీసీపీ విజయ్‌కుమార్‌లను వెంటనే విధుల నుంచి తొలగించాలని బీజేపీ ఎలక్షన్ కమిషన్ ఎఫైర్స్ కమిటీ చైర్మన్ మర్రి శశిధర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ కిలారి మనోహర్ డిమాండ్ చేశారు. గురువారం రాష్ట్ర చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ వికాస్‌రాజ్‌కు వినతిపత్రం సమర్పించారు. పోలీసులు అధికార పార్టీకి కొమ్ముకాస్తున్నారని, సికింద్రాబాద్ పార్లమెంట్ అభ్యర్థి కిషన్‌రెడ్డికి మద్దతుగా మంగళవారం ఇంటింటికీ ప్రచారం చేస్తున్న కార్యకర్తలను కావాలనే పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లారని, ప్రశ్నించిన బీజేపీ డివిజన్ ప్రెసిడెంట్ కొత్త వెంకటేష్‌ను గాయపరిచారని తెలిపారు. బోరబండతో పాటు పలు సమస్యాత్మక బూత్‌ల్లో కేంద్ర బలగాలను మోహరించాలని, ఎన్నికలను సజావుగా జరిపించాలని డిమాండ్ చేశారు.

టార్గెట్ 'త్రీ'



ఒక సిట్టింగ్.. చేజారిన మరో రెండు స్థానాలు

- మెజార్టీ భారం ఇన్‌చార్జిలపైనే.. పనితీరుతోనే గుర్తింపు
- జాతీయ నేతల ప్రచారంతో జోష్.. మరోవైపు ఘర్ వాపసీ
- గ్రేటర్‌లో పరువు కోసం అధికార కాంగ్రెస్ పాట్లు

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ పరిధిలోని లోక్‌సభ స్థానాలు అధికార కాంగ్రెస్ పార్టీకి కీలకంగా మారాయి. అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం చేజిక్కినప్పటికీ.. మహానగర పరిధిలోని సెగ్మెంట్లలో కనీస ప్రాధాన్యం దక్కకపోవడంతో.. పోయిన పరువును ఈ ఎన్నికలతోనైనా నిలబెట్టుకునేందుకు కాంగ్రెస్ విశ్వ ప్రయత్నం చేస్తోంది. ఒక సిట్టింగ్ స్థానంతో పాటు గతంలో చేజారిన రెండు లోక్‌సభ స్థానాలను ప్రతిష్టాత్మంగా తీసుకుంది. సికింద్రాబాద్, మల్కాజిగిరి, చేవెళ్ల లోక్‌సభ టికెట్ల కోసం తీవ్ర పోటీ ఉన్నప్పటికీ గెలుపు గుర్రాల పేరుతో పార్టీలో కొత్త వారిని చేర్చుకొని బరిలో దింపింది. మల్కాజిగిరిలో పట్నం సునీతా రెడ్డి, చేవెళ్లలో సిట్టింగ్ రంజీత్ రెడ్డి, సికింద్రాబాద్‌లో ఎమ్మెల్యే దానం నాగేందర్‌లను పోటీలో దింపినా.. ప్రత్యర్థుల నుంచి గట్టి పోటీ తప్పడం లేదు. అయినప్పటికీ.. వారి ఎత్తులకు పైఎత్తులతో విజయ బావుటా ఎగరవేసేందుకు కాంగ్రెస్ శక్తులూ ఒడ్డుతోంది. సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేసేందుకు గతంలో పార్టీ వీడిన వారి ఘర్‌వాపసీ కోసం వ్యూహాత్మంగా ముందుకు సాగుతోంది. ఇప్పటికే పలువురిని పార్టీలో చేర్చుకోవడంతో పాటు అంతర్గత అసమ్మతి లేకుండా జాగ్రత్త పడుతూ ప్రచారంలో దూకుడు ప్రదర్శిస్తోంది.

మూడింటిలోనూ గట్టి పోటీయే..

మహా నగర పరిధిలోని సికింద్రాబాద్, మల్కాజిగిరి, చేవెళ్ల లోక్‌సభ స్థానాల్లో కాంగ్రెస్‌కు గట్టి పోటీ తప్పడం లేదు. మల్కాజిగిరి, చేవెళ్ల స్థానాల్లో బీజేపీ, సికింద్రాబాద్‌లో బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులు గట్టి పోటీ ఇస్తున్నారు. మల్కాజిగిరి సిట్టింగ్ స్థానమైనప్పటికీ.. బీజేపీ అభ్యర్థిగా ఈటల రాజేంద్రర్ బరిలో దిగడంతో నువ్వా? నేనా? అనేవిధంగా పోరు తప్పడం లేదు. చేవెళ్ల లోక్‌స్థానంలో బీజేపీ అభ్యర్థి కొంగా విశ్వేశ్వర్ రెడ్డి బలమైన ప్రత్యర్థిగా మారారు. కాంగ్రెస్ అభ్యర్థి సిట్టింగ్ ఎంపీ అయినప్పటికి పార్టీ మారడం, బీజేపీ అభ్యర్థిపై సానుభూతి దెబ్బతీసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇక సికింద్రాబాద్‌లో దానం నాగేందర్‌కు బీజేపీ, బీఆర్‌ఎస్ అభ్యర్థుల నుంచి తీవ్ర పోటీ ఎదురవుతోంది. బీజేపీ నుంచి సిట్టింగ్ ఎంపీ కిషన్‌రెడ్డితో పాటు, బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావు కూడా గట్టి పోటీదారులుగా తయార య్యాయి. మూడు నియోజకవర్గాల పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్లలో కనీస ప్రాతినిధ్యం లేకపోవడం కాంగ్రెస్‌కు ప్రతికూల అంశంగా తయారైంది.

సీఎం ప్రత్యేక దృష్టి

సాక్షాత్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మూడు లోక్ సభస్థానాలను సీరియస్‌గా తీసుకున్నారు. పార్టీ అధిష్టానం నియోజక వర్గాల వారీగా సమన్వయకర్తలు, అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా ఇన్‌చార్జిలను నియమించి రంగంలోకి దింపింది. మరోవైపు సీఎం రేవంత్ రెడ్డి మూడింటి గెలుపును తన భుజస్కంధాలపై వేసుకొని పర్యవేక్షణ చేస్తున్నారు. ఎన్నికల్లో వచ్చిన మెజార్టీని బట్టి నేతల పనితీరును గుర్తిస్తామని, నామినేటెడ్ పోస్టులు, వివిధ పనుల్లో ప్రాధాన్యం ఉంటుందని మెలిక పెట్టా రు. మరోవైపు అసెంబ్లీల వారీగా రోడ్‌షో, కా ర్నర్ మీటింగ్‌లు, పార్టీ జాతీయ నేతల ప్రచారాలతో పార్టీ శ్రేణులో జోష్ నింపే ప్రయత్నం కొనసాగిస్తున్నారు. మూడింటిలో సైతం గట్టి పోటీ ఎదురవుతుండటంతో కాంగ్రెస్ టార్గెట్ త్రీ వ్యూహం ఫలిస్తుందా? లేక పాత పరిస్థితి పునరావృతమవుతుందా? అనే చర్చ సాగుతోంది.

ప్రజా సమస్యలే ఎజెండా..

మా పనితీరే.. మాకు గుర్తింపు




- నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటాం
- అభివృద్ధి పనులు.. సమస్యల పరిష్కారమే లక్ష్యం
- కుల, మతాలకు అతీతంగా ప్రజాదరణ
- పారాచూట్ నేతలు వస్తారు.. వెళ్తారు
- హైదరాబాద్ లోక్‌సభ ఎంఐఎం అభ్యర్థి అసదుద్దీన్‌ఒవైసీ

- వివరాలు 2లో ▸

నేడు సిటీలో ప్రధాని

ఎల్బీ స్టేడియం బహిరంగ సభకు మోదీ హాజరు

- పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్న పోలీసులు
- బేగంపేట-ఎల్బీ స్టేడియం మధ్య ట్రాఫిక్ ఆంక్షలు
- సాయంత్రం 4-రాత్రి 8 గంటల మధ్య అమలు



సాక్షి, సిటీబ్యూరో: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం నగరానికి మరోసారి రానున్నారు. బేగంపేట విమానాశ్రయం నుంచి రోడ్డు మార్గంలో ఎల్బీ స్టేడియానికి చేరుకుని బహిరంగ సభలో పాల్గొంటారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో నగర పోలీసు విభాగం పటిష్ట బందోబస్తు, భద్రత ఏర్పాట్లు చేస్తోంది. దాదాపు అయిదు వేల మంది సిబ్బందిని మోహరిస్తోంది.

శుక్రవారం ఉదయం నుంచే నగర పోలీసులు బందోబస్తు చేపట్టనున్నారు. ఇప్పటికే కేంద్ర, పోలీసు బలగాల అధీనంలో ఉండే రూట్లు, ప్రాంతాలను గురువారం ఎస్పీజీ తనిఖీ చేశారు. ఆయా మార్గాలతో పాటు స్టేడియంలోనూ గురువారం రాత్రి నుంచే ప్రత్యేక బాంబు నిర్వీర్య బృందాలతో అడుగడుగునా తనిఖీ చేస్తున్నారు. బందోబస్తు, భద్రత విధుల్లో ఎస్పీజీ, ఎన్ఎస్‌జీ, ఆక్టోపస్, శాంతి భద్రతల విభాగంతో పాటు టాస్క్‌ఫోర్స్, సిటీ సెక్యూరిటీ వింగ్, సీఏఆర్ విభాగాలు, కేంద్ర బలగాల సిబ్బంది పాల్గొనున్నారు. ప్రధాని పర్యటన, బహిరంగ సభ నేపథ్యంలోనే ఆయా ప్రాంతాల్లో నిర్ణీత వేళల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఎక్కడికక్కడ మెటల్ డిటెక్టర్లను ఏర్పాటు చేసి క్షుణ్ణంగా తనిఖీ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ఈసారి గగనతల నిఘా సైతం ఏర్పాటు చేశారు. రూఫ్ టాప్ వాచ్ కోసం రోడ్ షో జరిగే మార్గం చుట్టుపక్కల ఎత్తైన బిల్డింగ్స్‌పైన సుశిక్షితులైన స్నైపర్స్‌ను మోహరిస్తున్నారు.

ట్రాఫిక్ ఆంక్షలు ఇలా..

శుక్రవారం సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు బేగంపేట విమానాశ్రయం- ఎల్బీ స్టేడియం మధ్య ఉన్న మార్గాల్లో ఆంక్షలు అమలులో ఉంటాయి. ఈ రూట్లలో వాహనాలకు మళ్లించడమో, పూర్తిగా ఆపేయడమో జరుగుతుంది. ఎల్బీ స్టేడియంలో జరిగే బహిరంగ సభ నేపథ్యంలో ఆ చుట్టు పక్కల ప్రాంతాల్లోనూ ట్రాఫిక్ ఆంక్షలు, మళ్లింపులు విధిస్తూ ట్రాఫిక్ పోలీసులు ఉత్తర్వులు జారీ చేశారు. నిర్దేశిత సమయంలో స్టేడియం చుట్టు పక్కల మార్గాల్లోకి సాధారణ వాహనాలను అనుమతించమని, వాహన చోదకులు దీన్ని దృష్టిలో పెట్టుకుని తమకు సహకరించాలని కోరారు. సభకు హాజరయ్యే వారి కోసం ప్రత్యేక పార్కింగ్ స్థలాలు కేటాయించారు. వీటిపై ఆయా ప్రాంతాల్లో సూచికలు ఏర్పాటు చేయనున్నారు. ఎలాంటి సహాయ సహకారాలు అవసరమైనా ట్రాఫిక్ హెల్ప్ లైన్ నంబర్ 9010203626కు కాల్ చేయాలని అధికారులు కోరారు.

ముస్లింలకు అండగా ఉంటాం

బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ఓల్డ్ బోయిన్‌పల్లి: 'దేశంలోనే ముస్లిం మైనార్టీల సంక్షేమం కోసం ప్రత్యేక బడ్జెట్ ప్రవేశపెట్టిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదే. అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి చోటు ఇవ్వలేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది. ఇప్పుడు అందరూ బాధపడుతున్నారు. 12 మంది బీఆర్‌ఎస్ అభ్యర్థులకు మద్దతు ఇస్తే.. ఆరు నెలల తర్వాత మళ్లీ కేసీఆర్ ప్రభుత్వమే వస్తుంది' అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. గురువారం ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ నివాసంలో నిర్వహించిన ముస్లిం మైనార్టీల సమావేశంలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మల్కాజిగిరి బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డితో కలిసి కేటీఆర్ మాట్లాడారు. బీఆర్‌ఎస్ హయాంలో ఒకవైపు అభివృద్ధి.. మరోవైపు సంక్షేమ పథకాలను అందించామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా హామీలు అమలు కాలేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మాటల్లో 6 గ్యారంటీలు అంటే.. ఇన్వర్టర్, జనరేటర్, పవర్ బ్యాంక్, చార్జింగ్ బల్బు, టార్చిలైట్, క్యాండిల్ అని ఎద్దేవా చేశారు. కరెంట్ కష్టాలు, తాగునీటి కటకటతో పాటు ప్రజలకు అన్నీ కష్టాలే మొదలయ్యాయని ధ్వజమెత్తారు. దేశంలో నరేంద్రమోదీ ఇంత శక్తిగా ఎదగడానికి స్ట్రాంగ్‌గా లేని రాహుల్ గాంధీయేనన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ ఎన్నికల తర్వాత ఎప్పుడైనా బీజేపీలో చేరతాడని.. ఈ విషయాన్ని ఇప్పటికే 50 సార్లు చెప్పాను అని స్పష్టం చేశారు. మల్కాజిగిరిలో బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గెలుపు ఖాయమైందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్



తాయిలాలకు వేళాయే..

కులసంఘాలతో అభ్యర్థుల సమావేశాలు

- మెజారిటీ ఓటు బ్యాంకు మేరకు ఒప్పందాలు
- నియోజకవర్గాల వారీగా అంచనాలు
- నగదు, నజరానాల పంపిణీకి సన్నాహాలు
- కీలక దశలో లోక్‌సభ ఎన్నికల ప్రచారం



సాక్షి, సిటీబ్యూరో: లోక్‌సభ ఎన్నికల ప్రచారం కీలకదశకు చేరుకుంది. నిప్పులు చెరుగుతున్న మండుటెండల్లో ఆచితూచి ప్రచారం చేస్తున్న పార్టీలు మెజారిటీ ఓటు బ్యాంకును కొల్లగొట్టడమే లక్ష్యంగా పావులు కదుపుతున్నాయి. ఈ మేరకు కాలనీ సంఘాలు, అపార్ట్‌మెంట్‌ల సంఘాలు, కిందిస్థాయి శ్రేణులను ఎంపిక చేసుకొని ప్రచారం చేస్తున్న ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రస్తుతం కుల సంఘాలపై దృష్టి సారించారు. కులసంఘాల నాయకులు, కార్యకర్తలు, సభ్యులతో జోరుగా సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు. గ్రేటర్‌లోని హైదరాబాద్, సికింద్రాబాద్, మల్కాజిగిరి నియోజకవర్గాల్లో అన్ని ప్రధాన పార్టీలకు గెలుపు సవాల్‌గా మారింది. దీంతో ఓటర్లను ఆకట్టుకొనేందుకు అవకాశం ఉన్న అన్ని మార్గాల్లో సంప్రదింపులు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో భారీ ర్యాలీలు, ప్రదర్శనల కంటే కింది స్థాయి కార్యకర్తలు, కులసంఘాల ద్వారా ఓటర్లను ప్రసన్నం చేసుకొనేందుకే అభ్యర్థులు ఎక్కువ మొగ్గుచూపుతున్నారు. నగరంలోని కొన్ని ప్రాంతాల్లో కులసంఘాల ఐక్యత, ప్రాధాన్యతలను దృష్టిలో ఉంచుకొని గంపగుత్తగా ఓట్లను రాబట్టుకొనేందుకు సంప్రదింపులు కొనసాగిస్తున్నారు. మరోవైపు వివిధ కులసంఘాల నాయకులు సైతం ఇదే అదనుగా భావించి పెద్ద ఎత్తున బేరసారాలకు దిగుతున్నారు. 'ఏ నియోజకవర్గంలో, ఏ కులం ఓటు బ్యాంకు ఎక్కువగా ఉంది అనే అంచనాలతో కార్యాచరణను రూపొందించుకొని సంప్రదింపులు జరుపుతున్నాం' అని ఒక ప్రధాన పార్టీ నాయకుడు తెలిపారు.

ఉదయం సభలు, సాయంత్రం సంప్రదింపులు..

మెజారిటీ ఓటు బ్యాంకు ఉన్న కులసంఘాల సమావేశాలకు అభ్యర్థులు నేరుగా వెళ్లి రకరకాల హామీలు గుప్పిస్తున్నారు. అనంతరం సాయంత్రం ఏర్పాటు చేసే సంప్రదింపుల పర్వంలో బేరసారాలు మొదలవుతున్నాయి. 'కొన్ని కులసంఘాల నాయకులు గొంతెమ్మ కోర్కెలను కోరుతున్నారు.పెద్ద మొత్తంలో డిమాండ్ చేస్తున్నారు. ఎన్నికలకు ఇంకా గడవు ఉన్న దృష్ట్యా ఈ సంప్రదింపులను కొనసాగించే అవకాశం ఉంది' అని ఓ పార్టీకి చెందిన అభ్యర్థి ప్రధాన అనుచరుడు తెలిపారు. ప్రతి ఓటరు వద్దకు వెళ్లి కలవడం కంటే ఆయా సంఘాల ప్రతినిధులను కలవడం ప్రయోజనంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్ సరళి, వివిధ కులాల సంఖ్యాబలం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని ఓటు బ్యాంకు సమీకరణాలను కొనసాగిస్తున్నారు.

అధికారం కోసం ఆరాటం పట్టుకోసం పోరాటం

- ఈ సీటు చాలా హాటు..
- కంటోన్మెంట్‌లో హోరా హోరీ
- బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లకు కీలకంగా మారిన ఉప ఎన్నిక
- గెలుపే లక్ష్యంగా వ్యూహ, ప్రతి వ్యూహాలు



బీఆర్‌ఎస్ ముఖ్య నేతలతో సమావేశమైన కేటీఆర్

కంటోన్మెంట్: రాష్ట్రంలో పార్లమెంట్ ఎన్నికలతో పాటే జరుగుతున్న ఏకైక అసెంబ్లీ ఉప ఎన్నికలు ప్రధాన పార్టీలకు ప్రతిష్టాత్మకంగా మారాయి. ముఖ్యంగా సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకోవాలని బీఆర్‌ఎస్, ఎలాగైనా గెలవాలన్న పట్టుదలతో కాంగ్రెస్ పార్టీలు సర్వశక్తులు ఒడ్డుతున్నాయి. నియోజకవర్గంలో కార్యకర్తల బలం అంతగా లేని అధికార పార్టీ ఓ వైపు చేరికలు, మరో వైపు ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు పలు పథకాలు ప్రకటిస్తూ ప్రచారాన్ని హోరెత్తిస్తోంది. పటిష్టమైన కార్యకర్తల బలం ఉన్నప్పటికీ, అధికారం కోల్పోవడంతో తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతున్న బీఆర్‌ఎస్ దివంగత సాయన్న, లాస్యల సెంటిమెంట్‌పైనే ఆధారపడుతోంది. కింది స్థాయి కార్యకరర్తలు పార్టీని వీడినప్పటికీ బోర్డు మాజీ సభ్యులు పార్టీ వెన్నంటే ఉండటం బీఆర్‌ఎస్‌కు కలిసి వచ్చే అంశం. ఇక బీజేపీ గత ఎన్నికల్లో రెండోస్థానంలో నిలిచినా గత అభ్యర్థి శ్రీ గణేశ్ పార్టీని వీడి, కాంగ్రెస్‌లో చేరడంతో బలహీన పడింది. కొత్త అభ్యర్థి వంశ తిలక్ పనితీరుపై పార్టీ కేడర్ సైతం అసంతృప్తిగా ఉన్నారు. అయితే పార్లమెంట్ ఎన్నికలతో కలిసి రావడంతో శక్తివంచన లేకుండా ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు.



రసూల్‌పురాలో ప్రచారంలో పాల్గొన్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

సానుభూతిపైనే ఆశలు

దివంగత సాయన్న కుటుంబం నుంచి మూడో వ్యక్తి, మొత్తంగా సాయన్న కుటుంబీకులు ఎనిమిదోసారి బరిలో నిలిచారు. తండ్రి సాయన్న, సోదరి లాస్య నందితల హఠాన్మరణంతో సానుభూతి తనకు కలిసొస్తుందని బీఆర్‌ఎస్ అభ్యర్థి నివేదిత ఆశిస్తోంది. అయితే పదిహేనేళ్లుగా కంటోన్మెంట్‌లో విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేస్తూ సొంత ఇమేజ్‌ను సంపాదించుకున్న కాంగ్రెస్ అభ్యర్థి శ్రీగణేశ్ సైతం గతంలో పోటీ చేసిన రెండు సార్లూ ఓటమి పాలయ్యారు. గెలుపోటములతో సంబంధం లేకుండా, ప్రజల్లో ఉండటం ఆయనకు కలిసొస్తుంది. 30 ఏళ్లుగా తన తండ్రి చేసిన అభివృద్ధిని కొనసాగించాలంటే తనకూ ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వాలని నివేదిత కోరుతున్నారు.

భారీగా చేరికలు.. హామీలు

2009 తర్వాత జరిగిన ఏ ఎన్నికల్లోనూ కనీస స్థాయిలో పోటీ ఇవ్వలేక కాంగ్రెస్ డీలా పడిపోయింది. 2018 మినహా, 2014, 2023 అసెంబ్లీ ఎన్నికలు, 2019 పార్లమెంట్ ఎన్నికల్లోనూ మూడో స్థానంలోకి పడిపోయింది. గత పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజ్‌గిరి పార్లమెంట్ స్థానం నుంచి రేవంత్ రెడ్డి గెలిచినప్పటికీ, కంటోన్మెంట్‌లో మూడోస్థానమే దక్కింది. తాజా ఎన్నికల్లోనూ కేవలం 17 శాతం ఓట్లతో మూడో స్థానంలో నిలిచింది. గెలిచిన అభ్యర్థి లాస్య నందితకు 59వేల ఓట్లు రాగా, కాంగ్రెస్ అభ్యర్థికి కేవలం 21వేల ఓట్లు మాత్రమే వచ్చాయి. దీంతో పార్టీని గెలుపు తీరానికి చేర్చేందుకు అధికార పార్టీ ఆపసోపాలు పడుతోంది. బలమైన అభ్యర్థి కూడా లేకపోవడంతో బీజేపీ నుంచి పోటీ చేసిన రెండో స్థానంలో నిలిచిన శ్రీగణేశ్‌కు పార్టీ టికెట్ కేటాయించింది. పలు వార్డుల్లో పార్టీ బలహీనంగా ఉండటంతో పెద్ద సంఖ్యలో బీఆర్‌ఎస్ నేతలను చేర్చుకుంటున్నారు. ఇక అధికార పార్టీతోనే కంటోన్మెంట్ అభివృద్ధి సాధ్యమనే ప్రచారం చేస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి వారంలోనే రెండుసార్లు ప్రచారంలో పాల్గొనడం ద్వారా కంటోన్మెంట్ ఎన్నికల తమకెంత కీలకమో పరోక్షంగా వెల్లడించారు. మరో కీలక మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్టార్ క్యాంపెయినర్‌గా తన టీమ్‌తో ఇక్కడే మకాం వేసి మరీ కంటోన్మెంట్‌ను వడపోస్తున్నారు. కంటోన్మెంట్‌ను జీహెచ్‌ఎంసీ విలీనం చేసుకోవం, భూ బదలాయింపు ద్వారా సుమారు 10వేల మందికి పట్టాలు దక్కుతాయనే అంశాలను విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. రెవెన్యూ మంత్రిగా పట్టాలు ఇచ్చే బాధ్యత తానే తీసుకుంటానని పొంగులేటి హామీ ఇస్తున్నారు. కంటోన్మెంట్‌కు 6వేల ఇందిరమ్మ ఇళ్లు ఇస్తానని, పెండింగ్ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం రెండు నెలల్లోనే పూర్తిచేస్తానని ప్రకటించారు.

రంగంలోకి దిగిన కేటీఆర్

బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సైతం కంటోన్మెంట్ ఉప ఎన్నికలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. రోడ్‌షో, సోషల్ మీడియా వారియర్స్, యూత్ కనెక్ట్ ప్రోగ్రామ్‌ల పేరిట ఇప్పటి వరకు మూడు సార్లు కంటోన్మెంట్‌లో పర్యటించారు. తాజాగా గురువారం యూత్ కనెక్ట్ ప్రోగ్రామ్ ముగిశాక మళ్లీ కంటోన్మెంట్‌కు వచ్చి ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి నివాసంలో మాజీ మంత్రి మల్లారెడ్డి, ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, ఇంచార్జ్ రావుల శ్రీధర్ రెడ్డి, అభ్యర్థి నివేదితో పాటు ముఖ్య నేతలతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. కాంగ్రెస్ అనుసరిస్తున్న వ్యూహాలకు ప్రతివ్యూహాలను అమలు చేయాలని శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కంటోన్మెంట్ స్థానాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు.

ఫిల్లింగ్ స్టేషన్ల ఆకస్మిక తనిఖీ

సాక్షి,సిటీబ్యూరో: జలమండలి ఫిల్లింగ్ స్టేషన్లను సంస్థ ఎండీ సుదర్శన్ రెడ్డి గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఎల్లారెడ్డిగూడ, వెంగళ రావు నగర్, ఎస్.ఆర్.నగర్, వెంకటగిరి, తట్టిఖాన ఫిల్లింగ్ స్టేషన్లను ఆకస్మికంగా సందర్శించిన ఆయన రికార్డులు, ట్యాంకర్ డెలివరీకి సంబంధించిన ఇన్ అండ్ ఔట్ లాగ్ బుక్స్ పరిశీలించారు. లాగ్ బుక్స్ సక్రమంగా నిర్వహించాలని.. అందులో డెలివరీ టైమింగ్స్ తప్పని సరిగా నమోదు చేయాలన్నారు. పెండెన్సీ క్లియర్ చేసేందుకు తగినంత సిబ్బందిని సమకూర్చుకోవాలని సూచించారు. డిమాండ్‌ను బట్టి.. డెలివరీ టైమింగ్స్‌ను కూడా పెంచుకోవాలన్నారు. ఫిల్లింగ్ స్టేషన్లలోని సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు.

నీటి ఎద్దడి ప్రాంతాల్లో ఇంకుడు గుంతల నిర్మాణం

సాక్షి,సిటీబ్యూరో: వాటర్ ట్యాంకర్ల డిమాండ్ అధికంగా ఉన్న ప్రాంతాల్లో ఇంకుడు గుంతల నిర్మాణం కోసం జలమండలి చేస్తున్న సర్వే కొనసాగుతోందని ఎండీ సుదర్శన్ రెడ్డి తెలిపారు. ఇంకుడు గుంతల సర్వేపై ఆయన ప్రధాన కార్యాలయంలో గురువారం సమీక్షించారు. వేసవిలో నగరంలోని దాదాపు 30 వేలకు పైగా కుటుంబాలు వాటర్ ట్యాంకర్లు బుక్ చేసుకున్నారన్నారు. ఆయా ప్రాంతాల్లో భూగర్భ జలాలు అడుగంటిపోవడమే ఇందుకు కారణమన్నారు. ఆయా ప్రాంతాల్లో మళ్లీ ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా ఉండేందుకు 18 స్వచ్ఛంద సంస్థల ద్వారా జలమండలి ఇంకుడు గుంతల సర్వే చేపట్టిందన్నారు. ఆయా స్వచ్ఛంద సంస్థలకు చెందిన ప్రతినిధులు ఇప్పటికే 2500లకు పైగా కుటుంబాల్లో ఇంకుడు గుంతల నిర్మాణంపై సర్వే చేశారని తెలిపారు. వీరంతా ఆయా కుటుంబాలకు ఇంకుడు గుంతల నిర్మాణం ఆవశ్యకత, అవగాహన కల్పించినట్లు. ఈ వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేశారని వివరించారు. సమీక్షలో రెవెన్యూ డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్ కుమార్, ఇంకుడు గుంతల ప్రత్యేకాధికారి సత్యనారాయణ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలే ఎజెండా..

- మా పనితీరే... మాకు గుర్తింపు
- నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటాం
- అభివృద్ధి పనులు.. సమస్యల పరిష్కారమే లక్ష్యం
- కుల, మతాలకు అతీతంగా ప్రజాదరణ
- ఎన్నికల్లో పారాచూట్ నేతలు వస్తారు...వెళ్తారు.
- అత్యధిక మెజారిటీ విజయ దుంధుభి ఖాయం
- హైదరాబాద్ లోక్ సభ మజ్లిస్ అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీ

ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు గ్రహీత, బారిస్టర్ అసదుద్దీన్ ఒవైసీ హైదరాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి వరసగా నాలుగు పర్యాయాలు విజయం సాధించారు. ఎప్పటిలానే ఎలాంటి మేనిఫెస్టో లేకుండా ఐదోసారి ఎన్నికల బరిలోకి దిగారు. ఈ సందర్భంగా ఆయనతో 'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూ



సాక్షి,సిటీబ్యూరో: మా పని తీరు మాకు గుర్తింపు. అదే మజ్లిస్ విజయ రహస్యం. నిత్యం కార్పొరేటర్ నుంచి ఎంపీ వరకు ప్రజలకు అందుబాటులో ఉంటాం. వారంలో ఆరు రోజులు దారుస్సలాంలో ప్రజల సమస్యలు వింటాం. సంబంధిత అధికారులతో స్వయంగా మాట్లాడతాం. అక్కడికక్కడే సమస్య పరిష్కారానికి చొరవ చూపుతాం. మరోవైపు ప్రతి ఉదయం స్థానిక సమస్యలు తెలుసుకునేందుకు ప్రతి వీధిలో పాదయాత్రలు చేస్తాం. స్థానికులతో మాట్లాడి సమస్యలు గుర్తించి, పరిష్కారానికి కృషి చేస్తాం. కష్ట కాలంలో ప్రజలకు అండంగా ఉంటూ భరోసా కల్పిస్తాం. మున్సిపల్ కార్పొరేషన్, అసెంబ్లీ, పార్లమెంట్‌లలో ప్రజల పక్షాన గళం విప్పుతాం. కోవిడ్ కష్ట కాలంలో ప్రజలను అన్ని విధాల ఆదుకున్నాం. రవాణా, ఆహారం, వైద్య సేవలు అందించాం. కేవలం ఎన్నికల కోసం పారాచూట్, ఓవర్ నైట్ లీడర్ల మాదిరిగా రంగంలోకి దిగి ఓట్ల కోసం వెంపర్లాడే సంస్కృతి మాది కాదు. నిరంతరం ప్రజల్లో మమేకమై విశ్వాసాన్ని చూరగొంటాం. మా పనితీరు చూసి మాకు ఓటేసి మద్దతు ఇవ్వాలని ప్రజలను అభ్యర్థిస్తున్నాం.

అభివృద్ధిలో రాజీపడం

రాజకీయాలు ఎన్నికల వరకు మాత్రమే. ఆ తర్వాత స్థానికంగా అభివృద్ధి పనులు, ప్రజా సమస్యల పరిష్కారమే మా ప్రధాన లక్ష్యం. అందుకే రాష్ట్రంలో ఎవరూ అధికారంలోకి వచ్చినా.. అన్ని విధాల అభివృద్ధి కార్యక్రమాలకు సహకరిస్తాం. అండదండలు అందిస్తాం. ప్రజా సమస్యలను పాలకుల దృష్టికి తీసుకెళ్లి అవసరమైన అనుమతులు, నిధులు సాధిస్తాం. ప్రజాప్రయోజనాలకు భంగం కలిగించే నిర్ణయాలను మాత్రం వ్యతిరేకిస్తాం. అడ్డుకుంటాం. ఇందులో రాజీపడం.

పారాచూట్‌లకు అభివృద్ధి పనులేం తెలుసు

ఎన్నికల సమయంలో వచ్చే పారాచూట్ నాయకులకు అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలేం తెలుసు. పాతబస్తీలో అభివృద్ధి జరగలేదని పదే పదే ఆరోపణలు చేసేవారు వాస్తవాల కోసం సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసుకోవచ్చు. జీహెచ్‌ఎంసీ, వాటర్‌బోర్డు, హెచ్‌ఎండీఏ, విద్యా, వైద్యవిభాగాలు, కలెక్టరేట్ ద్వారా వివరాలు తెలుసుకోవాలి. ఆ సమాచారాన్ని పబ్లిక్ డొమైన్‌లో పెట్టి ఆపై మాట్లాడాలితే బాగుంటుంది. పాతబస్తీలో రహదారుల విస్తరణ, ఫ్లై ఓవర్లు, నాలాల అభివృద్ధి పనులు పెద్ద ఎత్తున జరిగాయి. విద్యుత్, తాగునీటి వ్యవస్థ, విద్య వైద్య సౌకర్యాలు మెరుగుపడ్డాయి. కొన్ని పనులు మాత్రం సున్నితమైన అంశాలతో కూడినవి కావడంతో కొంత ఆలస్యం జరిగిన మాట వాస్తవమే. తాజాగా మెట్రో రైలుతో పాటు ఐటీ, ఇతర పరిశ్రమలకు పాతబస్తీ అనువుగా మారుతోంది. ఇవీ కనిపించడం లేదా?

దెయ్యాలు వేదాలు వల్లించినట్లు..

కోవిడ్ కష్టకాలంలో వైద్య సేవల పేరుతో నిలువు దోపిడీకి పాల్పడిన ఆసుపత్రిని ప్రభుత్వం బ్లాక్ లిస్ట్‌లో పెట్టింది. అలాంటి ఆసుపత్రికి చైర్ పర్సన్‌ను బీజేపీ ఎన్నికల బరిలో దింపింది. బీజేపీకి మరో అభ్యర్థి దొరకలేదు. ఎన్నికల్లో ఓట్ల కోసం పేదప్రజలపై ఎనలేని ప్రేమ ఒలకబోయడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉంది. కేవలం ఎన్నికల ఓటు బ్యాంక్ కోసం పాతబస్తీలో కలిసి మెలిసి ఉంటున్న హిందూ–ముస్లింల మధ్య మత విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నం జరుగుతోంది. హైదరాబాద్ గుర్తింపు దెబ్బతింటే ఐటీ, ఇతరాత్ర పరిశ్రమల స్థాపన కోసం పెట్టుబడులు ఎలా వస్తాయి. 20 ఏళ్లుగా హైదరాబాద్ ప్రశాంతంగా ఉంది. ఎలాంటి మతపరమైన అలర్లు లేవు. ఎన్నికల ప్రచారంలో ప్రతినిత్యం సామాజిక మాధ్యమాలను వెంటబెట్టుకుని సంచలనాల కోసం నోటికి వచ్చినట్లు అవాస్తవాలు మాట్లాడితే ఓట్లు రాలవు. ఆ ప్రచార తీరు కేవలం పాల పొంగే. ప్రశాంత వాతావరణాన్ని భంగం కలిగించడానికి ప్రయత్నిస్తే ప్రజలు గట్టిగానే బుద్ధి చెబుతారు.

పాతబస్తీ ప్రజలపై నమ్మకం ఉంది.

గత నాలుగున్నర దశాబ్దాలుగా మజ్లిస్ ప్రజల విశ్వాసాన్ని చూరగొంటోంది. కుల మతాలకు అతీతంగా ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. నిరంతరం ప్రజల్లో మమేకమై పనిచేసేది ఎవరు ? కేవలం ఎన్నికల సమయంలోనే ఓట్ల కోసం కనిపించే వారేవరో? ప్రజలందరికీ తెలుసు. ఎప్పటి మాదిరిగా ఈసారి కూడా మజ్లిస్‌కు పోటీ లేదు. ఉండబోదు. ప్రత్యర్థులే లేరు. గెలుపు బావుట సునాయాసం. ఈసారి పోలింగ్ శాతం పెంపుతో అత్యధిక మెజార్టీ సాధనే లక్ష్యం.

రూ. 1.08 కోట్ల విలువైన బంగారం, వెండి, వజ్రాల పట్టివేత

మలక్‌పేట: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మలక్‌పేట పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో గురువారం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆస్మాన్ ఘడ్‌లో ఎస్సై జయంత్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు చేస్తున్న పోలీసులు మలబార్ గోల్డ్‌కు సంబంధించిన ఓమ్ని వ్యాన్‌ను సోదా చేయగా బంగారం, వెండి, వజ్రాలను గుర్తించారు. వాటికి సంబంధించి ఆధారాలు చూపకపోవడంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ1.08 కోట్లు ఉంటుందని తెలిపారు.

ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానాలు రద్దు

శంషాబాద్: ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ క్యాబిన్ ఉద్యోగుల సమ్మె కారణంగా దేశవ్యాప్తంగా ఎయిర్‌లైన్స్ విమానాలు పెద్ద సంఖ్యలో రద్దయ్యాయి. హైదరాబాద్ నుంచి దేశీయంగా వెళ్లాల్సిన కోల్‌కత్తాకు వెళ్లాల్సిన మూడు విమానాలు, వారణాసి, విజయవాడ, గ్వాలియర్, సూరత్, లక్నో, బెంగళూరు, గోవా, కొచ్చిన్, పూణేకు వెళ్లాల్సిన 12 విమానాలు ఇక్కడి నుంచి బయలుదేరలేదు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అదే విధంగా కోల్‌కత్తా, గ్వాలియర్, లక్నో, గోవా నుంచి హైదరాబాద్‌కు రావాల్సిన ఐదు విమానాలు కూడా ఇక్కడికి చేరుకోలేదు.

మోదీతోనే మహిళా సాధికారత

జాతీయ మహిళా మోర్చా అధ్యక్షురాలు వనతి శ్రీనివాసన్



నారీ శక్తి కార్యక్రమంలో పాల్గొన్న వనతి శ్రీనివాసన్

గచ్చిబౌలి: నరేంద్రమోదీ పాలనలోనే మహిళా సాధికారత సాధ్యమని జాతీయ మోర్చా అధ్యక్షురాలు వనతి శ్రీనివాసన్ అన్నారు. గురువారం గచ్చిబౌలిలోని సంధ్య కన్వెన్షన్‌లో 'నారీ శక్తి' సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో సగ భాగమైన మహిళలకు చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత మోదీకి దక్కుతుందన్నారు. మహిళల అభ్యున్నతి కోసం పాటుపడుతున్న బీజేపీకి మహిళలు అండగా ఉండాలన్నారు. బీజేపీ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి సతీమణి సంగీతా రెడ్డి మాట్లాడుతూ మహిళల అభ్యున్నతి కోసం మోదీ ప్రభుత్వం అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టిందన్నారు. ముద్ర రుణాలతో పాటు చిన్న పరిశ్రమల ఏర్పాటుకు చొరవ తీసుకున్నారన్నారు. నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే విశ్వేశ్వర్ రెడ్డిని గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మోర్చా నాయకురాళ్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దేశానికి కాంగ్రెస్ అవసరం



మాట్లాడుతున్న సయ్యద్ రఫీ

పంజగుట్ట: దేశం క్లిష్టపరిస్థితుల్లో ఉందని, మేధావులు ముందుకొచ్చి ప్రజల్ని చైతన్యవంతం చేయాల్సిన అవసరం ఉందని సినీ నటుడు సయ్యద్ రఫీ అన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... తెలంగాణ ఉద్యమంలో విద్యార్థులు ఆత్మబలిదానాలపై స్పందించిన సోనియాగాంధీ ప్రత్యేక రాష్ట్రం ప్రకటించిందని గుర్తుచేశారు. రాష్ట్రాన్ని ఇచ్చిన పార్టీకి రెండు సార్లు అధికారం ఇవ్వకుండా మోసం చేశామని మూడోసారి తప్పును గ్రహించి రాష్ట్రంలో కాంగ్రెస్‌ను గెలిపించుకున్నామన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌కు ఓటు వేయాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ నేతలు ఏం తినాలో, మనం ఏ దేవుడిని పూజించాలో కూడా వారే చెబుతున్నారని అలాంటి పార్టీలను ఓడించి సెక్యులర్ పార్టీ కాంగ్రెస్‌ను గెలిపించుకుందామన్నారు. కార్యక్రమంలో శ్యామ్‌రావు, ముక్కు నర్సయ్య, భార్గవ, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

జనజాతర సభను విజయవంతం చేయండి

గన్‌ఫౌండ్రీ: శుక్రవారం ఎల్బీస్టేడియంలో నిర్వహిస్తున్న జనజాతర సభను విజయవంతం చేయాలని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన ఎంపీ లక్ష్మణ్‌తో కలిసి స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీలతో పాటు పలువురు కేంద్ర మంత్రులు హాజరు కానున్నట్లు తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

పోలీసులతో వాగ్వాదం

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సమక్షంలో పలువురు బీజేపీ నాయకులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. మీడియా పాసులు జారీపై పోలీసులను నిలదీశారు. తమకు ఎలాంటి సంబంధ లేదని పోలీసులు చెప్పినా కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఒత్తిడితో మోదీ సభ సజావుగా జరగకుండా చూస్తున్నారని ఆరోపించారు.

మేడ్చల్ మున్సిపల్ చైర్ పర్సన్‌పై అవిశ్వాసం

కలెక్టర్‌కు నోటీసు అందజేసిన కౌన్సిలర్లు




కలెక్టరేట్ వద్ద కాంగ్రెస్ కౌన్సిలర్లు

మేడ్చల్: మేడ్చల్ మున్సిపల్ చైర్ పర్సన్ దీపికా నర్సింహారెడ్డిని గద్దె దించేందుకు రంగం సిద్ధమైంది. ఈ మేరకు 16 మంది కాంగ్రెస్ కౌన్సిలర్లు గురువారం కలెక్టర్‌కు అవిశ్వాసం నోటీసు అందజేశారు. కాంగ్రెస్‌కు చెందిన భవానీ రాఘవేందర్‌గౌడ్, సరితమల్లేష్‌గౌడ్, చాపరాజులతో పాటు ఇటీవల బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన నర్సింహ్మాస్వామి యాదవ్, సాయికుమార్, కౌడె మహేష్, మణికంఠగౌడ్, మాధవి నరేందర్, మానస శ్రవణ్‌కుమార్, కృష్ణవేణి, దేవరాజ్, సుహాసిని, ప్రియాంక మధుకర్‌యాదవ్, జంగా హరికృష్ణయాదవ్, శివకుమార్‌యాదవ్, వైస్ చైర్మన్ రమేష్ నోటీసుపై సంతకాలు చేశారు.

నర్సింగ్ విద్యార్థులకు విస్తృత అవకాశాలు

– ఆర్టీసీ ఎండీ సజ్జనార్





సాక్షి, సిటీబ్యూరో: నర్సింగ్ విద్యార్థులకు విస్తృతమైన ఉపాధి అవకాశాలున్నాయని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ అన్నారు. నర్సులకు ప్రపంచవ్యాప్తంగా గిరాకీ ఉందని, నైపుణ్యాలను పెంచుకుని వృత్తిలో రాణించాలని సూచించారు.గురువారం తార్నాకలోని ఆర్టీసీ ఆసుపత్రి నర్సింగ్ కళాశాలలో 40 మంది బీఎస్సీ నర్సింగ్ విద్యార్థుల ల్యాంప్ లైటింగ్ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సజ్జనార్ మాట్లాడుతూ.. నర్సింగ్ వృత్తిలో శ్రమించే తత్వం, సహనం, వృత్తి నైపుణ్యం ఉన్నవారు తక్కువ వ్యవధిలోనే ఉన్నత స్థాయికి చేరుకుంటారన్నారు. విసుగు, విరామం లేకుండా నర్సులు పనిచేస్తుంటారని, అలాంటి అంకితభావంతో అత్యున్నత సేవలు అందించిన ఫ్లోరెన్స్ నైటింగేల్ చరిత్రలో నిలిచిపోయారని గుర్తు చేశారు. జీవితంలో షార్ట్‌కట్స్ ఉండవని, కష్టపడితేనే ఏ వృత్తిలోనైనా రాణించవచ్చునన్నారు.ఆర్టీసీ సిబ్బంది సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని తార్నాక ఆస్పత్రిని సూపర్ స్పెషాలిటీగా అప్‌గ్రేడ్ చేశామని, ఆస్పత్రికి అనుసంధానంగా నర్సింగ్ కళాశాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నర్సింగ్ కళాశాల విద్యార్థినులకు విదేశాల్లో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం యాన్యువల్ స్పోర్ట్స్ మీట్‌లో భాగంగా నిర్వహించిన క్రీడా పోటీల్లో గెలుపొందిన 50 మంది విద్యార్థినులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(అడ్మిన్) కృష్ణకాంత్, ఓఎస్డీ సైదిరెడ్డి, తార్నాక ఆస్పత్రి సీఎంవో డాక్టర్ శైలజామూర్తి, అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శ్రీనివాస్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(సివిల్) రామ్మోహన్, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ వసుంధర తులసి, వైస్ ప్రిన్సిపాల్ సోని, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

FLAT FOR SALE
Spacious Ready To Occupy 3 BHK Flats, Near Tarnaka, Mallapur, 1,360 Flat Feels Like 1,600 Sft Gated Community, Modern Amenities Visit Now. Call: 08069045558 [H-804943]

LAND FOR SALE
Rs. 6600 గజంతో 244 గజాల ప్లాటు కార్నర్ రెండు వైపుల రోడ్స్‌తో @ మహేశ్వరంలో అమ్మబడును. ఫోన్: 9966521191. [H-800401]

PLOT FOR SALE
గజం 2550/- కే బెంగుళూరు హైవేకి ఆనుకొని బాలానగర్ దగ్గర పండ్ల మొక్కలు, గెస్ట్ హౌస్ స్విమ్మింగ్ పూల్ గేటెడ్ కమ్యూనిటీ కాంపౌండ్ వాల్ తో. ఫోన్: 9347986771. [HA-32169]
రామోజీ ఫిల్మ్‌సిటీ దగ్గర హైవేకి ఆనుకొని ORRకి 2-3 km దూరంలో 1000 గజాల (5x200) W/F బేస్మెంట్‌తో 3 సైడ్ రోడ్ ఫేసింగ్ ప్లాట్ ఇల్లు కట్టుకోవడానికి సిద్ధంగా కలదు. సంప్ర: 8801475020 [H-804937]

Services

PERSONAL CARE

CHANGE OF NAME
I, MOHAMMED SHARFUDDIN, R/o. 19-4-322/2/A/10, Kishan Bagh HYD, changed my name as "MOHAMMED SHARFUDDIN GHORI [H-778715]
I, KAUSAR BEGUM MIRZA SHAREEF BAIG, R/o. 19-4-322/2/A/10, Kishan Bagh HYD, changed my name as "KAUSAR BEGUM. [HA-778716]
I, Ganti Venkata Surya Chintamani F/o. Ganti Srinivas Siddharth, 53 yrs, R/o. 103, Shri Venkateshwara Apartments, Vishnupuri Colony, Vimala Devi Nagar, Malkajgiri, Under GHMC Malkajgiri, Medchal - Malkajgiri Dist. - 500047, TS, India, As per Affidavit My Son Name Changed From Ganti Srinivas Sidhartha (Old Name) to GANTI SRINIVAS SIDDHARTH (New Name) for all Records Purpose [H-804794]
I, GURRAM VENKATESHAM SRIHARI R/o. H.No. 5-3/1/100/104, Ammasani Venkat Reddy colony,Boduppal,Medipally, Medchal - 92. holder of Indian passport number. L6011720. Hereby change name to Gurram Srihari via affidavit number: 377AA899753 dated 9/05/2024. [H-804795]

OLD AGE HOME
వృద్ధులు & భార్యాభర్తలు A/C & N/C అటాచ్డ్ బాత్రూం, మేడిపల్లి / ఉప్పల్, వృద్ధులు, బెడ్ పేషెంట్లు. Ecil, చీర్యాల్ 'x' రోడ్, భోజన వసతి మరియు 24/7 మెడికల్ సర్వీస్. ఫోన్: 7981467086, 9391089990, 9515474083. [H-804780]

గుంటూరు రాజా పికిల్స్
హైదరాబాద్ & సికింద్రాబాద్ పరిధిలో నాన్ వెజిటేరియన్ & వెజిటేరియన్ పచ్చళ్ళు, గుంటూరు కారం, పసుపు, ధనియాల పొడులు & మసాలాలు సప్లై చేయుటకు ఏరియాల వారీగా డిస్ట్రిబ్యూటర్స్ కావలెను
No డిపాజిట్ • 1 to 2 లక్షలు పెట్టుబడి
ie.mandalapu@gmail.com
89775 78745

Wanted
ప్రముఖ రియల్‌ఎస్టేట్ DTCP & ఫామ్ ల్యాండ్ వెంచర్‌లో మార్కెటింగ్ చేయుటకు ఎగ్జిక్యూటివ్స్. M/Female కావలెను. మంచి కమీషన్ ఇవ్వబడును. ఫోన్: 9063800770 [H-788086]
ప్రముఖ ఫర్నిచర్ కంపెనీ నందు పనిచేయుటకు Accountant కావలెను. Q: B.Com. సంప్రదించండి: 9440680782 [H-799750]
నల్లకుంట, AS రావ్ నగర్, మదీనగూడలో గల ప్రముఖ ఎలక్ట్రానిక్ షోరూం కొరకు హౌస్ కీపింగ్ లేడీస్ మరియు హెల్పర్స్ బాయ్స్ అర్జెంటుగా కావలెను 9 గం॥ డ్యూటీ 4 వీక్లీ ఆఫ్స్ ESI+PF మంచి జీతం. సంప్ర: 9032153413 [H-778771]
సన్‌రైజ్ హోమ్ కేర్: పేషంట్ కేర్, బేబీకేర్, ఇంటి, వంటపని 24 గం॥ చేయుటకు కేర్‌టేకర్స్ కావలెను. మహిళలు, పురుషులు, భోజనం+రూం ఫ్రీ జీ: 15k-20k. ఫోన్: 8801821210 [HA-14332]
క్రాంతిరోడ్ ట్రాన్స్‌పోర్ట్ HYD ఆటోనగర్ ఆఫీస్ నందు గుమాస్తాలుగా పనిచేయుటకు 10th ఆపై చదివినవారు 30 సం॥లోపు వయస్సు గల మేల్ అభ్యర్థులు కావలెను. బ్యాచిలర్స్‌కు వసతి సౌకర్యం కలదు ✆ 87901 91999 [B-2]
JSR INFRA Req. Retired, VRS, House Wifes any Background M/F Age: 30 yrs, Good Income. Work from Home. Ph: 7013794440 [HA-97300]
Wanted Sales Manager and Telecaller with 2 to 3 years Experience for Furnishing Products. Contact : 9705111150, 8125111150 [H-1241891]
Required Wife and Husband for House Hold Works, Watchman and Gardening Works of Tarnaka, Attractive Salary Apart from Free Accommodation with Current and Water Facility. Contact: 7842615091 / 8125726969 [HA-97290]

FACULTY TEACHERS
Lady Teachers to Telugu, Eng: 1st 5th E/M & Telugu, Hindi, Phy & Social: 6th-10th E/M & Administration Staff @ Nr Hayathnagar. Ph: 8125533227, 9100921491 [HA-804944]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు | జోన్ సెంటర్స్
సాక్షి క్లాసిఫైడ్స్ 3+2 3 ప్రకటనలకు చెల్లించండి, 2 ప్రకటనలు ఉచితంగా పొందండి

దిల్‌సుఖ్‌నగర్	9912348016	రాజేంద్రనగర్	9010202372
ఎల్.బి.నగర్	9912225475	కూకట్‌పల్లి	9912225476
తార్నాక	9010202751	బాలానగర్	9951602997
సికింద్రాబాద్	9010299013	మల్కాజిగిరి	9505507562
చిక్కడపల్లి	9912225453	మెహదీపట్నం	9912225468
అబిడ్స్	9705144457	చందానగర్	9912225453
అమీర్‌పేట్	9505507563	ఉప్పల్	7095250115

వివరాలకు : 6-3-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం. 1, బంజారాహిల్స్, హైదరాబాద్ - 34 Ph: 040-2325 6000, Ext : 6235 Cell : 9912225453

సునీతామహేందర్‌రెడ్డిని గెలిపించాలి



కేపీహెచ్‌బీ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న టీపీసీసీ సెక్రటరీ గాలి బాలాజీ, కార్యకర్తలు



బాలానగర్ కాంగ్రెస్ కార్యాలయానికి వచ్చి మద్దతు తెలిపిన సీపీఐ, సీపీఎం నాయకులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ ఆదేశానుసారం కేపీహెచ్‌బీకాలనీ 9వ ఫేజ్, ఎస్ఎస్‌కాలనీలో గురువారం టీపీసీసీ సెక్రటరీ గాలి బాలాజీ ప్రచారం చేశారు. ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూసి కాంగ్రెస్ పార్టీ నాయకులు రెట్టింపు ఉత్సాహంతో ప్రచారం చేస్తున్నారని తెలిపారు. మల్కాజ్‌గిరి లోక్‌సభ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డిని అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కొప్పిశెట్టి దినేష్ కుమార్, గంధం రాజు, బచ్చు మల్లి, పిఆర్ నాయుడు, రాజేష్, సుబ్బు, వనజ, సంధ్య, వీణ, సరోజ, వరలక్ష్మీ,రేణుక, లతా రాణి, శోభ, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి ఏవీబీపురంలో..

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి డివిజన్ ఏవీబీపురంలో గురువారం అభ్యర్థి కూతురు మనీషారెడ్డి, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు ప్రచారం నిర్వహించారు. మల్కాజ్‌గిరి లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో శేరి సతీష్‌రెడ్డి, గొట్టిముక్కల దేశాల్, మొలుగు భీంరావు, మేకల రమేష్, సంజీవరావు, ఆర్.వాసు, కిరణ్, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

కేపీహెచ్‌బీ డివిజన్‌లో..

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ డివిజన్‌లోని ధర్మారెడ్డి కాలనీ, రైతు బజార్ వెనుక ప్రాంతంలో గురువారం కేపీహెచ్‌బీ డివిజన్ ఎన్నికల ఇన్‌చార్జి గాలి బాలాజీ గడప గడపకు ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీకే ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు టి.ప్రవీణ్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ అరవింద్‌రెడ్డి, డివిజన్ మహిళా అధ్యక్షురాలు రజిత, పొడుగు అప్పారావు, ఫణీంద్ర, ఆర్.నాయుడు, మైఖేల్, కిరణ్, నితీష్, బచ్చుమల్లి, అరవింద, సుందరి పాల్గొన్నారు.

భరత్‌నగర్‌కాలనీలో..

మూసాపేట: భరత్‌నగర్‌కాలనీలో కాంగ్రెస్ ఏ–బ్లాక్ అధ్యక్షుడు డాక్టర్ పి.నాగిరెడ్డి గురువారం ఇంటింటి ప్రచారం చేశారు. సునీతామహేందర్‌రెడ్డిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో అశోక్ ముదిరాజ్, సంతోష్‌కుమార్, లక్ష్మీనారాయణ, నాగేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వామపక్షాల మద్దతు కాంగ్రెస్ పార్టీకే..

కూకట్‌పల్లి: బాలానగర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇస్తున్న అన్ని రాజకీయ పార్టీల సమావేశం గురువారం ఏర్పాటు చేశారు. వామపక్షాల మద్దతు కాంగ్రెస్ పార్టీకే ఉంటుందని సీపీఐ, సీపీఎం నాయకులు అన్నారు. ఈ సమావేశంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు వినోద్ రెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, నియోజకవర్గ కోఆర్డినేటర్ కోటంరెడ్డి వినయ్‌రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం, సీపీఐ కార్యదర్శి వెంకట్‌రెడ్డి, సీపీఐఎం కార్యదర్శి సత్యం, బ్లాక్ అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

పోల్ మేనేజ్‌మెంట్ లక్ష్యంగా..

వ్యూహం



- ప్రచారం పూర్తికానుండటంతో పోల్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి
- గెలుపుపై మద్దతుకు అన్ని హంగులతో ప్రత్యేక కసరత్తు
- లోక్‌సభ నియోజకవర్గాల అభ్యర్థుల వేట



సాక్షి, మేడ్చల్ జిల్లా: ఎన్నికల ప్రచారం ముగిసేందుకు గడువు సమీపించటంతో నగరంతో సహా శివారు పార్లమెంట్ నియోజకవర్గాల్లోని ప్రధాన పార్టీల అభ్యర్థులు పోల్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా పోలింగ్ కేంద్రాల వారీగా ఓటర్లను విభాగాలుగా విభజిస్తున్నారు. ఇందులో అనుకూలురు, తటస్థులు, స్థానికంగా ఓటు కలిగి ఇతర చోట్ల నివసిస్తున్నవారు, ఇతర పార్టీల మద్దతుదారులుగా ఓటర్లను విభజిస్తున్నారు. పోల్ మేనేజ్‌మెంట్ లక్ష్యంగా కసరత్తు చేస్తున్నారు. తమకు పక్కాగా ఓటేసేవారు, తటస్థులు, ఇతర పార్టీల మద్దతుదారులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.

◆ నగరంతో సహా శివారు హైదరాబాద్, సికింద్రాబాద్, మల్కాజిగిరి, చెవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గాలకు చెందిన ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తూనే.. రాత్రి వేళల్లో ప్రధాన అనుచరులు, ముఖ్య నాయకులు తమవైపే ఉన్నారా లేదానని సమీక్షించుకుంటున్నారు. ప్రత్యర్థుల తాయిలాల వలకు చిక్కకుండా అప్రమత్తమవుతున్నారు. పోలింగ్ గడువు సమీపిస్తున్న కొద్దీ ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో టెన్షన్ పెరుగుతోంది. తమ అనుకూలమైన పరిస్థితులు ఏమిటనే విషయంపైనే చర్చించేందుకు సమయం సరిపోతుందని ఆందోళన చెందుతున్నారు.

◆ ఓటర్లకు దగ్గరయ్యేందుకు ఆత్మీయ సమ్మేళనాలు, పలకరింపుల కార్యక్రమానికి సిద్ధమవుతున్నారు. వయస్సు, సామాజిక వర్గాల వారిగా ఓటర్లను విభజించి వారిని ఆకట్టుకునేందుకు యత్నిస్తున్నారు. పోలింగ్ ముగిసే వరకూ తమవైపు అనుకూల పవనాలు వీచేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే ఓటర్లను ఆకర్షించడంతో పాటు ప్రత్యర్థి శిబిరం నుంచి ముప్పు తప్పించుకునేందుకు వ్యూహ ప్రతివ్యూహాలతో ముందడుగు వేస్తున్నారు. ఎన్నికల ప్రచారం ఎంత చేసినా, ప్రలోభపెట్టినా పోలింగ్ కేంద్రం వరకు ఓటరును తీసుకొచ్చే బాధ్యతలను ద్వితీయశ్రేణి నాయకులకు అప్పగిస్తుంటారు. ఓటేసే వరకు ఓటర్లను పలకరించేలా తమ అనుచరులను జాగ్రత్త పరుస్తుంటారు. దూరభారంతో ఇబ్బంది పడే ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు చేర్చేలా ప్రత్యేకంగా వాహనాలను కూడా సమకూర్చుతుంటారు.

◆నగరంతో సహా శివారు పరిధిలోని 4 పార్లమెంట్ నియోజకవర్గాలున్నాయి. ఇందులో దాదాపు అన్నిచోట్లా ఇంచుమించు ఇదే వైఖరిని ప్రధాన పార్టీల అభ్యర్థులు అనుసరిస్తున్నట్లు తెలుస్తోంది. అనుకూల ఓటర్లు చేజారకుండా జాగ్రత్తలు తీసుకుంటూనే తటస్థులు, ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్న వారిని తమవైపు తిప్పుకొనేందుకు వ్యూహరచన చేస్తున్నారు. ఇతర పార్టీల మద్దతుదారుల కదలికలపైన కూడా నిఘా పెడుతున్నారు. అనుకూల ఓటర్లకు ఏమాత్రం మర్యాద తగ్గకుండా చూస్తున్నారు.

ప్రసన్నం చేసుకునేలా..

వైద్యులు, మెడికల్, అసోసియేషన్లు, వాహనాల డ్రైవర్లు, చేతి వృత్తిదారులు, కుల వృత్తిదారులు, అసంఘటిత రంగ కార్మికులు, రైతులు, ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, ఐటీ ఉద్యోగులను ప్రసన్నం చేసుకునేలా కీలక నాయకులకు బాధ్యతలు అప్పగిస్తున్నారు. వివిధ సామాజికవర్గాలతో ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తున్నారు. కోరుకున్న వారికి ప్రత్యేక పార్టీలు తాయిలాలు ఇస్తూ పోలింగ్ నాటికి అంతా చక్కబెట్టుకునేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు.



◆ కాలనీలు, డివిజన్/వార్డు, మండలం, బస్తీ, గ్రామస్థాయిలో ప్రాబల్యం చూపేవారి కోరికలను వెంటనే తీరుస్తున్నారు. వారు ఏమి ఆశిస్తున్నారో తెలుసుకుని ఆకర్షించేందుకు ఎంత ఖర్చుకైనా వెనకాడొద్దని ప్రధాన అనుచరులకు స్పష్టం చేస్తున్నారు. మరోవైపు ఇతర పార్టీల మద్దతుదారులు రోజువారీగా ఎక్కడ తిరుగుతున్నారు. ఎవరెవరితో మాట్లాడుతున్నారు? అనే విషయాలపై కూడా తెలుసుకుంటున్నారు. అవసరమైతే వారిని తమ వైపు తిప్పుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

చేవెళ్లలో కాసాని జ్ఞానేశ్వర్ విజయం తథ్యం



ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఆల్విన్‌కాలనీ: చేవెళ్ల లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపే లక్ష్యంగా ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ఆదేశాలతో నాయకులు ప్రచారం చేశారు. ఆల్విన్‌కాలనీ ఫేజ్–1, విజయనగర్‌కాలనీ, నవోదయకాలనీల ప్రతినిధులు అంజిరెడ్డి, రాజిరెడ్డి, స్వరూప, లావణ్య, మంజుల, కాశీనాథ్‌యాదవ్, చిన్నోళ్ల శ్రీను ఇంటింటికీ వెళ్లి కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. జిల్లా గణేస్ నేత మాట్లాడుతూ... ప్రజలు చాలా స్పష్టంగా బీఆర్ఎస్ ప్రభుత్వానికి ఖచ్చితంగా పట్టం కట్టబోతున్నారని అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అవగాహన రాహిత్య నిర్ణయాలతో ప్రజలు ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. ఈసారి ఖచ్చితంగా బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కట్ట శ్రీను, రవి, రాములుగౌడ్, వెంకటేష్‌గౌడ్, జగదీష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

చేవెళ్లలో కాంగ్రెస్‌నే గెలిపిద్దాం

కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్



పీజేఆర్‌నగర్ ఫేజ్–2లో ప్రచారం చేస్తున్న ఆల్విన్‌కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: ఎల్లమ్మబండ పరిధిలోని పీజేఆర్‌నగర్ ఫేజ్–2 కాలనీవాసులు ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ సమక్షంలో గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం చేవెళ్ల లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ తరపున అత్యధిక ఓట్లు కాంగ్రెస్‌కు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణగౌడ్, సమ్మారెడ్డి, శివరాజ్‌గౌడ్, సయ్యద్, యాదగిరి, రాజు, కె.శ్రీనివాస్, బాలస్వామి, బాబునాయక్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

హస్తం గుర్తుకే ఓటెయ్యండి

ఓల్డ్ బోయిన్‌పల్లి: హస్తం గుర్తుకు ఓటు వేసి మల్కాజ్‌గిరి కాంగ్రెస్ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డిని గెలిపించాలని కాంగ్రెస్ నాయకులు ఓటర్లను అభ్యర్థించారు. గురువారం అంజయ్యనగర్‌లో డివిజన్ అధ్యక్షుడు మహేష్‌యాదవ్ జోరుగా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్‌ను గెలిపిస్తే మరింత అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కనకరాజు యాదవ్, కుంటన్న బెల్లం ఐలన్న , శ్రీను, నర్సింహ, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థిని గెలపించండి.. అండగా ఉంటాం

కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



హెచ్ఏఎల్ పార్కులో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ ముద్దం



ఓల్డ్‌బోయిన్‌పల్లి: బీఆర్ఎస్‌ను గెలిపించండి మీకు అండగా ఉంటామని వాకర్స్‌ను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కోరారు. ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్‌లోని హెచ్ఏఎల్ పార్కులో గురువారం కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్‌తో కలసి ఆయన ప్రచారం చేశారు. వాకర్స్‌తో మాట్లాడుతూ.. మల్కాజ్‌గిరి బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలన్నారు. కారు గుర్తుకే ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం వారితో కలసి చాయ్ తాగుతూ యోగాక్షేమాలు తెలుసుకున్నారు.

◆ స్వర్ణధామనగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కాలనీవాసులను కలసి బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. మైత్రీవనం కాలనీ, లక్ష్మీనర్సింహ కాలనీవాసులను కలసి కారు గుర్తుకు ఓటు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరేందర్‌గౌడ్, నర్సింగ్‌రావు, మన్నే ఉదయ్‌యాదవ్, ఇర్ఫాన్, మేకల హరినాథ్, బల్‌రాజు, రాజుగౌడ్, మట్టిశ్రీను, యాదగిరి, నర్సింగ్‌రావు, నాగేష్, కృష్ణారెడ్డి, పోచయ్య పాల్గొన్నారు.

రాగిడికి అత్యధిక మెజార్టీ అందించాలి

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని సఫ్దర్‌నగర్‌లో కార్పొరేటర్ సబిహా బేగం గురువారం ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశానుసారం బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి విజయమే లక్ష్యంగా ప్రచారం చేస్తున్నామని తెలిపారు. కులమతాలకు అతీతంగా అడుగడుగునా ప్రజాదరణ చూస్తుంటే తప్పకుండా బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గెలుపు ఖాయమన్నారు. ఈ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.



ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ సబిహాబేగం

అనుమతి లేని హెయిర్ క్లినిక్ సీజ్



క్లినిక్‌ను సీజ్ చేసిన అధికారులు



కూకట్‌పల్లి: ఆరోగ్య సమస్యలు ఎదురైనప్పుడు, నకిలీ వైద్యుల ప్రమేయం, అనధికారిక వైద్య విధానాలపై అనుమానం ఉంటే వెంటనే జిల్లా వైద్యాధికారికి సమాచారం ఇవ్వాలని మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ రఘునాథ స్వామి పేర్కొన్నారు. ఎలాంటి అనుమతులు, లైసెన్స్ లేకుండా చర్మ సంబంధమైన వ్యాధులకు చికిత్స అందిస్తున్న కూకట్‌పల్లిలోని లేయర్స్ స్కిన్ అండ్ హెయిర్ క్లినిక్‌కు గురువారం సీజ్ చేశారు. సమాజం భద్రతా, శ్రేయస్సును నిర్ధారించడంలో ప్రజల సహకారం ముఖ్యమని ప్రజారోగ్యాన్ని పరిరక్షించడం, వైద్య సేవల సమగ్రతను కాపాడుకోవడం ప్రధాన కర్తవ్యమని డాక్టర్ రఘునాథ స్వామి తెలిపారు. ఆయన వెంట కూకట్‌పల్లి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సౌమ్య, కేపీహెచ్‌బీ సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి,పి. శ్రీనివాస్ ఉన్నారు.

కార్పొరేటర్‌కు కృతజ్ఞతలు



ఆల్విన్‌కాలనీ: ఎల్లమ్మబండి పరిధిలోని పీజేఆర్ కాలనీ ఫేజ్–2 వాంబే బ్లాక్ నం.50 నుంచి 53 వరకు నిర్మించిన సీసీ రోడ్లను కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రోడ్డుకు ఇరువైపులా అంచుల వద్ద మట్టి వేసి, క్యూరింగ్ చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు. నూతన సీసీ రోడ్డు నిర్మించినందుకు కాలనీవాసులు కార్పొరేటర్‌ను సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువనేత రామకృష్ణగౌడ్, సమ్మారెడ్డి, శివరాజ్‌గౌడ్, సయ్యద్, యాదగిరి, కె. శ్రీనివాస్, బాలస్వామి, బాబునాయక్, జనార్దన్, ఫారూఖ్, ఖలీమ్, తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ విజయంతోనే దేశాభివృద్ధి



మూసాపేట డివిజన్‌లో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ కోడిచర్ల మహేందర్, నాయకులు

ఓల్డ్‌బోయిన్‌పల్లి: బీజేపీ గెలుపుతో దేశాభివృద్ధి జరుగుతుందని ప్రతి ఒక్కరూ కమలం పువ్వు గుర్తుకే ఓటు వేసి గెలిపించాలని బీజేపీ, ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రజలను కోరారు. గురువారం ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ పరిధిలోని హస్మత్‌పేట, హరిజనబస్తీ, అంజయ్యనగర్ ప్రాంతాలలో ఇంటింటికీ తిరిగి కరపత్రాలు ఇచ్చి మల్కాజ్‌గిరి బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రపంచంలో శక్తివంతమైన దేశాల సరసన భారత్‌ను నిలిపిన నరేంద్రమోదీని మరోసారి గెలిపించాలన్నారు. దేశాన్ని ఎన్నో రంగాల్లో ముందుకు తీసుకెళ్లిన మోదీ మళ్లీ గెలిపించుకుంటే మన దేశం ఆర్థికంగా ఎదుగుతుందన్నారు. దేశం బాగుంటే మనం బాగుంటామని అన్నారు. ఈ ప్రచారంలో నాయకులు మధుకర్, నర్సింహ, ఎనుగుల తిరుపతి, జగదీష్, రాములు, సూర్య, శేఖర్, కార్తీక్, చిన్న తదితరులు పాల్గొన్నారు.

ఈటల రాజేందర్‌ను గెలిపించుకుందాం

మోతీనగర్: మల్కాజ్‌గిరి లోక్‌సభ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మూసాపేట కార్పొరేటర్ కోడిచర్ల మహేందర్ ఓటర్లను అభ్యర్థించారు. బబ్బుగూడలో గురువారం ఇంటింటి ప్రచారంలో పాల్గొని ఆయన మాట్లాడారు. కరోనా కష్టకాలంలో దేశంలో మోదీ, రాష్ట్రంలో అప్పటి మన ఆరోగ్యశాఖ మంత్రిగా ఈటల రాజేందర్‌లు ఎంతో సేవ చేశారన్నారు. ఈ దేశం సుభిక్షంగా ఉండాలంటే భారతీయులు ప్రపంచ దేశాలలో ఆత్మ గౌరవంగా జీవించాలంటే ఈటల రాజేందర్‌ను గెలిపించాలన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో బూత్ అధ్యక్షులు శ్రీధర్, భాస్కర్, ఎర్రస్వామి, నాగరాజు, బసవరాజు, సుమన్, సద్గుణ,వాసవి, హేమలత, శ్రీనివాస్, లింగా, శోభారాజన్ తదితరులు పాల్గొన్నారు.



ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్‌లో ఈటల రాజేందర్‌ను గెలిపించాలని ప్రచారం చేస్తున్న నాయకులు

అన్ని వర్గాల ప్రజల మద్దతు బీజేపీకే: మాధవరం కాంతారావు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి అసెంబ్లీ బీజేపీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు గురువారం ఐడియల్ లేక్ వాకింగ్ ట్రాక్, కేపీహెచ్‌బీ కాలనీ రోడ్ నం.1 జీహెచ్ఎంసీ పార్కులో ప్రచారం చేశారు. వాకర్స్‌ను కలిసి బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గతంలో మల్కాజ్‌గిరి అభ్యర్థిగా గెలిచిన రేవంత్‌రెడ్డి అభివృద్ధి చేయలేదన్నారు. నమ్మి ఓటేసిన ప్రజలకు ఇప్పుడు గాడిద గుడ్డు చూపిస్తున్నారని విమర్శించారు. తెలంగాణ ఉద్యమకారుడు, ఆర్థిక మంత్రి, ఆరోగ్యశాఖ మంత్రిగా మంచి అనుభవం కలిగిన.. మనలో ఒకడైన ఈటల రాజేందర్‌ను గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. మల్కాజ్‌గిరి లోక్‌సభ నియోజకవర్గంలోని అసెంబ్లీ సెగ్మెంట్‌లలో అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు వినోద్‌కుమార్‌గౌడ్, నాయకులు సోమశేఖర్, తిరుపతి, సత్యనారాయణ, అనిల్, సంతోష్, సూరిబాబు, ప్రేమ్ కుమార్, అర్జున్, జగదీష్, మురళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెరిగేదే లే!

ఆందోళన కలిగిస్తున్న ఓటింగ్ సరళి

తొలి మూడు విడతల్లోనూ తగ్గుముఖమే



ఓటెయ్యండి బాబూ.. ప్రజాస్వామ్యాన్ని కాపాడండమ్మా.. ఓటు విలువ తెలుసుకో యువతా అంటూ ఒకవైపు ఎన్నికల సంఘం, మరోవైపు స్వచ్ఛంద సంస్థలు చెవిలో 'ఈవీఎం' కట్టుకుని పోరుతున్నా ఓటర్లలో మాత్రం ఉత్సాహం పెద్దగా కనిపించడం లేదు! ఇప్పటిదాకా జరిగిన మూడు విడతల పోలింగ్‌లో ఓటింగ్ మందకొడిగానే నమోదైంది. 2019తో పోలిస్తే తగ్గింది కూడా. సుదీర్ఘ షెడ్యూల్, మండుటెండలతో పాటు పట్టణ ఓటర్ల నిరాసక్తత వంటివి ఇందుకు కారణాలుగా కన్పిస్తున్నాయి. తక్కువ ఓటింగ్ మన దేశంలో కొత్తేమీ కాదు. ఈ పరిణామంతో అధికార, ప్రతిపక్షాల్లో ఎవరికి నష్టం, ఎవరికి లాభమన్న చర్చ ఊపందుకుంది...

- సాక్షి, నేషనల్ డెస్క్

ఈసారి సుదీర్ఘ లోక్‌సభ ఎన్నికల ప్రక్రియలో మూడు అంకాలు ముగిశాయి. మే 7న మూడో విడతలో 11 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 93 నియోజకవర్గాలకు పోలింగ్ జరిగింది. 65.68 శాతం ఓటింగ్ నమోదైంది. ఆ స్థానాల్లో 2019లో నమోదైన 67.33 శాతంతో పోలిస్తే 1.65 శాతం తగ్గినట్లు ఈసీ డేటా చెబుతోంది. తొలి రెండు విడతల్లోనూ ఇదే తంతు. 102 లోక్‌సభ స్థానాల్లో ఏప్రిల్ 19న జరిగిన తొలి విడతలో 66.14 శాతం ఓట్లు పడ్డాయి. 2019లో ఈ స్థానాల్లో 69.4 శాతం ఓటింగ్ నమోదైంది. 88 సీట్లకు ఏప్రిల్ 26న రెండో విడత పోలింగ్‌లో 66.71 శాతం ఓటింగే నమోదైంది. 2019లో ఆ స్థానాల్లో వీటికి 69.2 శాతం ఓటింగ్ జరిగింది. మరో నాలుగు విడతల పోలింగ్ జరగాల్సి ఉంది. అందులో మే 13న జరిగే నాలుగో దశలో అత్యధికంగా 96 సీట్లున్నాయి. చివరి మూడింట్లో పోలింగ్ జరగాల్సిన స్థానాలు 164 మాత్రమే.

2019లో రికార్డు ఓటింగ్...


2019లో 67.4 శాతం ఓటింగ్ నమోదైంది. ఇప్పటిదాకా జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఇదే రికార్డు. 1951–52 తొలి లోక్‌సభ ఎన్నికల్లో నమోదైన 45.67 శాతం ఓటింగ్‌తో పోలిస్తే ఓటర్లలో చైతన్యం పెరుగుతూ వస్తోందనే చెప్పాలి. అయినా ఇప్పటికీ కనీసం 70 శాతాన్ని కూడా చేరకపోవడం మాత్రం ఆందోళనకరమే. రికార్డు పోలింగ్ నమోదైన గత ఎన్నికలనే తీసుకుంటే జనాభా భారీగా ఉన్న రాష్ట్రాల్లో జాతీయ సగటు కంటే తక్కువగా ఓటింగ్ నమోదవడం గమనార్హం. బిహార్ (57.33%), ఉత్తరప్రదేశ్ (59.21), ఢిల్లీ (60.6%), మహారాష్ట్ర (61.02), ఉత్తరాఖండ్ (61.88%), తెలంగాణ (62.77%), గుజరాత్ (64.51%), పంజాబ్ (65.94%), రాజస్తాన్ (66.34%), జమ్మూ కశ్మీర్ (44.97%), జార్ఖండ్ (66.8%) వంటివి ఈ జాబితాలో ఉన్నాయి. 2014లో 66.44 శాతం ఓటింగ్ నమోదైంది. 2009లో నమోదైన 58.21 శాతంతో పోలిస్తే ఏకంగా 8.23 శాతం పెరిగింది! మన దేశంలో ఓటింగ్ ఒకేసారి అంతలా ఎగబాకడం కూడా రికార్డే.

ఎందుకు తగ్గుతోంది...!

ఈ లోక్‌సభ ఎన్నికల్లో ఇప్పటికైతే ఓటింగ్ సరళి నిరాసక్తంగానే ఉంది. మిగతా నాలుగు విడతల్లో ఓటర్లు భారీగా బాగా బారులు తీరితేనే కనీసం 2019 స్థాయిలోనైనా ఓటింగ్ నమోదయ్యే అవకాశముంటుంది. లేదంటే భారీగా తగ్గే సూచనలే కనిపిస్తున్నాయి...

- పట్టణ ఓటర్లు ఓటేయడానికి పెద్దగా ఆసక్తి చూపకపోవడం ఓటింగ్ శాతం పడిపోవడానికి ముఖ్య కారణాల్లో ఒకటి. మూడు విడతల్లో పట్టణ నియోజకవర్గాల్లో పేలవ ఓటింగే ఇందుకు నిదర్శనం.
- యూపీలోని గాజియాబాద్‌లో 2019లో 55.88 శాతం ఓట్లు పడగా ఈసారి 49.88 శాతానికి దిగజారింది. కర్నాటకలోని బెంగళూరు సెంట్రల్‌లో 54.31 శాతం నుంచి 54.06 శాతానికి; బెంగళూరు సౌత్‌లో 53.69 శాతం నుంచి 53.17 శాతానికి తగ్గింది.
- 2019లో కూడా పట్టణ ఓటర్లలో ఇదే ధోరణి కనబడింది. అత్యంత తక్కువ ఓటింగ్ నమోదైన 50 లోక్‌సభ స్థానాల్లో 17 మెట్రోపాలిటన్, పెద్ద నగరాల్లోనే కావడం గమనార్హం.
- తక్కువ ఓటింగ్‌కు వలసలు కూడా కారణమే. పొట్టకూటి కోసం వలస వెళ్లేవాళ్లు ఎక్కువగా ఉన్న స్థానాల్లో ఓటింగ్ తగ్గుతున్నట్లు తేలింది.
- వచ్చి ఓటేసేంత స్థోమత లేకపోవడం, కూలి డబ్బులను వదులుకోలేని అశక్తత వల్ల వారు ఓటింగ్‌కు దూరంగా ఉండిపోతున్నారు.
- దేశంలో అత్యధిక ఓటర్లున్న ఉత్తరప్రదేశ్‌లో అతి తక్కువ ఓటింగ్ నమోదవడం దీనికి నిదర్శనం.
- మండుటెండలు కూడా ఓటింగ్‌కు గండికొడుతున్నాయి. ఇప్పటికే దేశవ్యాప్తంగా 40 నుంచి 46 డిగ్రీల ఉష్ణోగ్రతతో భానుడు బెంబేలెత్తిస్తున్నాడు.
- రానున్న రోజుల్లో వడగాలుల తీవ్రత మరింత పెరిగేలా ఉండటంతో మిగతా నాలుగు విడతల ఓటింగ్‌పైనా తీవ్ర ప్రభావం ఉండొచ్చని భావిస్తున్నారు.

1951 నుంచి ఓటింగ్ శాతం హెచ్చుతగ్గులు ఇలా...



ఫలితాలపై ప్రభావం.. ఎప్పుడెలా...?!

1951 నుంచి 2019 వరకు లోక్‌సభ ఎన్నికల ఫలితాలను చూస్తే భారీగా ఓటింగ్ పెరిగినప్పుడు, తగ్గినప్పుడు అనూహ్య ఫలితాలే వచ్చాయి. ఎమర్జెన్సీ తర్వాత జరిగిన 1977 ఎన్నికల్లో ఓటింగ్ 5 శాతం పైగా పెరిగి 60 శాతం దాటింది. ఆ ఎన్నికల్లో ఇందిరా గాంధీ ఘోర పరాజయం పాలై జనతా కూటమికి అధికారం దక్కింది. 1980లో ఓటింగ్ మళ్లీ భారీగా పడిపోయింది. అధికార జనతా పార్టీ ఓడి కాంగ్రెస్ విజయం సాధించింది. 1984 ఎన్నికల్లో ఓటింగ్ 7 శాతం పైగా పెరగడం ఇందిర మరణంపై వెల్లువెత్తిన సానుభూతికి నిదర్శనంగా నిలిచింది. రాజీవ్‌గాంధీ ఘన విజయం సాధించారు. 1989లో మళ్లీ ఓటింగ్ తగ్గింది. కాంగ్రెస్ ఏకంగా సగానికి పైగా సీట్లను కోల్పోయింది. 1991 ఎన్నికల్లోనూ ఓటింగ్ 6 శాతానికి పైగా తగ్గింది. మళ్లీ అధికార పక్షానికి షాక్ తగిలి కాంగ్రెస్ గద్దెనెక్కింది. 2004లో ఓటింగ్ స్వల్పంగానే తగ్గినా ఐదేళ్ల వాజ్‌పాయి సర్కారు ఓటమి చవిచూసింది. కాంగ్రెస్ సారథ్యంలో యూపీఏ సర్కారు కొలువుదీరింది. 2009 ఓటింగ్ స్వల్పంగా పెరిగింది. యూపీఏ ప్రభుత్వమే కొనసాగింది. 2014లో ఓటింగ్ రికార్డు స్థాయిలో 8 శాతానికి పైగా పెరిగింది. బీజేపీ తొలిసారి ఘన విజయం కొట్టింది. పెరిగిన ఓటింగ్ మోదీ వేవ్‌కు అద్దం పట్టింది. 2019లోనూ 1 శాతం అధికంగా ఓట్లు పోలయ్యాయి. బీజేపీ మెజారిటీ మరింత పెరిగింది. ఆ లెక్కన ఈసారి ఓటింగ్ భారీగా తగ్గితే కచ్చితంగా అనూహ్య ఫలితాలే రావచ్చంటున్నారు రాజకీయ పండితులు.

అధికార పార్టీకే నష్టమా?

2019లో 67.4 శాతం ఓటింగ్ జరిగినా వాస్తవంగా చూసుకుంటే 30 కోట్ల మంది ఓటే వేయలేదు! ఇదే నిరాసక్తత ఈసారి కూడా కొనసాగితే ఓటింగ్‌కు దూరంగా ఉండేవారి సంఖ్య 35 కోట్లకు పెరగవచ్చు. ఓటింగ్ భారీగా తగ్గడం దేనికి సంకేతమన్న దానిపైనా పలు రకాలు వాదనలున్నాయి. ఓటింగ్ పడిపోవడం అధికార పార్టీకే ఎక్కువ నష్టమని చరిత్ర చెబుతోంది. అయితే ఇది అన్నివేళలా నిజం కాదని కూడా రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ''ఓటింగ్ తక్కువగా నమోదైనప్పుడు ఓటర్ల మనోగతాన్ని అర్థం చేసుకోవడం చాలా కష్టం. ఓటింగ్ తగ్గుదల 5 శాతం లోపుంటే ప్రజలు మార్పు కోరుకోవడం లేదని, పెద్దగా స్తబ్ధత లేదని చెప్పుకోవచ్చు. అలాంటి పరిస్థితుల్లో స్థానికాంశాలు కీలక పాత్ర పోషిస్తాయి. దీనివల్ల కొన్నిసార్లు ఆశ్చర్యకరమైన ఫలితాలు రావచ్చు. ఏదైనా జరగొచ్చు'' అంటున్నారు రాజకీయ విశ్లేషకుడు నోమిత పి.కుమార్. ఓట్ల శాతం భారీగా తగ్గడం వల్ల మెజారిటీలకు గండిపడి ఒక్కోసారి ఫలితాలు భారీగా తారుమారవుతాయన్నది మరికొందరి వాదన.

ఎలక్షన్ టూరిజం జోరు!

అంతర్రాష్ట్ర ప్రయాణాల్లో 27% పెరుగుదల



సాంస్కృతిక పర్యాటకం, వైల్డ్‌లైఫ్ టూరిజం, మెడికల్ టూరిజం, గ్రామీణ టూరిజం, హిమాలయన్ ట్రెక్కింగ్, టెంపుల్ టూరిజం. ఇలా మన దేశంలో పర్యాటకం ఎన్నో రకాలు! లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఇప్పుడు ఎన్నికల పర్యాటకం కూడా ఫుల్ స్వింగ్‌లో ఉంది! మన దేశంలో మామూలుగానే రైళ్లు, బస్సులు ఎప్పుడూ కిక్కిరిసే ఉంటాయి. పండుగలప్పుడైతే వాటిలో కాలు పెట్టే సందు కూడా ఉండదు! లోక్‌సభ ఎన్నికల సీజన్ కారణంగా దేశవ్యాప్తంగా ప్రయాణాలు ఏకంగా 27 శాతం పెరిగాయట! ఇక్సిగో, అభీబస్ వంటి ట్రావెల్ ప్లాట్‌ఫాంలు చెబుతున్న గణాంకాలివి. ముఖ్యంగా పోలింగ్ జరుగుతున్న రాష్ట్రాల్లో ప్రయాణాలు బాగా పెరిగినట్టు అభీబస్ సీవోవో రోహిత్ శర్మ తెలిపారు. తమిళనాడు, ఒడిశా, బిహార్, రాజస్తాన్, ఉత్తరప్రదేశ్ నుంచి అంతర్రాష్ట్ర ప్రయాణాల్లో గణనీయమైన పెరుగుదల నమోదైందట. ''బస్సు ప్రయాణాలకు డిమాండ్ తమిళనాడులో 27 శాతం, రాజస్తాన్‌లో 26 శాతం, ఉత్తర ప్రదేశ్‌లో 24 శాతం, బీహార్‌లో 16 శాతం, ఒడిశాలో 10 శాతం పెరిగింది. కర్నాటక నుంచి తమిళనాడుకు బస్సు ప్రయాణం 21 శాతం, ముంబై నుంచి ఢిల్లీకి 52 శాతం, ఢిల్లీ నుంచి శ్రీనగర్‌కు 45 శాతం, చండీగఢ్ నుంచి శ్రీనగర్‌కు 48 శాతం, బెంగళూరు నుంచి ముంబైకి ఏకంగా 104 శాతం చొప్పున డిమాండ్ పెరిగింది'' అని అభీబస్, ఇక్సిగో వెల్లడించడం విశేషం!

- సాక్షి, నేషనల్ డెస్క్



మధుబని పెయింటింగ్

నువ్వా నేనా?!

బిహార్లో నాలుగో దశలో ఆసక్తికర పోరు

- 5 లోక్‌సభ స్థానాలకు 13న పోలింగ్
- ఎన్డీఏ, ఇండియా కూటముల హోరాహోరీ

యూపీ, పశ్చిమబెంగాల్ మాదిరే బిహార్‌లోనూ లోక్‌సభ ఎన్నికలు మొత్తం ఏడు దశల్లోనూ జరుగుతున్నాయి. బీజేపీ, జేడీ(యూ), లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్)తో కూడిన ఎన్‌డీఏ కూటమి; కాంగ్రెస్, ఆర్జేడీ, వామపక్షాలతో కూడిన విపక్ష ఇండియా కూటమి హోరాహోరీ తలపడుతున్నాయి. 40 స్థానాలకు తొలి మూడు విడతల్లో 14 చోట్ల పోలింగ్ ముగిసింది. ఈ నెల 13న నాలుగో దశలో దర్భంగా, ఉజియార్‌పూర్, సమస్తిపూర్, బెగుసరాయ్, ముంగేర్ లోక్‌సభ స్థానాల్లో పోలింగ్ జరగనుంది. వీటిలో 2019 ఎన్నికల్లో బీజేపీ మూడు, ఎల్‌జేపీ, జేడీ(యూ) ఒక్కో చోట గెలిచాయి. ఈసారి ఆర్జేడీ అధినేత లాలు ప్రసాద్ అనారోగ్య సమస్యలను పక్కన పెట్టి మరీ ప్రచారం చేస్తున్నారు. ఈ విడతలో ఇద్దరు కేంద్ర మంత్రుల భవిష్యత్‌ను ఓటర్లు తేల్చనున్నారు...

- సాక్షి, నేషనల్ డెస్క్

బెగుసరాయ్



గిరిరాజ్ సింగ్

బిహార్‌లోని హాట్ సీట్లలో ఇదీ ఒకటి. కేంద్ర గ్రామీణాభివృద్ధి, పంచాయితీరాజ్ మంత్రి, బీజేపీ సిట్టింగ్ ఎంపీ గిరిరాజ్ సింగ్ మళ్లీ బరిలో దిగారు. ఆయనపై ఇండియా కూటమి నుంచి సీపీఐ సీనియర్ నాయకుడు అవధేశ్ కుమార్ రాయ్ పోటీ చేస్తున్నారు. ఆయన ఇక్కడ 1967లో గెలిచారు. 57 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ బరిలో దిగుతుండటం విశేషం! ఈ నియోజకవర్గంలో భూమిహార్ సామాజికవర్గ ప్రాబల్యం ఎక్కువ. గిరిరాజ్ కూడా ఆ కులానికి చెందినవారే. 2019లో సీపీఐ అభ్యర్థి కన్హయ్య కుమార్‌ను ఆయన 4.2 లక్షల ఓట్ల మెజారిటీతో ఓడించారు. విపక్షాలన్నీ సంఘటితం కావడం ఈసారి ఆయనకు కాస్త ప్రతికూలమే. 2004 దాకా ఇక్కడ కాంగ్రెస్‌దే హవా! 2004, 2009ల్లో జేడీ(యూ) గెలిచింది.

ఉజియార్‌పూర్



నిత్యానందరాయ్

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, బీజేపీ నేత నిత్యానందరాయ్ ఇక్కడి సిట్టింగ్ ఎంపీ. 2014లోనూ ఇక్కడ ఆయనే నెగ్గారు. 2019లో రాయ్ చేతిలో ఓడిన రాష్ట్రీయ లోక్ సమతా అధ్యక్షుడు ఉపేంద్ర కుశ్వాహ ఎన్డీఏలో చేరడంతో హ్యాట్రిక్ విజయంపై బీజేపీ భరోసాతో ఉంది. 2014లో రాయ్ చేతిలో ఓడిన అలోక్ కుమార్ మెహతా మరోసారి ఆర్జేడీ నుంచి పోటీలో ఉన్నారు. ఈ లోక్‌సభ స్థానం పరిధిలోని ఆరు అసెంబ్లీ సీట్లలో ఎన్డీఏ, ఇండియా కూటముల చేతుల్లో చెరి సగం ఉన్నాయి. ఇక్కడ యాదవ, కుశ్వాహ సామాజికవర్గాల ప్రాబల్యం ఎక్కువ. ముస్లింలు, బ్రాహ్మణుల ఓట్లు కూడా ఎక్కువే.

ముంగేర్



లలన్ సింగ్

ఒకప్పుడు కాంగ్రెస్ కంచుకోట. కొన్నేళ్లుగా జేడీ(యూ)కే జై కొడుతోంది. జేడీ(యూ) మాజీ చీఫ్, సిట్టింగ్ ఎంపీ రాజీవ్ రంజన్ సింగ్ (లలన్ సింగ్) ఈసారీ బరిలో ఉన్నారు. ఆర్జేడీ నేత గ్యాంగ్‌స్టర్ అశోక్ మెహతో జైలు పాలవడంతో పార్టీ తరఫున ఆయన భార్య అనితా దేవి పోటీ చేస్తున్నారు. ఈ నియోజకవర్గ పరిధిలోని ఆరు అసెంబ్లీ స్థానాల్లో ఎన్డీఏ, ఇండియా కూటములు చెరో సగం గెలుచుకున్నాయి. ఇక్కడ ఏ సామాజిక వర్గానిదీ పూర్తి ఆధిపత్యం కాకపోవడం విశేషం! మొకామ సిట్టింగ్ ఆర్జేడీ ఎమ్మెల్యే అయిన గ్యాంగ్‌స్టర్ అనంత్‌సింగ్ అనూహ్యంగా లలన్‌సింగ్‌కు మద్దతుగా ప్రచారం చేస్తున్నారు. దాంతో పరిస్థితులు ఆయనకు మరింత అనుకూలంగా మారాయి. ఆయుధాల చట్టం కేసులో పదేళ్ల జైలుశిక్ష అనుభవిస్తున్న అనంత్ ఈ నెల 5న పెరోల్‌పై విడుదలై మరీ లలన్‌సింగ్‌కు ప్రచారం చేస్తున్నారు. భారీ వాహన కాన్వాయ్‌తో నియోజకవర్గమంతా చుట్టేస్తున్నారు.

దర్భంగా



గోపాల్ జీ ఠాకూర్

దీన్ని మిథిల ప్రాంత రాజధానిగా పరిగణిస్తుంటారు. మైథిలీ బ్రాహ్మణుల ఆధిపత్యమున్న ఈ లోక్‌సభ స్థానంలో 2009 నుంచీ బీజేపీయే గెలుస్తూ వస్తోంది. అగ్రవర్ణాలకు చెందిన సిట్టింగ్ ఎంపీ గోపాల్ జీ ఠాకూర్ మళ్లీ బీజేపీ నుంచి బరిలో ఉన్నారు. ఆయనపై కాస్త వ్యతిరేకత కనిపిస్తోంది. యాదవులు, అగ్ర వర్ణాలతో పాటు ఓబీసీ ఓట్లపైనా బీజేపీ ఆశలు పెట్టుకుంది. మాజీ క్రికెటర్ కీర్తి ఆజాద్ ఇక్కడ 1999, 2009, 2014ల్లో బీజేపీ తరఫున గెలిచారు. 2021లో తృణమూల్ కాంగ్రెస్‌లో చేరిపోయారు. ఈ లోక్‌సభ స్థానం పరిధిలోని ఆరు అసెంబ్లీ స్థానాల్లో ఐదు బీజేపీ, జేడీ(యూ) చేతుల్లోనే ఉన్నాయి. ఈ విడత ఇక్కడి ఓటర్ల నాడి ఎవరికీ అందడం లేదు! ఇక్కడ ముస్లింలు, యాదవుల ఓట్లు ఎక్కువ. ఆర్జేడీ నుంచి లలిత్ కుమార్ యాదవ్ పోటీ చేస్తున్నారు. ఆర్జేడీ ముస్లింకు టికెటివ్వకపోవడం, పైగా ముస్లిం అభ్యర్థులను ఓడించిన చరిత్ర ఉండటంతో ఈసారి లలిత్‌కు వారి మద్దతు దక్కకపోవచ్చని భావిస్తున్నారు.



లలిత్ కుమార్ యాదవ్



సన్నీ హజారీ

శాంభవి చౌదరి

జేడీయూ వర్సెస్ జేడీయూ!

సమస్తిపూర్. బిహార్ దివంగత సీఎం, భారతరత్న కర్పూరీ ఠాకూర్ జన్మస్థలం. ఈ నెల 13న నాలుగో విడతలో పోలింగ్ జరగనున్న ఎస్సీ రిజర్వుడ్ లోక్‌సభ స్థానం. కాంగ్రెస్ నుంచి సన్నీ హజారీ, లోక్ జనశక్తి పార్టీ (రాం విలాస్) తరఫున శాంభవి కునాల్ చౌదరి తలపడుతున్నారు. ఇందులో విశేషం ఏముందంటారా? వీరి తండ్రులిద్దరూ అధికార పక్షమైన జేడీ(యూ) నేతలు! పైగా రాష్ట్ర మంత్రులు!! జేడీ(యూ) చీఫ్, సీఎం నితీశ్‌కుమార్ శాంభవికి మద్దతుగా నిలుస్తుంటే మంత్రి అయిన సన్నీ తండ్రి మాత్రం కుమారుని కోసం ప్రత్యర్థి పార్టీ కాంగ్రెస్‌కు మద్దతుగా ప్రచారం చేస్తున్నారు...!

- సాక్షి, నేషనల్ డెస్క్

సమస్తిపూర్‌లో చిత్రమైన పోరు • పోటీ కాంగ్రెస్, ఎల్జేపీ నడుమ • బరిలోనేమో మంత్రుల పిల్లలు

బిహార్‌లో ఇటీవలి దాకా కాంగ్రెస్, ఆర్జేడీ దన్నుతో సీఎంగా కొనసాగిన నీతిశ్ ఎన్నికల ముందు వాటికి గుడ్‌బై చెప్పడం, ఎన్‌డీఏ గూటికి చేరి కుర్చీని కాపాడుకోవడం తెలిసిందే. బీజేపీ సారథ్యంలో ఎన్డీఏ, కాంగ్రెస్ నేతృత్వంలో విపక్ష ఇండియా కూటములు ఈ లోక్‌సభ ఎన్నికల్లో హోరాహోరీగా పోరాడుతున్నాయి. కానీ జేడీ(యూ) నేత, రాష్ట్ర మంత్రి మహేశ్వర్ హజారీ మాత్రం తన కుమారుని కోసం కాంగ్రెస్‌కు ఓటేయాలంటూ ప్రచారం చేస్తుండటం విశేషం. ఆయన లోక్ జనశక్తి పార్టీ వ్యవస్థాపకుడు దివంగత రాం విలాస్ పాశ్వాన్‌కు బంధువు కూడా!

సమస్తిపూర్‌లో దాదాపు 17.5 లక్షల మంది ఓటర్లున్నారు. వీరిలో 20 శాతం ఎస్సీలే. కుశ్వాహ, యాదవుల వంటి ఓబీసీలూ ఎక్కువే. ముస్లిం ఓటర్లు 13 శాతమున్నారు. ఇక్కడ గ్రామీణ ఓటర్లే 95 శాతం. 2014, 2019ల్లో ఎల్జేపీ తరఫున రామ్ విలాస్ పాశ్వాన్ తమ్ముడు రామచంద్ర పాశ్వాన్ గెలుపొందారు. ఆయన హఠాన్మరణంతో జరిగిన ఉప ఎన్నికలో కుమారుడు ప్రిన్స్ రాజ్ విజయం సాధించారు. ఆయన ప్రస్తుతం పశుపతి పార్టీ ఆర్ఎల్జేపీలో ఉన్నారు.

నితీశ్ దన్ను!

సమస్తిపూర్ తన మెట్టినిల్లంటూ నాన్‌లోకల్ ప్రచారాన్ని శాంభవి తిప్పికొడుతున్నారు. మోదీ ఫ్యాక్టర్ కలిసొస్తుందన్న నమ్మకంతో ఉన్నారు. నితీశ్ కూడా ఆమెకు మద్దతిస్తున్నారు! పోల్ మేనేజ్‌మెంట్‌లో ఆరితేరిన పార్టీ ఎంపీ, కర్పూరీ ఠాకూర్ కుమారుడు రామ్‌నాథ్ ఠాకూర్‌ను శాంభవికి దన్నుగా రంగంలోకి దించారాయన. సమస్తిపూర్‌లో మెజారిటీ ప్రజలు పాశ్వాన్ నిజమైన రాజకీయ వారసునిగా చిరాగ్‌నే చూస్తుండటం శాంభవికి కలిసొచ్చే అంశం. మొత్తానికి సమస్తిపూర్ లోక్‌సభ ఎన్నిక జేడీ(యూ) మంత్రుల మధ్య పోరాటానికి వేదికగా మారిందని పార్టీ నేతలే గుసగుసలాడుకుంటున్నారు!

శాంభవి.. మరో మంత్రి గారమ్మాయి!

ఇక ఎల్జేపీ (రాం విలాస్) అభ్యర్థి శాంభవి తండ్రి అశోక్ చౌదరి కూడా మంత్రిగా జేడీ(యూ) సర్కారులో కీలక శాఖలు చూస్తున్నారు. 25 ఏళ్ల శాంభవి ఈ సార్వత్రిక ఎన్నికల్లో బరిలో ఉన్న అత్యంత పిన్న వయస్కురాలు. అయితే ఆమెకు టికెటివ్వడంతో పార్టీ అధినేత చిరాగ్ పాశ్వాన్‌పై నేతల్లో అసంతృప్తి భగ్గుమంది. నిరసనగా పలువురు రాజీనామా కూడా చేశారు! పైగా ఆమె నాన్‌లోకల్ అంటూ కాంగ్రెస్ ప్రచారం హోరెత్తిస్తోంది. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో జేడీ(యూ)కు దెబ్బ తీసి 48 స్థానాలకు పరిమితం చేయడంలో చిరాగ్‌ది కీలక పాత్ర. ఎందుకంటే పాశ్వాన్ మరణానంతరం ఆయన సోదరుడు పశుపతి పరాస్, కుమారుడు చిరాగ్ మధ్య నితీశ్ చిచ్చురేపారు. ఎల్జేపీ పశుపతి పరమయ్యేలా చేశారు. ఈ ఎపిసోడ్లో మహేశ్వర్ హజారీది కూడా కీలక పాత్రే. కాంగ్రెస్ సన్నీకి టికెట్ ప్రకటించగానే, తమ కుటుంబంలో చిచ్చు పెట్టింది హజారీయేనంటూ చిరాగ్ మండిపడ్డారు కూడా!

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.